అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి : 34 సంచిక : 2 ఏప్రిల్ 2011

వెల : రు 10 (285) పేజీలు : 68

ప్యారిస్ కమ్యూన్‌కు 140 ఏళ్లు

ఇంద్రవెల్లి పోరాటస్ఫూర్తికి 30 ఏళ్లు



-: స్వీకారం :-

'చదువు'ల సారం - 1
కథలు విందాం
ప్రచురణ :
మంచి పుస్తకం
జన విజ్ఞాన వేదిక
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 85/-



'చదువు'ల సారం - 2
ఆడుకుందాం
ప్రచురణ :
మంచి పుస్తకం
జన విజ్ఞాన వేదిక
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 55/-



'చదువు'ల సారం - 3
అనుభవాలు పంచుకుందాం - 1
ప్రచురణ :
మంచి పుస్తకం
జన విజ్ఞాన వేదిక
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 100/-

'చదువు'ల సారం - 4
అనుభవాలు పంచుకుందాం - 2
ప్రచురణ :
మంచి పుస్తకం
జన విజ్ఞాన వేదిక
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 110/-



'చదువు'ల సారం - 5
పాడుకుందాం
ప్రచురణ :
మంచి పుస్తకం
జన విజ్ఞాన వేదిక
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 85/-

'చదువు'ల సారం - 6
భాషా వ్యాసాలు
ప్రచురణ :
మంచి పుస్తకం
జన విజ్ఞాన వేదిక
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 85/-

'చదువు'ల సారం - 7
భాషాభ్యాసాలు
ప్రచురణ :
మంచి పుస్తకం
జన విజ్ఞాన వేదిక
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 75/-



'చదువు'ల సారం - 8
చదువుల వెలుగులు
ప్రచురణ :
మంచి పుస్తకం
జన విజ్ఞాన వేదిక
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 85/-

అనార్కో
హిందీ మూలం
అనువాదం :
సత్యా సరీలా
ప్రచురణ :
మంచి పుస్తకం
వెల : రు. 22/-



పాడే ఈక
వసీలీ సుహోమ్లిన్స్కీ
అనువాదం :
ఆర్.వి.ఆర్.
ప్రచురణ :
మంచి పుస్తకం
వెల : రు. 33/-



చిన్నారి గుడ్లగూబ!
రచయిత :
మైర్ ఫౌలర్
ప్రచురణ :
మంచి పుస్తకం
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. 15/-



శివమెత్తిన నది
ప్రచురణ :
మంచి పుస్తకం
www.manchipustakam.in
email: info@manchipustakam.in
వెల : రు. /-



గుండె కాగడా
మక్సీమ్ గోర్కీ
అనువాదం :
ఎన్. వేణుగోపాల్
ప్రచురణ :
మంచి పుస్తకం
వెల : రు. 35/-



టాల్‌స్టాయ్ సాహిత్య పరిచయ వ్యాసాలు
రచయిత :
ఎస్.వి.ఎస్. నాగభూషణాచార్యులు
జనసాహితి ప్రచురణలు
వెల : రు. 10/-

నిమజ్జనం
కథ సంపుటి
రచయిత :
డా॥ జి.వి. కృష్ణయ్య
ప్రచురణ :
జనసాహితి ప్రచురణలు
వెల : రు. 25/-

KLVA10M153

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

285

సంపుటి : 35 ◆ సంచిక : 2 ◆ ఏప్రిల్, 2011

సంపాదకుడు
చలసాని ప్రసాద్

◆ ◆ ◆

వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామకృష్ణా రావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500040
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
* ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com,
raamki70@gmail.com
లకూ రచనలు పంపవచ్చు

◆ ◆ ◆

కొరియర్, రిజిస్టర్డ్ పోస్ట్ ల ద్వారా
రచనలు పంపితే...
టి. కృష్ణాబాయి
9-19-3, సి.బి.ఎం. కాంపౌండ్
విశాఖపట్నం - 530 003

◆ ◆ ◆

చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360
సెల్ : 9866021257

◆ ◆ ◆

విరసం కార్యదర్శి చిరునామా
పాణి
50-348, L 19 B II,
అరోరా నగర్, బి క్యాంప్, కర్నూల్ - 2
ppinaakaa@yahoo.com

ఈ సంచిక వెల : రు. 10

సంపాదక లేఖ...

ప్యారిస్ కమ్యూన్‌కు 140 ఏళ్లు. ప్రపంచ చరిత్రలో శ్రామికుల, కార్మికుల ఆధ్వర్యంలో నేలపై ఏర్పడిన మొట్ట మొదటి కార్మిక రాజ్యం. అధికారంలో ఉన్న బూర్జువాలను, పెట్టుబడిదారులను కూలదోసి కార్మికుల నాయకత్వాన 'ప్యారిస్ కమ్యూన్' ఏర్పడింది. 1871 మార్చి 18 నుంచి మే 28 వరకు 72 రోజులపాటు కార్మికుల పాలనలో ప్యారిస్ ఉంది. శ్రామిక వర్గ ఆధిపత్యంలో ఏర్పడిన మొట్టమొదటి పరిపాలన అది. అంతకు ముందు ఫ్రాంకో, ప్రష్యన్ యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోయింది. ఆ యుద్ధం తర్వాత దేశంలో విపరీతమైన సంక్షోభం తలెత్తింది. ఆకలి, నిరుద్యోగం, దోపిడీ, మిలిటరీ అణిచివేతలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం 'ప్యారిస్ కమ్యూన్'గా బద్ధలైంది. కమ్యూన్ విజయం తర్వాత తొలి చర్యగా పాత సైన్యాన్ని రద్దుచేసి దాని స్థానంలో 'జాతీయ రక్షణ దళం' ఏర్పాటైంది. నూతన ప్రభుత్వం అధికారం చేపట్టినట్లు మార్చి 20 తేదీన ప్రకటించింది. మార్చి 26న కమ్యూన్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో 85 మంది సభ్యులు ఎంపికయ్యారు. వారిలో 21 మంది బూర్జువాలు. వాళ్లు అనతి కాలంలోనే అధికారం నుండి తప్పుకున్నారు. మిగిలిన సభ్యుల్లో సగం మంది కార్మికులు, తక్కిన వాళ్లు గుమస్తాలు, డాక్టర్లు, టీచర్లు, జర్నలిస్టులు మొదలయిన ప్రజాతంత్ర మేధో జీవుల ప్రతినిధులు. ఆ విధంగా కమ్యూన్ కౌన్సిల్‌లో శ్రామిక ప్రతినిధులున్నారు. నాయకత్వం కార్మికులది. ప్రపంచ విప్లవోద్యమానికి చిహ్నమైన ఎర్రజెండాను తన పతాకంగా కమ్యూన్ స్వీకరించింది. కమ్యూన్ చేసిన ప్రధానమైన రాజకీయ నిర్ణయాలు-చర్చిని, ప్రభుత్వం నుంచి వేరు చేసింది. చర్చికి చెల్లించే సబ్సీడీలను రద్దుచేసింది. స్టాడింగ్ ఆర్మిని రద్దుచేసి పీపుల్స్ మిలిషియాను ఏర్పాటుచేసింది. అధికారులందరిని ఓటర్లకు బాధ్యులయ్యేటట్లు చేసింది. సంవత్సరానికి 600 ఫ్రాంకులకు మించకుండా అధికారుల జీతాన్ని నిర్ణయించింది. ఉచిత విద్యను ప్రవేశపెట్టింది. రొట్టెల ఫ్యాక్టరీలో రాత్రి పనిని రద్దుచేయించింది. వర్క్‌షాపుల్లో యజమానులు వేసే జరిమానాలను రద్దుచేసింది. వడ్డీ వ్యాపారం రద్దుచేసింది. మూసివేయ బడిన ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకొని కార్మిక సహకార సంఘాల ద్వారా నడిపింది. బీదవాళ్లు కుదువబెట్టిన వస్తువులన్నీ ఉచితంగా తిరిగి ఇచ్చింది. కార్మికులు అద్దెలు చెల్లించడానికి వ్యవధిని పొడిగించింది. మురికి కూపాల్లో నివసిస్తూ ఉండిన కార్మికులకు వర్సేల్స్‌కు పారిపోయిన ధనవంతుల భవనాల్లో నివాసాలు ఏర్పాటు చేసింది. విద్య ఉచితంగా, నిర్బంధంగా ఉండాలని కమ్యూన్ చట్టం చేసింది. కార్మిక స్త్రీల శిశువులకు క్రెష్‌లు, కిండర్ గార్డెన్‌లు ప్రారంభించింది. కమ్యూన్ తరపున రైతులనుద్దేశించి ప్యారిస్ కార్మికులు సంతకం చేసిన ఒక లేఖను కమ్యూన్ ఒక లక్ష ప్రతులు అచ్చు వేయించింది. ఆ లేఖలో 'ప్యారిస్ కోరేది రైతులకు భూమి, కార్మికులకు పనిముట్లు, ప్రజలందరికి పని' అన్న తన ఆకాంక్షను తెలియజేసింది. సోషలిజంవైపు కార్మికవర్గానికి మార్గం చూపడంలో కమ్యూన్ గొప్ప అనుభవాన్ని ఇచ్చింది. అయితే ఆనాడు పోరాట ప్రారంభం నుండి ఫ్రెంచ్ కార్మిక వర్గానికి సరైన నాయకత్వం వహించగల ఒక సమైక్య సంఘటిత విప్లవ పార్టీ లేదు. అటువంటి పార్టీ లేకపోవడం వల్ల 72 రోజుల అనంతరం ప్యారిస్ కమ్యూన్ తిరిగి బూర్జువాల వశమైంది. వీధి వీధికి పెద్ద సంఖ్యలో మోహరించిన సైనికులను ఎదిరించి కమ్యూనార్డులు వీరోచితంగా పోరాడారు. కమ్యూన్ దారుణంగా అణిచివేయబడింది. ఆ తర్వాత కొన్ని రోజులపాటు అమానుషమైన చిత్రవధలు జరిగాయి. జనరల్ డీ-గానీ-ఫెట్ 30 వేల

మిగతా 63వ పేజిలో....

ఈ సంచికలో...

సంపాదకీయం : (5-8)
ప్యారిస్ కమ్యూన్ - ఇంద్రవెల్లి : గమ్యం గమనం
- వరవరరావు

వ్యాసం : (8-10)
ఛత్తీస్‌ఘడ్‌లో పత్రికలు
- సెవంతీ మీనన్

వ్యాసం : (10-12)
మావనాటే - మారాజ్యం! పోలవరం మా కోసం కాదు!
- గీతాంజలి

ఉత్తరం : (13)
నాయుడుబావూ .... నోరిప్పకు మీ!
- బజరా

వ్యాసం : (14-15)
హిందూ, జొరాష్ట్రియన్ మతవిశ్వాసాలు
- కొడవటిగంటి రోహిణీప్రసాద్

వ్యాసం : (16-19)
ప్రజా ఉద్యమాలు - నాటకాలలో స్త్రీల భాగస్వామ్యం
- డాక్టర్ నళిని

సంస్మరణ : (20-24)
అరుదైన సాధారణ వ్యక్తి వెంకాయమ్మ - *పాణి*

వ్యాసం : (24-29)
అంతర్యుద్ధం నుంచి యుద్ధం స్థాయికి
ఇ.ఎస్.బ్రహ్మచారి

ఉత్తరం : (29)
ఓరి రమేసా? ... యెట్రిది తమాసా...
- గున్నల గన్నమ్మ

కవిత్వం : (30-36)
గాయపడ్డ నవ్వుల సంద్రం
- మహమూద్ ; పౌర హక్కుల తోటమాలి, మరణం
విషాదమే - **శాఖమూరి రవి కవితలు రెండు** ;
భయాన్ని భయపెట్టే ఆయుధం కావాలి - **వనం** ;
మిలియన్ మార్చింగ్ సాంగ్ - **దాసరాజు రామారావు** ;
గిరాయిపల్లి నుండి హైదరాబాద్ - **సముద్రుడు** ;
సాయుధుడివి కాక తప్పదు - **లాంఛర్** ;

వ్యాసం : (36-37)
“ఆదివాసీ గిరిజన రుచికాలు ఎందరో”
- జావెద్ ఇక్బాల్

కథ : (38-42)
చావుడేరా
- ఉదయమిత్ర

కథ : (43-54)
విప్లవ పయనం
- మిడ్కో

పత్రికా ప్రకటన : (55-56)
ఒడిషా సర్వోదయ సమాజ్‌కు కొన్ని ప్రశ్నలు
- మావోయిస్టు రాజకీయ ఖైదీలు

దండకారణ్య డైరీ (57-63)
గ్రీన్‌హంట్ ఉత్పాతాలు
- సాధన

నవల సీరియల్ (64-66)
గుమ్మెటమోత (11వ భాగం)
- పాణి

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి. డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

విడి సంచిక వెల : రు. 10
సంవత్సర చందా : రు. 100
జీవితచందా : రు. 1000

కవర్‌పేజీ : ప్యారిస్ కమ్యూన్ పోరాట దృశ్యం, ఇంద్రవెల్లి అమరుల స్థూపం

ఫొటోలు : గూగుల్ నెట్, పాలపిట్ట మాసపత్రిక

ప్యారిస్ కమ్యూన్ - ఇంద్రవెల్లి : గమ్యం - గమనం

- వరవరరావు

ప్యారిస్ కమ్యూన్ జరిగి నూట నలభై ఏళ్లు. ఇంద్రవెల్లి జరిగి ముప్పై ఏళ్లు. ప్యారిస్ కమ్యూన్ ఆదర్శ గమ్యం. ఇంద్రవెల్లి ఆదర్శ గమనం. ప్యారిస్ కమ్యూన్ తాత్కాలిక విజయాన్ని చవిచూసింది. ఇంద్రవెల్లి తాత్కాలిక అపజయాన్ని అధిగమించింది. ప్యారిస్ కమ్యూన్ కార్మిక వర్గపోరాట విజయాలకు వేగుచుక్క.ఇంద్రవెల్లి నక్సల్బరీ, శ్రీకాకుళాల తాత్కాలిక ఓటమి తర్వాత జగిత్యాల జైత్రయాత్ర కొనసాగింపు.

ప్యారిస్ కమ్యూన్ నాటికే ప్రపంచ కార్మిక వర్గ ఆకాంక్షల మేరకు ముఖ్యంగా యూరపులో వివిధ దేశాల కార్మిక వర్గాల పోరాటాల అవసరాల కోసం మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు మానిఫెస్టో రచించి ఉన్నారు. కాని అప్పుడే కార్మిక వర్గ విజయానికి సమయం ఆసన్నం కాలేదన్నారు. కార్మిక వర్గాన్ని రాజ్యాధికారానికి తేగల నాయకత్వం ఇంకా సుపటిష్ఠంగా ఏర్పడలేదన్నారు. కమ్యూనార్డులాగా పిలుచుకునే కార్మికులు కాదు కూడదు బూర్జువా వర్గాన్ని అధికారం నుంచి కూలదోసి కార్మికవర్గ రాజ్యాన్ని సాధించుకోవాల్సిందేనన్నారు. కమ్యూనార్డుల సంకల్పానికి సంసిద్ధతకు మార్క్స్, ఎంగెల్స్ ముగ్ధులయ్యారు.

ప్యారిస్ కమ్యూన్‌కు నాయకత్వం వహించారు. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా 1871 మార్చ్ 18న బూర్జువర్గాన్ని అధికారం నుంచి పడగొట్టి కమ్యూనార్డులు ప్యారిస్ నగరంలో అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అప్పటికి తొమ్మిది దశాబ్దాలకు ముందు ఫ్రెంచ్ విప్లవం జరిగి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నినాదాలతో బూర్జువా వర్గం ఫ్యూడల్ నిరంకుశ రాచరిక విధానాన్ని రద్దు చేసి అధికారంలోకి వచ్చింది. కాని అది మార్క్స్ చెప్పినట్లు బూర్జువా వర్గాన్నే విముక్తం చేసింది తప్ప సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాతృత్వాలను తేలేదు.

ఇంక పెట్టుబడిదారీ విధానం దాని అత్యున్నత దశకు చేరుకొని అభివృద్ధి ఆగిపోయి మరణశయ్యకు చేరుకున్న సామ్రాజ్యవాద దశలో ఆ బూర్జువా విప్లవ ఫలాలు కూడా నిష్ఫలమైనవి.

పారిశ్రామిక విప్లవం పెట్టుబడిదారీ విధానం వచ్చి ఇంగ్లాండు, ఫ్రాన్సులలో వచ్చిన బూర్జువా విప్లవాలు సాధించిన 'చట్ట బద్ధ పాలన' (రూల్ ఆఫ్ లా) కూడా లేని స్థితి ఇవ్వాళ మనం ప్రపంచ వ్యాప్తంగా చూస్తున్నాం.

ఒక్కసారి ఈ స్థితిని ప్యారిస్ కమ్యూన్‌తో పోల్చుకుందాం. ప్యారిస్ కమ్యూన్ బతికింది. డెబ్బై రెండు రోజులే. కాని ఒక సమాజానికి, ఒక సమూహానికి సజీవమైన బతుకంటే ఇది అని రుజువు చేసి చరిత్రపై చెరగని ముద్రవేసి పోయింది. వ్యక్తి పరిపూర్ణ వికాసానికి, నూతన మానవావిర్భావానికి కమ్యూన్ జీవితాన్ని మించిందిలేదని చూపించిపోయింది.

కమ్యూన్ అంటే సమిష్టి జీవితం. ప్యారిస్ కమ్యూన్ జైళ్ళను, పోలీసు వ్యవస్థను రద్దు చేసింది. యంత్రాలను నడిపే, వీధులు ఊడ్చే, కాలువలు శుభ్రపరిచే, పత్రికలమ్మే, కార్మికులే స్వపరిపాలకులయ్యారు. ప్రజాన్యాయస్థానాలు నిర్వహించారు. కవిత్వం, కళలు, సాంస్కృతిక సంచాలకులయ్యారు. ఒక ట్రెడిల్ మిషన్ తొక్కి కరపత్రాలు అచ్చువేసే యూజీన్ పొటెయార్ వంటి కార్మికుడు ఇవ్వాళ ప్రపంచమంతటా పోరాటశక్తులు పాడుకునే 'ఇంటర్నేషనల్' (అంతర్జాతీయ గీతం) రాసాడు.

జైళ్లు, పోలీసులు లేకపోవడమంటే నేరం - శిక్ష లేకపోవడం, నేరం - శిక్ష లేకపోవడమంటే దొంగతనం - విచారణ లేకపోవడం లేదా దొంగతనము - దొరతనము లేకపోవడం. అంటే వ్యక్తిగత ఆస్తి లేకపోవడం. ఇది కల కాదు డెబ్బై రోజుల పాటు ప్యారిస్ కమ్యూన్ సాకారం చేసిన స్వప్నం.

కవిత్వం, కళలూ, సంస్కృతీ వికసించిన కాలం.

డెబ్బై రోజులు ఒక సార్థక సజీవ స్వప్నంగా బతికి ప్యారిస్ కమ్యూన్ ఓడిపోయింది.

ఉక్కు శిక్షణ గల కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం లేకపోవడం వల్ల కార్మికవర్గం తన రాజ్యాధికారాన్ని నిలబెట్టుకోలేకపోయిందని సమీక్షించి, విశ్లేషించిన లెనిన్ రష్యాలో కార్మికవర్గ విజయం కోసమే కాదు, కార్మిక వర్గ విజయాన్ని నిలుపుకోవడం కోసం బోల్షివిక్ పార్టీని నిర్మించి విప్లవాన్ని సాధించాడు.

శ్రామికవర్గం అధికారంలోకి రావడమే కాదు శ్రామిక వర్గ నియంతృత్వాన్ని అమలు చేస్తే తప్ప సామ్యవాద దశలోకి, కమ్యూనిస్టు దశలోకి పయనించలేమని చెప్పాడు.

1917 నుంచి 1953 వరకు రష్యాలో సామ్యవాదం లెనిన్ (1917-23), స్టాలిన్‌ల కాలంలో అమలయింది. అట్లాగే చైనాలో 1948 అక్టోబర్ 1న విప్లవం విజయవంతమై నూతన ప్రజాస్వామిక విప్లవ దశ నుంచి 1956లో సామ్యవాద దశలోకి ప్రవేశించింది. 1966-73 మధ్యన బూర్జువా వర్గ ప్రభావం నుంచి కాపాడుకోవడానికి మావో నాయకత్వంలో శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం నిర్వహించినా 76 తర్వాత చైనా కూడ పెట్టుబడిదారీ పంథాకే మళ్లింది.

శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ (1966) ప్రభావంతో వచ్చిన

నక్సల్బరీ పోరాటం మనదేశంలో ప్యారిస్ కమ్యూన్ లక్ష్యానికి వేసిన మలి అడుగు. తొలి అడుగు తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం కాని 1972 నాటికే నక్సల్బరీ శ్రీకాకుళాలు కూడా సెట్‌బ్యాక్‌కు గురయ్యాయి.

ఈ తాత్కాలిక ఓటమి నుంచి స్వీయ విమర్శ చేసుకుని చేపట్టిన పోరాటమే జగిత్యాల జైత్రయాత్ర. ఆ జైత్రయాత్ర నిర్వహించిన విప్లవోద్యమమే ఒక దండకారణ్య దార్శనికతను రచించుకుని అడవిలో ప్రవేశించింది. మైదాన పోరాటాలను కాపాడుకోవడానికి. రిట్రీటు నుంచి మళ్లీ రేకెత్తడానికి, విముక్త ప్రాంతాలు నిర్మించుకోవడానికి విప్లవోద్యమానికి అడవి కన్నతల్లి.

విప్లవోద్యమంలో ఆ అడవికి వేసిన మొదటి అడుగు పెద్దిశంకర్ (1979 నవంబర్) అతని నెత్తుటి అడుగుజాడలే ఇవ్వాళ దండకారణ్య విప్లవంలో భాగమైన గడ్చిరోలీ, సిరోంచ పోరాటాలు. పెద్దిశంకర్ బెల్లంపల్లి బొగ్గుగని కార్మికుని కొడుకు. రాడికల్ యువజన సంఘం కార్యకర్త.

మరొక దళం ఆదిలాబాదు, కరీంనగర్‌ల నుంచి బస్తర్‌లో ప్రవేశించింది. ముప్పై ఏళ్లు దాటినది.

అడుగు తీసి అడుగు వేసే రెండడుగుల నడక పరుగయ్యే దశ ఒకటి మైదానంలో పోల్చుకున్నట్లుగా అడవిలో పోల్చుకోవడం అంత సులభం కాదు. ప్రజాయుద్ధం చేయడానికి ఒక ప్రజాయుద్ధ పార్టీ కావాలి కదా. 1980 నుంచి ప్రజా యుద్ధ సన్నాహం మొదలయింది. ఆదిలాబాదు అడవుల్లోకి రఘు (నల్లా ఆదిరెడ్డి) నాయకత్వంలో గజ్జెల గంగారామ్, సాహులు తోడుగా విప్లవోద్యమం ప్రవేశించింది.

అప్పటికే రగిలి చల్లారిన కుంపటి ఆదిలాబాదు. దానికి వందల ఏళ్ల పోరాట చరిత్ర ఉన్నది. బ్రిటిష్ నైజాంల కాలం నుంచి ప్రతిఘటించిన గోండ్వానా ఆదివాసుల చరిత్ర ఉన్నది. రాంజీగోండు వేసిన చాలు ఉన్నది. కొమురంభీం వేసిన బాట ఉన్నది. పన్నెండు ఊళ్లను స్వాధీనం చేసుకుని 'మా గూడాల్లో మా రాజ్యం' అని ప్రకటించిన స్వపరిపాలన అహగాహన ఉన్నది.

విప్లవోద్యమం ఆదివాసీ తిరుగుబాట్లకు ఇక్కడే కాదు నక్సల్బరీ శ్రీకాకుళం, వైనాడుల కాలం నుంచి కూడ అందించింది ఒక దార్శనికతయే. బహుశా ప్రపంచ ఆదివాసీ పోరాటాల చరిత్రకు ఒక సైద్ధాంతిక దార్శనిక నాయకత్వాన్ని అందించింది నక్సల్బరీ పంథాయే. అయితే అది ఆదివాసులకే పరిమితం కాదు. సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీ నుంచి సమస్త మానవాళిని విముక్తం చేస్తుంది.

ఇవ్వాళ మనం దేశంలో జంగల్ మహల్, లాల్‌ఘడ్‌లలో కానూ సిద్ధూ మిలిషియాలను చూస్తున్నాం. ఛత్తీస్‌ఘడ్‌లో గూండాదర్ భూంకాల్‌లను చూస్తున్నం. కానూసిద్ధూలు 150 ఏళ్ల క్రితం బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించిన సంతాల్ పోరాట నాయకులు. గూండాదర్ వందేళ్ల క్రితం బస్తర్‌లో బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడానికి భూంకాల్ సైన్యాన్ని నిర్మించినవాడు. వాటి మిలీషియాలకు, భూంకాల్‌కు తను నెత్తుటి త్యాగాలతో బాటలు వేసినవాళ్లు ఇంద్రవెల్లి అమరులు.

కానూసిద్ధూ, బిర్సాముండా, రాంజీగోండు, కొమురంభీం వీళ్లంతా ఆదివాసులే. ఆదివాసీ తిరుగుబాటుకు నాయకత్వం వహించినవాళ్లు. ఆదివాసీ పోరాటాలకు నాయకత్వం వహించిన ఆదివాసేతర నాయకుడు అల్లూరి సీతారామరాజు ఉన్నాడు. కొమురం భీంకు స్ఫూర్తినిచ్చిన మన్నె పోరాటయోధుడు.

ఆదివాసులై ఆదివాసీ పోరాటంలో మమేకమైనవాళ్లు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం.

నల్లా ఆదిరెడ్డి నాయకత్వంలో విప్లవకారులు వెళ్లకముందు ఆదిలాబాదు అడవుల్లోకి పౌరకల సార్లు వెళ్లలేదని కాదు. కాని ఆదివాసుల్లో మమేకమైవాళ్ల భాష, ఆట, పాట నేర్చుకొని, వాళ్ల చెమట, కన్నీళ్లు, చిరునవ్వు పంచుకుని వాళ్ల అడవి జీవితంలో ముప్పై ఏళ్లుగా విప్లవకారులు 'ఆకులో ఆకులై, పూవులో పువ్వులై' ఆ అడవినే దాగిపోయి, ఆ అడవినే రాలిపోతున్న, ఆ అడవినే సాగిపోతున్న చరిత్ర ఇంద్రవెల్లితో మొదలైంది.

1978-80 నుంచి 81వరకు చేసిన కృషి ఏకకాలంలో ఆదిలాబాదు జిల్లా గిరిజన రైతు కూలీ సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్యల నిర్మాణానికి, పోరాటానికి పునాది వేసింది.

20 ఏప్రిల్ 1981న ఆదిలాబాదు జిల్లా గిరిజన రైతు కూలీ సంఘం సభ తలపెట్టింది. కిన్నెక హనుమంతరావు అనే ఆదివాసీ నాయకుని అధ్యక్షతన ఆ సభలో మాట్లాడవలసిన రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడు లింగమూర్తి ఆ తర్వాత కాలంలో నల్లమల ఉద్యమ నిర్మాతల్లో ఒకడుగా అమరుడయ్యాడు. ఆనాటి మరోవక్త సిపిడిఆర్ నాయకుడు కోబాడ్ గాంధీ తీహార్ జైల్లో ఉన్నాడు. సభకు వచ్చిన వేలాదిమంది మీద నిర్వచక్షగా పోలీసులు కాల్పులు జరిపారు. ప్రభుత్వం ఆ తర్వాత ప్రకటించిన పదముగ్గురు పేర్లు తప్ప ఇప్పటికీ మృతుల వివరాలు తెలియవు. అరవైకి తక్కువ కాకుండా అమరులయ్యారని, వందలాదిగా గాయపడ్డారని అప్పుడు ఎందరో ప్రత్యక్ష సాక్షులు చెప్పడమే కాదు, ప్రతి నిజనిర్ధారణ కమిటీ అభిప్రాయపడింది.

ఆదివాసులు ఎందుకోసం సభ పెట్టుకున్నారు?

తాము పోడు చేసుకున్న భూములపై తమకు పట్టాలివ్వాలని ఇంద్రవెల్లి సంతకు తెచ్చే తమ ఉత్పత్తికి - పొగాకు కావచ్చు, మిర్చేకావచ్చు - గిట్టుబాటు ధర ఇవ్వాలని, అక్కడి వ్యాపారులు సరియైన తూకం రాళ్లు ఉపయోగించాలని ఇవీ, ఇటువంటివీ డిమాండులు.

న్యాయబద్ధమైనవే కాదు, చట్టబద్ధమైనవి కూడ.

ఇవి రాజ్యాంగం ఆదివాసులకిచ్చిన హక్కులు. శ్రీకాకుళ ఆదివాసీ రైతాంగ పోరాటం తర్వాత 70(1) ద్వారా పునరుద్ధాటించిన హక్కులు 1981లో ప్రభుత్వం తన చట్టాన్ని తూటాలతో ఉల్లంఘించింది.

ఆనాటి ఎస్.పి. 'బులెట్స్ నో నో రూల్స్' (బులెట్లకు నియమాలు తెలియవు) అని ఇంగ్లిషులో ప్రకటించాడు.

ముఖ్యమంత్రి అంజయ్య 'కొండలు దిగి వచ్చిన వాళ్లు

ఎవరనుకున్నారు? పీపుల్స్‌వార్ అంటే, యుద్ధం చీపురుపుల్లలతో చేయరు కదా - అని వెనుక ఉన్న చోడకళక్కుల నీడకు జడుసుకున్నామని చెప్పకనే చెప్పాడు.

ఇవ్వాళ లాల్‌ఘడ్‌లోనూ, నారాయణపట్నంలోనూ అదే చేస్తున్నారు. అదే చెప్తున్నారు.

ఆదివాసులు మావోయిస్టులయ్యారు. మావోయిస్టులు ఆదివాసులయ్యారు. ఈ క్రమం ఇంద్రవెల్లితో మొదలయింది.

ఈ ముప్పై ఏళ్లలో ఇంకెందరు ఈ విముక్తి పోరాటంలో అమరులయ్యారో?

అయితే ఇంద్రవెల్లి తన అమరత్వం నుంచి ఆకాశమెత్తు అమరుల స్థూప పతాకమై లేచింది. ఆ నిర్మాణానికి తన రక్తమాంసాలు ధారపోసినవాడు అమరుడు గంజి రామారావు - రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు. ఆ తర్వాత జగదీశ్ అనే ఆదివాసీ విప్లవకారుడు ఎన్‌కౌంటరయ్యాడు. (జై బోలో జై బోలో జగదీశన్నాకు జై బోలో). పోలీసులు రత్నాపూర్ గుట్టమీద 'ఎన్‌కౌంటర్' చేసి అందులో హనుమంతరావునే దోషిగా చూపారు. పోరాటం ఉధృతమైంది. రాజ్యహింస ఉధృతమైంది. పోలీసులు డైనమైటు పెట్టి ఇంద్రవెల్లి స్థూపాన్ని కూల్చారు.

ఇంద్రవెల్లి తన అమరుల జ్ఞాపకాలను పోరాటంలోకి అనుసృజన చేసుకొని, గాయాలు తుడుచుకొని ఇనుమడించిన పోరాట శక్తి అయింది. అడవి గూడాలు మునిగే సాత్నాల ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకున్నది.

కేస్లాపూర్ నాగోబా జాతరలో రగల్ జెండాను ఎగురువేసి ప్రజా దర్బారు నిర్వహించే సంప్రదాయాన్ని పునరుద్ధరించింది.

బహుశా విప్లవోద్యమ చరిత్రలో మొట్టమొదటి దాడి 1987లో ఆలంపెల్లి సి.ఆర్.పి.ఎఫ్. క్యాంపుపై జరిగింది. పదకొండు మంది సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లు చనిపోయారు. దాడిచేసిన విప్లవకారుల్లో కామ్రేడ్ రామకృష్ణ అమరుడయ్యాడు.

అప్పుడు ఇంద్రవెల్లి ఎక్కడ? ఆదిలాబాద్ ఎక్కడ అని తల తడుముకున్నాడు ఎన్.టి.ఆర్. ఆదిలాబాదు జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటిస్తున్నానన్నాడు. ఇంద్రవెల్లి స్థూపాన్ని ప్రభుత్వ పద్ధతిలో పునర్నిర్మాణం చేయించాడు. ఎవరీ పీపుల్స్‌వార్? ఎక్కడుంటారు? వాళ్లతో మాట్లాడాలి అన్నాడు.

ఇప్పుడెవరూ, ఏ పాలకుడు ఈ ప్రశ్న వేయలేడనుకుంటాను. తెలివితక్కువగానైనా? గడుసుగానైనా - ఎందుకంటే ఇవ్వాళ ఇంద్రవెల్లి గమనం అటూ లాల్‌గఢ్ దాకా ఇటు నారాయణపట్నం దాకా మధ్య - తూర్పు భారతమంతా విస్తరించింది.

హేమన్‌డార్ఫ్ సహచరి యాలీన్ తనను కూడా మార్లాపురం అడవిలో ఆదివాసీ వలె ఖననం చేయాలని అడిగింది. శివసాగర్ సహచరి పార్వతి తన పార్థివ శరీరాన్ని ఇంద్రవెల్లి మట్టిలో కలపాలన్నది.

నక్సల్బరీ, శ్రీకాకుళాల వలెనే ఇంద్రవెల్లి బుద్ధిజీవులను తీవ్రంగా కదిలించింది. మారణకాండ జరిగిన వెంటనే డాక్టర్ సిఆర్ రాజగోపాలన్ నాయకత్వంలో ఒక నిజనిర్ధారణ కమిటీ హైదరాబాదు నుంచి వెళ్లింది. 81 మేలో వరంగల్‌లో రాడికల్ యువజన సంఘం మహాసభలకు వచ్చిన ప్రొఫెసర్ మనోరంజన్ మొహంతీ నాయకత్వంలో మరొక నిజనిర్ధారణ కమిటీ వెళ్లింది. కార్మికుని రక్తంలో తడిసిన అంగే మేడే జెండా అయినట్లుగా ఆదివాసీ రక్తంలో తడిసిన రేగడి నెర్రెల్లో దొరికిన అంగీని ఆ కమిటీలో వెళ్లిన కెవిఆర్ ఎత్తిపట్టి ఈదే రేపటి రగల్ జెండా అని ప్రకటించాడు. (ఇంద్రవెల్లి సృజన ప్రత్యేక సంచికకు అదే ముఖచిత్రమైంది) ఇంద్రవెల్లి మారణకాండ జరగగానే మృతుల, బాధితుల కుటుంబాలకు సహాయం చేయడానికి ఒక కమిటీ ఏర్పడి ఏడాది కాలం పని చేసింది. ఇంద్రవెల్లి, పిట్టబొంగరం, పాండుపురం మొదలైన గ్రామాలు తిరిగి మృతుల, బాధితుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసింది. విరసం 'ఇంద్రవెల్లి', 'రగల్ జెండా' వంటి కవితా సంకలనాలు ప్రకటించింది. 'అడవి ఉప్పొంగిన రాత్రి' (విమల) వంటి కవిత్వం, 'అడవిలో వెన్నెల' (బి.ఎస్.రాములు) వంటి కథలు, 'అడవి' (వసంత రావ్ దేశ్‌పాండే) వంటి నవలలు, మరెంతో సాహిత్యం వెలువడింది. 'ఫారెస్ట్ ఫైర్స్' పేరుతో కెవిఆర్ ఇంగ్లిషులో ఒక సమగ్ర నివేదిక రాసి ప్రచురించాడు.

ఒక విరసం కవి (రమేశ్)కి ఇంద్రవెల్లి ఇంటి పేరయింది. ఇంద్రవెల్లితో పాటే ప్రాణహిత నది, రేలా పాట, నృత్యం ప్రాచుర్యంలోకి వచ్చింది. కవులెందరో తమ పిల్లలకు రేలా, ప్రాణహిత పేర్లు పెట్టుకున్నారు. అల్లం నారాయణ ఏది రాసిన అది 'ప్రాణహిత' మే.

ఇదంతా ఒక ఎత్తు. ఇంద్రవెల్లి డిస్కవర్ చేసిన (పునరావిష్కరించిన) 'కొమురంభీం' ఒక ఎత్తు. 1940లో ఇదే ఆదిలాబాద్ అడవుల్లో 'మా గూడాల్లో మా రాజ్యం' అని స్వపరిపాలన కోసం నైజాంతో సాయుధ పోరాటం చేసిన కొమురం భీం అప్పటి కమ్యూనిస్టు సాహిత్యంలో ఎక్కడా కనిపించడు. కాని ఇంద్రవెల్లి అమరత్వం నుంచి కొమురం భీం 'పునరుత్థానం' చెందాడు. జీసస్ క్రైస్టు రిసరక్షన్ వలె. 'మటగరీ' మళ్లీ మనలోకి వచ్చినట్లు విప్లవోద్యమం మొత్తం కొమురం భీం జీవితం, పోరాటాల గురించి సాహుతో అధ్యయనం, పరిశోధన చేయించి అల్లం రాజయ్య, సాహుల రచనగా 'కొమురం భీం' చారిత్రాత్మక నవలను ప్రచురించింది. చరిత్ర అంటే వర్తమానం గతంతో చేసే పోరాట సంభాషణ అని గుర్తించడం. వర్తమానం గతాన్ని ఒక పోరాట వారసత్వంగా అవగాహన చేసుకోవడం అంటే ఇదే.

1982లో మొదటి సంస్మరణ సభ పోలీసులు జరుగనివ్వలేదు. 1983లో కొమురం భీం నవలను ఇంద్రవెల్లి సంస్మరణ సభలోనే బాలగోపాల్ ఆవిష్కరించాడు. తపన్ బోసు ఇంద్రవెల్లి డాక్యుమెంటరీ రూపొందించాడు. (వెలుగు చూడలేదు) గంజి రామారావు అధ్యక్షతన గద్దర్ ఇంద్రవెల్లి అమరుల (కొండ గోగులు ఎరువు, కొండల్లు ఎరువు, అడవిలో అన్నల అమరత్వం ఎరుపు) స్థూపావిష్కరణ చేశాడు. ఈ సభలో కన్నబిరాన్, డాక్టర్ రామానాథం పాల్గొన్నారు.

1984లో జార్జి ఫెర్నాండెజ్, బాలగోపాల్, పంకజ్‌దత్

వ్యాసం

(పాఠకులు ఇబ్బడిముబ్బడిగా పెరిగినప్పటికీ... జర్నలిస్టులు లోతట్టు ప్రాంతాలకు పోలేకపోవడం వల్ల ఛత్తీస్‌ఘడ్‌లో వాస్తవాలను వెల్లడించడం కష్టమైపోతోంది)

ఛత్తీస్‌ఘడ్‌లో పత్రికలు

- సెవంతీ మీనన్

అనువాదం : ఉదయమిత్ర

ఛత్తీస్‌ఘడ్‌లోని దంతెవాడ జిల్లాలో గల తిమ్మాపురం ప్రాంతంలో పోలీస్ చర్య ఆరు రోజులు కొనసాగింది. మూడు గ్రామాల్లో బీభత్సకాండ యథేచ్ఛగా జరిగింది. సుమారుగా మూడు వందల ఇండ్లు దగ్ధమయ్యాయి. అత్యాచారాలు, హత్యలు కొనసాగాయి. మొత్తం ఒకవారం తర్వాత, ఆ ప్రాంతంలోని సంఘటనలు ఒక్కొటొక్కటే వెలుగు చూడసాగాయి.

అంతకుముందే ఆ రాష్ట్రంలో అత్యంత అధిక సర్క్యులేషన్ గల పత్రిక 'దైనిక్ భాస్కర్'లో రెండు సంచలన వార్తలు (ఓ ఫోటోతో సహా) ప్రచురించేసింది. చిత్రమేమిటంటే, వాళ్లా ప్రాంతానికి ఒక్కసారయినా పోలేదు. ఆ ప్రాంతాన్ని స్వయంగా చూసొచ్చిన ఇద్దరు జర్నలిస్టులు చెప్పినదానికీ, ఈ పత్రిక చెప్పినదానికీ అసలు పోలికే లేదు.

మొబైల్ ఫోన్ ఆధారిత 'సిటిజన్ న్యూస్ సర్వీస్'కు చెందిన సి.జి. స్వర చెప్పిందాని ప్రకారం 'మార్చి 18నాడు రాష్ట్ర పోలీసులు, ఎస్.పి.ఓలు సంయుక్తంగా చింతల్‌నార్ (దంతెవాడ) ప్రాంతంలోని గ్రామాల మీద దాడిచేసి అనేక ఇళ్లను దగ్ధం చేశారు. 'ది హిందూ', 'రాజస్థాన్ పత్రిక' విలేఖరులు ఆయా గ్రామాల్ని స్వయంగా దర్శించి, సుమారు మూడు వందల ఇళ్లు దగ్ధమయ్యాయని, కమాండోలతో సహా ఆరుగురు చనిపోయారని, ముగ్గురు స్త్రీలపై అత్యాచారం జరిగిందని వార్తలు రాశారు. "కో ఆర్డినేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రైట్స్ ఆర్గనైజేషన్" అనే సంస్థ నిజనిర్ధారణ కమిటీగా వెళ్లి పదిహేను రోజుల క్రితం ఢిల్లీలో ఓ ప్రకటన విడుదల జేసింది. మూడు గ్రామాల్లో ఇద్దరు గ్రామస్తులు చంపబడ్డారనీ, మూడు వందల ఇళ్లు దగ్ధమయ్యాయనీ, ముగ్గురు స్త్రీలపై అత్యాచారం జరిగిందనీ ఆ సంస్థ తెలిపింది. ఆ గ్రామస్తులు తెలిపిన వివరాలతో, వాళ్లు తొమ్మిది మంది సల్వాజుడుం వాళ్ల పేర్లు కూడా ప్రకటించారు. వీటన్నింటితో బాటు మావోయిస్టులు కూడా ఒక ప్రెస్ నోట్ ఇస్తూ కేవలం ఒక్క మావోయిస్టు మాత్రమే చనిపోయాడని తెలిపారు.

ఇదిలా ఉండగా ప్రఖ్యాతి గాంచిన "దైనిక్ భాస్కర్" మార్చి 16నాడు రాసిన వార్త ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. చింతల్‌నార్ ప్రాంతంలో మావోయిస్టులు జరిపిన దాడి (అంబుష్)ని కోయకమాండోలు విజయవంతంగా తిప్పికొట్టారనీ, ఈ ఎదురుదాడిలో ఇరవై నాల్గు మంది నక్సల్స్ మరణించారనీ రాశారు. సుశిక్షితులైన పోలీసులు అత్యంత ఆధునిక ఆయుధాలతో జరిపిన ఎదురుదాడిలో ముగ్గురు ముఖ్యమైన మావోయిస్టు నాయకులు చనిపోయారని చిత్రాలతో సహా వార్తలు రాశారు. మళ్లీ

వచ్చారు. తిరుగు ప్రయాణంలో పోలీసులు గొండుల దుస్తుల్లో కొండల మీంచి రాళ్లు దొర్లించి కార్లో ప్రయాణం చేస్తున్న వీళ్లను హతమార్చాలని చూసారు. సభ జరిగింది. పూర్తిగా పోలీసుల సాయుధ పహరాలో. 1985లో ఏక్‌నాథ్ సాల్వే, గద్దర్, మనోరంజన్ మహంతీ, మురళీమోహన్‌లను అరెస్టు చేసి సభ జరుగకుండ చేసి, కేసుపెట్టి, తర్వాత దేశవ్యాప్త ఉద్యమాల వల్ల వెనక్కి తీసుకున్నారు. 1990లో మాత్రం మళ్లీ ఇంద్రవెల్లిలో ఎనబై వేల మందితో ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభ జరిగింది. మళ్లీ 91 నుంచి గత ఇరవై సంవత్సరాలుగా వెల్లి చుట్టూ ఇరవై కిలోమీటర్ల దూరం 144 సెక్షన్ పెట్టారంటే ఏప్రిల్ 20 వస్తున్నదని గుర్తు చేయడమన్న మాట.

అయినా ఇంద్రవెల్లి, జోడేన్‌ఘాట్ ప్రతి సంవత్సరం ఇంద్రవెల్లి అమరులను, కొమురంభీం పోరాటాల్ని స్మరించుకుంటూనే ఉన్నాయి.

కొమురంభీం పోరాటం ఒకే హేమన్‌డార్ఫ్‌ను, ఒక సేతు మాధవరావును (హెమన్‌డార్ఫ్ సూచించిన సంస్కరణలు అమలుచేయడానికి ఉట్నూరులో నియక్తుడైన సేవాభావం గల అధికారి) ఆదివాసీ జీవితాలతో పెనవేసినట్లుగానే ఇంద్రవెల్లి పోరాటం ఒక వియ్యాల జనార్ధనరావును ఆదివాసీ జీవితాల పోరాటాల అధ్యయనానికి పురికొల్పింది.

ముప్పై ఏళ్ల క్రితం చెట్లమీద కూర్చొని ప్రజలపై జరిపిన పోలీసు కాల్పులు ఇవ్వాళ గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో ప్రజలపై ప్రభుత్వాల యుద్ధ స్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నాయి.

ముప్పై ఏళ్ల క్రితం ఇంద్రవెల్లి నుండి గుడిహత్నూరు వరకు మనకు లక్సెట్టిపేట ఆదిలాబాదును కోర్టుపై కనిపించే సంత - ఇవ్వాళ అడవిలో చొరబడ జూస్తున్నా సామ్రాజ్యవాద మార్కెటు అవతారంగా ముసుగు తొలగించుకున్నది.

ఇంద్రవెల్లి విజయం ఎక్కుడున్నదంటే ప్యారిస్ కమ్యూన్ వలెనే తాత్కాలిక ఓటమికి వెరచి లొంగిపోకపోవడంలోనే. ప్రపంచం నలుదిశలా ప్యారిస్ కమ్యూన్ స్ఫూర్తి విప్లవ విజయాలు సాధించినట్లుగానే ఇంద్రవెల్లి దేశం నలుమూలలా విప్లవవ్యాప్తికి మార్గం సుగమం చేసి రాజ్యానికి అన్నిటి కన్నా పెద్ద అంతర్గత ప్రమాదమైంది.

ఇవ్వాళ ఇంద్రవెల్లి మాత్రమే కాదు. దండకారణ్య విప్లవోద్యమం తన ముప్పై ఏళ్ల ప్రస్థానాన్ని సమీక్షించుకుంటున్నది.

ఈ సమీక్ష ఇంద్రవెల్లి గమనాన్నే కాదు ప్యారిస్ కమ్యూన్ గమ్యాన్ని కూడా సాధ్యం చేసే ఆదర్శ ఆచరణగా సఫలం అవుతుందనీ, కావాలనీ ఆశిద్దాం. ☆

మార్చి 19నాడు మరో వార్త వచ్చింది. "మావోయిస్టులు తమ కామ్రేడ్ల ముప్పై ఏడు మందిని ఖననం చేశారు"నీ పతాక శీర్షికన అచ్చయింది. ఇది మావోయిస్టులకు పెద్ద దెబ్బ, ముప్పై ఏడు మంది మావోయిస్టులు మరణించడంతో బాటు పదిహేనుమంది తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇరవై ఒక్క మంది స్వల్పంగా గాయపడ్డారు." (హిందీ నుండి అనువాదం). ఇదీ వార్త! ఛత్తీస్‌ఘడ్‌లో విరాజిల్లుతోన్న జర్నలిజానికి స్వాగతం!

ఫిబ్రవరి 28నాడు రాయగడ్‌లోని ధరమ్ జై ఘడ్‌లో విద్యుత్ ప్రాజెక్టు కోసం భూసేకరణ గురించి ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఆ ప్రాజెక్టు సుమారు ఆరు గ్రామాల్నీ, సగం పట్టణాన్ని మింగేసే ప్రమాదముందని తెల్సుకున్న ప్రజలు ఆ సదస్సుకు 400 మంది దాకా హాజరయ్యారు. అందరూ ఆ ప్రాజెక్టును బలంగా వ్యతిరేకించారు. ఆ సదస్సుకు "టైమ్స్ ఆఫ్ ఇండియా", "ది హిందూ", "హిందూస్థాన్" పత్రికల జర్నలిస్టులు హాజరయ్యారు. వాళ్లంతా ఇంచుమించు ఒకే విధమైన రిపోర్టు ఇచ్చారు.

"టైమ్స్ ఆఫ్ ఇండియా" చెప్పిన దాని ప్రకారం, "సోమవారం నాడు సంబంధిత బొగ్గు గని గురించి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ఏడు గంటల పాటు వాడిగా వేడిగా జరిగింది. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా 438 మంది ఓటేశారు... ఏ ఒక్కరూ మద్దతు పలుకలేదు. 438 మంది ఆ సదస్సులో మాట్లాడారు. ఏ ఒక్కరూ మద్దతుగా మాట్లాడలేదు.

"ఈ పవర్ ప్రాజెక్టు కంపెనీ యజమాని ఎవరో దయచేసి చెప్పగలరా?" అని హిందూ పత్రిక విలేఖరి అభా ఎక్కా అడిగితే, "అదంత అవసరమని నేను భావించడం లేదు" అంటూ ముక్తసరిగా సెలవిచ్చాడు జిల్లా అదనపు జడ్జి ఎస్.కె. శర్మ. డి.బి. పవర్ లిమిటెడ్ పేరుతో నడుస్తోన్న ఆ కంపెనీకి 693.32 హెక్టార్ల స్థలం కావాలి. ఆ కంపెనీ కోసమే ఎస్.కె. శర్మగారు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.

"హిందూస్థాన్ టైమ్స్" మరో రిపోర్టు ఇచ్చింది. తమ ప్రాంతాల మీద పవర్ ప్రాజెక్టు వల్ల కలిగే వాతావరణ ప్రభావం గురించి అనేక విషయాలు సరిగా రిపోర్టు కాలేదనీ, వచ్చిన వార్తలు ఇంగ్లీషులో ఉండడం వల్ల తమకు సరిగా అర్థం గాలేదనీ గ్రామస్తులు అసంతృప్తిని వెలిబుచ్చారు. అయితే అవే ఇంగ్లీషు పత్రికలు ఆ గ్రామసదస్సును నిర్వహించింది. "దైనిక్ భాస్కర్" యాజమాన్యమేనని ఖరాఖండిగా చెప్పాయి. ఆ పత్రిక డిబి పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్ అజమాయిషీలో నడుస్తోందని వేరే చెప్పఖ్ఖర్లేదు..

అసలు ఈ ప్రజాసదస్సు కన్నా ముందే పవర్ ప్రాజెక్టును వ్యతిరేకించే వాళ్లు ఆ కంపెనీ ఆఫీసు మీద దాడులు చేశారు. ఈ ప్రజా సదస్సుకన్నా ముందే "దైనిక్ భాస్కర్"లో పవర్ ప్రాజెక్టుకు మద్దతుగా అనేక కట్టు కథలు ప్రచురించబడ్డాయి. అందులో ఒక ఉదాహరణ : "కాలే హీ రేసే చమకే గీ ధరమ్ జై ఘడ్ కీ తక్ దీర్ (నల్ల వజ్రంతో ధరమ్ జైఘడ్ భవిష్యత్తు వెల్గిపోతుంది)". అయితే ఈ డిబి పవర్ ప్రాజెక్టును ఒక పారిశ్రామిక సంస్థ నడుపుతోంది. అనేది మాత్రం ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారు. ఈ లోపున పవర్‌ప్రాజెక్టుకు వ్యతిరేకంగా వార్తలు సేకరించినందుకు పదకొండు మంది జర్నలిస్టులపై కేసులు నమోదు చేశారు.. జర్నలిజమా... వర్ధిల్లు...

ఛత్తీస్‌ఘడ్‌లో వార్తాసేకరణ చాలా కష్టంతో కూడిన పని. అది యుద్ధ భూమిలో వార్తా సేకరణలాగానే ఉంటది. ఒకవైపు వార్తగా రావాల్సిన సమాచారం చాలానే ఉంటది. కాని, విలేఖరులకు సంఘటనా స్థలానికి పోయే వీలుండదు. అందుకు ముందుగా పోలీసులే 'రక్షణ' పేరు మీద అడ్డు తగుల్తారు. అక్కడికి స్వయాన కలెక్టర్ పోలేని స్థితి. దంతెవాడ ప్రాంతంలో గృహ దహనాలు, అత్యాచారాలు, హత్యలు యథేచ్ఛగా జరిగిపోతుంటే, అక్కడికి స్వయాన కలెక్టర్ పోవాలనుకుంటే, అందుకు పోలీసులు అడ్డు చెప్పారు. వాపసు వచ్చిన కలెక్టరు బాధితులకు నిత్యావసర వస్తువుల్ని పంపితే అక్కడ సల్వాజుడుం ఎస్.పి.ఓ. (స్పెషల్ పోలీస్ ఆఫీసర్)లు డ్రైవర్‌ను కొట్టి పంపించారు.

ఛత్తీస్‌ఘడ్‌లో వార్తా పత్రికల స్వేచ్ఛ గురించి 'అంతర్జాతీయ పత్రికా స్వాతంత్ర్య సంస్థ' పోయిన నెల రెండు ప్రకటనలనిచ్చింది. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక సంఘటనా స్థలంలో వార్తా సేకరణ ఎంత కష్టమో రాసే సరికి, ఆ సంస్థ దూరం నుంచే ఈ ప్రకటన చేయడం గమనార్హం.

వాస్తవమేమంటే, జరిగేవన్నీ అడవుల్లోనే జరుగుతుంటాయి. రోడ్డు గుండా పోవాలంటే, దారులు మూసేస్తారు.. వార్తల సేకరణ కోసం వెళ్లే జర్నలిస్టులు ఏదో ఒక అడవి మార్గం ఎంచుకొని వెళ్లి వార్తలు సేకరించాల్సిందే.

ప్రభుత్వమూ, పత్రికలూ, పోలీసులూ ప్రజల మీద యుద్ధమే చేస్తున్నారు. గాయానికి ఇంత మాలము కోసం, పిడికెడు ముద్ద కోసం, ఒంటిమీద గుడ్డకోసం ఆదివాసీలు ఇంతగా కష్టపడి పోతుంటే, దీన్ని ఎట్లాంటి ప్రజాస్వామ్యమనాలో...

ఓ వైపు మావోయిస్టులకు, ప్రభుత్వానికీ మధ్యన ఘర్షణ జరుగుతుండానే, పాలకులు మాత్రం పరిశ్రమల కోసం భూమిని యథేచ్ఛగా ఇచ్చేయడం, ప్రజల్ని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్‌లో పరిశ్రమలకు భూమి అప్పజెప్పడం గురించి అనేక ఒప్పందాలు ఎం.ఓ.యు. (మెమోరెండం ఆఫ్ అండర్‌స్టాండింగ్)లు జరిగిపోయాయి.

ఒక ప్రాజెక్టు మొదలెట్టాలంటే దానికి ప్రజాభిప్రాయ సేకరణ జరగాలి. వాతావరణ పరిశోధన శాఖ అనుమతి కావాలి. కాని ఈ పరిశ్రమల వాళ్లు ఇవన్నీ తుంగలో తొక్కేసి తమ పని మొదలెడ్తారు. ఈ చట్టాల ఉల్లంఘన గురించి ఫిర్యాదులుండవా? అంటే ఉండవు. ప్రాజెక్టును గురించి వ్యతిరేకంగా ఫిర్యాదులుండవా? అంటే ఉండవు. ఎందుకూ? అంటే బెదిరింపులూ, బుజ్జగింపులూ, వార్తల్ని యథాతథంగా రాసేవాళ్లని 'మావోయిస్టు'లని ముద్రవేస్తారు. ఒక జర్నలిస్టు మూడు నెలల క్రితం తన ఉద్యోగాన్నే పోగొట్టుకున్నారు. ఎందుకంటే, అతడు పనిచేసే పత్రికకు ప్రభుత్వం నుండి విలువైన ప్రకటనలొస్తుంటాయి. ఒక మామూలు జర్నలిస్టు కోసం, పత్రిక తన ఆదాయ వనరును పోగొట్టుకోదు గదా! ఇక బుజ్జగింపుల విషయానికొస్తే, జర్నలిస్టుల్ని సరాసరి డబ్బుతో కొనేస్తారన్నది

వ్యాసం

మావనాటే - మారాజ్యం! పోలవరం మా కోసం కాదు!

- గీతాంజలి

ఫిబ్రవరి 19-20 తారీఖుల్లో మానవ హక్కుల వేదిక అధ్వర్యంలో 30 దాకా ఆదివాసీ, గిరిజన, తెలంగాణ, విరసం సంఘులు కల్సి రెండు రోజులు ఖమ్మం జిల్లాలోని 32 గ్రామాల్లో పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక ప్రచార యాత్రను వేలేరుపాడు మండలం కొయిదా గ్రామం నుంచి మొదలుపెట్టాయి. రెండు రోజులు పాదయాత్రలో 32 గ్రామాల్లో ఆదివాసీ, దళిత ప్రజల నుంచి పోలవరం ప్రాజెక్ట్ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యింది. తమ గ్రామాల్లో ఎటువంటి గ్రామసభలు నిర్వహించకుండా, తమకు కనీస సమాచారం ఇవ్వకుండా కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ పోలవరం ప్రాజెక్టులో తమ అటవీ ప్రాంతం ముంపునకు ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వడం పట్ల ఆగ్రహం కన్పించింది.

కనీసం అటవీ హక్కుల చట్టం అధ్యాయం 3 సెక్షన్ 4 (1) (డి) అనుసరించి తమకు పునరావసం, ప్రత్యామ్నాయ పథకాల గురించి ఎటువంటి సమాచారం లేదని వాళ్ళు చెబుతున్నారు. ఎక్కడో అశ్వారావుపేటలో తమకు భూములిస్తారని వింటున్నామని, తమకు అడవిలో తమ ఇతర మండలాల్లో బతుకు లేదని కాబట్టి పోలవరం ప్రాజెక్టే వద్దని వారు బలంగా కోరుకుంటున్నారు. కనీసం తమ సాగులో ఉన్న అటవీ భూములను పోలవరం ప్రాజెక్ట్‌నకు బదిలీ చేసే సందర్భంలో కూడా తమతో కనీసం ఒక్క అధికారి సంప్రదించకుండా మోసం చేస్తూ వచ్చారని, గ్రామసభ్యులను సమావేశపర్చి తమ అంగీకారాన్ని కోరలేదని ఆవేదన వెలిబుచ్చారు.

తమగ్రామాల్లో అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిగా అమలు చేయకుండానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర పర్యావరణం అటవీ మంత్రిత్వ శాఖకు 02-09-2010న 10-06-2011 నాటి చట్టాన్ని పూర్తిగా అమలుపర్చినట్లుగా ఇచ్చిన తప్పుడు సమాచారం తెల్సుకుని తాము చాలా ఆశ్చర్యపోయినట్లుగా చెప్తూ, ప్రభుత్వం ఈ రకంగా తప్పుడు సమాచారం ఇవ్వడాన్ని ఖండిస్తూ, వెంటనే విచారణ జరపాలని తమ గ్రామసభలు - ప్రభుత్వాన్ని డిమాండ్ చేసస్తూ తీర్మానాలు చేసినా లాభం లేకుండా పోయిందని వాపోయారు.

కట్కూరు అనే గ్రామంలో సోందినారయ్య - ఈ పోలవరం ప్రాజెక్టు వల్ల వచ్చే నీళ్ళు మా పంట పొలాల్లో మేం పంట పండించుకోవడానికి కాదు తూర్పుగోదావరికి ఆ నీళ్లు. వాళ్ళకి ముందే అన్ని నీళ్ళుండగా మళ్ళీ ఎందుకు? ఇది మమ్మల్ని బత్కించనీకి కాదు పరిశ్రమల కోసం. పోలవరం రావాలి - మేం చావాలా? దీని వెనకాల రాజకీయ ప్రయోజనాలున్నాయి. "పోలవరం వచ్చినా మేం ఇక్కడ్నించి కదలం" అని చాలా స్పష్టంగా పాలకవర్గాల అభివృద్ధి నమూనా వెనక ఉన్న విధ్వంసపూరితమైన కుట్రను విడమరచి చెప్పాడు. నిజానికి వాస్తవమూ అదే!

పోలవరం ఎవరి ప్రయోజనాల కోసం అమలుకాబోతోందో స్పష్టంగా అన్ని రకాలుగా నిర్వాసితులవబోతున్న ఆదివాసీలు తెలుసుకున్నారు. పోలవరం ఉద్దేశం పొలాలకు నీరందించడం కోసం కాదు. ఆంధ్రాలో ఏర్పడబోతున్న అతిపెద్ద పారిశ్రామిక కారిడార్‌కి అతిపెద్ద మొత్తంలో నీరందించడం కోసమే. విశాఖపట్టణం, కాకినాడ, విజయవాడ - ముఖ్యంగా కాకినాడ సమీపంలో దేశంలోనే పెద్దదైన ప్రత్యేక ఆర్థిక మండలం కోసం నీరందించడానికే ఈ పోలవరం అన్నది స్పష్టం. ఆంధ్రప్రదేశ్‌లో దేశ విదేశ పారిశ్రామిక వేత్తలు ఎక్కడ పరిశ్రమలు పెట్టినా వారికి విద్యుత్తు, నీరు విస్తృతంగా అందిస్తామని అందుకు తమ దేశ గిరిజన, దళిత, ఆదివాసీ రైతాంగం ప్రాణాలు తీసైనా అందిస్తామని రుజువు చేస్తూనే ఉంది ప్రభుత్వం.

విజయవాడ - కాకినాడ - విశాఖపట్నం పారిశ్రామిక కారిడార్‌ల వల్ల అక్కడ స్థానిక ప్రజలూ నిర్వాసితులవడం

బహిరంగ రహస్యం.

అయితే ఛత్తీస్‌ఘడ్‌లో జర్నలిజం మాత్రమే పతనమయ్యింది గాని, పత్రికా వ్యాపారం తద్భినంగా వృద్ధి చెందుతోంది. విద్యుత్, బొగ్గు గనుల్ని నడిపే పరిశ్రమల అజమాయిషీలో "దైనిక్ భాస్కర్", "హరిభూమి"లాంటి పత్రికలు నడుస్తున్నాయి. వీటితో బాటు కొత్త కొత్త పత్రికలు పుట్టుకొస్తున్నాయి. వాటికి కావల్సిన ప్రోత్సాహం (ప్రకటనల రూపంలో) ఇవ్వడానికి ప్రభుత్వమూ, పరిశ్రమలూ సిద్ధంగా ఉన్నాయి. సెప్టెంబర్ 2010లో రాజస్థాన్ పత్రిక ఒక కోటి పెట్టుబడితో అట్టహాసంగా మొదలయ్యిందంటే, పత్రికా వ్యాపారం ఎంతగా అభివృద్ధి చెందుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడున్న పత్రికల్తో బాటు మరో ఆరు పెద్ద పత్రికలు (హిందీవి) నడుస్తున్నాయి.

గత రెండు సంవత్సరాలుగా ఒక ఛత్తీస్‌ఘడ్‌లోనే పాఠకులు గణనీయంగా పెరిగారు. వాళ్లు హిందీ మాట్లాడే వాళ్ల సంఖ్యలో నాలుగో వంతు ఉంటారు. కాబట్టి, జర్నలిజం ఏ ఏట్లో పడితేనేం? పత్రికా పరిశ్రమ మూడు పూవులు ఆరు కాయలుగా వృద్ధి చెందుతోంది గదా...

పర్యావరణ కాలుష్యాలకు ఇప్పటి కొత్తతరాలు బలికాబోవడం ఒక కఠోర వాస్తవమే. ఇప్పటకే విశాఖపట్నంలో ఉన్న అనేక కెమికల్ ప్లాంట్స్ వదిలే కాలుష్యాలవల్ల అంగవైకల్యం ఉన్న పిల్లలు పుడుతున్నట్లు సర్వేలు చెప్తున్నాయి.

కోయిదా గ్రామంలో ఒక రైతు కూలీ అయితే - ఈ పోలవరం ప్రాజెక్టు కోసం మమ్మల్ని మేం పుట్టి పెరిగిన ఊర్నించి - మా భూములు - అటవీ సంపదల నుంచి బలవంతంగా పరాయి ప్రాంతాలకు తరలించడం చూస్తుంటే ఇదంతా బ్రిటిష్ పాలనలా ఉంది తప్ప తమకు రక్షణ భద్రత ఇవ్వాల్సిన భారత దేశ పాలనలా లేదని చేప్తున్నాడు. ఇతర ప్రాంతాల్లో మాకు పళ్లు తోమడానికి పుల్లలు కూడా దొరకవు. కూలీ దొరక్కపోతే అడవిలో ఏదో ఒకటి దొర్కుతుంది బయట మేం బతుకలేం. 'ఇక్కడ్నించి బయట కాలుపెట్టామా కుక్కల తీరు అవుతది మా బత్కు' అని ఒంటి మీద చిరుగుల అంగీ ఉన్న పింతల కృష్ణారెడ్డి అన్నాడు. ఇక్కడ ఎక్కువ ఆదిమ ఆదివాసీలు కొండరెడ్లు - కోయలు ఉన్నారు. ఇక్కడ ఎకరం నుంచి 10 ఎకరాల వరకు పోడు, సాగుభూములున్న ఆదివాసీ - ఆదివాసేతర షెడ్యూలు కులాలకు చెందిన రైతులున్నారు. ఆదివాసేతరుల చేలుల్లో పట్టాలుంటే వారి చేతుల్లోకే పాలం తాలూకు నష్టపరిహారం పోతుంది. వారి భూముల్లో సంవత్సరాల తరబడి వ్యవసాయం చేస్కుంటున్న భూమిలేని - పట్టాల్లేని ఆదివాసీలు ఈ రోజు నడిరోడ్డుమీద అయోమయంగా నిల్చున్నారు. వీళ్ళు కొత్త ప్రదేశాలకు వెళ్ళి జీవించలేక అడవుల్లోనే మరింత లోపలికి వెళ్ళి అడవులు నరికి పోడు వ్యవసాయానికి భూమి తయారు చేస్కుంటున్నారు. సంవత్సరంలో వరి, కందులు, మినుములు, పెసళ్ళు, మిరపకాయలు, పొగాకు పండిస్తారు. వారికి అది సరిపోతుంది. కొనుక్కునే అవసరం ఉండదు. వరి సరిపోకపోతే పక్క పొలాల్లో రోజు 60 రూపాయల కూలీకి పోతారు. లేదా అడవి లోపలకి వెళ్ళి చింతపండు, జిగురు, ఇప్పపువ్వు, కల్లు రకరకాల దుంపలు, వైద్యానికి పనికి వచ్చే వనమూలికలు తెచ్చుకుని అమ్ముకుంటారు. ప్రతి ఇంటి ముందు గులాబీ, మందార, మల్లె రకరకాల మొక్కలతో పాటు చిక్కుడు, టమాట, వంకాయ, సొరకాయలు పండిస్తారు. వీటితో పాటు పశుసంపద ఉండనే ఉంది. పాలు, పాడి సమృద్ధిగా ఉంటాయి. ఇదంతా వదిలి మేం ఎవరికోసమో ఎక్కడికో ఎందుకు వెళ్ళాలి? అని ప్రశ్నిస్తున్నారు ఈ గ్రామస్తులు. నిజమే, అభివృద్ధి చెందిన ప్రాంతాలను ఇంకా అభివృద్ధి చెందించడానికో, పరిశ్రమలు, కారిడార్‌లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు కోసమో, వాటికి నీరందించడానికో... ఆదివాసీలు ఎందుకు తమ సహజ వనరులను, నివాసాలను కోల్పోవాలి? స్వయం సమృద్ధి ఆర్థిక వ్యవస్థను ధ్వసం చేస్కుని, నిర్వాసిత స్థలాల్లో ఎందుకు కూలీలవ్వాలి?

సహజ వనరులే కాదు ఆదివాసీలు ఒక్కసారి తమ అటవీప్రాంతాన్ని దాటి బయటకు వెళ్తే వారు తమ అటవీ హక్కుల్నీ ఒదులుకోవాల్సి వస్తుంది. అక్కడి ఆదివాసీ షెడ్యూలు తెగలకు ప్రత్యేకంగా ఉద్యోగ రిజర్వేషన్లలో వచ్చే వి.ఆర్.ఓ. - ఎ.ఎన్.ఎం. లాంటి ఉద్యోగవకాశాలు పోతాయని స్థానిక ఆదివాసీ హక్కుల సంఘాల వాళ్ళు చెప్తున్నారు. అంతేకాదు భూమి బదలాయింపు నియంత్రణ 1996 నాటి పంచాయితీల షెడ్యూల్డు ఏరియాకు విస్తరణ చట్టం ద్వారా అమల్లోకి వచ్చిన ప్రత్యేక నిబంధనల కిందటే స్వీయపాలన అన్నీ కూడా ఈ అటవీ ప్రాంతాల్ని దాటగానే వారు కోల్పోతారు. అందుకే 'మావనాటే - మా రాజ్యం' (మా ఊళ్ళో - మా రాజ్యం) అంటున్నారు ఇక్కడి ఆదివాసీలు.

అయితే ఇక్కడ కొద్దిమంది ప్రజల్లో అయోమయ పరిస్థితి ఉంది. ఉదా: రేపాక దుమ్ము అనే గ్రామంలో ఒక కొండరెడ్డి తెగకి చెందిన రైతు "మీరు మా కోసం ఇంత కష్టపడి వచ్చారు కానీ మీతో కల్సి ఈ ఉర్నించి చాలా మంది రారు. ఎందుకంటే ఇక్కడి ఆదివాసేతరులు వాళ్ళ పొలాల్లో పనిచేస్కుని బతికే ఆదివాసీ కౌలు రైతుల్ని గురించి పట్టించుకోకుండా ప్రభుత్వం దగ్గర డబ్బు తీస్కున్నారు అన్నాడు ఆగ్రహంగా... అలాగే న్యూడెమోక్రసీ పార్టీ, సిపిఐ, సిపిఎం పార్టీలు నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వలేని పోలవరం వద్దంటున్నాయి. కానీ - అసలు 300ల గ్రామాల్ని, 10,000 ఎకరాల అటవీ-సాగుభూమిని ముంచి, 3 లక్షల దళిత ఆదివాసీలను నిర్వాసితుల్ని చేసే అపారమైన అటవీసంపద, వన్యప్రాణుల, వనమూలికల్ని, అరుదైన జీవవైవిధ్యం కలిగిన పాపికొండల్ని, ఆదివాసీ సంస్కృతిని, భాషని నాశనం చేసే పర్యావరణ కాలుష్యాన్ని పెంచే ప్రమాదకరమైన కొద్దిమంది పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మొదలైన పోలవరాన్ని పూర్తిగా వద్దే వద్దు అని అనడం లేదు. నిర్వాసిత పాకేజీ - నిర్వాసిత హక్కుల మీద మాత్రమే దృష్టి సారిస్తూ అక్కడి ప్రజల్ని అయోమయానికి గురిచేస్తున్నాయి. పైసలు రెండు రోజుల్లో అయిపోతాయి. భూమి తల్లిలా బతుకంతా ఆదుకుంటుంది. మా పిల్లలకీ అది కూడూ - చదువూ - బతుకు ఇస్తుంది. మాకు పునరావాస పేకేజీ డబ్బులు వద్దు, మా భూమి మాకు కావాలి. మా ఊళ్ళూ అటవీ సంపదా మాక్కావాలి అని ఆదివాసీలు ముక్తకంఠంతో చెప్తున్నారు. భూమి అమ్ముకున్న ఆదివాసేతరులు కొత్త కొత్త హీరోహోండాలతో తిరుగుతూ - బి.సి.లు - ఒ.సి.లు మీ కళ్లకు కనపడ్డం లేదా అని ఒక దశలో రోడ్డు మీద మమ్మల్ని నిలదీసి అడిగి నిర్లక్ష్యంగా వెళ్లిపోయారు.

ఇక్కడ కొంతమంది ఆదివాసీలు ఇళ్ళు కట్టుకుటుంటే కొద్దిమంది రాజకీయ నాయకులు వాళ్ళని - కట్టుకోవద్దని ఎలాగూ ఇక్కడ్నించి మీరంతా వెళ్ళిపోవల్సిందే, పైసలెందుకు వృథా చేస్తున్నారు, కట్టద్దని - బెదిరిస్తున్నట్లు కొన్ని గ్రామాల్లో ప్రజలు చెప్పడం జరిగింది.

లచ్చు గూడెంలోనైతే గ్రామ సభల్ని నిర్వహించకుండా భూమి సర్వేలకొచ్చిన ఎం.ఆర్.ఓ.లను, మరికొద్ది మంది ఆఫీసర్లను అక్కడి గ్రామ ప్రజలు నిర్బంధిచారు, అడ్డుకున్నారు. కొన్ని రాజకీయ పార్టీలన్నీ కుమ్మకై తమ ఆస్తుల్ని కాపాడుకోవడానికి పోలవరం

ప్రాజెక్టుని సమర్థిస్తున్నాయి. ఈ రాజకీయ దళారీల నుంచి మా భూములకు, జీవితాలకు రక్షణ కావాలని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గోదావరికి వరదొస్తే అదిగో అడవిలోని ఆ గుట్టలు మమ్మల్ని ఆదుకుంటాయి. గుట్టలెక్కి అక్కడ్నే వండుకుని, ఉండి వరద పోగానే మళ్ళీ మా ఊర్లోకి వస్తాం. మా పంటపొలాలు ఎటూ పోవు. మళ్ళీ అన్నీ సమకూర్చుకుంటాం. పోలవరం ప్రాజెక్టు అట్లకాదు కదా. ఇది మొత్తం మా ఆదివాసీ తెగనే సమూలంగా నిర్మూలిస్తుంది. భూమి - ఇళ్ళు - అడవి అన్నీ కోల్పోతాం కాబట్టి మాకు ఈ ప్రాజెక్టు వద్దే వద్దని కుకునూరు మండలం రామన్నగూడెం ప్రజలు చెప్పారు.

ఇక్కడి ఆదివాసీలందర్కి 1/70 చట్టం 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింపచేస్తూ పంచాయితీ రాజ్ షెడ్యూల్డ్ ప్రాంత విస్తరణ చట్టం పి.ఇ.ఎస్.ఎ. లాంటి అటవీ హక్కుల గురించి మంచి అవగాహన ఉంది. ఈ అవగాహన బహుశా బాలగోపాల్ బతికి ఉన్నప్పుడు ఇక్కడ పోలవరం ఆపడానికి విస్తృతంగా తిరిగినప్పుడు వీరికి కలిగించిన అవగాహనలో భాగంగా అనుకోవచ్చు.

ఇంకో అంశం ఏంటంటే... అక్కడి గ్రామాల్లో ఇప్పుడిప్పుడే డిగ్రీల దాకా చదువుతున్న ఆదివాసీ యువతీయువకులు ఉన్నారు. ఈ ప్రాజెక్టు వారి జీవితాల్ని అంధకారంలోకి తోస్తుంది. కోయిజాతిలో చదువుకున్న స్త్రీలు సంపాదిస్తున్న నాటేవన్ స్త్రీల మహిళా సంఘాల్లో చురుకైన కార్యకర్తలుగా పనిచేస్తూ కోయ, తెలుగు - ఇంగ్లిషు పదాల ప్రయోగంతో ధారళంగా మాట్లాడ్తుంటే అబ్బురమనిపించింది.

పోలవరం ప్రాజెక్టు వలన జరిగే మరో ప్రమాదకరమైన నష్టమేమంటే... పోలవరంలో ఎగువన ఉన్న తెలంగాణలో కరీంనగర్ మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు ఇవ్వాల్సిన 680 టి.ఎం.సి.ల నీటి నుండి 500 టి.ఎం.సి.ల నీటిని ఆంధ్రకు తరలించి జలదోపిడికి పాల్పడడం. అన్నింటికంటే దారుణమైన విషయం ఏమిటంటే... నిర్మించే అవకాశం ఉన్న ఇచ్చంపల్లి ప్రాజెక్టును మర్చిపోవడం, అలాగే కోట్లు ఖర్చుపెట్టినా మొదలుకాని దుమ్ముగూడెం ప్రాజెక్టు, శ్రీరాం సాగర్, దేవాదుల, ఎల్లంపల్లి, సింగూర్ కాలువ, కొమురం భీం, రాలివాగు, నిర్వాయం, నెట్టంపాడు, భీమా, ప్రాణహిత పనులు అలానే ఆగిపోయి ఉన్నాయి. వీటి గురించి ఆలోచించకుండా ముందు నుంచీ నీటి వసతి బాగా ఉన్న పశ్చిమ గోదావరి, తూర్పు కృష్ణా, విశాఖ జిల్లాలోని దాదాపు 600 గ్రామాలకు నీరందించడానికి అక్కడి ఆంధ్ర పారిశ్రామికవెత్తల పరిశ్రమలకు, సెజ్‌లకు నీరందించడానికి ఉత్తర తెలంగాణకు నీటి హక్కుని గుంజుకునే పోలవరం నిర్మించద్దు.

పోలవరం వలన 960 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని చెప్తున్నారు. కానీ ఖమ్మం జిల్లాలో ముంపుకు గురి అయ్యే 7 మండలాల అటవీ ప్రాంత గ్రామాల్లో నైరుతి రుతుపవనాల కాలంలో 1400 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసి కరెంట్, భూగర్భజల వినియోగం లేకుండా పంటలన్నీ వాన నీటిలోనే పండుతాయి. అయినా పోలవరం వల్ల ఉత్పత్తి అయ్యే కరెంట్ ఆ ప్రాంత ప్రజలకు కాదన్నది వాస్తవం.

పాలకుల విధ్వంసకర అభివృద్ధి నమూనాలైన ఖనిజాలకై అడవుల తవ్వకాలు సెజ్‌లు-పారిశ్రామిక కారిడార్‌లు, కెమికల్, గ్యాస్ ప్లాంట్‌ల వలన నాశనం అయ్యే ఆదివాసీ, దళిత, బీదరైతాంగాలు, అదృశ్యమయ్యే వృక్ష-వన-జంతు సంపదలు ఎవరికి కావాలి?

డ్యాంల నిర్మాణంపై పరిశీలన కోసం ఏర్పాటైన అంతర్జాతీయ భారీ ప్రాజెక్టుల కమిషన్ ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ అభివృద్ధి అంటే సహజ వనరులను నాశనం చేస్తూ ఒక వర్గ ప్రజల ఆదాయ అవకాశాలను పెంచడం కాదని స్పష్టం చేసినా ఎవరికి పట్టింది?

పోలవరాన్ని వ్యతిరేకించే ఇంజనీర్లు దీని నిర్మాణం వలన అపారమైన జల సంపద ఒక చోట పోగు పడి లేదా నిల్వచేయడం జరిగి భూమిపై ఒత్తిడి పెరిగి భూకంపాలు సంభవించే అవకాశం ఉందని తేల్చి చెప్పినా, ప్రత్యామ్నాయాలు సూచించినా, కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ 28 జూలై 2010న ఫారెస్ట్ క్లియరెన్స్ జారీ చేయడం ఎవరి ప్రయోజనాల కోసం?

మల్కన్‌గిరిలో కలెక్టర్ వినీల్ కృష్ణను కిడ్నాప్ సందర్భంలో మావోయిస్టులు చేసిన డిమాండ్లలో పోలవరం ప్రాజెక్టును ఆపివేయమని ఉన్నా, ముందు ఒప్పుకున్నా విడుదల అయ్యాక స్వయంగా సి.ఎం. కిరణ్‌కుమార్ రెడ్డి కేంద్రం నించి పోలవరానికి జాతీయహోదా కల్పించే నిధుల విడుదల ప్రయత్నం చేయడం, ఏ విద్రోహాన్ని సూచిస్తుంది?

ఏమైనా ఒక వర్గానికి విద్యుత్ కోసమో, నీటి కోసమో, రాజకీయ నాయకులు పంచుకున్న నిధుల వాటాల కోసమో మేం బలికాదల్చుకోలేదు. చివరిదాకా పోరాటం చేస్తాం. మేం అసలు వీళ్ళకు పోలవరం ప్రాజెక్టు కట్టే అనుమతి ఇవ్వలేదు. ఇవ్వకుండా భూమి ఆక్రమించుకునే హక్కు వీళ్ళకు లేదు. మా హక్కుల కోసం పోరాడుతాం. నీలాంటి వాళ్ళు ఇంకా చాలా సార్లు మా గ్రామాలకు రావాలి. మాకు సాయపడాలి. అందరం కలిసి పోలవరాన్ని రాకుండా ఆపాలి. గ్రామ సభలు నిర్వహించండి. మా ఊళ్ళోకి వాళ్ళు కాళ్ళు పెట్టద్దు. మా ఊళ్ళో - మా రాజ్యమే నడవాలి అని - ఆదివాసీలు చాలా ధృఢంగా మాతో చెప్పారు. ఇది ఆదివాసీల స్వయం పాలన ఆకాంక్ష కాక మరేమిటి? తమ ప్రాంతంలోకి బల ప్రయోగలాతో, మోసాలతో చొచ్చుకొస్తున్న పరాయి దేశ పారిశ్రామిక వేత్తలు, వారికి దళారుల్లా పనిచేస్తున్న స్వదేశీ రాజకీయ ద్రోహుల మోసాల్ని అడ్డుకొని తమ ప్రాంత స్వీయపాలన అటవీ హక్కుల్ని కాపాడుకోవడమే ధ్యేయంగా ప్రతిఘటిస్తున్న ఆదివాసీల పోరాటాలు విజయవంతమై పోలవరం ప్రాజెక్టు ఆగి పోవాలని ఆకాంక్షిద్దాం.

ఉత్తరం

నాయ్డుబావూ .... నోరిప్పీకు మీ!

- బజరా

ఏటి నాయ్డు బావూ! ఇంతన్నావా? నువ్వు పిలిస్తే పలకవట, పడితే సూడవట, పిత్తితే నవ్వవట. నీ అరకత్తులు సూడలేక నచ్చిపోతన్నామనీసి ఆ అప్పోజినను పార్టీవోలు వోవ్వోగగ్గోలెట్టెస్తన్నారు. నువ్వానాడు సోంపేట కాల్పులవుడు రెచ్చిపోయి పుచ్చిపోయినావట. యిరగబడిపోయి తిరగబడి పోనావట. మరిప్పుడేటయ్యిందీ? అని మంత్రి 'దర్మాన' పియ్యే అయిన సూర్రావు మెడపోత్రంగా మాట్లాడతన్నాడు. అట్టెయ్యకే పోవాల... అట్టేసిన తరవాత ఎంచేపుస్తావు? తిరగెయ్యక తప్పదు కదా? మాడిపోద్ది, (మన) దాక పేలిపోద్దని ఎక్కిరించి మరీ ఎకసెక్కాలాడతన్నాడు. మనుసుల జీవాలార్పీసి ఇళ్లూ ఊళ్లూ తగలబెట్టీసి ఇంత సేసినా నువ్వూ మీ తమ్ముడూ ఇద్దరికిద్దరూ ఫెవికోలు పెదాలకతికించీసుకోని... సూదీ దబ్బలాలతోటి నోళ్ళు కుట్టీసుకోని మాటలాడ్డం లేదనీసి మరిడి మాటలాడుతాడా? నీటి మీద కొడితే వొకటవుతాదా? రెండవుతాదా? మనం మనం బరంపురం అని తెలుసుకోకండా - సోంపేటవుడు నెవ్వెక్కిరిస్తావా? ఇప్పుడు కాకరాపల్లప్పుడు మేమెక్కిరిస్తామని ఆడు బూమి తవ్వీసి మూడు బాగాలు సేసెస్తన్నాడు గదా? సోమారం పుట్టిన సొట్టిక తెగిపోయిందని వదిలిద్దునుగాని... యేనికని ఆలోసిత్తన్నాను. పేడ మీద రాయేస్తే మన మీదకి తుల్లుతాది గదా అనీసి ఆలోసిత్తన్నావీ.

నువ్వూ మీ తమ్ముడూ ఈస్టుకోస్టు కరంటు కంపినీవోలు దగ్గర కోట్లు కోట్లు కొట్టీసినారట. అందుకే మీరిద్దరూ తోడు దొంగల్లాగ కిక్కురు మనడం లేదట. సాలక యెనకటికి మీ తమ్ముడు నాయ్డు బావ్... తకరల్లేదు, కరంటు కంపినీలొస్తే లాబమేగాని నష్టమేటిలేదనీసి పేపర్లగట్ల ఊదరగొట్టీసినాడని సాచ్చికాలతోటి ఆలు తవ్వి పోస్తున్నారు. సిగ్గులేనోడికి ఉచ్చపోసి బుర్రగొరిగితే - యెన్నిముంత లేసినారని అడిగినాడట. అలాగ ఆలకి సిగ్గేటి పరువేటి నీతేటి జాతేటి సెప్మీ.

అది కాదు నాకు తెలీకడుగుతాను, ఆలు సోంపేట నాగార్జున కరంటు కంపినీ దగ్గిర దొబ్బిలేదా? కోట్లు కోట్లు కొట్టీలేదా? కాకరాపల్లి ఈస్టుకోస్టోళ్ళ దగ్గిర కొట్టీలేదా? ఎవుల దగ్గర కొట్టీలేదుసెప్మీ. అందరి దగ్గర దండుకున్నారు కాబట్టీ జనమడ్డు తీసి ఆగమేగాల మీద పనులు జరిపిస్తన్నారు, పోలీసుల్ని దింపీసిమరీ. పవరాల సేతిల ఉంది. కలకటేరు ఆలసేతిలున్నాడు. ఎస్పీ ఉన్నాడు. ఆ మాటకొస్తే దేశమే ఆల సేతిల ఉంది. కాబట్టీ డబ్బియారు ప్లాంటులకి పునాది రాయేస్సినారు. అన్నిట్లల్ల ఆలకి వోటాలుండొచ్చు, మనకుండ కూడదా? పెతి పచ్చుంల ఉండడమే తప్పా? నేరమా? ఏటీ అన్నేయం? పెరసంటేజీలు తీసుకున్నప్పుడు మీరు స్థానిక లీడరా? అప్పుడు మిమ్ము కలుపుకుపోతారా? ఇప్పుడు ఇచ్చిపుచ్చికాలు మాట్లాడతారా? దండుకున్నప్పుడు అందరం ఏకపార్టీ. కాంగిరేసు లేదు, తెలుగు దేశం లేదు, అప్పుడు జెండాలు తీస్సి ఎజెండాలెట్టేసి నారు. వోటీల్లేని సన్నాసులెవరున్నారో సెప్పండి. నా నోరసలే మంచిది కాదు, అందరం ఆ బురదగుమ్మిల సేపలు పట్టినోలిమే. ఏల ఎల్లమ్మని ఎంచాల? ఏల పోలమ్మని పొగడాల?

నాయ్డు బావూ... నోరు మూసుకున్నా, జనం దగ్గిర అలవాటుకి సెవ్వులు మూసుకోకు. నా మాట బాగ ఆలించు. బావూ... నువ్వటా రాజకీయాల్లో కొచ్చి లచ్చల కోట్లు దొబ్బినావట. మరి మంత్రి బావు దొబ్బలేదా లచ్చల కోట్లు... కాదు తెలీకడుగుతాను, ఏల... తిన్నికూట్ల ఏల ఏరగాల? ఏరిగింది ఏల ఎత్తిపోసుకోవాల? నూనెయ్యకండా నోటి ఆవిరిన బూరిలొండినోలుమే ఎవులమయినా, ...నోరు మూసుకుంటే తప్పేటీ. సోంపేటవుడు జిల్లా ఓలు మొత్తము పెజానీకము తిట్టి పోసినా మంత్రిగోరు పెదవిప్పినారో, గవర్నమెంటుల ఉన్నాడు కాబట్టి సచ్చినా బతికినా ఎవులు ఏమయిపోయినా గవర్నమెంటు పాలసీ మారదనీసినాడు. అంతకు పెచ్చు ఒక్క మాటాడినాడా? కర్సు లేని నాలికదేముంది? నాలిక అంగుట్లెట్టి అడిసీసికుంతే సేన... సోంపేటలాగే కాకరపల్లి అగ్గిలాగ లెగిసి బుగ్గిల బుగ్గయి నిన్నట్ల కలిసి పోతాది. కడుపుకి జరక్క కనాకష్టమవతుంతే బుతుకులే సూసుకుంతారా? కేసులకే తిరుగుతారా?

అయినా ఈ జనానికి ఆరో మీరో తప్ప ఎవులు దిక్కు సెప్పిమీ? సచ్చినట్టు ఓటెయ్యాల. సావొచ్చినట్టు పడాల. రామాయణంల పిడకల ఏటన మద్దిల ఈ జగను గుంటడొకడు. నీ ఓటా సెప్పంతే ఆడేటి సెపుతాడు? ఓటాలేసిందే ఆలనాయన. ఆల నాయనా వోటా ఆలనాయన యెప్పుడో తీసికెలిపోండు. పెరిమినచ్చింది ఆ వొగను బావుడే కదా? నచ్చి ఎక్కడున్నాడోగాని మనలాటోలందరికీ అంతో ఇంతో సంపాదించుకోమని సెప్పీసి పునాదులు తవ్వీసే పోనాడు. తప్పుమాట మాసెడ్డ మంచోడుమీ. అయినా ఆడి వూసు ఏనికి గాని, అందరూ మిమ్మల్ని ఉలవగింజకి మొల్లెట్టినట్టుగా మనిసొక మొట్టెట్టెస్తన్నారు, ఇది సూడలేక నాగోల. అయినా జాగా సూసే బైటో అనాలగాని జాగా సూడకుండా బైటో అంతే ఎలగ?

సివారకర్ర వొక్క మాట. లాస్టు మాట. మీరు మాత్రం ఆ క్రిష్ణ పరమాత్తడిలాగ నోరిప్పకండి. ఇప్పినారా... ఇంక నంతే... బాపురే పదునాల్గు బువన బాండాలన్నారు, ఏది బైట పడినా మీరు బైట పడాల్సి వస్తాది. మీడియా వోలు కితకితలెడతారు. మీరు మాత్రం కిమ్మనకండి. కమ్మనకండి. కోవెలకెళ్ళి పిత్తకుండా ఉంటే దూపమేసినంత ఫలితం. అలాటి ఫలితం దక్కాలంటే ఇలాటి తిప్పలు తప్పవు. మీరే కరెస్టు. మీరు నోరు తెరకండి, పెజలు సచ్చినా బతికినా!

వ్యాసం

హిందూ, జొరాష్ట్రియన్ మతవిశ్వాసాలు

- కొడవటిగంటి రోహిణీప్రసాద్

మతవిశ్వాసాల్లో వ్యత్యాసాలు ఎలా ఏర్పడ్డాయో చరిత్రను చూస్తే తెలుస్తుంది. ఈనాడు ప్రాచుర్యంలో ఉన్న హిందూ, జొరాష్ట్రియన్ (పార్శీ) మతవిశ్వాసాలు ఎంతో ప్రాచీనమైనవి. ఇప్పుడు వేరుగా ఉన్నప్పటికీ ఒకప్పుడు ఇవి ఒకే కుదుటినుంచి పుట్టాయనే ప్రతిపాదనకు ఆధారాలు కనిపిస్తాయి. వీటి పరిశీలనకు కొంత చరిత్ర ఉంది. 1786లో మన దేశానికి వచ్చి సంస్కృతం అభ్యసించిన సర్ విలియం జోన్స్ సంస్కృతానికీ, పర్షియన్, గ్రీక్, లాటిన్, కెల్టిక్, గోథిక్ తదితర యూరపియన్ భాషలకూ ఉన్న పోలికలను గుర్తించాడు. వీటివల్ల తెలిసే అనేక విషయాల్లో ఆర్యభాషకు పూర్వరూపాన్ని గురించిన వివరాలున్నాయి. 1920 తరవాత సింధునదీ నాగరికత గురించిన పరిశోధనలూ వగైరాలన్నీ జరిగాయి.

భాష, మతవిశ్వాసాల విషయంలో క్రీ.పూ.1200 ప్రాంతాల కూర్చబడిన ఋగ్వేదానికీ, జొరాష్ట్రియన్ మతగ్రంథమైన జెండ్ అవెస్తాకూ ఎన్నో సామ్యాలు కనిపిస్తాయి. అప్పటి ఇరాన్లో పాటించిన పార్శీ మతవిశ్వాసాలను మనదేశపు జొరాష్ట్రియన్లు నేటికీ అవలంబిస్తారు. వీరంతా ఇస్లాంవల్ల బహిష్కరణకు గురయి వెయ్యేళ్ళ క్రితమే ఇరాన్నుంచి గుజరాత్, ముంబై తదితర ప్రదేశాలకు వచ్చి స్థిరపడిన ప్రజలు. హిందూమతవిశ్వాసాల మూలాలనూ, జొరాష్ట్రియన్ మతంతో దానికిగల పోలికలనూ మనం గమనించవచ్చు. వీటి చరిత్రను గురించిన ప్రతిపాదనల్లో తీవ్రమైన భేదాభిప్రాయాలు కూడా కనిపిస్తాయి.

క్రీ.పూ.1500 ప్రాంతాల మనదేశపు వాయవ్యప్రాంతాలకు పడమటినుంచి వచ్చిన ఆర్యభాష ప్రజలు ఎక్కడివారో పటంలో చూడవచ్చు. ఉత్తరాన కజక్స్తాన్, కిర్గిజ్స్తాన్, పశ్చిమాన ఉజ్బెకిస్తాన్, టర్క్మెనిస్తాన్, దక్షిణాన అఫ్ఘానిస్తాన్, మధ్యలో తజికిస్తాన్ మొదలైన ప్రాంతాలన్నిటిలోనూ ప్రాచీన ఆర్యభాషీయులు వాడిన పదాలకూ, ఆచారాలకూ మూలాలు కనిపిస్తాయి. ఇండోయూరపియన్ భాషీయులైన కొందరు ప్రజలు మధ్యఆసియానుంచి తమ పశువులను తోలుకుంటూ అనేక దిక్కుల్లో ప్రయాణించారని కొందరు చరిత్రకారుల ఉద్దేశం. వీరి తాత్త్వికచింతన ఋగ్వేదంలోనూ, అవెస్తాలోనూ కూడా కనిపిస్తుంది. ఈ ప్రతిపాదనకు కొన్ని సాక్ష్యాలు లభించాయి. క్రీ.పూ. 1400 ప్రాంతాల నేటి ఉత్తరసిరియా ప్రాంతపు హిటైట్, మితానీ రాజ్యాలమధ్య జరిగిన సంధి ఒప్పందంలో ఇంద్ర (ఇందర), వరుణ (ఉరువన), నాసతియన (నాసత్య లేదా అశ్వనీ) మొదలైన పేర్లు రాసుకున్నారు. మన దేశానికి ఎంతో దూరాన కనిపించిన ఇటువంటి సాక్ష్యాలవల్ల దాదాపుగా ఒకే భాషనూ, మతధోరణినీ పాటించిన ప్రజల్లో కొందరు పడమటగానూ, మరికొందరు తూర్పుగా మన ప్రాంతాలకూ వలసవెళ్ళారనే ప్రతిపాదన ఉంది.

పార్శీవారి ఉపనయనంవంటి నవజోత్ తంతు

వారి మతవిశ్వాసాల్లోకూడా పోలికలుండేవి. ఆర్యులలాగే అగ్నినీ, మిత్ర, వాయు, వరుణుడి వంటి (గ్రీక్ సంప్రదాయంలో ఔరనోస్) ప్రకృతిశక్తులను ఆరాధించడం, జంధ్యంవంటిది ధరించడం పార్శీవారి సంప్రదాయం. వారి నవజోత్ (లేదా పునర్జన్మ) తంతు మనవాళ్ళ ఉపనయనంవంటిదే (పటం). జొరాష్ట్రియన్ మతంలో పూజారులను జోతర్ (హోత్ర) అంటారు. భాషాపరంగా అవెస్తాలోని హోమ (సోమ), హిందు (సింధు), అహుర (అసుర), దాహ (దాస) మొదలైన పదాలు సంస్కృతాన్ని పోలినవి. గాథ, మత్ర (మంత్ర), యస్న (యజ్ఞ), యిమ (యమ), సతం (శతం) మొదలైన పదాలు సంస్కృతంవంటి అర్థాలు కలిగినవే. వేదసాహిత్యంలోని ప్రకృతిని శాసించే ఋతం అవెస్తాలో అర్త అయింది. ఇవికాక లెక్కలేనన్ని ఇతర పదాలు రెండు పద్ధతుల్లోనూ కనిపిస్తాయి. ప్రాచీన పార్శీ మతంలోకూడా పూజలు చేసేందుకూ, పరిపాలించేందుకూ, పశుపాలనకూ మూడు వర్ణాల ప్రజలుండేవారు. కాయకష్టం చేసే నాలుగో వర్ణం తరవాత వచ్చింది. పితృదేవతలను ఆరాధించడం రెండు సంప్రదాయాల్లోనూ కనిపిస్తుంది.

కొందరు చరిత్రకారుల లెక్కన మధ్యఆసియానుంచి వలసవెళ్ళిన ప్రజలు అనుసరించిన మార్గాలు పటంలో చూడవచ్చు. వీరిలో కొందరు ఐర్లండ్దాకా వెళ్ళినట్టు భావిస్తున్నారు. సంస్కృతంలోని రాజ శబ్దాన్ని పోలిన రెక్స్ మొదలైన లాటిన్ పదాలవంటిదే ఐరిష్ భాషలోని రీ అనే మాట. దీన్నిబట్టి చూస్తే

రాచరికవ్యవస్థ అనేది ఈ ప్రజలంతా కలిసి జీవించిన దశలోనే మొదలైందనీ, అందుకని అప్పటి మాట వివిధప్రాంతాల్లో కొద్దిపాటి మార్పులతో కొనసాగిందనీ అంటారు. మనదేశానికి అనేక విడతల్లో తండాలుగా వచ్చిన ఈ ప్రజలకు అప్పటికే కొన్నివేల ఏళ్ళుగా స్థిరపడిన సింధునాగరికత ఎదురయి ఉంటుంది. అక్కడి రుద్రుడు, శివుడు మొదలైన దేవతలు క్రమంగా కొత్తగా వచ్చినవారి మతవిశ్వాసాల్లో చోటు సంపాదించుకుని ఉంటారు.



ఇండోయూరొపియన్ భాషీయులైన ప్రజల వలస మార్గాలు

పార్శీ సంప్రదాయంలో ఇరాన్ ఈశాన్యంలోని అఫ్ఘనిస్తాన్, కశ్మీర్, పామీర్ (ప్మారు) మొదలైన ప్రదేశాల ప్రస్తావన కనిపిస్తుంది. ఆర్యావర్తం అనే తమ ప్రాంతాలను అవెస్తాలో ఐరియాన వేజా అని రాశారు. జెండ్ అవెస్తా, ఋగ్వేదాల కూర్పు జరిగేనాటికి వీరంతా ఇరుగుపొరుగువారే. మొదట్లో ఒకే బృందానికి ప్రజల్లో కొందరు ఇరాన్ ప్రాంతానికీ, మరికొందరు సింధునది పరిసరాలకూ అనేక విడతలుగా ప్రయాణించి ఉండవచ్చు. కాలక్రమాన వీరి తాత్వికచింతనలో వైరుధ్యాలు తలెత్తినట్టుగా అనిపిస్తుంది.

పార్శీవారి అధిదేవత అహురమజ్ద (సంస్కృతంలో అసురమేధ). అహుర అనేది వారికి పవిత్రమైన పేరు. తరవాత దేవ, దైవ అనేవి దయ్యాలవంటివిగా పరిణమించాయి. అలాగే ఋగ్వేదం మొదట్లో వరుణుడూ, మిత్రుడూ (సూర్యుడు) అసురులుగానే ప్రస్తుతించబడ్డారు. క్రమంగా వేదసాహిత్యంలో దేవశబ్దం ప్రశంసాపాత్రమై, అసురశబ్దం పనికిరానిదిగా తయారైంది.

ఈ చీలికను గురించి కొందరు పార్శీ పరిశీలకులు వివరాలు సేకరించారు. వారి లెక్కన అగ్ని, వరుణ మొదలైన తొలి అసురశక్తులన్నీ రూపరహితమైనవి. ఇంద్రుడివంటి దైవపురుషులు ప్రధానంగా మనుషుల రూపాలు ధరించి లోకవ్యవహారాల్లో జోక్యం చేసుకున్నవారు. ప్రాచీన సాహిత్యాన్నిబట్టి చూస్తే మొదట్లో దేవాసుర శక్తులు కొంత సామరస్యంతో జీవించినప్పటికీ తరవాత వారి వైషమ్యాలు పెరగసాగాయి.

మొదటినుంచీ ఇరాన్ ఆర్యభాషీయులకు వరుణుడు ఎక్కువ పూజనీయుడు. మనదేశంలో మటుకు ఇంద్రుడి ఆరాధన ఎక్కువయింది. ఇంద్రుడు నిజమైన వ్యక్తిలాగే అనిపిస్తాడు. యుద్ధాలలో ఆరితేరిన ఇంద్రుడంటే గిట్టని తెగలు క్రమంగా దూరం కాసాగాయి. రూపరహితమైన భగవంతుడిమీద మతవిశ్వాసాలు కలిగిన అహురమజ్ద ఆరాధకులకు కొత్తగా మనదేశంలో మొదలైన యజ్ఞవిధులూ, తంతులూ, జంతుబలులూ మొదలైనవన్నీ నచ్చనివిగా పరిణమించసాగాయి. వేదసాహిత్యంలో రానురాను అసురులంటే రాక్షసులనే అర్థం ఏర్పడింది.

మతాలకు సంబంధించిన తక్కిన సమస్యల్లాగే ఇవన్నీ ఆరాధకుల వైఖరిలో ఏర్పడిన భేదాభిప్రాయాలే. క్రీ.పూ. అయిదో శతాబ్దపు చరిత్రకారుడైన హెరడోటస్ పార్శీవారికి విగ్రహారాధనా, ఆలయవ్యవస్థలూ ఉండవని రాశాడు. అగ్నిని ఆరాధిస్తారని చెప్పాడు. అలాగే పార్శీమతంలో పుణ్యాపాపాల గురించిన వైఖరీ మొదలైనవన్నీ ఆ తరవాత పశ్చిమాసియాలో తలెత్తిన జుడాయిజం, క్రైస్తవ, ఇస్లాం మతాలన్నిటినీ ప్రభావితం చేశాయి. భగవంతుడనే భావన కేవలం భక్తుల మనసుల్లో ఉత్పన్నమైనదే కనక మతవిశ్వాసాల వైఖరుల్లో తేడాలు కలగడానికి అతీతశక్తుల ప్రమేయం ఏ యుగంలోనూ ఉండదు. ఒకే హిందూమతాన్ని నమ్మినవారిలోకూడా తరవాతి కాలంలో ఆదిశంకరుణ్ణి నమ్మినవారికి రామానుజుడి సిద్ధాంతాలు నచ్చలేదనేది తెలిసిన సంగతే. అలాగే క్రైస్తవ, ఇస్లాం తదితర మతాలన్నిటిలోనూ శాఖలూ, ఉపశాఖలూ, వాటిమధ్య విభేదాలూ, కొట్లాటలూ, రక్తపాతమూ జరుగుతూనే ఉండేదని చరిత్ర మనకు నేర్పుతుంది.



ప్రాచీన ఇండో ఇరానియన్ ప్రాంతాలు

వ్యాసం

ప్రజా ఉద్యమాలు - నాటకాలలో స్త్రీల భాగస్వామ్యం

- డాక్టర్ నళిని

"ప్రజా ఉద్యమాలు - నాటకాలలో స్త్రీల భాగస్వామ్యం" గురించి ఇప్పుడు ముచ్చటించుకుందాం. అయితే దానికి సంబంధించి ముందుగా సాహిత్యం - కళల మీద కొంత విశ్లేషణ, రచయితల నిబద్ధత గురించి కొన్ని సూచనలు అవసరం అనిపించింది.

ముఖ్యంగా, రచయిత ఏ ప్రక్రియ ఉపయోగించినా దానికి ఒక నిబద్ధత ఉండాలి. ప్రజల పట్ల ప్రేమ కావాలి. అందుకే కళాకారులు ముందుగా తాము ఎవరి పక్షం వహిస్తారో తేల్చుకోవాలి - పీడితుల పక్షమా? పీడకుల పక్షమా?

అలానే, వస్తువు విషయంలో కూడా జాగ్రత్త అవసరం. తన తోటి మనుషుల జీవితాలే రచనకి వస్తువు కావాలి. స్పందించే హృదయం, ప్రశ్నించే మెదడు, లోతుగా అసమానతల ప్రపంచాన్ని కాక దేన్ని చిత్రించగలం? మెరుగైన ప్రపంచం కోసం వీక్షించే చూపు ఉంటే, కాక దేని కోసం తప్పించగలం?

అందుకే, "కళ అనేది మానవాళికి, సత్యానికి మధ్య వారధి," అన్నాడు హొవర్డ్ ఫాస్ట్, "కళ ఒక సమ్మేళనం, ఒక సంయోగం. కళాకారులు యంత్రాలు కారు. వారి సృజన అనేది జీవితం నించి ఉద్భవిస్తుంది." రచయితలు ప్రజల జీవితాన్ని, దాని సంక్లిష్టతను పరిశీలించి, వర్గాలను, వాటి మధ్య సంబంధాలను అర్థం చేసుకుని, ప్రజల మనః ప్రవృత్తిని విశ్లేషించాలి. మానవుని సామాజిక జీవితమే సాహిత్యానికి కళలకి మూలం కావాలి. ఎందుకంటే మన సాహిత్యం కన్నా మన జీవితం ఎంతో గాఢమైనది, సజీవమైనది. అందుకే, రచయిత ప్రజలను, వారి భావనలను వర్ణించాలి.

వాస్తవికతకి దూరంగా కళ అనేది లేదు, ఉండబోదు. రచయితకి ఉండవలసిన పరిశీలనా శక్తి - అంటే, ఇతరుల అనుభవాలను తాను అనుభవించగల శక్తే. అప్పుడే "రచయితకి ప్రజల హృదయ కవాటాలకు తాళం దొరుకుతుంది," అంటాడు ఇల్యా ఎహ్రెన్‌బర్గ్.

సాహిత్యమూ, విప్లవమూ కూడా జీవితం నించి, అట్టడుగు వర్గాల ప్రజల నించి పుడతాయి. ఈ రెండూ కలిసే కేంద్రమే ప్రజా జీవితం అంటారు కొడవగంటి కుటుంబరావు. ఈనాడు అన్ని వర్గాల ప్రజలు జీవిత సమస్యలతో రాజీలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అలాంటి జీవన పోరాటాన్ని చిత్రించే కళలు నేటి ఆవశ్యకత. అవే నేడు రాణిస్తున్నాయి.

వాస్తవానికి మన స్త్రీలు అనేక సమస్యలతో సతమతమవుతూ, రకరకాల ఉద్యమాల్లో పాలు పంచుకుంటున్నారు, ముందు వరసలో నిలుస్తున్నారు. వరంగల్ వంటి చోట్ల నిర్బంధాన్ని సైతం ఎదుర్కొంటూ, రకరకాల పద్ధతుల్లో ప్రజల మనుషులకు వెన్నుదన్నుగా ఉంటున్నారు. ఆర్థిక, సామాజిక సమస్యలపైనే కాక భూ సమస్యపై కూడా స్పందించి వర్గపోరాటంలో పాల్గొంటున్నారు. ఇటీవల తెలంగాణ ఉద్యమంలో ప్రతి విద్యాసంస్థలో, ప్రతి గ్రామంలో స్త్రీలు, బాలికలు విశేషంగా భాగస్వామ్యం వహిస్తున్నారు. ఇంతటి చైతన్యం గల స్త్రీలకు కళారంగంలో మాత్రం అంతగా ప్రాధాన్యత ఉండదు.

గతంలోకి తొంగి చూస్తే, 40-50 దశకాల్లో స్త్రీ పాత్రలు పురుషులు వేయడం పరిపాటిగా ఉండేది. ఉదా॥ స్థానం నరసింహారావు, అక్కినేని నాగేశ్వరరావు, తర్వాత స్త్రీ పాత్రలకి స్త్రీలే వేషం కట్టే రోజులొచ్చేసరికి, అది భోగకారితలకే పరిమితమైపోయింది. ఉదా॥ రామతిలకం, కన్నాంబ, కాంచనమాల, రాజేశ్వరి, పూర్ణిమ. వాస్తవానికి, మంచి కళాకారులుగా రాణించిన వీరికి రాను రాను సామాజిక గౌరవం హెచ్చిందే గాని తగ్గలేదు. (వీరంతా తర్వాత సినిమా రంగంలో స్థిరపడ్డారు). అటు తర్వాత, కొమ్మూరి పద్మావతి, కొప్పరపు సరోజిని లాంటి కుటుంబ స్త్రీలూ నటించారు. ఆ కాలంలో అది పెద్ద విప్లవమే.

అయితే, స్త్రీలు విరివిగా నటిస్తున్న కాలం వచ్చేనాటికి కూడా కమ్యూనిస్టు పార్టీలో మాత్రం ఈ విషయమై రెండు పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు ఉండేవి. గ్రామ కమిటీల్లో, జిల్లా కమిటీల్లో చురుగ్గా పాల్గొంటున్న స్త్రీలను స్టేజి పైకి ఎక్కిస్తే వారి పరువు పోతుందనీ, వారిని భోగకాంతల్లా చూస్తారని, వాళ్ళు అందరి నోళ్ళలో నానతారని ఒక అభిప్రాయం బలంగా ఉండేది. దీనికి విరుద్ధంగా, ఏ కళారూపమైన స్త్రీ పాత్ర ఉంటే ఎక్కువగా ఆ కట్టు కుంటుందనేది అందరికి తెలిసిందే. అలాంటప్పుడు స్త్రీ పాత్రలు స్త్రీలే ఎందుకు వేయకూడదు? పైగా ఆ పాత్ర మనోభావాలను స్త్రీలే ఎక్కువగా అర్థం చేసుకుని స్పందించగలగడం సహజం. అలా ఆ పాత్రకి న్యాయం చేకూరాలంటే స్త్రీలే నటించాలి, ఇది రెండో అభిప్రాయం.

ఈ నేపథ్యంలో, ఒక ప్రాసెస్‌గా, ఒక ఘర్షణ ఫలితంగానే ప్రజానాట్యమండలి ఏర్పడింది. ఎలాంటి ఘర్షణ లేకుండా నిర్దిష్ట రూపం అనేది ఏర్పడదు. ఇది గతితార్కిక భౌతికవాద సూత్రం. అలా, పరస్పర విరుద్ధమైన భావాల ఘర్షణల నుండే ఈ సాంస్కృతిక సంస్థ ఏర్పడింది. 1943 తర్వాత 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్' ఐ.పి.టి.ఎ. కూడా ఏర్పడింది. దాని అఖిల భారత కార్యవర్గంలో డా॥ గరికపాటి ఒక సభ్యుడు.

కళా సాంస్కృతికోద్యమం వెల్లివిరిసిన ఈ దశని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. 1943-1945. మొదటి దశలో బుర్ర కథలు, 1945-1948 మధ్య అభ్యుదయ నాటకాలు రాజ్యమేలాయి. ఈ రెండు దశల తర్వాత తెలంగాణ సాయుధ పోరాటాన్ని అణచివేయడం కోసం ప్రభుత్వం ఎక్కుపెట్టిన నిర్బంధంలో ఈ కళారూపాలన్నీ వెనుకంజ వేసాయి. 1952 తర్వాత కూడా క్షీణదశే అని చెప్పవచ్చు. సాయుధ పోరాటానికి స్వస్తి చెప్పి సంస్కరణలకి పెద్ద పీట వేస్తున్న కాలంలో, ఎన్నికల సన్నాహాల్లో భాగంగా 'కుమ్మరి మొద్దు', 'భూమి కోసం' లాంటి ప్రదర్శనలే జరిగేవి. కానీ అవి రాణించలేదు, రక్తి కట్టలేదు. నక్సల్బరీ తర్వాత రాజుకున్న శ్రీకాకుళ పోరాటంతో మళ్ళీ కళలు విరబూశాయి.

మొదటి దశలో, అంటే 1943-45 మధ్య 25 సాంస్కృతిక దళాలు ఏర్పడ్డాయి. అందులో నాలుగైదు బుర్ర కథ దళాలు, మహిళా దళాలు, బాలికల దళాలు కూడా ఉండేవి. ఇవన్నీ కలిసి దాదాపు అరవై రకాల కళారూపాలను పునరుద్ధరించడం జరిగింది. వాటిలో విచిత్ర వేషం, కోయవేషం, బుర్రకథ, జముకుల కథ, పిచికగుంట్ల కథ, హరికథ, చెంచిత, సమిష్టిగానాలు, కోలాటం, డప్పుకోలాటం, గొల్లసుద్దులు, హిట్లరు పతనం వీధి భాగోతం, వగైరాలు కొన్ని.

కళాకారులు ఎక్కువగా రైతు కుటుంబాలకు చెందినవారే. కృష్ణా జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో రైతు సంఘాలు, మాగాణి ప్రాంతాల్లో యువజన సంఘాలు చురుగ్గా పనిచేసేవి. ఆనాడు ఫాసిస్టు వ్యతిరేక సమీకరణ ప్రధాన అంశంగా ఉండేది.

మొదట్లో ఎక్కడికక్కడ వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగేవి. దాన్ని ప్రచార సాధనంగా చేసుకుని చైతన్యయుతంగా పనిచేసిన చోట్ల వైజ్ఞానిక కార్యకలాపాలు విస్తరించాయి. క్రమంగా బుర్ర కథ దళాలు ఏర్పడ్డాయి. గొల్లసుద్దులు, బుర్రకథలు మొదలు హాస్యప్రధానంగా ఉండేవి. తర్వాత 'స్టాలిన్ గ్రాడ్ యుద్ధం', 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథ నడిచాయి. ఇతర కళారూపాలు ప్రాచుర్యం పొందినా గాని, పెద్ద దళాలు అవసరమైన చోట్ల ఖర్చు ఎక్కువయ్యేది. అయితే, పార్టీ నిర్మాణం బలంగా ఉన్న చోట్ల రెండో స్థాయికి చెందిన సాంస్కృతిక దళాలు ఏర్పడ్డాయి.

ఈ కాలంలో చెప్పుకోదగ్గ దళాలు కోగంటి, మిక్కిలినేని, పెరుమాళ్ళు, మాణిక్యాలరావు, బెనర్జీ, నాజరు ప్రధాన కథకులుగా కృష్ణా, గుంటూరులో, ఇంకా కర్నూలు, కడప, నెల్లూరులలోనూ నడిచాయి. ఇవి కాక, తిరువూరు తాలూకాలో శాయమ్మ, దమయంతి, వల్లం రాధారుక్మిణి ఒక దళంగా, తాపీ రాజమ్మ, కొండేపూడి రాధ, వీరమాచనేని సరోజిని ఒక దళంగా బుర్రకథలు చెప్పారు. గుడివాడ తాలూకాలో కోనేటి రాఘవులు భార్య కథకురాలిగా ఒక దళం ఉండేది. మోటూరు ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మితో ఒక దళం పనిచేసేవి. 1952 తర్వాత బాలికల దళాలు ఏర్పడ్డాయి. ఉప్పు గుంటూరు దళం పేరు గాంచింది. అందులో వర్ధనమ్మ (కంచికచర్ల) - జలజ-హాస్యం (నందిగామ), కమల (గుడివాడ-చవటపల్లి), రాజకీయం చెప్తూ చురుగ్గా పనిచేశారు. వీరు ఇతర జిల్లాల్లో, రాయలసీమలో కూడా ప్రదర్శనలిచ్చారు. అలానే, పాలకొల్లులో ఒక బాలికల దళం పనిచేసేది. ఇవికాక బాలుర దళాలు కూడా ఉండేవి.

అటు తర్వాత 1945-48 మధ్య కాలంలో అభ్యుదయ నాటకాలు ప్రాచుర్యం పొందాయి. అయితే, నాటకాలకి పెద్ద బృందాలు, టీమ్‌వర్క్, రిహార్సల్సు అవసరం. ఈ కాలంలో చెప్పుకోదగ్గ నాటకం 'ముందడుగు'. ఆ అనుభవం ఎన్నో రకాల గుణపాఠాలు నేర్పింది. కోడూరు అచ్చయ్య దర్శకత్వంలో, కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలో నెలరోజులు రిహార్సల్స్ జరిగాయి. పన్నెండు పాత్రలు గల ఈ నాటకం రిహార్సల్స్‌కి ఆనాడు 2,500 రూపాయల ఖర్చు తేలింది. ఈ సందర్భంగా, స్త్రీ పాత్రలు స్త్రీలు వేయాలా లేదా అనే విషయమై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. రెండు విభిన్న ధోరణుల మధ్య ఘర్షణ జరిగింది. స్త్రీ పాత్రలు స్త్రీలు వేయడం వల్ల జిల్లా స్థాయిలో నిర్ణాయక కమిటీల్లో ఉన్న ఆయా స్త్రీలని చిన్నచూపు చూస్తారని, నీచంగా చూస్తారని వాదించే నాయకులు కూడా ఉండేవారు. అందుకని, హీరో తల్లి పాత్రకి పెరుమాళ్ళతోపాటు జోశ్యభట్ల సుబ్బమ్మ, హీరోయిన్ పాత్రకి వల్లం నరసింహారావుతో పాటు కొండపల్లి కోటేశ్వరమ్మకి కూడా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ నాటకం మొదటి ప్రదర్శన తెనాలి రైతు మహాసభలో స్త్రీలు నటించకుండానే వేయడం జరిగింది. అయితే, పి.సి.జోషి ఈ నాటకాన్ని చూసి ఉత్తేజితుడై, స్త్రీ పాత్రలు స్త్రీలే వేసి ఉంటే ఇంకా 'బాగుండేదని అనడంతో నిర్వాహకులు ఉప్పొంగిపోయారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా టికెట్ ప్రదర్శనలు ఇవ్వడంతో అప్పు తీరిపోయింది. మరో విషయం - పద్యాలు లేకుండా నాటకం రాణించదనే అపోహ కూడా ఈ నాటకంతోనే పటాపంచలయింది. మొదట్లో హీరో రేడియోలో పద్యం వింటునట్టు ఒక పద్యాన్ని జొప్పించడం జరిగింది. తర్వాత ఆ పద్యం లేకపోయినా నాటకం రక్తికట్టడంతో పద్యం అవసరం తీరిపోయింది.

అలా, సంసార స్త్రీలు నాటకాల్లో పాల్గొనరాదనే వాతావరణానికి స్వస్తి చెప్పిన ఖ్యాతి కమ్యూనిస్టు పార్టీకే దక్కింది. ఈ కాలంలో మహిళా దళం 'అపనింద' నాటకాన్ని మద్రాసులో ప్రదర్శించింది. తెలంగాణ పోరాటాన్ని సూచిస్తూ 'కన్యక' జముకుల కథని ఆడారు. జమీందారు వ్యతిరేక పోరాటాన్ని చిత్రిస్తూ ప్రత్యగాత్మ నేతృత్వంలో "జయభేరి" నాటకాన్ని ప్రదర్శించారు. మరొక ఉదాహరణ, బెంగాల్ కరువుపై కోడూరి అచ్చయ్య నాటకం డాక్టర్ అచ్చమాంబ ప్రోత్సాహంతో, ముక్కామల నాగభూషణం దర్శకత్వంలో బుర్రకథలు, బతుకమ్మ ఆట, కోలాటం విరివిగా ఆడారు, బృందగేయాలు పాడారు. సుంకర 'మా భూమి' నాటకం ప్రత్యేకించి తెలంగాణ పోరాటంలో ఒక సాంస్కృతిక ఆయుధంగా పనిచేసింది.

ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే, గ్రామస్థాయిలో నాటకరంగాన్ని ఊతగా తీసుకుని యువజన సంఘాలను

పటిష్టపరచడం జరిగింది. అలా నాటకాలు విప్లవ ప్రచార సాధనంగానే కాక నిర్మాణంలో భాగంగా కూడా పనిచేశాయి. అవి సాంస్కృతిక సేనావాహినిగా పనిచేశాయి. వీటికి తోడుగా రాత్రి పాఠశాలలు, వ్యాయామశాలలు, రీడింగ్ రూములు వక్తృత్వ పోటీలు పనిచేశాయి. అలా కృష్ణా, గుంటూరు జిల్లాలలోనే దాదాపు 100 గ్రామ దళాలు ఏర్పడ్డాయి. అనేక గ్రామాల్లో స్త్రీలే స్త్రీ పాత్రలు వేశారు. కమ్యూనిస్టు కుటుంబాల స్త్రీలు ఇంట్లో కీచులాడయినా సరే ఈ పాత్రలు పోషించారు. అలా కుదరకపోతేనే పట్టణాల నించి కిరాయి నటులని రప్పించారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నాటకాలను ఆడడం వల్ల ఆ స్త్రీల పట్ల గౌరవం పెరిగింది.

1948 తర్వాత నిర్బంధం పెరిగింది. ప్రభుత్వ అణచివేతలో భాగంగా సాంస్కృతిక రంగం కూడా వెనుకబడింది. 1952 తర్వాత మళ్ళీ ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. సుంకర 'భూమి కోసం' వేశారు. ఎలా చూసినా ఇది సాంస్కృతికోద్యమ క్షీణదశే అని చెప్పవచ్చు.

మళ్ళీ నక్సల్బరీ తర్వాత, శ్రీకాకుళోద్యమం ప్రభావంతో ఆంధ్రలో ప్రజా ఉద్యమాలు విజృంభించాయి. వాటితో పాటు ఆటపాట చిందులేశాయి. ఎమర్జెన్సీకి ముందు, సుబ్బారావు పాణిగ్రాహి నేతృత్వంలో శ్రీకాకుళంలో సాంస్కృతిక దళాలు విస్తృతంగా పనిచేశాయి. స్త్రీ పాత్రలో చినబాబు ఇమిడిపోయి అందరి గుండెల్లో చోటు సంపాదించుకున్నాడు. అయితే, ఒగ్గుకథ, జముకుల కథల్లో తప్పనిసరిగా ప్రధాన కథకులు స్త్రీ వేషధారణలో ఉండేవారు. స్త్రీ పాత్ర ఉందో లేదో చూసి ప్రదర్శన చూడడానికి జనం రావడం పరిపాటి. అలా స్త్రీ పాత్ర ఆవశ్యకతని గుర్తించాక పురుషుల స్థానంలో స్త్రీలే కథకులుగా ఎదిగారు. అటు తర్వాత తప్పెటగుళ్ళు కూడా స్త్రీలు ఆడి మెప్పించడం ఎంతో అబ్బురపరిచింది.

ఇదే సమయంలో నాటకరంగం ఎంతగానో వృద్ధి చెందింది. ఆంధ్రా యూనివర్సిటీలో కె. వెంకటేశ్వరరావు, తదితర దర్శకుల ఆధ్వర్యంలో 'నిజం', 'పావలా', 'కనకపుష్యరాగం', 'కన్యాశుల్కం' తదితర నాటకాల్లో స్త్రీ పాత్రలను శ్యామల, విజయలక్ష్మి వంటి వాళ్ళు నటించి ఎంతగానో రక్తి కట్టించారు. ఇంకా కాశీ విశ్వనాథ్, గణేశ్ పాత్రోల నాటకాల్లో కూడా స్త్రీలు నటించారు. ఆయా పాత్రలు జనం హృదయాల్లో గూడు కట్టుకున్నాయి.

ఎమర్జెన్సీలో ఉత్తరాంధ్రలో సాంస్కృతిక రంగం చురుగ్గానే పనిచేసేది. వంగపండు ప్రసాదరావు 'వెట్టిచాకిరి' బుర్రకథ అందుకు ఒక ఉదాహరణ. హైదరాబాద్‌లో 'ఆర్ట్ లవర్స్' సంస్థ ఏర్పడ్డాక పలుచోట్ల జన నాట్యమండలి కూడా ఏర్పడింది. విశాఖలో వంగపండు 'వెట్టిచాకిరి' బుర్రకథని చాలాసార్లు ప్రదర్శించారు. పండుగల సమయంలో ఇచ్చే ప్రదర్శనల్లో జననాట్యమండలి కూడా ఒక భాగమయింది. బృందగీతాలు, కోలాటాలు, 'కొండలు పగలేసిన్' దృశ్యకావ్యాలు, డప్పు డాన్సులు, ధూలాలతో రెండు గంటల పాటు ప్రదర్శన సాగేది.

ఎమర్జెన్సీ తర్వాత కళారంగం అతివేగంగా అభివృద్ధి చెందింది. 'యువత మేల్కొంది' నాటకం మొదటగా ప్రదర్శించారు. తర్వాత వంగపండు 'అడవి దివిటీలు' నాటకం గురజాడ కళామందిర్‌లో సత్యానంద్ దర్శకత్వంలో నెలరోజుల పాటు ఆడింది. ఇతర సంస్థలవారు కూడా ఈ నాటకాన్ని సొంతం చేసుకుని ఆడారు. 'అమ్మ' నాటకంలో (మాక్సిం గోర్కీ నవలకి నాటక రూపం) అమ్మ పాత్రని చాట్ల శ్రీరాములు కూతురు పోషించింది. ఆదివాసులను దోపిడీ చేస్తున్న వ్యాపారులు, ఫారెస్టు అధికారులపై నేను రాసిన 'ఎర్రలాంతరు' నాటకాన్ని రాడికల్ యువజన సంఘం జిల్లా మహాసభల్లో అనకాపల్లిలో ప్రదర్శించారు.

అప్పట్లో జముకుల కథని ప్రచార సాధనంగా వాడడం కోసం మేము విజయనగరంలో రెండు దళాలను కలిసి, నెల రోజుల పాటు వాళ్ళతో తిరిగి, వారి కథలను రికార్డు చేసుకుని, ఆ బాణీల్లో ఒక కథని సొంతంగా తయారు చేశాను. కథ, హాస్యం, రాజకీయం కోసం సరైన బాణీలు దొరికాయి. పాత్రలూ దొరికారు. కానీ ప్రధాన కథకుడే స్క్రిప్టు చూడకుండా పాడలేని పరిస్థితి ఉండడంతో నెల రోజుల రిహార్సల్సు తర్వాత కూడా ఆ కథని ప్రదర్శించలేక పోయాం. అయితే ఆ అనుభవం ఎన్నో పాఠాలు నేర్పింది. జీవన భృతి లేక ఈ జముకుల కథకులు రైతు కూలీలుగా పని చేస్తూ, పొలం పనులు లేని సమయంలో విశాఖలో రిక్షా తొక్కేవారు. ఊరు ఊరుని కదిలించగల గళాలు, బాణీలు, జోరు ఉన్న ఈ కళాకారులు కూలీలుగా మారిన వైనం బాధించేది. ఎంతో వైవిధ్యం ఉన్న ఈ కళాకారులు కొందరు అటు తర్వాత కేవలం ప్రభుత్వ పథకాల ప్రచారకులుగా టీవీలో కనిపించసాగారు.

ఎమర్జెన్సీ తర్వాత ప్రజా ఉద్యమాల్లో మొదట్లో కమ్యూనిస్టు కుటుంబాల మహిళలు ముందుకొస్తే, రాను రాను ఉద్యమం ఊపందుకున్నాక జె.ఎన్.ఎం. ప్రోగ్రాములతో ప్రభావితమై ఇతర విద్యార్థులు, మహిళలు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. పెదమేరంగి దళంలో భానుమతి, నెల్లూరు దళంలో పద్మ, హైదరాబాదులో నిర్మల (నిమ్మి), విశాఖలో నవత, రాధికలు ఎంతో పాటుపడ్డారు, పేరు తెచ్చుకున్నారు. ప్రదర్శనల సమయంలో ఏ ఊరి స్త్రీలు ఆ ఊళ్ళో తమంత తాముగా ముందుకొచ్చి, ప్రదర్శనలో పాల్గొనేవారు. పాటలకి కోరస్‌గానో నృత్యనాటకంలో రైతు స్త్రీలుగానో, తిరుగుబాటు అంకాల్లో ప్రజలుగానో ఇష్టపూర్వకంగా నటించేవారు.

'దున్నేవాడికే భూమి' నినాదంతో ఆంధ్రదేశం మారు మోగుతుండగా, వ్యవసాయ విప్లవంపై కె.ఎస్. రాసిన డాక్యుమెంటు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తూ ఉత్తేజపరుస్తుండగా, వంగపండు ప్రసాదరావు "భూమి భాగోతం" నృత్య నాటకాన్ని రాశాడు. ఆనాటి దేశకాల పరిస్థితులు, రైతుల బాధలు, ప్రభుత్వ పథకాలు, విభజించి

పాలించే విధానాలు, ప్రజలంతా కలిసికట్టుగా తిరగబడక తప్పని పరిస్థితులు అందులో చాలా చక్కగా చిత్రించారు. ఏడు ప్రధాన పాత్రలు, మరో ఐదారు పాత్రలు, ఐదుగురు గాయకులు, డోలక్ ఆర్టిస్టుతో కలిసి దాదాపు ఇరవై మంది కలిసిన ట్రూపు నెలకు పైగా రిహార్సల్స్ చేసి, స్టేజి ఎక్కే ముందు ఎన్నో మార్పులు చేర్పులు చేసుకున్నారు. రైతు, రైతు భార్య, కరణం, మునసబు, దళిత రైతు, సబ్ ఇన్‌స్పెక్టర్, రాజకీయ నాయకుడు, రైతు కూలీలు - అందరూ తమ తమ పాటలకి డాన్సు చేస్తూ అభినయించాలి. ఒక్కొక్క పాత్రకి ఒక్కొక్కరకం ప్రత్యేకమైన స్టెప్పులు ఏర్పడ్డాయి. గంటన్నర పాటు సాగే ఈ నృత్యనాటకం ఎంతో ప్రచారం పొందింది. ఇది స్త్రీ పాత్రలనే కాక స్త్రీ గాయకులని కూడా తయారు చేసింది. మొదట్లో ఎవరూ లేక నేను, నా చెల్లి వంగపండుతో పాటు ప్రధాన గాయకులుగా పాత్ర పోషించక తప్పలేదు. పరీక్షల సమయానికి హాస్టలుకి చేరి చదువుకుని, మిగిలిన సమయమంతా రిహార్సల్సుతో, ప్రదర్శనలతో గ్రామాలు తిరగడం మరిచిపోలేని అనుభవం. మద్రాసులో ఈ ప్రదర్శన చూసి మా నటులకి సినిమా ఛాన్స్ ఇస్తామంటూ వెంటపడ్డారు. గ్రామాల్లో అయితే ఒక ఊరి నించి ఒక ఊరికి వెళ్తుంటే, ప్రదర్శన జరిగిన గ్రామం నించి జనం మా వెంట పడి వచ్చేవారు, పక్క గ్రామంలో ప్రదర్శన కూడా చూసి వెళ్ళేవారు.

ప్రధాన అంశం 'భూమి భాగోతం' అయినా, ముందు వెనుక బృందగీతాలు, 'కొండలు పగలేసినం' దృశ్యకావ్యం, 'పట్నవాసం' - భార్యాభర్తల సంవాదం, 'జీతాల తమాషా' - సంవాదం, 'జజ్జనకరి జనారే' - డప్పు డాన్సు, కోలాటం, ధూలా వంటివీ కూడా ఉండేవి. వీటన్నిటిలో స్త్రీలది ప్రధాన పాత్ర. ఇవి కాక మహిళా కళాశాలల్లో ధూలా, వీధి నాటకాలు జరిగేవి.

ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న స్త్రీలు కొందరు కళారంగం నించి ప్రజా ఉద్యమకారులుగా ఎదిగి, ఇప్పటికీ ఆ ఉద్యమాల్లో చురుకైన పాత్ర వహిస్తూ త్యాగాలకు వెనుదీయక పోరాడుతూనే ఉండడం అభినందనీయం. దీర్ఘకాలిక పోరాటంలో నిలదొక్కుకోవడానికి వారికి ఆ శిక్షణ ఎంతో తోడ్పడిందని చెప్పవచ్చు.

ఈ సమయంలోనే హైదరాబాదులో 'రగల్ జెండా' బ్యాలే జరిగేది. స్త్రీల పరిస్థితుల మీద ఈ కాలంలోనే ఎన్నో పాటలు పుట్టాయి. 'కర్మభూమిలో పూసిన ఓ పువ్వా' అని యువక రాసిన గీతం, 'అమాస చీకటి అర్ధరాతిరి' అని సత్యమూర్తి రాసిన గీతం ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఇప్పుడు మళ్ళీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మహిళల గళాలు మారుమోగుతున్నాయి.

గుంటూరులో 'వీర కుంకుమ' నాటకం (సుంకర రచన - తారకం దర్శకత్వం), 'గంజినీళ్ళు' నాటకం, సారా ఉద్యమంపై స్కిట్ కూడా ఇక్కడ చెప్పుకోవాలి. రుక్మిణి, తదితరులు వీటిలో పాల్గొన్నారు. కొండ మొదలు పోరాటంపై 'పోరాటాల రాజవ్వ'గా అంబిక నటించి రాజవ్వనే మెప్పించింది. సారా పోరాటంపై కూడా ఎన్నో రూపాల్లో ప్రదర్శనలు జరిగాయి.

ఈ అనుభవాలతో చూస్తే, నాటకం, నృత్యరూపకం వగైరా కళారూపాల ఎంపిక ఒక సమస్య అయితే, పాత్రలు, వాటి ప్రభావం మరొక సమస్య. స్త్రీ పాత్రల వల్ల అనవసరపు సమస్యలు వస్తాయనీ, వారిని సురక్షితంగా ఇంటికి చేర్చడం ఒక సమస్య అవుతుందని మొదట్లో నిర్వాహకులు జంకారు. రాను రాను ఉద్యమం ఊపందుకుని, ప్రదర్శన సారాంశం ప్రచారమయాక ప్రజలే మా రక్షకులయ్యారు. మైళ్ళ కొద్దీ చీకట్లో నడిచినా; ఇసక లారీల్లో వెన్నెల రాత్రుల్లో ప్రయాణం చేసినా; చెరుకు బళ్ళ వెంట గిత్తల మువ్వలు వింటూ చకచకా నడిచినా; వాగులు వంకలు దాటి బురదలోంచి తపతప నడిచినా; ప్రజలు పెట్టిన నీళ్ళ చారన్నాన్ని, విందు భోజనాలని ఒకేలా స్వీకరించినా - అన్నీ ఆనందాన్నిచ్చాయి. ఒక ప్రయోజనం కోసం, ఒక లక్ష్యం కోసం పనిచేస్తున్నామనే తృప్తిని పొందాము. మమ్మల్ని చూసి మరింత మంది స్త్రీలు ముందు కొస్తుంటే పొంగిపోయాం.

స్త్రీ పాత్రల వల్ల సమస్యలు రావని, మంచి ప్రయోజనం ఉంటుందని మా ప్రదర్శనలు బలంగా రుజువు చేశాయి. ఆ పాత్రల వల్ల సందేశం సూటిగా చేరేది. ఉదాహరణకి 'భూమి భాగోతంలో' ఒక సాధారణ రైతు స్త్రీ అనుభవం కొద్దీ కుల సమస్యని సైతం అధిగమించి భర్తని రక్షించుకుంటూ కలిసికట్టుగా అందరితో కలిసి పోరాడే స్థాయికి ఎదుగుతుంది. ఇతర పాత్రలు ఎంత ఆకర్షణీయంగా ఉన్నా ఆ 'మంగి' పాత్ర ఒక బలమైన ముద్రని వేస్తుంది.

అలా స్త్రీలు ప్రధాన పాత్రలుగా ఉన్న నాటకాలు ఇంకా ఎన్నో రావలసి ఉంది. మూడు గంటల నాటకం కంటే నృత్య నాటకం ఎక్కువ ఆసక్తిదాయకంగా ఉన్నట్టే, స్ట్రీట్ ప్లేలు, స్కిట్‌లు కూడా అటు తర్వాత మంచి ప్రచార సాధనాలుగా ముందుకొచ్చాయి. సఫ్దర్ హష్మి, అతని భార్య కలిసి నటించిన వీధి నాటకాల లాగా హైదరాబాద్ తదితర చోట్ల కూడా విద్యార్థులు, మహిళలు ప్రయోగాత్మకంగా వాటిని ప్రదర్శించారు.

మన పాత్రలని మనమే నటించగలం. మన బాధలని, మన కష్టాలని మనమే ప్రదర్శించగలం, ఆ ఉద్విగ్నత, ఆ పాత్ర పోషణ, పాత్రలో లీనం కావడం మనకే సాధ్యం. ప్రతి మహిళ ఏదో ఒక సమయంలో ఏదో ఒక రీతిలో వివక్షకి, అణచివేతకి, అన్యాయానికి గురయ్యే ఉంటుంది. ఆ చేదు అనుభవం ఆయా పాత్రల్లో బలంగా ప్రతిఫలిస్తుంది.

అందుకే, ఇప్పటికి కొంత నిర్లక్ష్యానికి గురయిన నాటక రంగానికి స్త్రీలు మరింత జవసత్వాలని, జీవాన్ని పొందుపరిచి, కొత్త ఊపిర్లు ఊదవలసి ఉంది. అందుకు ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక మరింత కృషి చేయాలని కోరుకుంటున్నాను.

(నర్సాపూర్‌లో జరిగిన 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' ప్రథమ వార్షికోత్సవంలో చదివిన ప్రసంగ పాఠం)

సంస్మరణ

అరుదైన సాధారణ వ్యక్తి వెంకాయమ్మ

- పాణి

వ్యక్తిత్వాన్ని పరిపూర్ణంగా ఊహించగలమా? ఏవో కొన్ని నమూనాలుగా మలుచుకొని అర్థం చేసుకోగలం.. అంత వరకే. వాటిలో కొన్ని మనల్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని వ్యక్తిత్వాలు అసాధారణంగా, విలక్షణంగా ఉంటాయి. మరి కొన్ని చాలా సాధారణంగా ఉంటాయి. ఏది విలక్షణం, ఏది సాధారణం? ఎందుకు ? అనే సమస్య ఉండొచ్చుగాని మామూలు స్థాయిలో అలాంటి తేడా ఉంటుందని అంగీకరించడానికి ఇబ్బందిపడనవసరం లేదు. అయితే సాధారణ వ్యక్తిత్వాలను అర్థం చేసుకోవడంలోనే ఎక్కువ ఇబ్బందులు ఉంటాయి. సాధారణంగా ఉండే అసాధారణ వ్యక్తిత్వం అనే మాట ఉపయోగించవచ్చుగాని సరిపోతుందనే నమ్మకం లేదు. పైగా మనకు ఇతరుల వ్యక్తిత్వాలను అర్థం చేసుకోవడంలో, గౌరవించడంలో విశాలమైన దృష్టి, ప్రమాణాలు ఉన్నట్లే అపార్థం చేసుకోడానికి వాళ్లతో ఎదురయ్యే ఒక చిన్న అనుభవం చాలు. ఆ ఒక్క కారణం వల్లే తొలి తుది వ్యాఖ్య చేయగల సాహసం ఉంటుంది. బహుశా ఆ అనుభవం అక్షర సత్యమే అని ఒప్పేసుకున్నా అదే మొత్తం వ్యక్తిత్వం కాదని మనం అంగీకరించం. ఇదంతా మామూలు మనుషుల్లో ఉండే సమస్య కాదు. అసాధారణ ప్రపంచమనీ, చైతన్యయుత సమాజమనీ అనుకొనే రాజకీయ జీవుల్లో ఉండే తీవ్ర సమస్య. దేన్నయినా వివరించగల, అంచనావేయగల ఆలోచనా రంగంలో ఈ ధోరణి దిగ్భ్రాంతికరం.

ఈ ఉపోద్ఘాతమంతా - ఒక సాధారణ వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించే క్రమంలో కలిగిన ఆలోచనలు. ఈ గొడవ ఏమీ లేకుండా మన మధ్య నిర్మాణమై, భౌతికంగా దూరమైపోయిన వారి గురించి ఉద్వేగంగా మాట్లాడుకొనీ ప్రయోజనం లేని ప్రత్యేక సందర్భంలో మనమంతా ఉన్నామని మొదట అంగీకరించాలి. ఈ ఎరుక లేనంత కాలం మనం అలాంటి వారి గురించి మాట్లాడుకోవడం కేవలం స్తోత్ర పాఠం అవుతుందనే భయమైనా ఉండాలి. అదీ లేకుంటే ఎన్ని చేసినా ప్రయోజనం ఉండదు.

వేటపాలెం వెంకాయమ్మగారు చనిపోయినప్పటి నుంచి సాధారణ వ్యక్తిత్వాలను ఎలా అర్థం చేసుకోవాలనే విచికిత్స ఇది. ఉద్యమాల్లో వెంకాయమ్మగారి లాంటివారిని ఎలా అర్థం చేసుకోవాలనేది చాలా పెద్ద ప్రశ్న. వెంకాయమ్మగారిని అందరూ అమ్మ అనే అంటారు. అందులో... విప్లవంలోని అమ్మదనం గురించి భావోద్వేగపూరిత అనుబంధం ఉంటుంది. అది పూర్తి నిజమే. ఆదర్శ ప్రాయమే. గౌరవనీయమే. అయితే అంత మాత్రమే కాదు. మన ముందు జీవించి, మరణించిన వాళ్ల గురించి ఆలోచించడానికి ముందు మనం మనుషులను అర్థం చేసుకుంటున్న పద్ధతి ఏమిటి? అనే ప్రశ్న ప్రతివారూ తప్పక వేసుకోవాలి. దాన్ని ఇంకా కొనసాగించి... మనం జీవిస్తున్న పద్ధతి ఏమిటి? అని కూడా తర్కించుకోవడం బాగుంటుంది. అయితే ఆ సంగతి ఎవ్వరూ మరొకరికి చెప్పడం కానీ, అలాంటి చర్చకు ఉపక్రమించడం కానీ బాగుండదు. ఎందుకంటే ఇందులో అర్హతల ఉచితానుచితాల ఉప చర్చ తలెత్తే ప్రమాదం ఉంది. అయితే మొదటి ప్రశ్న తప్పక వేసుకోవలసిందే.

వెంకాయమ్మగారి గురించి నేను మొదట కామ్రేడ్ శేషప్రసాద్ నోటెంట విన్నాను. చాలా ఇష్టంగా, అపురూపంగా చెప్పేవాడు. అమ్మ తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి ఉద్యమాలతో ఎట్లా కొనసాగుతూ వచ్చిందో చెప్పేవాడు. అంతకంటే ఎక్కువగా ఆమె మనుషులను ఎలా అర్థం చేసుకుంటుందో చెప్పేవాడు. మనం... ప్రజలను అర్థం చేసుకోవడం అనే మాటను గొప్ప మార్మికంగా మార్చేశాం. అంతులేని సాధారణీకరణకు తీసికెళ్లాం. అందుకే మనకు ప్రజల మధ్య వైరుధ్యాల విషయంలో ఏ రకమైన తటాపటాయింపు ఉండదు. బహుశా భిన్నాభిప్రాయం కూడా ఉండదు. మనుషులను అర్థం చేసుకోవడం అనే విషయానికి వచ్చినప్పుడు ఇవేవీ చెల్లుబాటు కాని పరిస్థితి వచ్చేసింది. వెంకాయమ్మగారిలా 'పామరోచితం'గా ఉండేవాళ్లకు ఈ గొడవే ఉండదు. వాళ్ల పద్ధతి వాళ్లకు ఉంటుంది. మనం కామన్‌సెన్స్ అనే సాధారణ పరిజ్ఞానం మాత్రమే వారిలో ఉంటుంది. మార్క్సిజం, వర్గపోరాటం, వర్గ దృక్పథం, విప్లవం, ఆచరణ, పార్టీ తదితరాలన్నీ వెంకాయమ్మగారిలో కామన్‌సెన్స్‌గా కలగలిసి పోయాయని నేను దగ్గరిగా చూచి నిర్ధారించుకున్నాను. అందుకే సాధారణ వ్యక్తిత్వం అని ముందే అన్నాను. అందులో ఎలాంటి విలక్షణతా ఉండదు. విప్లవంలోని విషయాలన్నీ సాధారణ పరిజ్ఞానంగా వంటబట్టి, అదే వ్యక్తిత్వంగా మారితే వెంకాయమ్మలాంటి వాళ్లు తయారవుతారు. ఏ ఏ సందర్భాల్లో మార్క్సిస్టులు ఎలా స్పందిస్తారు? ఆ సందర్భాల్లోని మనుషుల చర్యలను ఎలా అర్థం చేసుకుంటారు? వాళ్ల మీద ఏ అంచనాలకు వస్తారు? అనే చాలా గంభీరమైన, లోతైన విషయాలను వెంకాయమ్మగారిలో నేను కామన్‌సెన్స్‌గా గుర్తించి ఆశ్చర్యపోయాను. ఎందుకంటే.. ఆమె అలాంటి సందర్భాలన్నిటిలో రాజకీయంగా సరైన వైఖరి దృఢంగా ప్రదర్శించేది. ఎలా సాధ్యం ? అనే ప్రశ్న మనకు మిగిలిపోతుంది.

అమ్మను ఇంత దగ్గరిగా నేను కొన్ని నెలలపాటు గమనించి

అర్థం చేసుకున్నాను. వేంపెంట మారణకాండ 1998 జులై 17న జరిగింది. కారంచేడు ఘటనకు ముందూ వెనుకా జరిగిన దళితులపై దాడులన్నిటికంటే వేంపెంట కులం గురించి చాలా సంక్లిష్టమైన విషయాలను ముందుకు తెచ్చింది. భూమి, ఫ్యాక్షనిజం, విప్లవోద్యమం అనే మూడు ప్రత్యేకమైన అంశాలు వేంపెంట ఘటన నేపథ్యంలో ఉన్నాయి. మిగతా ఘటనలు కూడా మన సమాజ అభివృద్ధి క్రమంలోని అనేక అంశాలతో, ముఖ్యంగా దళితుల ఆత్మగౌరవ చైతన్యంతో ముడిబడి ఉన్నవే అయినా వేంపెంటలో ఇంకా అదనంగా చాలా ఉన్నాయి. సమాజాన్ని పునర్నిర్మించే విప్లవాచరణ క్రమంలో ఫ్యాక్షనిజం, భూమి సమస్య, పీడిత కులాల మధ్య వ్యవస్థాగతంగానే ఉన్న అంతరం అనేవి సవాళ్లుగా ముందుకు వచ్చాయి. అప్పటికే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. వేంపెంటలో బాధితుల్లో ఎక్కువ మంది మాదిగలు కావడం, ఫ్యాక్షనిజం వల్ల మాల కులస్తుల్లో కొందరు మాదిగలపై దాడిలో పాల్గొనడం వల్ల సమాజంలో, విప్లవోద్యమంలో కూడా మాల మాదిగ వైరుధ్యం రంగం మీదికి వచ్చిన సందర్భం అది.

దీన్ని ఇలా ఉంచితే... దాడి జరిగాక రెండో రోజో, మూడో రోజో ఆత్మకూరు ఎస్సీ హాస్టల్‌లో బాధితుల శిబిరం మొదలైంది. ఆ తొలి రోజులు చాలా విషాదంగా, ఉద్వేగంగా, వొత్తిడిగా ఉండేది. పైన చెప్పినట్లు ఇది విప్లవోద్యమ నేపథ్యంలో జరగడం వల్ల ఈ దారుణానికి వెనుక ఒక హత్య కూడా జరిగి దానికి ప్రతీకారంగా ఈ దాడి జరిగిందనే ప్రచారం చాలా పెద్ద మనుషులు కూడా చేయడం వల్ల విప్లవోద్యమ సమర్థకులైన కార్యకర్తలు ఈ సంఘీభావ ఉద్యమంలో చాలా ఒత్తిళ్లు అనుభవించాల్సి వచ్చింది. పైగా కర్నూలు జిల్లాలోగాని, రాయలసీమలో గాని పేరున్న, అనుభవం ఉన్న విప్లవ సానుభూతిపరులు లేకపోవడం, ఉన్నవాళ్లు కూడా ఈ సంక్లిష్టత వల్ల పెద్దగా భాగస్వామ్యం వహించకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉండేది. అట్లాంటి ఆ తొలిరోజుల్లో (బహుశా నాలుగో రోజనుకుంటా) తెలతెలవారుతున్నప్పుడు వెంకాయమ్మగారు ఒక వైరు బుట్ట చేతపట్టుకొని, మానసిక వికలాంగుడైన తన కొడుకును వెంటబెట్టుకొని శిబిరం దగ్గరికి వచ్చింది.

గుంపులో నుంచి నన్ను పక్కకు తీసికెళ్లి 'మనోల్లు నన్ను పంపించారు. నేను ఇక్కడే ఉంటాను' అని చెప్పింది. 'ఈ రోజు రేపట్లో అమ్మ వస్తుంద'ని శేషప్రసాద్ అంతక ముందే కబురు పంపించాడు. నాకు ఇప్పటికీ బాగా గుర్తు... ఆయన అమ్మ .. అని రాసి... నేను గుర్తుపడతానో లేదో అని బ్రాకెట్లో వెంకాయమ్మగారు అని రాశాడు. నిజంగా ఇప్పుడనిపిస్తోంది.. తెలియని వాళ్ల కోసం అసలు పేరు బ్రాకెట్లో ఉండాలేమోగాని... అటు విప్లవకారులకైనా, సానుభూతిపరులకైనా ఆమె అమ్మగానే మిగిలిపోయింది.

ఆ రోజు నుంచి శిబిరం నిర్వహణలో, ఆత్మకూరులో జరిగిన బాధితుల ఉద్యమంలో ఆమె పెద్ద దిక్కుగా నిలబడింది. శిబిరంలో అమ్మగా, ఉద్యమంలో కార్యకర్తగా పనిచేసిందని చెప్పవచ్చు. వేంపెంట బాధితుల శిబిరం ఈ దేశానికి ఒక చిన్న ఉదాహరణ అని అనుకునేవాళ్లం. బాధితుల్లో ఎక్కువ మంది మాదిగలే అయినా మాల కులస్థులు, బీసీలు అందరూ శిబిరంలో ఉన్నారు. ఒక రకంగా చెప్పాలంటే విప్లవోద్యమంతో ఉన్నవాళ్లందరి మీద భూస్వామ్య సాయుధ ముఠా దాడి చేసింది. చనిపోయిన వాళ్లలో బీసీలు కూడా ఉన్నారు. వీళ్లందరి రాజకీయ అవగాహనలో ఎన్ని తేడాలుండేవో, వాళ్ల సాంస్కృతిక స్థాయిలో, సాంఘిక విశ్వాసాల్లో అంతే తేడా ఉండేది. ముఖ్యంగా కులపరమైన తేడాలు ఆ విషాద సందర్భంలో కూడా వెన్నాడుతుండేవి. అవి తిండి దగ్గర, మాట దగ్గర, చిన్న చిన్న సౌకర్యాల దగ్గర, ఇచ్చిపుచ్చుకునే దగ్గర, ఇంతా... జరగడానికి మీ కులం వాళ్లు కారణమంటే మీ కులం వాళ్లు కారణమనే దగ్గర .... అడుగడుగునా బైటపడేవి. వాటి సామాజిక అర్థం తెలిసినంత మాత్రాన వాటిని పరిష్కరించడం అయ్యేపని కాదు. అవన్నీ జీవితాలతో, వాటి నుంచి పుట్టిన నుడికారాలతో, ఉద్వేగాలతో, విశ్వాసాలతో ముడిబడినవి.

అక్కడ వెంకాయమ్మగారి పాత్రకు ఆ రోజుల్లో చేతులెత్తడం తప్ప మరేమీ చేయలేకపోయాం. ఇందాక అన్నట్లు ... మార్క్సిజం, వర్గ దృక్పథం అనేవి కామన్‌సెన్స్‌లో కలగలసిన వ్యక్తిత్వంతో ఆమె అత్యద్భుతంగా ఈ సమస్యలతో వ్యవహరించేది. ఇక్కడ నేను ... వ్యవహరించడం... అనే మాటను కావల్సి వాడుతున్నాను. పరిష్కారం అనే మాట వాడటం కొంచెం కష్టమే. ఎందుకంటే ... 'ఇది పరిష్కారమయితేనే అది... , అక్కడ అది తేలితేనే ఇక్కడ ఇది కుదురుతుంది... , ఆ వ్యక్తి గురించి ఇప్పుడు నా అభిప్రాయం ఇది కాబట్టి ఒక యావజ్జీవితం ఇంతే... 'అనే పద్ధతిలో సాధారణ జన జీవితం సాగదు. అందుకే ఆమె ఎప్పటికప్పుడు ఒక క్రమంలో ఉండేదేగాని పరిష్కారపు తుది తీర్పుల దిశగా సాగేది కాదు. దాదాపు రోజూ సమస్యలు వస్తుండేవి. ఆమె వచ్చిన రెండో రోజో మూడో రోజో మాల కులస్తులు మాదిగవాళ్లు వండింది తినమని, వాళ్లతో కలిసి ఉండమని పేచీ పెట్టారు. దానికి బైటి కారణాలు కూడా ఏవైనా ఉండవచ్చు గాని ఆ మాట అనడానికైతే వాళ్ల విశ్వాసాల్లో పునర్జీవితమయ్యే సాంఘికత్వం ఉన్నదే గదా. అలాంటి వాటిని వెంకాయమ్మగారు చాలా ఓర్పుగా; నేర్పుగా సర్దుబాటు చేసింది. శిబిరంలో రెండు పొయ్యిలు పెట్టకూడదని మేం గింజుకునే వాళ్లం. అమ్మ ఆ ఉపద్రవం రాకుండా మేనేజ్ చేయగలిగింది.

ఇదొక్కటే కాదు, శిబిరంలో భార్యాభర్తల తగాదాలు, అబ్బాయి అమ్మాయి ప్రేమలు, వివాహేతర సంబంధాలు... ఒకటేమిటి? అదో చిన్న సైజ్ పూర్ణ ప్రపంచం. అందులో అన్నీ ఉండేవి. అన్నిట్లో పేచీలే, వైరుధ్యాలే. ఐదు నెలలపాటు నడిచిన శిబిరంలో రోజూ ఇలాంటి పంచాయితీలే. ఇక్కడే వెంకాయమ్మ మనుషులను అర్థం చేసుకున్న పద్ధతి గురించి చెప్పుకోవాలి. ఒక విషయంలో అనుచితంగానో, చిరాకుగానో ప్రవర్తించిన మనిషిని ఆ సందర్భంలోని వ్యవహారంగానే ఆమె చూసేది. నాకు ఈ సంగతి ఎలా అర్థమైందంటే, ఇతరేతర పనుల్లో మేం తిరుగుతుంటే ఇవన్నీ

ఆమె తానుగా ఎప్పటికప్పుడు పట్టించుకోవడమేగాక ఏ రోజుకారోజు, లేదా వీలు దొరికినప్పుడు ఆ రిపోర్టు అంతా చెప్పేది. మొదట్లో నాకు అర్థమయ్యేది కాదు. ఇదంతా మళ్లీ చెప్పడం దేనికి? ఛాదస్తం కాకపోతే ...! అనుకొనేవాడిని. కానీ ఆమె అట్లా చెప్పడం తన బాధ్యత అనుకొని చెప్తోందని అర్థం చేసుకోడానికి నాకు కొన్ని రోజులు పట్టింది. అట్లా చెప్తున్నప్పుడు ఒక వివాదంలో ఒక మనిషి గురించి ఈ రోజు చెప్పేదానికీ, నాలుగు రోజుల తర్వాత మరో వివాదంలో అదే మనిషి గురించి చెప్పేదానికి సంబంధం ఉండేది కాదు. మనిషిలో ఒక లోపం ఉంటే సర్వత్రా అన్ని విషయాల్లో అదే లోపం ఉంటుందనీ, దానికి భిన్నంగా మరోలా వ్యవహరించలేడని బోలెడు పుస్తకాలు చదివి, రాసేసేవారు కూడా నమ్ముతూ ఉంటారు. వాళ్ల వ్యక్తిగత జీవితంలో కూడా మానవ సంబంధాలను అదే ప్రాతిపదిక మీద కొనసాగిస్తూ ఉంటారు. అవసరమైతే దీన్ని ఒక విలువల చర్చగా, మనో, వ్యక్తిత్వ విశ్లేషణగా కూడా అభివృద్ధి చేయగలరు. ఇందులో ఏదైనా శాస్త్రబద్ధమైన అంశం ఉంటే కాదనబోవడం లేదుగాని... మానవ జీవితం ఆ చట్రంలోనే నిర్ధారణ కాదనీ, మనుషులను... మానవ సంబంధాల్లోని వైరుధ్యాలను కామన్‌సెన్స్‌లో భాగంగా అర్థం చేసుకొనేవారు ఆ చట్రానికే పరిమితం కారనీ, తమదైన సొంత పద్ధతిలో మనుషులను అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తుంటారని చెప్పడమే ఉద్దేశం. వెంకాయమ్మగారికి విప్లవ చైతన్యం వల్ల అట్లా తనదైన పద్ధతి ఏదో పట్టుపడింది.

ఆ ఆర్నెల్లలో వెంకాయమ్మగారి వ్యవహార శైలిలో నాకు ఇలాంటిదేదో ఒకటి తెలియవచ్చింది. ఎవరిండ్లల్లో వాళ్లు ఉంటూ ఏవో పనుల మీద కలిసి తిరగడానికంటే.. ఇట్లాంటి బాధిత శిబిరంలో నెలల తరబడి కలిసి ఉండడం వల్ల మనుషులు చాలా లోతుగా తెలుస్తారు. వెంకాయమ్మగారు నాకు అట్లా తెలిశారు. ఆమె వ్యవహార శైలి, మాట తీరు, ఆలోచనారీతి తెలిశాయి. శిబిరంలో ఫలానావారికి ఫలానా పని అప్పగించాలనుకుంటే... ఆమె 'ఒద్దయ్యా...' అని వారించేది. అదే మరేదో పనిపడితే 'మనోడు ఉన్నా..' అని అదే వ్యక్తిని సూచించేది. పురమాయించేది. ఆమెకు మనుషుల పట్ల ఏదో ఒక లెక్క ఉండేది. దాని ప్రకారం ఆ సందర్భంలో ఆ వ్యక్తిని అంచనా వేసేది. '.... నిన్న ఇట్లా కాబట్టి ఇక నేను వాడి ముఖం చూడను.. ఆ ఇంటి మీది కాకి మా ఇంటి మీద వాలడానికి వీల్లేదనే గౌరవనీయ మేధావుల్లా వ్యవహరించేది కాదు. మొన్నామధ్య చాలా మంచి కథలు రాసిన ఒక మిత్రుడు చెప్పిన ఒక విషయానికి ఆశ్చర్యపోయాను. ఒక వ్యక్తి గురించి తన అంచనాకు ఇరవై ఏళ్ల కిందటి ఒకానొక అనుభవం ఆధారం. దాని ఆధారంగా... అప్పుడు ఏర్పడ్డ అభిప్రాయాన్ని మోసుకతిరగడానికే తాను జీవిస్తున్నాడా ? అనిపించింది ఆయన చెప్పిన తీరుచూచి. విషాదమనిపించింది. ఎంత దుర్భరమైన పద్ధతి ఆయనకు పట్టుపడిందా? అనిపించింది. ఆయన విలక్షణ వ్యక్తిత్వాల కోవలోకి వచ్చే మనిషి.

సాధారణ వ్యక్తిత్వాల జాబితాలో ఉండేవాళ్లకు ఈ సమస్య ఉండదనుకుంటాను. వెంకాయమ్మగారంటే శిబిరంలో ఎంత మన్నన ఉన్నా ఆమె మాట కొందరు పట్టించుకొనే వాళ్లు కాదు. కొంత రాజకీయ అవగాహన ఉన్నవాళ్లకయితే ఈమె మనకు సంబంధించిన వ్యక్తి అనే ఆలోచన ఉండేది. మామూలు వాళ్లకు సహజంగానే బైటి మనిషి అవుతుందిగదా? అందువల్ల పట్టించుకొని సందర్భాలు కూడా ఉండేవి. కొందరు కొన్ని సందర్భాల్లో ఆమె మాటను చాలా గౌరవించినా మరి కొన్ని సందర్భాల్లో తీసేసే వారు. ఇట్లాంటి వాటి గురించి ఆమె మనసులో ఏమనుకునేదోగాని, బైటికి ఏమీ అనేది కాదు. అసలు బైటపడేదే కాదు.

మనుషుల మీద ఉండే అంచనాల్లో ఆమెకు కొంచెం బోళాతనం ఉన్నట్లుండేది. మనోళ్లు కదా... సర్దుకుపోవాలనే దృష్టి అది. కామన్‌సెన్స్‌లో ఉదారత్వం కూడా భాగమేనేమో. అయితే మనుషుల పట్ల ఆమెకు ఉండే పరిశీలన, వైఖరి నుంచి నేను చాలా నేర్చుకున్నాను. వేంపెంట ఘటన జరిగేనాటికే నిప్పులవాగు నవల దాదాపుగా ఒక పద్ధతిలో పూర్తయిపోయింది. ఆ ఊరు... అందులోని వైరుధ్యాలు కేంద్రంగానే నవల సాగింది. ఈ ఘటన తర్వాత ఇతివృత్తం, అంత కంటే ఎక్కువగా పాత్రలూ మారిపోయాయి. బహుశా ఆ నవలలోని పాత్రల వెనుక ఉన్న నిజ వ్యక్తులను అర్థం చేసుకోడానికి నాకు వెంకాయమ్మగారి వ్యవహారశైలి తోడ్పడిందేమో అని ఇప్పుడనిపిస్తోంది. లేకపోతే పాత్రల పట్ల నేను కొంచెం పెడసరంగా, మొండిగా ప్రవర్తించేవాడినేమో. వెంకాయమ్మగారు చనిపోయారని తెలిశాక వేంపెంట చుట్టూ, శిబిరంలో నేను ఎరిగిన ఆమె వ్యక్తిత్వం చుట్టూ ఆలోచనలు తిరుగుతూ ఇది కూడా స్ఫురించింది.

వెంకాయమ్మగారిలో నేను దగ్గరిగా చూచిన మరో పార్శ్వం కార్యకర్తృత్వం. శిబిరం మొదలైనప్పటి నుంచి ఒక దశదాకా రోజూ రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు నడిచాయి. ఆ మాత్రమైనా అవి నడిచాయంటే అమ్మ తానే వెనుకా, ముందూ ఉన్నందు వల్లే సాధ్యమయ్యాయి. ఆ ఉద్యమానికి పరిణతి, అనుభవంగల రాజకీయ నాయకత్వం లేకపోవడం అతి పెద్ద వెలితి. కారంచేడు, చుండూరు ఉద్యమాల్లో అప్పటికే పేరెన్నిక గల దళిత, విప్లవ ప్రగతిశీల నాయకత్వం పాల్గొన్నట్టు చెప్తారు. ఆ ఉద్యమాల నుంచే కొత్త తరం నాయకత్వం వచ్చినట్టు కూడా చెప్తారు. కానీ వేంపెంట ఘటనకు ఉన్న స్థల కాల నేపథ్య ప్రత్యేకతల వల్ల, ముఖ్యంగా రాయలసీమలో ప్రగతిశీల ఉద్యమాలు బలంగా లేకపోవడం వల్ల, చెప్పుకోదగ్గ నాయకత్వం ఏ వైపు నుంచీ తయారు కాలేదు. ఆ వెలితి వేంపెంట ఉద్యమంలో కొట్టవచ్చినట్లు కనిపించేది. అసలు ఆ ఘటన పెద్దగా చరిత్రలో చోటు సంపాదించుకోకపోడానికి రాజకీయ ప్రభావం వేయగల నాయకత్వం, వ్యాఖ్యాతలు లేకపోవడం ఒక కారణం. చాలా విచిత్రంగా ఆ ఉద్యమం నుంచి కొత్త నాయకత్వం కూడా తయారుకాలేదు. దీనికి మినహాయింపు ఆ మొత్తం ఉద్యమాన్ని విప్లవోద్యమం వైపు నుంచి నడిపించిన శేషప్రసాద్ మాత్రమే. బహుశా శేషప్రసాద్‌కు, వెంకాయమ్మగారికి కారంచేడు ఉద్యమంలో ఉన్న అనుభవం, అవగాహన వేంపెంట

ఉద్యమానికి దోహదపడ్డాయి.

బాధితుల ఉద్యమానికి లేదా సంఘీభావ ఉద్యమానికి స్థానికంగా వెంకాయమ్మగారే నాయకురాలని చెప్పవచ్చు. బాధితులను నిత్యం కదిలించి తాలూకా ఆఫీసు ముందు వేసిన దీక్ష శిబిరానికి తరలించడం, పొద్దంతా కూచోబెట్టడం అంతా ఆమే చూసుకొనేది. డిమాండ్ల విషయంలో బాధితులను ఒకే అభిప్రాయం కింద నిలబెట్టడంలో కూడా కీలకపాత్ర పోషించింది. పైన చెప్పినట్లు పెద్దగా నాయకత్వం, సంఘీభావం కూడా లేకపోవడంతో ఎక్కువసార్లు దీక్షా శిబిరాన్ని ప్రారంభిస్తూ ఆమే మాట్లాడాల్సి వచ్చేది. ఆమెకు వర్గ దృష్టితో తప్ప మరోలా ఆలోచించేందుకు చేతకాదా ? అని ఎవరికైనా సందేహం కలిగేంత స్పష్టత ఉండేది.

ఆగస్టు 15న బాధితులు బూటకపు స్వాతంత్ర్యాన్ని బహిష్కరిస్తూ నిరసన దినంగా ఆత్మకూరులో ర్యాలీ చేపట్టారు. శిబిరం నుంచి ర్యాలీ మొదలుకాగానే పోలీసులు పెద్ద ఎత్తున చుట్టుముట్టి అందరినీ స్టేషన్‌కు తరలించారు. ఆ రోజు వెంకాయమ్మగారు బాధితుల్లో ధైర్యం నింపుతూ పోలీసులతో గొప్పగా తలపడింది. అప్పటికే చాలా మంది మేధావులు వేంపెంట ఘటనకు విప్లవోద్యమమే కారణమని పత్రికల్లో వ్యాసపరంపర రాస్తున్నారు. పోలీసులు వాటిని చక్కగా వాడుకొని ... మీవల్లే దళితులకు ఈ గతి పట్టిందని మాతో వాదనకు దిగారు. బాధితులకేమో... ఇప్పటికైనా వీళ్లకు దూరమై ప్రభుత్వం అందిస్తున్న పరిహారం తీసుకొని ఊరికి వెళ్లి హాయిగా బతకమని బోధించడం మొదలు పెట్టారు. దాన్ని వెంకాయమ్మగారు ధాటిగా తిప్పికొట్టింది. పోలీసుల నిర్బంధంలో కూడా ఆమె సహజశైలిలో ... మావాళ్లు... అని విప్లవోద్యమాన్ని సమర్థిస్తూ వాదనకు తిరిగింది. మీరంతా బుడ్డా వెంగళరెడ్డి మనుషులు... అందుకే మీరిట్లా మాట్లాడుతున్నారు... అని తిప్పికొట్టింది. ఆరోజు పోలీస్ స్టేషన్లో జరిగిన సభలో ఆమె నిర్భీతిగా విప్లవోద్యమం గురించి, అగ్ర వర్ణ ఫ్యాక్షన్ నాయకుల గురించి మాట్లాడుతూ కారంచేడు నేరస్థులకు విప్లవోద్యమం ఏ శిక్ష వేసిందో చెప్పడం మొదలు పెట్టింది. మాతోపాటు అరెస్టయిన కొంత మంది మిత్రులు... ఈ ముసలామె ఏందీ.. ఇట్లా మాట్లాడుతోందే... అనే కంగారుపడ్డారు.

బాధితుల్లో నిరాశ, భయం, ప్రలోభం మొదలైన ధోరణులు తలెత్తినప్పుడు ఆమె విప్లవోద్యమం గురించి మాట్లాడటం నేను చాలా సార్లు విన్నాను. కూడగట్టుకోడానికి, ఉత్తేజం పొందడానికి విప్లవాన్ని తలపోసుకోవడం ఆమె కామన్‌సెన్స్‌లో, వ్యక్తిత్వంలోనే ఉన్నట్లుంది. సుదీర్ఘ కాలం పాటు విప్లవం ఎదుర్కొనే అన్ని దశల్లో విప్లవం పక్షానే నిలబడ్డం అందరికీ సాధ్యమయ్యేది కాదు. అసలు చాలా మంది జీవితంలో విప్లవం అనేది యాక్సిడెంట్ లాంటిది. ఎందుకు, ఎలా విప్లవోద్యమం తారసపడుతుందో చెప్పడం కష్టమే అయినా అదొక ఘటనగా మిగిలిపోవడం చూడవచ్చు. యాక్సిడెంట్ నుంచి కోలుకొని కొత్త జీవితం ప్రారంభించడం కూడా చూడవచ్చు. గట్టిగా గాలి వీస్తే, ఒక చిన్న కుదుపు వస్తే, లోలోపలే ఏదో అలజడి తలెత్తితే రాలిపోయే వాళ్లను కూడా చూడవచ్చు. దాంతో ఘటనగా, స్మృతిగా విప్లవం మిగిలిపోయినవాళ్లు కూడా ఉన్న చోట విప్లవం ఒక చైతన్యయుతమైన క్రమంగా, వ్యక్తిత్వంగా, సంస్కారంలో సంలీనమైపోవడంగా, సాధారణ పరిజ్ఞానంగా వెంకాయమ్మ గారిలాంటి వాళ్లలో చూస్తాం. కొన్ని పనుల రూపంలో, కేవల జ్ఞానంగా కూడా విప్లవం ప్రతిఫలించవచ్చు. నిర్మాణాలతో నిమిత్తం లేని సొంత కార్యక్రమంగా కూడా విప్లవం ఉండొచ్చు. దాన్నే విప్లవంలో ఉన్నట్లు సమర్థించుకోవచ్చు. కానీ వెంకాయమ్మగారు విప్లవాన్ని ఒక ప్రత్యేక ఆలోచనా దశకు సంబంధించిందిగా, విశిష్టమైన ఆచరణగా చూసినట్లు నా పరిచయంలో నాకు అనిపించలేదు. అది ఆమెకు చాలా మామూలు విషయం. అట్లా తప్ప మరోలా జీవించలేకపోవడం, మరోలా మాట్లాడలేకపోవడం, మరోలా ఆలోచించలేకపోవడం అనేది ఆమెలో ఎన్నడో నిర్మాణమై ఉన్నట్టనిపిస్తోంది. అది నిరంతరం పునర్నిర్మాణము అవుతున్నట్టు అనిపించేది. లేకపోతే మనదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్ల వైపు నుంచి చూస్తే... చివరంటా దానితో కలిసి నడవడం అంత తేలిక కాదు. అందుకే కమ్యూనిస్టని మరణానంతరమే అనే సాహసం చేయగలం. వెంకాయమ్మగారు జీవించి ఉండగానే కమ్యూనిస్టు వెంకాయమ్మగా పేరు పొందడానికి కూడా కారణం... ఆమె వ్యక్తిత్వంలో, సాధారణ పరిజ్ఞానంలో విప్లవం కలగలసి పోవడం. అందు వల్లే ఆ గుర్తింపు ఆమెకు సాధ్యమైంది. మిగతా గుర్తింపులేమో పుట్టుకతో, సాంఘిక అస్తిత్వంతో వచ్చేవి. వాటి గురించిన ఎరుక వల్ల కలిగేవి. కమ్యూనిస్టు అనే గుర్తింపు పూర్తిగా బైటి నుంచి పొందే చైతన్యం వల్ల మాత్రమే దొరుకుతుంది.

ఈ గుర్తింపు ఆమెకు సమాజం మాత్రమేకాదు, విప్లవోద్యమం కూడా ఇచ్చింది. భారత కమ్యూనిస్టుపార్టీ దగ్గరి నుంచి భారత కమ్యూనిస్టుపార్టీ మావోయిస్టు దాకా ఆంధ్రప్రదేశ్‌లో నడచిన ఉద్యమ చరిత్రతో ముడిబడిన మనిషి కాబట్టి... దేశంలోని విప్లవశక్తులు ఏకమై మావోయిస్టుపార్టీగా ఏర్పడ్డాక (అప్పటికి బైటికి ప్రకటించకపోవచ్చు) గుత్తికొండ బిలం సభలో ఆ పార్టీ తన పతాకాన్ని వెంకాయమ్మగారితో ఆవిష్కరింపజేసింది.

మళ్లీ వేంపెంట దగ్గరికి వస్తే... బాధితుల ఉద్యమం, సంఘీభావ ఉద్యమం రాజకీయ ఆందోళనగా సాగినంత కాలం శిబిరం నడిచింది. అది మరో దశలోకి వెళ్లిపోయాక, బాధితులను గ్రామానికి తరలించే దాకా వెంకాయమ్మగారు అక్కడే ఉన్నారు. వచ్చిన రోజు ఎట్లా ఉన్నారో, ఎంత బాధ్యతాయుతంగా ఉండి ఏ పాత్ర పోషించారో చివరి రోజు దాకా అట్లాగే ఉన్నారు. ఏ పనైనా రెండ్రోజుల కంటే ఎక్కువ కొనసాగించలేని కార్యకర్తృత్వం వాళ్ల విరుచుకుంటున్న కాలంలో, ఇద్దరు కలిసి రెండు రోజులు పనిచేస్తే నాలుగు వైరుధ్యాలు తలెత్తే వాతావరణంలో, చీమ కాలంత పని చేసి అఖండమైన అనుమానాలకు గురయ్యే సందేహజీవులు తారసిల్లుతున్న పరిస్థితుల్లో ఆమె అట్లా ఉండడం సాధారణ వ్యక్తిత్వం వల్లే సాధ్యమైందనిపిస్తోంది. దాని వల్లే ఆమె సుదీర్ఘ కాలం ఉద్యమాలతో దృఢంగా కొనసాగగలిగింది. శిబిరం పని పూర్తి అయ్యాక మళ్లీ శేషప్రసాద్ 'అమ్మను ఊరికి పంపించేయండి' అని

వ్యాసం

అంతర్యుద్ధం నుంచి యుద్ధం స్థాయికి

ఇ.ఎస్.బ్రహ్మచారి

అరబ్ ప్రజల తిరుగుబాట్లూ - పాలకవర్గాల పాట్లూ ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ - అన్నిదేశాల పాలకులూ ఈ మంత్రాల్నే జపిస్తున్నారు. ఈవిధానాలనే అమలు పరుస్తున్నారు. వేగిరపరుస్తున్నారు. వీటి దుష్ఫలితాలు ప్రజల జీవితాల్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. సంపన్నులు మహాసంపన్నులవుతున్నారు. పేదలు నిరుపేదలుగా దిగబడి పోతున్నారు. నిరుద్యోగం నింగి వైపు చూస్తోంది. ఉన్నవాడికీ లేనివాడికీ ఉన్న అంతరాల స్థాయి అంతా ఇంతాకాదు. విద్యా, వైద్యమూ సామాన్యుడికి అందేవిగా లేవు. రోజు రోజుకీ మరీ దూరంగా పరుగుతీస్తున్నాయి. పెరుగుతున్న ఆహారధరలు మరింత మందిని ఆకలితో అలమటింపజేస్తున్నాయి.

అన్ని దేశాలూ ఇవే విధానాల్ని అమలుచేస్తున్నాయి. కనక ఇంచుమించు అవే ఫలితాలు పొందుతున్నాయి. ప్రపంచంలో ఏఒక్క దేశమూ ఇందుకు మినహాయింపు కాదు. కొన్నిదేశాలు మెల్లగా, కొన్ని త్వరత్వరగా అంతే తేడా.

ప్రజలు తమగోడు వినమని మొరపెట్టుకుంటున్నా వినే దిక్కు లేదు. నిరసనల్ని సైతం ఉక్కుపాదంతో తొక్కెయ్యడమే పాలకుల ఏకైక మార్గంగా ఎంచుకుని నిర్దాక్షిణ్యంగా అమలు పరుస్తున్నారు. అంతటి క్రూర అణచివేతని సైతం తట్టుకొని నిలబడుతున్న ప్రజల పోరాటాలు అరబ్ దేశాల్లో విజయం కోసం వేచి ఉన్నాయి.

తిరుగుబాటు మొదట టునీషియాలో మొదలైనా, ఈజిప్ట్‌లో ఎక్కువ గుర్తింపు వచ్చింది. ఈజిప్ట్ తరహా పోరాటం అనే మాట అన్నిచోట్లా వినపడుతున్నది. అమెరికాలో విస్కాన్సన్ ఉద్యోగులూ, బ్రిటన్‌లో విద్యార్థులూ బడ్జెట్ కోతకు వ్యతిరేకంగా పోరాడుతూ ఈజిప్ట్ తరహాలో చేస్తామన్నారు. ఉద్యమకారులకు ఇది స్ఫూర్తిదాయకమయింది. దేశదేశాల పాలకులూ తమ దేశంలోనూ అలాంటిది జరుగుతుందేమోనని బెదురుతో ఉన్నారు.

దీన్నిబట్టి అరబ్ పోరాటాలు ఎంత ప్రభావం చూపనున్నాయో తెలుస్తుంది. ఈపోరాటాలన్నింటిలో ఉమ్మడి కారణాలున్నాయి. అలాగే ప్రత్యేకతలూ ఉన్నాయి. కనక వాటిని విడివిడిగానూ ఉమ్మడిగానూ పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రస్తుతమున్న ప్రభుత్వాలు పోతే గాని బాధలు పోవు అనే నిశ్చితాభిప్రాయం ప్రజలకు ఏర్పడింది.

అలోచించాల్సిన విషయమేమంటే: ఒక్కొక చోట ఒక్కొక ప్రభుత్వం ఉంది. ఒక్కొక్క పాలకుడున్నాడు. ఎక్కడి కక్కడ ప్రజలు తమ పాలకుడు పోతే తమ కష్టాలు గడిచి గట్టున పడతాం అనుకుంటున్నారు. మరి అందరి పాలన ఫలితలూ బాధలే అయినప్పుడు కారణం పాలకులు కాదు అనేది స్పష్టం. పాలకులు వేర్వేరు అయినా అమలు పరుస్తున్న ఆర్థిక విధానాలు ఒక్కటే. వాటిని మారిస్తే తప్ప పాలకుల్ని మార్చి ఏప్రయోజనమూ ఉండదు. ఈ సంగతి జనానికి ఇప్పటికే కొంత తెలుసు. అరబ్ పరిణామాల తర్వాత మరికొంత అవగతమవుతుంది. చైతన్యం పెరుగుతుంది. పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించి పోరాడతారేమో అనే భయం అన్నిదేశాల పాలకవర్గాలనీ బెంబేలెత్తిస్తున్నది. అందుకే లిబియాలో సైనిక జోక్యం. వర్గ ప్రయోజనాలనీ, పాలననీ కాపాడుకోవడానికే దురాక్రమణ యుద్ధం గడాఫీ విమానదాడులతో అమెరికా నేటో సేనలు బాంబులతో భారీ అంతర్యుద్ధం కొనసాగుతున్న లిబియాని ముందు చూద్దాం.

జనాభా 6 కోట్లా 50 లక్షలు. చమురు నిల్వలు 2010 లో 4150 కోట్ల బారెళ్ళు. రోజుకి 18 లక్షల బారెళ్ళ చొప్పున వెలికి తీస్తారు. ఈలెక్కన 66 ఏళ్ళు చమురు లభిస్తుంది.ఆఫ్రికాలో ఇంతనిల్వలున్న దేశం మరొకటిలేదు. ప్రపంచంలో దానిది 9 వ స్థానం. మొత్తం దేశ ఉత్పత్తి (డి.డి.పి) లోసగం వాటా చమురే. ఆఫ్రికా దేశాల్లో తలసరి అదాయం లిబియాదే ఎక్కువ. ఎగుమతుల్లో 95 శాతం చమురే. సామ్రాజ్య వాదుల దృష్టి ఆ దేశం మీద ఉండడానికి ఇది చాలు.

రాసే వరకు ఆమె అక్కడి నుంచి కదల్లేదు. దాన్ని విశ్వాసం అందామా? క్రమశిక్షణ అందామా? మొండితనం అందామా? అమాయకత్వం అందామా? ... ఈ ప్రశ్నలన్నీ మనకు వదిలేసి ఒక అతి సాధారణ ఉదాహరణగా ఆమె నిలిచిపోయింది.

వెంకాయమ్మగారితో సుదీర్ఘ ఉద్యమ అనుభవం, వ్యక్తిగత సాన్నిత్యం ఉన్నవాళ్లు చాలా మందే ఉన్నా నేను కొన్ని నెలలపాటు ఒకానొక ప్రత్యేక స్థితిలో ఆమెను అర్థం చేసుకున్న తీరు రాయాలనుకొనీ, ముందే అన్నట్లు ఎలా రాయాలో తెలియక రాయలేకపోయాను. కామ్రేడ్ షహీదా అరుణతారకు పంపించిన వ్యాసం (జనవరి-మార్చి' 2011) చూశాక ఏదో దారి దొరికినట్టయింది. విరసం చేసిన పనుల్లోని అపశ్రుతులను, చేయవలసీ చేయని పనులను విప్లవోద్యమ నాయకత్వం ఎత్తి ఇట్లా ఎత్తి చూపడం నాకు చాలా బాగా నచ్చింది. షహీదా విమర్శ నచ్చడమేగాక ఇప్పటికైనా ఇది రాయడానికి పురికొల్పింది. అందుకు షహీదాకు ధన్యవాదాలు చెప్తూ, విరసం కార్యక్రమాలను, పత్రికను, రచనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఇలాంటి విమర్శ రాయాలని కోరుకుంటున్నాను.

1911 నుంచీ 1943 వరకూ ఇటలీకి వలసగా కునారిల్లింది. అందువల్ల, లిబియన్లలో సామ్రాజ్యవాద వ్యతిరేకత గూడు కట్టుకొని ఉంది.నాణ్యమైన, అపారమైన చమురు నిల్వల్ని కొల్లగొట్టింది ఇటలీ. 1969 లో అమెరికా మద్దుతున్న, అవినీతి పుట్ట అయిన రాజు ఇద్రిస్ ని కూలదోసి 27 ఏళ్ళ వయసులో గడాఫీ లిబియా పగ్గాలు పట్టాడు. గడాఫీ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాడు. నాజర్ సూయజ్ జాతీయీకరణ నించి స్ఫూర్తి పొందాడు. అమెరికా సైన్యాన్ని బహిష్కరించినప్పుడూ, అమెరికా చమురు కంపెనీలని జాతీయం చేసినప్పుడూ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గడాఫీకి బ్రహ్మరథం పట్టారు. పాలస్తీనీయుల పోరాటాన్ని సమర్థిస్తూ, ఇజ్రాయిల్‌కి వ్యతిరేకిగా నిలబడ్డాడు.

1972 లో పాశ్చాత్య దేశాలతో ఉన్న ఒప్పందాల్ని రద్దుచేశాడు. దాంతో అమెరికా తన రాయబారిని వెనక్కు పిలిపించుకుంది. 1979లో లిబియన్లు గుంపుగా కూడి అమెరికా రాయబార కార్యాలయాన్ని తగలబెట్టారు. అప్పుడు అన్నిసంబంధాల్ని తెంచుకుంది అమెరికా. రష్యాకు అనుకూలంగా ఉంటూ పదే పదే అమెరికా విధానాల్ని దుయ్యబట్టేవాడు. అమెరికా ఆయన్ని బద్ధ వ్యతిరేకిగా చూసేది. గడాఫీ అమెరికాతో విరోధిగా వ్యవహరించేవాడు.

1986 మార్చిలో అమెరికా లిబియా పెట్రోల్ బోట్లని ముంచింది. తర్వాత జర్మనీలో లాబెలే డిస్కో క్లబ్ లో బాంబు పేలింది. లిబియాని రీగన్ ప్రభుత్వం నిందించింది. బెర్లిన్‌లో ఉండే అమెరికా సైనికులు అక్కడకు పోతుండే వారు. ముగ్గురు చనిపోగా 200 మంది గాయపడ్డారు. రీగన్ గడాఫీని "పిచ్చికుక్క" అన్నాడు. లిబియా టెర్రరిస్ట్ దేశమంటూ ఆంక్షలు విధించాడు.

అంతే కాదు, అమెరికా లిబియా విమానాల్ని కూల్చింది.ఒక ఓడని ముంచింది. అందులో 35 మంది నావికులు చనిపోయారు. తర్వాత ట్రిపోలీ, బెంఘాజీ ల మీద బాంబు లేసింది. ఇంకో 60 మంది హతులయ్యారు. వాళ్ళలో గడాఫీ పెంపుడు కూతురు కూడా ఉంది.

పరాకాష్ట ఏమంటే, అమెరికా విమానం 1988 లో బాంబువల్ల ధ్వంసం అయింది. 243 మంది ప్రయణీకులూ,16 మంది సిబ్బందీ మరణించారు. విమాన శకలాలు స్కాట్లండ్ లోని లాకర్బీ పట్టణం మీద పడడంతో అక్కడ మరో 11 మంది చనిపోయారు. ఎన్నోఇళ్ళు గుల్లగుల్ల అయ్యాయి. మొత్తం 21 దేశాలకు చెందిన 270 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనని లాకర్బీ బాంబింగ్ అంటారు. అది లిబియా ఘాతుకమేనని అమెరికా వాదించింది. అమెరికాతో సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి. అయితే ఆతర్వాత గడాఫీ తన పంథా మార్చుకున్నాడు.

రష్యా వెనకబడ్డాక, 1990 దశకం చివరలో అమెరికా తలుపు తట్టటం మొదలెట్టాడు. అప్పటికి లిబియాకీ అమెరికాకీ ముస్లిం సాంప్రదాయ వాదులనుంచీ ముప్పు ఉన్నదని గడాఫి గ్రహించాడనీ, అయన ప్రతినిధులు అమెరికాతో ఏవిషయంలో నైనా సంప్రదింపులకు సిద్ధంగా ఉన్నారనీ అమెరికా అసిస్టెంట్ సెక్రటరీ మార్టిన్ ఇండిక్ తర్వాతి కాలంలో రాశాడు. సెప్టెంబర్ 11 దాడులకి ముందే అల్ ఖైదాతో పోరాటానికి సిద్ధమన్నాడు. అణ్వాయుధ కార్యక్రమాన్ని అంతర్జాతీయ పరిశీలకులు వచ్చి తనిఖీ చేయడానికి ఒప్పుకున్నాడు. అమెరికా టవర్ల మీద దాడి జరగగానే గట్టిగా ఖండించిన మొదటి ముస్లిం నాయకుడు గడాఫీయే.

ఆవిధంగా సెప్టెంబర్ దాడి అమెరికాతో లిబియా స్నేహబంధాన్ని దృఢతరం చేసింది. తర్వాత అమెరికా అల్ ఖైదా మీద చేసిన దాడిలో గడాఫీ రహస్య పోలీసులు అమెరికా గూఢచారి సంస్థ 'జు' కి సంపూర్ణ సహకారం అందించారు. 2003 లో రెండో ఇరాక్ యుద్ధం జరిగాక గడాఫీ పాశ్చాత్య దేశాలతో పూర్తి రాజీ చేసుకున్నాడు.

లిబియా 2003లో లాకర్బీ బాంబింగ్ బాధ్యత ఒప్పుకున్నది. 2008లో 200 కోట్ల డాలర్లు బాధిత కుటుంబాలకి నష్ట పరిహారం చెల్లించింది. 2011 ఫిబ్రవరి 24న ముస్తఫా అబ్దుల్ జలీల్ అనే మాజీ లిబియా న్యాయ మంత్రి స్వయంగా గడాఫీయే ఆనాటి బాంబింగ్‌కి ఆదేశాలు ఇచ్చాడన్నాడు.

ప్రభుత్వ అధీనంలో ఉన్న చమురు కంపెనీల్ని ప్రైవేటు పరం చేశాడు. పదవి చేపట్టినప్పుడు విదేశీ కంపెనీలని జాతీయం చేసి జాతిచేత జై కొట్టించుకున్న నేత, వాటిని తిరిగి విదేశీ కంపెనీలకు అప్పగించి ఛీ కొట్టించుకున్నాడు. సంస్థాగత సర్దుబాట్లు చేశాడు. ఆహార, చమురు సబ్సిడీలు తగ్గించాడు. తృప్తి పడిన అమెరికా ఆంక్షలు ఎత్తేసింది. గడాఫీ అమెరికాకీ , యూరప్‌కీ దగ్గరపడ్డాడు. ఆయనకి ఆ దేశాల్లో ఘనస్వాగతం లభించింది. ఆయా దేశాధీశులు ఒకరితర్వాత మరొకరు లిబియా వచ్చి కరచాలనాలు చేశారు. కొత్తహితుణ్ణి హత్తుకున్నారు. తమదేశాలకు ఆహ్వానించి కరతాళధ్వనులు మిన్నుముట్టించారు. 2009 లో లాకర్‌బి బాంబు నిందితుణ్ణి ఇంగ్లండ్ విడుదలచేసి లిబియాకి పంపింది. తన ప్రజలమీద గడాఫీ ప్రయోగిస్తున్న ఆయుధాలు పాశ్చాత్య దేశాలు సరఫరా చేసినవే.

అల్ ఖైదాకు చెందిన వాళ్ళని అరెస్ట్ చేశాడు. అమెరికా ఎవరిని ఉగ్రవాది అంటే వారిమీద కఠిన చర్యలు చేపట్టాడు.పాలస్తీనా వాళ్ళని తనదేశం నుంచి గెంటివేశాడు. కనకనే మానవహక్కుల్ని రక్షిస్తున్న దేశమంటూ ఐరాస మానవహక్కుల కమీషన్ 2010 లో మెచ్చుకుంది. అయితే తన ప్రజల మెప్పు పొందలేక పోయాడు. జనాలకి దూరమయ్యాడు. కారణం పాశ్చాత్య దేశాల ప్రాపు కోసం ప్రయివేటీకరణనీ, ప్రపంచీకరణనీ ప్రోత్సహించడమే. ప్రజల మీద కత్తిగట్టడమే.

లిబియా అరబ్ రిపబ్లిక్ నెలకొల్పాడు. తర్వాత 1977 లో "జమహిరియా"గా మార్చాడు.. అంటే ప్రజా రాజ్యం. తనది ఇస్లామిక్ సోషలిజం అన్నాడు. పేరుకే గాని అది సోషలిజం కాదు. అప్పటికి రష్యాలో పెట్టుబడిదారీ విధానం తిరిగి పట్టు పెంచుకుంటున్నది. ప్రజల కమిటీల చేతుల్లో అధికారం అన్నాడు. ఆచరణలో అన్ని అధికారాలూ గుప్పెట్లోనే. ప్రతిదీ ఆయన కనుసన్నల్లో జరగాల్సిందే. అంతా ఆయన అదుపాజ్ఞల్లో ఉండాల్సిందే.

అన్ని ప్రజాస్వామ్య దేశాల్లో లాగే అక్కడా ప్రజాస్వామ్యం

పేరుకే. ప్రజలకు హక్కులు అమల్లో ఉండవు. గడాఫీ ప్రత్యక్ష ప్రజస్వామ్యం అంటాడు. అసమ్మతికి పరోక్ష నరకం చూపిస్తాడు. అంతదాకా ఎందుకు, అసమ్మతి చట్టవ్యతిరేక చర్య, నేరం. రాజకీయ పార్టీ స్థాపిస్తే మరణ శిక్షే. వ్యతిరేకుల్ని బహిరంగంగా ఉరితీసి, టీవీల్లో ప్రసారం చేసిన సందర్భాలూ ఉన్నాయి. అదే ఆయన జమాహిరియా, అదే ఆయన ప్రత్యక్ష ప్రజాస్వామ్యం.

గడాఫీ కొడుకులు పశ్చిమ దేశాల సంపన్నులతో కాలక్షేపం చేస్తుంటారు. విలాసవంతమైన జీవితం గడుపుతుంటారు. వాళ్ళ ఆశీస్సులతో అనేక బ్రిటిష్ కంపెనీలు లిబియా మార్కెట్‌లో ప్రవేశించాయి. ఇటలీ చమురు కంపెనీల్లో ఆయనకు వాటాలున్నాయి. చాలా బ్యాంకుల్లో వాటాలు కొన్నాడు. లిబియా లోపలా బయటా ఆయనికి ఎంతో సంపద ఉంది. జింబాబ్వే, చైనా, సూడాన్, లియోన్, లిబిరియా దేశాల్లో పెట్టుబడులున్నాయి.

నిరుడు అక్టోబర్ 28న ఐ.ఎం.ఎఫ్ లిబియా ప్రైవేట్ రంగాన్ని పెంచే ప్రయత్నాల్ని మెచ్చుకుంది. ద్రవ్య మార్కెట్లని విస్తరంపచేస్తున్నదని కొనియాడింది. ప్రభుత్వ సొంత బ్యాంకులక్కడ లేవనీ, అక్కడున్న 16 ఆపరేటింగ్ బ్యాంకుల్లో ఆరింటిలో విదేశీ భాగస్వాములున్నారనీ చెప్పింది. ఉద్యోగాలు కుదించడంలో పురోగతి సాధించిందనీ శ్లాఘించింది. 3,40,000 మంది ప్రభుత్వోద్యోగుల్ని తొలగించడానికి సెంట్రల్ లేబర్ ఆఫీస్ కి బదిలీ చేశాడు. వాళ్ళలో 4 వ వంతు మందికి వేరే ఆదాయ వనరులు లభించాయనీ, ఈ ప్రక్రియ వేగం పుంజుకోవాల్సి ఉందనీ సూచించింది.

తిరుగుబాటుకి వారం ముందు (ఫిబ్రవరి 9 న) బ్యాంకుల్ని పూర్తిగా ప్రైవేటీకరించాలనీ, పసిదశలో ఉన్న ద్రవ్య రంగాన్ని అభివృద్ధి పరచాలనీ కార్యక్రమం రూపొందించాడు. 2010లో సంస్థాగత సర్దుబాట్లకు సంబంధించి చట్టాలు చేశాడనీ, ఫలితంగా ప్రైవేట్ రంగం ఊపందుకుంటుందనీ, విదేశీ పెట్టుబడులకి ఆకర్షణ పెరుగుతుందనీ చెప్పింది. ఈ ఆర్థిక విధానాలకి అనుగుణంగా శ్రామికుల్ని తయారుచేసే విధానాలు చేపట్టాడని శ్లాఘించింది.

అమెరికాకు నేస్తమయ్యాడు. ఐ.ఎం.ఎఫ్. ప్రశంసలు పొందాడు. ఐ.రా.స. పొగడ్తలు అందుకున్నాడు. ఇంకనాకేం అనుకున్నాడు. అయితే అనతికాలంలోనే, ప్రజల తిరుగుబాటూ వెల్లువెత్తింది.

పైనేపథ్యంలో చూస్తే మధ్య ప్రాచ్యం లోని తిరుగు బాట్లు ఆయా దేశాల్లో స్వేచ్ఛా మార్కెట్ విస్తరణకీ, సంస్థాగత సర్దుబాట్ల అమలుకూ వ్యతిరేకంగా చెలరేగిన ప్రజా ఉద్యమాలుగా కనబడతాయి. 20 ఏళ్ళుగా అవి కార్మికుల స్థితిగతులమీద దెబ్బమీద దెబ్బకొట్టాయి. అందుకే నియంతృత్వం మీద తిరుగుబాటుగా మాత్రమే దీన్ని చూస్తే సరిపోదు. ప్రపంచీకరణ ప్రక్రియమీదా, దాని వెనక ఉన్న పెట్టుబడిదారీ విధానం మీదా ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఇక్కడ స్పష్టమయింది. వాళ్ళిచ్చిన నినాదాల్లో కార్మికుల వేతనాలకీ, కార్మిక చట్టాలకీ సంబంధించినవి ఉన్నాయి. పాలకులు కూడా ఆర్థిక వరాలు కురిపించారు. ఒకడు దిగుతాడు. మరెవడో ఎక్కుతాడు. అమెరికా పెట్టిన వాడు కావచ్చు. ప్రజలు ఎన్నుకున్న వాడైనా రావచ్చు. ఎన్నికల్లో గెలిచి గద్దెమీద కూర్చున్నాడనుకుందాం. ఆయన ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకుల ఆదేశాల్ని కాదన గలడా? స్వేచ్ఛా మార్కెట్నీ, ప్రపంచీకరణనీ, సంస్థాగత సర్దుబాట్లని ఆపగలడా? అది అయ్యేపనికాదు. అవన్నీ పెట్టుబడిదారులకు లాభదాయకం. కార్మికులకి ప్రాణ సంకటం. కనక దీని తర్వాత మరో తిరుగుబాటు - కార్మిక వర్గ పోరాటం - చెయ్యాలి. చేస్తారు.

ఇక్కడ ఒక విషయం పరిశీలించాలి.

ఒక దశాబ్దంగా అమెరికా గడాఫీని తనవాడిగా తనకి లాభాలు పండించే నమ్మకస్తుడిగా చూస్తున్నది. సంబంధాలు అంత సజావుగా సాగుతున్నప్పుడు ఆయన్ని దిగిపొమ్మనటమెందుకు? పారిపోయినా వదిలేదిలేదనీ, అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో నిలదీస్తాం అనడంలోని అంతరార్థమేమిటి?

పశ్చిమ దేశాలకి సమస్య తిరగబడుతున్న ప్రజలతో. పాలకులతోకాదు. విహితుడైన పాలకుడు తన దేశప్రజల తిరుగు బాటుని అణచి వెయ్య గలిగితే అమోదిస్తాయి. అక్కడిక మానవ హక్కుల ప్రస్తావనకు చోటుండదు. అదే తమకు లొంగని వాడయితే ఆదేశ ప్రజలమీద మానవహక్కుల ఉల్లంఘన జరిగినట్లే. అప్పుడు ప్రజలతో చేరి పాలకుణ్ణి దింపి తమ కీలుబొమ్మకి కిరీటం బెడతారు. లొంగినా, అనుకున్నంత లొంగకపోతే, అతన్ని కూలదోసి చెప్పిన పనిని చెప్పినట్లు చేసే వాడికి పట్టంకడతారు. ఎంత అనుకూలుడైతే వాళ్ళకి అంత మంచిది. ఆర్థిక ప్రయోజనాలు ప్రధానం. పాలకులు కాదు. తిరుగుబాటుని పాలకుడు అణచి వేస్తుంటే, తాము ప్రజల పక్షాన నిలబడి నెగ్గించామని ప్రజల ఆదరణ పొందాలి. తమ కీలుబొమ్మని ప్రతిష్ఠించి పనులు గతంలోకంటే మెరుగ్గా చక్కబెట్టుకోవాలి. వాళ్ళ జోక్యంతోనే రాజ్యాధినేతలు రావాలి. వాళ్ళ ప్రయోజనాలు సంపూర్ణంగా, నిరాటంకంగా నెరవేరాలి. సామ్రాజ్య వాదులకు శాశ్వత మిత్రులుండరు. శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి.

లిబియాలో పోరాటం అంతర్యుద్ధం స్థాయికి చేరింది. దాన్ని ఆపడం కుదరదని అమెరికాకి తెలుసు. గడాఫీ విహితుడే అయినా, మహాహితుడు -పూర్తి విశ్వాసం లోకి తీసుకోదగిన వాడు - కాదని తిరుగుబాటు మొదలయ్యే వరకూ అమెరికా అభిప్రాయం. ఈజిప్ట్ అధినేత ముబారక్ లాగే పారిపోతాడనీ అప్పుడు అతని కన్న విశ్వాస పాత్రుణ్ణి అందలం ఎక్కిస్తే మెరుగు అనుకుంది. అయితే గడాఫీ గద్దెదిగలేదు. ఉద్యమాన్ని అణచడానికి పూనుకున్నాడు. ఉద్యమం ఆగిపోతుందనీ అమెరికా అనుకున్నది. అలా జరిగితే గడాఫీయే కొనసాగుతాడు. అది అమెరికాకి ఇప్పుడు ఇష్టం లేదు. ఒకవేళ వాళ్ళకు వాళ్ళుగా, ప్రజలు నెగ్గినా తిరుగుబాటుదారుల్లో సామ్రాజ్యవాద వ్యతిరేకి పదవిచేపట్టి, అప్పట్లో గడాఫీలాగ తమను ఢీకొట్టచ్చు. ఆలా జరగకుండా ఉండాలంటే సైనిక జోక్యం చేసుకోవాలి. అంతర్యుద్ధాన్ని యుద్ధం స్థాయికి తీసుకెళ్ళాలి. గడాఫీ ముబారక్ లాగే పారిపోలేదు. పైగా తిరుగుబాటు మొదలయ్యాక, అమెరికా, నేటో, అల్ ఖైదాలే రెబెల్స్ ని రెచ్చగొట్టాయి అని ఆరోపిస్తున్నాడు. అందువల్ల అతన్నిక ఉపేక్షించడం వాళ్ళకి ఎంత

మాత్రం శ్రేయస్కరం కాదు. కనక అతన్నిదింపి తమ కీలుబొమ్మని పెట్టడం తప్ప ప్రత్యామ్నాయం లేదు. అంతే, తమ ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకే గాని, లిబియా పౌరుల్ని ఉద్ధరించడానికి కాదు. వాళ్ళ కీలుబొమ్మ గడాఫీ కన్నా దారుణమైన పాలననిస్తాడు. ప్రజలకి ఎంతో హాని చేస్తాడు. ఇది ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో ఇటీవలే రుజువయింది.

ఆర్థిక సంస్కరణలు చేపట్టాడు. బహుళజాతి సంస్థలు - చమురు కంపెనీలూ, అంతర్జాతీయ బ్యాంకులూ, ఆయుధ సంస్థలూ ప్రవేశించాయి. ఫలితంగా, అసమానతలు అధికమయ్యాయి. అవినీతి అందలమెక్కింది. 35 శాతం మంది పేదరికంలో మగ్గుతున్న దేశమది. నూటికి 30 మంది ఉద్యోగాల వేటలో వేసారి ఉన్న ప్రాంతమది. ఈకారణాలవల్ల ఫిబ్రవరి మధ్య తిరుగుబాటు రేగింది. కార్మికుల పేదల మద్దతుతో నడుస్తున్న పోరాటమిది. సొంతతెగ "గడాఫా" జోక్యం ఎక్కువయింది. ఇది మిగిలిన తెగలకు ఇష్టం లేదు.

గడాఫీ అణచివేతకు పూనుకున్నాడు. రెండు రోజుల్లో 20 మంది చనిపోయారు. టునీషియా, ఈజిప్ట్ నేతలకు అంతకుముందు మద్దతు పలికాడు. క్రమంగా నిరసన ప్రదర్శనలు పెరిగాయి. "గడాఫీ, గద్దె దిగు" అనీ, "నియంతా ఇప్పుడు నీవంతు, పారిపో" అనీ నినదిస్తుంటే దిక్కులు పిక్కటిల్లాయి.

వెంటనే గడాఫీ 10 లక్షల ప్రజలున్న ట్రిపోలీ నగరంలో రెబెల్స్ మీద విరుచుకపడ్డాడు. రెబెల్స్ చేతుల్లో ఉన్న మధ్యధరా తీరంలోని జ్వార, జవియాలతో సహా పశ్చిమ పట్టణాల్ని తిరిగి కైవశం చేసుకున్నాడు. రెబెల్స్ ని ఎలుకలు అని అవహేళన చేశాడు. ఇల్లిల్లూ సోదాచేసి మట్టుబెడతానన్నాడు. తిరుగుబాటుకి కారకులు విదేశీయులూ, కిరాయి మూకలూ అన్నాడు. తిరుగుబాటు పుంజుకునేకొద్దీ మచ్చిక చేసుకునేందుకు తాయిలాలు ప్రకటించాడు. ప్రభుత్వోద్యోగుల జీతాలు రెట్టింపు చేశాడు.ఈజిప్ట్ టునీషియాల లోలాగానే కిరాయిమూకల్ని ప్రయోగించాడు. నిర్దాక్షిణ్యంగా ప్రజా ఉద్యమం మీద సాయుధ దాడికి దిగాడు.

తాము జొరబడడానికి ఇదే సరైన సమయం అనుకున్నాయి అమెరిక నేటోలు. లిబియా గగనతలంలో విమానాలు ఎగురరాదని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి తీర్మానించింది. 1973 తీర్మానం ద్వారా కూటమికి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు అవసరమయ్యే చర్యలు తీసుకునేందుకు అనుమతి నిచ్చింది. మానవహక్కుల రక్షణ సాకుతో అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల కూటమి లిబియాలో జోక్యం చేసుకుంది. పౌరుల్ని కాపాడడానికి విదేశీ ఆక్రమణ తప్ప ఏదైనా చెయ్యండి అని ఐరాస భద్రతామండలి మార్చ్ 17న తీర్మానం చేసింది. సంకీర్ణ దళాలు "ఆపరేషన్ ఒడిస్సీ డాన్" కార్యక్రమం మొదలె మొదలెట్టాయి.

మార్చ్ 19 న ఫ్రాన్స్ విమాన దాడులకు దిగింది. ఫ్రాన్స్ మొదటినుంచీ ముందుంది. తిరుగుబాటుదారుల "ట్రాన్స్ నేషనల్ కౌన్సిల్"ని ముందు గుర్తించింది ఫ్రాన్స్. ఆతర్వాత ఇటలీ.

భద్రతామండలి ఇలాంటి తీర్మానాల్ని యుగోస్లావియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ దేశాలల్లో జోక్యం చేసుకుని దురాక్రమణ యుద్ధాలు చేసేందుకు వీలు కలిగిస్తూ ఇటువంటి తీర్మానాలే చేసి సామ్రాజ్య వాదులకి సహకరించింది. తీర్మానం కేవలం లైసెన్సు మాత్రమే. దాన్నడ్డం బెట్టుకుని సైన్యాల్ని పంపి ఏ అరాచకమైనా చేయడం నాటోకి అలవాటే. కీలుబొమ్మని పెట్టి శాంతి భద్రతల పేరిట, ప్రజాస్వామ్యం సాకుతో సంవత్సరాల తరబడి తిష్ట వేయటం పరిపాటే.

నెలకి పైగా నేటో చేసిన వేలాది దాడుల మూలంగా గడాఫీ పోరాట పటిమ నలిగింది. సైనిక సామాగ్రిలో మూడో వంతు నాశనమయింది. సరఫరా మార్గాలు సన్నగిల్లాయి. నేటో వేలాది దాడులు చేసింది. టాంకుల్ని, యుద్ధ వాహనల్నీ, రాకెట్ లాంచర్లనీ, ఆయుధాగారాల్ని ధ్వంసం చేసింది. బంకర్లనీ కొట్టింది. ఏప్రిల్ చివరలో గెలవబోతున్నాం అని ప్రకటించింది. ఇప్పటికి గడాఫీ భవన సముదాయం మీద 4 సార్లు దాడి చేసింది.

పెట్రోల్ కోసం జనం బారులు తీరుతున్నారు. ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్య సరఫరా సరిపోయినంతగ లేదు. ఎకానమీ చెల్లాచెదరైంది. ఎక్కువమంది లిబియన్లు తమ పరిస్థితికి నేటోని తప్పుబట్టవచ్చు. అయినా గడాఫీ ఉన్నంత కాలం సాధారణ స్థితి ఏర్పడదు అనే సందేశం ప్రచారంలో ఉంది. గడాఫీ కి ప్రజాదరణ తగ్గుతున్నది. మరికొంత పట్టు కోల్పోతే ముగింపు మొదలైనట్లే.

దాడులు కొనసాగిస్తూనే సంప్రదింపులు అంటున్నారు. ఆఫ్రికా యూనియన్ బృందం తిరుగుబాటుదారులతో బెంఘాజీలో కలిసి మాట్లాడింది. గడాఫీ గద్దె దిగితేనే, సంప్రదింపులకు వస్తామని రెబెల్స్ అంటున్నారు. నేటో సంప్రతింపుల్ని తిరస్కరించింది. గతంలోనూ దాడులకి తలపడే ముందు కాల్పుల విరమణ అనేవాడనీ, కావలసింది మాటలు కాదు, చేతలనీ చెప్పింది.

దేశం వీడడం ఆయనకు మంచిదనీ, వెళ్ళినా, ఆయన తన ప్రజలపై జరిపిన మానవ హక్కుల ఉల్లంఘనకు చర్యలు తప్పవనీ అమెరికా విదేశాంగ ప్రతినిధి పి.జే. క్రౌలే మార్చి లోనే తేల్చి చెప్పాడు.

ఒబామా, సర్కోజీ, కామరాన్ - త్రయం గడాఫీ గద్దె దిగాల్సిందే నన్నారు. అదితప్ప ఏదైనా సరే అంటున్నాడు గడాఫీ. అంతే, వెంటనే బ్రిటన్, ఫ్రాన్స్‌లు బెంఘాజీలో ఉన్న తిరుగుబాటు దారులకు సలహాదారుల్ని పంపడం మొదలెట్టాయి. ఒబామా 2కోట్లా 50 లక్షల డాలర్లు పంపాడు. గడాఫీ సేనని కొట్టటానికి డ్రోన్ యుద్ధ విమానాలు పంపాడు. వాటిలోనడిపే మనుషులుండరు. తక్కువ ఎత్తులో ఎగురుతాయి. లక్ష్యాలని స్పష్టంగా గుర్తించి ఛేదిస్తాయి. పదాతి దళాలమీద శక్తివంతంగా దాడి చేస్తాయి. హెల్ ఫైర్ మిసైల్‌లు ఉండే 2 డ్రోన్ లు లిబియా గగన తలలంలో రేబావళ్ళూ పహరా గాస్తాయని 22న వాల్ స్ట్రీట్ జర్నల్ రాసింది.

ఏప్రిల్ 30 ననేటో గడాఫి ఉన్న భవనం మీద హై స్థాయి దాడి చేసింది. ఆయన కేమీ కాలేదు కాని ఆరుగురు కొడుకుల్లో కడగొట్టు వాడు, 29 ఏళ్ళ సైఫ్ అల్ అరబ్ హతుడయ్యాడు. గడాఫీ మనవళ్ళు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇది నాయన మీద చేసిన హత్యా ప్రయత్నమేనని ప్రభుత్వ ప్రతినిధి ఇబ్రహీం దాడిని ఖండించాడు. కనీసం మూడు క్షిపణులు భవనాన్ని ఢీకొన్నాయి. పెద్ద రంధ్రాలు పడ్డ భవనం కప్పుని విలేకరులకు ప్రభుత్వం

చూపెట్టింది. రాత్రి పొద్దుపోయాక నగరమంతా పేలుళ్ళతో దద్దరిల్లింది.

ఆవేశంతో లిబియన్లు ట్రిపోలీ లోని ఇటలీ, బ్రిటన్ దేశాల రాయబార కార్యాలయాలమీద పడి భయోత్పాతం సృష్టించారు. ఆగ్రహించిన బ్రిటన్ లిబియా రాయబారిని తమ దేశం నుంచి బహిష్కరించింది. ఐరాస తన అధికారుల్ని ఖాళీ చేయించింది.

అదలా ఉండగా మిసురాటా నౌకాశ్రయం మీద వందల రాకెట్లతో సైన్యం దాడులు చేసిందని రెబెల్ ప్రతినిధి ఆరోపించాడు ప్రభుత్వ ప్రతినిధి మౌస్సా ఇబ్రహీం క్షమాభిక్ష కావాలంటే 4 రోజుల్లో రెబెల్స్ ఆయుధాలు వీడాలనీ, లేకపోతే, తమ ఆగ్రహాన్ని చవిచూడక తప్పదనీ హెచ్చరించాడు.

గడాఫీ సంప్రదింపులకి సంసిద్దత వ్యక్తం చేశాడు. లిబియా మీద విమాన దాడుల్ని ఆపమన్నాడు. శనివారం (ఏప్రిల్ 30) పొద్దున్నే టీవీలో కనబడి "మేము వాళ్ళమీద దాడి చెయ్యలేదు... సముద్రాన్ని దాటిందీ లేదు. వాళ్ళు మామీద ఎందుకు దాడి చేస్తున్నట్లు?" అని అడిగాడు. మమ్మల్ని మీతో మాట్లాడనీయండి. సంప్రదింపులు జరుపుదాం." అంటూ నేటో కూటమిని కోరాడు. ఆదేశాలకి కావలసింది చమురే అయితే కాంట్రాక్టులు కుదుర్చుకునేందుకు ఏ ఇబ్బందీ ఉండదు అని భరోసా ఇచ్చాడు.

టీవీలో 80 నిముషాలు మాట్లాడాడు. పదవిని వీడే ఉద్దేశ్యం కానీ, దేశాన్ని వదలే ప్రసక్తి గానీ లేదన్నాడు. నేటో దాడులు ఆపితే లిబియన్లు తమ సమస్యల్ని తామే పరిష్కరించుకోగలరని తేల్చాడు.

లిబియన్లంతా ఒకే కుటుంబం. ఒకరితో ఒకరు కొట్లాడుకో కూడదు- అని హితవు పలికాడు. ఇంతకుముందు స్వాతంత్ర్యమో, మరణమో. లొంగేది లేదు. భయపడం. ఈమార్గాన్ని వీడం. "మీరు దురాక్రమణదారులు. మేము మీతో మాట్లాడతాం - మీరు మీ నౌకల్నీ, విమానాల్నీ వెనక్కి తీసుకెళ్ళండి."

తూర్పు లిబియాలోనూ, ఉత్తరాన మిస్రాటాలోనూ తిరుగుబాటుదారులు లిబియన్లు కాదు,"అల్జీరియ, ఈజిప్ట్, టునీషియా, అఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన వాళ్ళు" అన్నాడు.

ప్రసంగం జరుగుతున్నప్పుడు జమాహిరియా భవనం పక్కన భవనం మీద బాంబులు పడ్డాయి. అంటే ఆయన్ని లక్ష్యంగా చేసుకున్న దాడే అది అని టి.వి. చెప్పింది.

మిసురాటా నౌకాశ్రయంలో ఓడల్ని నాశనం చేసే మందుపాతరలు పెడుతున్నారనీ, అందుకొచ్చిన లిబియా ఓడల్ని అడ్డగించామనీ నేటో చెప్పింది. వెంటనే లిబియా మిసురాటాలోకి సహాయక పదార్థాల్ని తెచ్చే ఓడల్ని ఎదుర్కుంటానని బెదిరించింది. ఆనౌకాశ్రయాన్ని రెబెల్స్ ఆయుధాలు తెచ్చుకోడానికీ, ఉగ్రవాదుల్ని రప్పించడానికీ వాడుతున్నారని ఇబ్రహీం ఆరోపించాడు. ఇది మా అధికార పరిధిలో ఉంది. అలా జరగడానికి మేం ఒప్పుకోం అన్నాడు. మేము సోదా చెయ్యనిదే అందులో మనుషులు రావడానికి అంగీకరించం. కాదని వస్తే ఏ ఓడనైనా దాడిచెయ్యకుండా వదలం.

నేటో సైనిక జోక్యాన్ని ఊచకోత అంటూ విమర్శించాడు. తమ సేనలు పౌరుల్ని చంపలేదన్నాడు. మాపిల్లల్ని మీరెందుకు చంపుతున్నారని ప్రశ్నించాడు. మౌలిక సదుపాయాల్ని ఎందుకు ధ్వంసం చేస్తున్నారో చెప్పమన్నాడు.

మిసురాటా రెబెల్స్ పట్టులోనే ఉంది. రెండు నెలల నుంచీ భీకర పోరు జరుగుతోంది. ప్రభుత్వ సేనలు ప్రజల మీద క్లస్టర్ బాంబులు వేస్తున్నారేమో అని హిల్లరీ క్లింటన్ తప్పుబట్టింది. దాదాపు రెణ్ణెల్లుగా మిసురాటా నగరాన్ని సైన్యం ముట్టడించింది. విడువకుండా దాడి చేసింది. అయితే ఏప్రిల్ 23 సాయంత్రం సేనలు వెనక్కి వెళ్ళాయి. రెండు భవనాల్లో మాత్రం ఉన్నారు. కారణం రెబెల్స్ చుట్టుముట్టి లొంగిపొమ్మని పట్టు పడుతున్నారు.

మిసురాటా నుంచి గడాఫీ సేన వెనుదిరగడం ఒక మలుపు. మిసురాటా 3లక్షల జనాభాగల పశ్చిమ లిబియా నగరం. అది రెబెల్స్‌కి గట్టి పట్టున్న చోటు. అయినా రెండు నెలలుగా అక్కడ ప్రభుత్వ సేనలు కొన్ని ప్రాంతాల్ని గుప్పెట్లో పెట్టుకున్ని ఉన్నాయి. వెనక్కొచ్చాక, నగరం వెలుపలి ప్రాంతాల నుంచీ రోజా దాడులు చేస్తూనే ఉన్నాయి.

మే 4న మిసురాటా ఓడరేవులో ఒక అంతర్జాతీయ సహాయక నౌక మీద ప్రభుత్వ సైన్యం రాకెట్ దాడి చేసింది. అయిదుగురు చనిపోయారు. అందులో 180 టన్నుల పదార్థాలున్నాయి. తిరుగుప్రయాణంలో శరణార్థుల్ని తీసుకు వెళుతుంది. అయితే ఈ గందరగోళంలో 200 మంది ఒడ్డునే ఉండి పోయారు.

అదే రోజు ఉదయం అంతర్జాతీయ నేర న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ భద్రతా మండలికి నివేదిక ఇచ్చాడు. అందులో నేరాలు పెరుగుతున్నాయన్నాడు. ఒక్క ఫిబ్రవరి నెలలోనే 700 మంది పౌరుల్ని చంపారని చెప్పాడు. మూడు అరెస్ట్ వారంట్లున్నాయన్నాడు.

ఒకవేళ ఈ నగరన్ని కంట్రోల్ చేయలేకపోతే లిబియా ఇప్పటికే రెండుగా చీలినట్లే: గడాఫీ పట్టులో పశ్చిమ లిబియా, రెబెల్స్ గుప్పెట్లో తూర్పు లిబియా ఏకంగా ఉండాలంటే గడాఫీ నెగ్గాలి. అయితే అది సాధ్యం అనేవారు పెద్దగా లేరు.

మిసురాటాని తిరిగి లాక్కోలేకపోతే, గట్టి విశ్వాసపాత్రులకు సైతం నమ్మకం సడలుతుంది. గడాఫీ, అతని కుటుంబమూ, తప్పుకొక తప్పదు, అని నిపుణుల అంచనా. సామాన్యులకి సైతం అవే అనుమానాలు కాలక్రమంలో కలుగుతున్నాయి..

"అమెరికా నేటోల చిక్కు లిబియా కాదు. అరబ్ ప్రపంచంలో పెల్లుబుకుతున్న విప్లవ కెరటాలు. ఎలాగైనా నిరోధించాలనేది వాళ్ళ కాంక్ష" అన్నాడు ఫిడెల్ కాస్ట్రో. "అన్ని ప్రయోజనాలూ కొందరు పొందుతున్నారు. ఏ హక్కూ లేనివాళ్ళు చేస్తున్న పోరాటం. ఇది 1789 లోయూరప్‌లో బాస్టిలీ ముట్టడి కన్నా గట్టిది" అన్నాడు క్యూబా నేత.

మార్చి చివరలో ఒబామా రాజ్యం మార్పు కోసమే తమ యుద్ధం అన్నాడు. ఏప్రిల్ మధ్యలో అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్లు సంయుక్త బహిరంగ లేఖ విడుదల చేశాయి. గడాఫీ అధికారంలో ఉండగా, లిబియా భవిష్యత్తుని ఊహించడం అసాధ్యం అని తేల్చి చెప్పారు.

మే 5న రోం నగరంలో కాంటాక్ట్ గ్రూప్ సమావేశం జరిగింది. 22 దేశాల విదేశాంగ మంత్రులూ, ఐ.రా.స, గల్ఫ్ యూరప్

అధికారులూ హాజరయ్యారు. అమెరికా స్తంభింపచేసిన లిబియా ఆస్తుల్లో కొంత భాగం సైనిక జోక్యానికి ఖర్చుపెడతాం అని హిల్లరీ క్లింటన్ చెప్పింది. నేషనల్ కౌన్సిల్ చట్టబద్ధమైనదేనని సమావేశం తీర్మానించింది. రాబోయే లిబియా పాలకులని ఇప్పటినుంచే తొత్తులుగా మలుచుకునే ప్రయత్నం మొదలు పెట్టారు. ఉత్తర ఆఫ్రికాలో ఎగిసిపడుతున్న విప్లవోద్యమాల్ని అణచడానికి లిబియాని స్థావరంగా తీర్చి దిద్దే చర్యలు చేపట్టారు. ఫ్రెంచ్ విదేశాంగమంత్రి దాడులు నెలల తరబడి కొనసాగుతాయి అన్నాడు. కౌన్సిల్‌తో కలిసి పనిచేసేందుకు దూతల్ని పంపించి గడాఫీ ప్రభుత్వాన్ని ఏకాకిని చెయ్యాలని హిల్లరీ అంది.

మే 6న ఫ్రాన్స్ 14 మంది లిబియా డిప్లమాట్లని 48 గంటల్లో వెళ్ళిపొమ్మంది. ఇటలీ త్వరలో రెబెల్స్ కి ఆయుధాలు సరఫరా చేస్తానంది.

మిసురాటాలో ప్రభుత్వ సేనలు రాకెట్ల ద్వారా చిన్న పారాచూట్లతో మందు పాతరల్ని అక్కడక్కడా వదిలారు. ఇవి 20 కన్నా ఎక్కువే అంటున్నారు. మే 7 న మిసురాటా లో 4 పెద్ద ఇంధన నిల్వ సాధనాల్ని గడాఫీ సేన ధ్వంసం చేసింది. చెలరేగిన మంటల్ని ఆర్పే సామాగ్రి తమవద్ద లేదని రెబెల్స్ వాపోతున్నారు. నగరానికి ఇంధన వనరులు అవే.

గడాఫీ గద్దెగిగేదాకా దాడులు ఆగవు అంటున్నది సంకీర్ణ కూటమి. స్వాతంత్ర్యమో, మరణమో. లొంగేది లేదు. భయపడం. ఈమార్గాన్ని వీడం అంటున్నాడు గడాఫీ. లొంగటం లేదు. నేటో లిబియాని అన్ని రకాలుగా దిగ్బంధనం చేస్తున్నది. బిన్ లాడెన్ ని చంపి విజయోత్సాహంలో ఉన్న అమెరికా గడాఫీ లొంగి చెప్పినట్లు వినకపోతే ఏమైనా చేస్తుంది. ఎంతకైనా తెగిస్తుంది.

ప్రస్తుతం యుద్ధం జరుగుతూ ఉంది. పెరుగుతున్నది కూడా.

లిబియాలో అంతర్యుద్ధం స్థాయి నుంచి యుద్ధం స్థాయికి చేరిన ప్రజా తిరుగుబాటు మొదట వచ్చింది లిబియాలో కాదు. టునీషియలో. అక్కడ నుంచీ అరబ్ దేశాలన్నిటికీ ఎంతోకొంత పాకింది. ప్రజ్వరిల్లుతూ ఉంది.అలాగే ఇది లిబియాతో ముగిసేదీ కాదు.

అరబ్ ప్రజల పరిస్థితుల వంటివే అన్ని దేశాల్లోనూ నెలకొని ఉన్నాయి - కాకపోతే తరతమ భేదాలున్నాయి. అవే ఇలాంటి ఉద్యమాలకు ఊపిరులూదుతాయి. ప్రజలకీ స్ఫూర్తి నిస్తాయి. కనక ఉద్యమాలు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువవుతాయి. ఇప్పుడో మరొకప్పుడో పెట్టుబడికి అనుకూలమైన ఆర్థిక విధానాలవల్ల బాధలు పడే ప్రజలు పాలకుల మీద తిరుగుబాటు చెయ్యటం తథ్యం. విజయం సాధించటం అంతకన్నా తథ్యం.

ఉత్తరం :

ఓరి రమేసా? ... యెట్రిది తమాసా...

రమేసా, వోరి జయరామ రమేసా? ఏటన్నా వేటన్నావూ? కరంటు పేక్రటీ పనులు ఆపేయాలా? ఆ మాటన్నందుకే కదా మమ్ముల్ని పిట్టల్ని కాల్చీసినట్టు కాల్చీసింది. అంతయిపోయిన తర్త సంతన్నట్టుగున్నాది నీయవ్వారం. సోంపేటలోట కాల్సి సంపేసిన తర్త పేక్రటీ పనులు ఆపీమన్నావ్. ఇప్పుడు కాకరాపల్లిలో కాల్సి సంపేసిన తర్త పేక్రటీ పనులు ఆపీమంతన్నావ్. ఏమి ముగ్గరేసి చచ్చి వందల మందిమి అవిటోలమయితేగాని నీకళ్ళు పేలలేదా? ఇన్నాలు నీ నయనాలు ఎక్కడెట్టుకున్నావ్? నీ నయనాలు తీసి ఏగ్గైనాన దోపుకున్నావ్? మమ్ముల్ని కొట్టి సంపేసినదాక నువ్వు రెప్పలిప్పవా?

ఒకసేత్తోటి పీక నులిమీసి పేల్చేసి సంపేడిమూ మరకసేత్తో మాకంట్ల ఏలెట్టేసి ఆసేత్తోనే తుడిసేడిము. దురదుస్టమ్... దురదుస్టమ్ అనడం బాగుంది. ఆ మందల కలిసింది మా బక్క అన్నట్టుగుంది. తీరపేంతం ఎలగుంటాదో తెలదా? పచ్చగ పసిరిక పాములాగ ఉంటాదే లేకపోతే ఎండిపోయిన ఎడారిలాగుంటాదే? గట్టెక్కిసూస్తే కనపడిందానికి సెట్టెక్కి యేల సూత్తన్నావ్?

ఇదంతా తడినేలని సిత్తడినేలని సెవటసిత్తడినేలని నీకు ఎరికలేదా? ఏటీ, ఎరికయి తెలిసి నోటీసిచ్చినావా? ఇచ్చి వొల్లకున్నావా?, సేతులు కటుకోని. బాగుంది, సేనా బాగుంది. పాసి గీసుకోడానికి ఏనికది? పెజాభిప్రాయం అడగలేదేల? అడిగినారు. మేం సెప్పింది విని ఆలు రాయాల్సింది రాసుకున్నారు. ఏమి నీకిదేదీ తెల్దా? మా మాటా మా మనసూ తెలుసుకోడానికి అప్పుడూ పోలీసుల్ని దింపినారే. అయినా మా బతుకులు బుగ్గిసేసే పేక్రటీ మాకిస్టమయితే - మేమెవరం అడ్డు సెప్పకపోతే - అడ్డగ ఈ పోలీసుల్నేల దిగినారు? నిత్తిమూ పోలీసులు ఇక్కడేల సత్తన్నారు? యేల 144 సెకసన్ పెట్టినారు? వద్దని వల్లకాడు సెయ్యొద్దని నిరారదీచ్చలు సేస్తుంతే, పోలీసు దెబ్బలు తింతుంతే తిరగబడతుంతే ఇంకా పెజాభిప్రాయం ఏమిటో తెల్డం లేదా? పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే లోకం సీకటయిపోదు. మీ లీడర్లకి సిగ్గూ లజ్జాలేదు. నీతీ జాతీ లేదు. అందుకే సిగ్గు లేని మాటలు మాట్లాడతన్నారు. ఏటిబాబూ మల్లీ వారం రోజుల్ల మీటింగా? యేనికి... పేక్రటీ ఎత్తీడానికి కాదా? సర్టిపికట్లు సరిగ్గా ఉన్నాయో లేవో సూత్తావా? అప్పుడిదాక ఆగి, ఆ యెనక మళ్ళీ యధావిధి సిద్దిరస్తు సేసుకోవచ్చునా? అయినా తెలకడుగుతానూ... పర్యావరణ శాఖా అటవీ శాఖా దేవదాయ శాఖా మత్సశాఖా అన్నీ పెబుత్వ శాఖలే కదా? పెబుత్వానికి ఇరుద్దంగా రిపోర్టులు ఇస్తాయేటి? పెబుత్వం పెద్దలకి ఇరుద్దంగా ఉంటాదేటి? మీ లాభాలు మీరు వొదులుకుంతారేటి? అంతా మసిచేస్సి మాయజేస్సినారు. తేలినీలాపురం పచ్చుల్లాగ మాకింకో గూడూ లేదు? మాకింకొక మట్టీ లేదు... ఎక్కడి కెలిపోవల్ల... ఏమి కావల్ల... అవునూ రేపు మమ్ముల్ని సంపేసి... సెల్లా సెదురుసేస్సి... ఇక్కడెవులూ లేరని పేక్రటీకి మంచి అనువుగా ఉందని రిపోర్టులల్ల సూపించరని గ్యారంటీ ఏటి?

అవునయ్యా, బతుకంటే పోరు. సచ్చేదాక బతుకుతాం. చావో రేవో తేల్సుకుంటాం. నేయం అన్నేయమైపోతే మనుసు లేటవుతారో నీకు తెల్దా? పంచబూతాల పంచన బతికే మడిసికి టైమొస్తే బూతమవడం తెల్దేటి?

\- గున్నల గన్నమ్మ

కవిత్వం

గాయపడ్డ నవ్వుల సంద్రం

- మహమూద్

నక్షత్రపూలపై వాలుతున్న జుగ్నులను
పొదిగిన ఆకాశం చీరని చుట్టుకొని
హరివిల్లుల్ని కాలిగజ్జెల్లోకి
దింపుకున్న తటిల్లత వాడిపోయినట్టు

చేతి నిండా గాజుల సవ్వడి విని
చెవిలోలాకు తన్మయ ఊగిసలాటలో
సితారాలు చిన్నబోయెలా
ముక్కుపుడక మురిపాల సోయగంతో
చురకత్తులకు చురుకుదనం అంటించిన
చలాకీ వ్యక్తిత్వం చిన్నబోయినట్టు

సౌందర్యానికి
ముత్యాల స్ఫూర్తినిచ్చిన
దోరనవ్వుల ఊట ఇంకిపోయినట్టు

ఆమె ఆమెలా లేదు
ఏదోలా ఉంది కొత్త కొత్తగా
వీథరుగు మీద అస్తవ్యస్తంగా
అడ్డదిడ్డంగా
అరుగుకు మొలచిన గంభీర గాయంలా...

* * *

ఒకప్పుడామె
చిరునవ్వుల సముద్రం

ఇప్పుడామె
రెమ్మల పరిమళపు సాంగత్యం
చేజార్చుకున్న గులాబి ముల్లు

నాకే కాదు
ఆమె ఆత్మీయనేస్తం
కానిదెవరికీ?

అవసరం ఉన్న
ప్రతి ఇంటి గడప మీద
ఆమెది బక్రీదు త్యాగ జ్ఞాపకం..

ఆ మనిషి ఇప్పుడో
దెయ్యం నీడ
వేకువకు వెలుతురిచ్చిన
నగుమోము ఆరిపోయిన దీపశిఖ

సోజా బేటా సోజా నైతో
ఖమ్రూన్ ఆజాతీ...
పిల్లల కనుగుడ్లను
చురుక్కుమనిపిస్తున్న పీడకల..

* * *

ఏ చేతుల
శిల్పచాతుర్యం చెక్కిన
వికృత హాస్యమిదీ?

ఏ మెదడులో పుట్టిన
కుట్రకు ప్రతిరూపమిదీ?

ఓ సహవాసి బతుకు
పలుముక్కలై బజారుపాలైతే
పరోక్షంగానో ప్రత్యక్షంగానో
వీథి వేలిముద్ర పడిఉండదా?
విధి మీద నెపం నెట్టి నిదురిద్దామా?

సంఘం అంటే
సహజీవన సంరంభం కదా?
కూలిన మనిషి రెక్కల కింద
మన అరచేతులను భూమిలా ఆసరా చేయకపోతే
సంఘం ఒక్క మనిషి దుఃఖాన్ని బరువనుకుంటే
సంఘం దుఃఖాల్ని ఏ మనిషి భరించాలి?

అన్నం ముద్దలో
నాలుగో సగమే నీదన్నాడు ప్రవక్త!
మూసుకున్న తలుపుల వెనకాల
ఎంత ప్రపంచం వికసిస్తే ఏం?

ప్రపంచం మధ్య పారదర్శకతని
ప్రసరించనివ్వని నీతి మీద
కడివెడు నీళ్ళు గుమ్మరించి
ఇహంలోకి దింపాలి!
ఇంటింటి మధ్య గోడలను
కూలగొట్టి సామూహిక సంచార
వాహకం ఒకటి ఏర్పాటు చేయాలి!

కంచం నిండా పరుచుకున్న
మెతుకుల సముద్రంలో

గుప్పెడు సముద్రం నాది కాదనుకుంటే
ఇంకొకరి కంచెం నిండుతుంది
ఓ ఎడారి కడుపు ఆకలి దప్పిక తీరుతుంది

మన కోసం మనం
చేసుకునే "దువాల" ద్వంద్వత్వంలో
పక్కమనిషి కోసం ఒక్క ఘడియ
కనులు మూసుకుంటే కనబడే
ప్రతిబింబంలోకి దివిదిగి
ఆ కాలికింద పునాదిలా నిలబడుతుంది

నమాజు వరసలో కాదు
దుఃఖంలో ఉన్నపుడు భుజానికి
భుజం రాసుకోవాలి

తలదించుకొని
ఆమెను దాటుకుంటూ
వెళుతున్న మనం తలెత్తుకొని
ఆమె తలెత్తుకునేలా చేయాలి

నివురుగప్పిన
నిప్పులాంటి
నిశ్శబ్ద దుఃఖాత్మకు
భావ వ్యక్తీకరణ ఉండదు
మెత్తబడిన ఆమె ఎముకల
మధ్య నుండి శబ్దం రాలదు
ఆమె గాయానిది మూగభాష

లోతైన గాయం చేసిన
మానవ స్వరూప ఆయుధమేదో
ఇటువైపే తిరుగుతూ ఉండాలి
తొందరగా పసిగట్టండి
సంఘంలో మరో మనిషి దేహంపై
మరో గాయం
ఊరకముందే...!

పౌర హక్కుల తోటమాలి

- శాఖమూరి రవి కవితలు రెండు

హక్కుల బాటసారి
అలుపెరగని ధైర్యశాలి

గద్దెత్తుకపోయిన పిల్లలకై
తల్లిగుండె తడినెరిగిన వాడా!

హెబియస్ కార్పస్‌తో ఎదురెగిరి
తల్లి తనువును ముద్దాడింపచేసిన
ఓ కన్నాబిరాన్
నీవు పేద ప్రజల కరుణాబిరాన్

గద్దలకు ఎదురెగరటమంటే
గాలిపటాలెగురేసే ఆటలా!
అది సముద్రాన్నీదే సాహసయాత్ర

అలలు అలజడలు
సుడిగుండాలు, సునామిలు
వెనుదిరికి ఎల్లిపోదామనో
పక్కదారిలో పయనిద్దామనో
అనుకోలె

దాన్ని
కష్టజీవుల కాలిబాటగా కలగన్నాడు
కాళ్ళ కడ్డమొచ్చిన ముళ్ళనేరుకుంటూ
పెంచుకుంటొచ్చిన పౌరహక్కుల తోటను
కంచెవేసి కాపాడిన తోటమాలి
ఈ కన్నాబిరాన్

మిసాలో మోసాన్ని
టాడా, పోటాల తగువు నెగ్గి
చెరబండ రాజు మొదలు
శాఖమూరి దాకా

యుద్ధనీతినొదిలిన గద్దల రాజ్యం
కాళ్ళకు కత్తులతో కావాతు చేసి
కారాగారంలో బందిస్తే

రాజ్యం ద్వారానే తిప్పికొట్టిన
మహోన్నత న్యాయకోవిదుడా!

నిప్పులాంటి నీ నిబద్ధతా దారినెరిగి
రాజ్యమే పారిపోయిందిలే

మరణం విషాదమే

మరణం విషాదమే
సహజమా
అసహజమా
ఏదైన సరే!

మరణం విషాదమే

నాదైనా
నీదైనా
మరెవరిదైన సరే!

మరణంలో తేడాలున్నట్లు
విషాదములో కూడ...

ప్రజలకోసం
ప్రజా ప్రస్థాన రచ్చబండలో మరణించడం
మరీ విషాదమే!

ప్రజల కోసమే వచ్చిన
పావురాల గుంపు
మా చుట్టూ ప్రద్మాక్షి, చంద్రగిరి, పావురాల
గుట్టులుగా గుళ్ళేసుకొని
కలిసి మెలసి జీవిస్తున్న వేళ

రాజ్యం కళ్ళుపెట్టుకున్న మనిషి
మమ్ము, మా గుట్టలను
గుట్టలను, గూళ్లను వేరు చేసిన సందర్భాలెన్నో
నేను విచారపడిన దినాలెన్నో

ఏడ్చి ఏడ్చి కారిన కన్నీరు
కాగి కాగి ఆవిరై
క్యుమిలో న్యుమస్ మేఘమై
పావురాల గుట్టపై కాపుగాసి ఎన్నోళ్ళాయనో...

భయాన్ని భయపెట్టే ఆయుధం కావాలి

- వనం

రెక్కలు తొడుక్కొని షికారు చేసి
పక్షులు చెదిరిపోయాయి...
అప్పుడప్పుడూ నగరంపై వెలిసే ఇంద్ర ధనస్సులో
ఎర్రటి వర్ణమొకటే మిగిలింది
ముందస్తు నోటీసు లేదు
ముందస్తు ప్రకటనా లేదు
నెత్తురు చిందిస్తూ... ఓ హెచ్చరిక
ఆ నెత్తుటి హెచ్చరిక
'భయవాయువు'లను నగరంపైకి పంపింది
అంతే -
అందరిలోనూ
భయం.... భయం... భయం....

ఎఫ్.ఎం. రేడియో, ఎం.పి.త్రీలు అతికించుకున్నా
భయంగొలిపే
హాహాకారాలే చెవుల్లో మార్మోగుతున్నాయ్...
విధ్వంసం చూసిన కళ్ళకు
మరే దృశ్యాలు కనిపించడం లేదు
భయంతో వణికే పెదాలపై
నవ్వు పువ్వు వాడిపోయింది

* * *

వెచ్చటి నెత్తుటిలో పుట్టిన 'భయంచలి'
క్రమంగా పెరుగుతూ
భద్రత చలిదుప్పట్లను
కానరానంత దూరానికి విసిరేసింది
అందుకేనేమో
ప్రాణాన్ని సేఫ్ లాకర్‌లో ఉంచే
లైఫ్‌సేవ్ బ్యాంకులు కావాలంటున్నారు
ప్చ్... ఎక్కడున్నాయ్...
ప్చ్... ప్రాణమంత ఖరీదు కాదిప్పుడు

* * *

నీటిలాగా... ప్రాణ వాయువులాగా...
జనం భయాన్ని భరిస్తున్నారు
వారు భయంతోనే జీవిస్తున్నారు
భయభయంగానే
బతుకు పోరాటం చేస్తున్నారు

* * *

భయం... చూపులపై ఆంక్షలు పెట్టింది
భయం... గొంతుపెగలనంత విషాదాన్ని నింపింది
భయం... కాళ్ళను కట్టిపడేసింది
భయం... అందర్నీ భయపెడుతోంది
లింగ వయోభేదం లేదు...
కులం, మతం, వర్గ భేదాల్లేవు
భయం ముందు అందరూ సమానమే!

* * *

అందుకే -
భయాన్ని బోన్‌లో నిలబెట్టి ప్రాసిక్యూట్ చేయాలి?
అప్పుడు బోలేడు భయాలు బయటకొస్తాయ్...
దాని పుట్టుపూర్వోత్తరాలు తెలుస్తాయ్...
భయమే పాలిస్తున్న రాజ్యంలో
పగలూ రాత్రీ తేడా లేకుండా
భయం నిర్భయంగా తిరుగుతోంది
ఇక

మనశ్శాంతి ఎక్కడుంటుంది?
స్వేచ్ఛయుత జీవనమెక్కడుంటుందీ?
తలచుకొంటే
మస్తిష్కం మొద్దుబారిపోతుంది
అందుకే -
భయాన్ని భయపెట్టే ఆయుధం కావాలి!
అదెక్కడ దొరుకుతుందో తెలుసుకుని
అక్రమంగానైనా సరే కొనాలి
కసితీరా మట్టుబెట్టాలి
భయాన్ని పుట్టిస్తున్న మూలాల్ని పీకేయాలి
లేకపోతే -
బట్టలు కూడా సరిగాలేని జనానికి
బుల్లెట్ జాకిట్లెవరిస్తారు?
కనీసం విష జ్వరాల నుంచి రక్షించలేనప్పుడు
విధ్వంసం గాయాల నుంచి ఎవరు కాపాడతారు...
వారి ప్రాణాలకు, మానాలకు ఎవరు భరోసా ఇస్తారు?

మిలియన్ మార్చింగ్ సాంగ్

- దాసరాజు రామారావు

"విగ్రహాలు మీవి
శవాలు మావి"
అన్న కవి ధర్మాగ్రహ ప్రకటన
తథాగతును అభయముద్ర నీడలో గెలిచే తీరింది

నాలుగు దిక్కుల
సర్కారు, పళ్ళ బిగువున రహదారుల్ని బంధించినా
చట్టాల చట్టుబండల్ని పలుగు జీరి,
టాంక్‌బండంతా
తెలంగాణ అలుగై పారింది

ఊహలెన్ని పుడ్తున్నయో
ఉద్యమ రూపాలన్ని పుడ్తున్నయి
గిప్పుడు
చీకి, శిథిలమై, నూకలు చెల్లిన
అసెంబ్లీ మాసికాని కాడికొచ్చినం

మా వాకిట్ల బొడ్డెమ్మ పెట్టుకోడానికి,
టాంక్‌బండ్ చెరువు కట్టమీద
బతుకమ్మ పాట పాడుకోడానికి

అనుమతి నియ్యని నీ మతి లేని తనాన్ని
విధ్వంసం చేసిన
ధ్వంస రచనగా చదువుకో!

మా మట్టిల ఘూర్ణిల్లుతున్న
మా మూలుగులు
మరో ప్రపంచంలో ఏ ప్రస్థానం చేరలే

చాపకూడుతో సమతను నేర్పి ఉండొచ్చు
మన మధ్య మమతానుబంధాన్ని
ఒక్క విస్తరాకు వేసి తినిపించలేదుగదా

ఊహలకే పుట్టినిల్లైన కవి
ఊహా చిత్రమే దొరకక
అబద్ధమైన ఆదికవి నన్నయ
అక్కడెట్ల భీష్మించుకు కూచున్నడో!

గబ్బిలం సాక్షిగా
ఎగబడ్డ ముప్పది మూడుకోట్ల దేవతల్లో
ఈ జగడం గాండ్లను కూడా కలిపితే

అచ్చు అంటరానివాళ్ళ తీర్గనే
తెలంగాణను పీక్కు తిన్న సందేశం
లోకానికి
ఇంకా బలంగా అంది ఉండేది

ఇచ్చుకపోయిన పొత్తుల
ధర్మ యుద్ధానికి
నాలుగక్షరాల సెగ తోడంటించాలని
ఆశించడం
ఐక్యరాజ్యసమితిని కూల్చేసే కుట్రగాదే
సోదరమైత్ర బంధంలో
పాకులాడడం ఒక హక్కే

ప్రాంతపు మట్టిల
పరిమళించడం, దుఃఖించడం
తనదైన ప్రాథమిక స్మృహలో, స్ఫురణలు ఉన్నట్టు

అక్షరం ఎల్లలు దాటాలె
కాలికింది మట్టిని, బొట్టు పెట్టుకునే

కూల్చిన విగ్రహాలనే
తిర్లేసి, మర్లేసి,
మల్ల మల్ల కూలుస్తున్నట్టు
చూపుతున్నరుగని,

అర్ధ శతాబ్దంగా మంట బెట్టిన
మా అస్తిత్వ ఘోషలకు
మీ వెన్నుపూసలు ఇప్పటికీ కరగకపాయె

విగ్రహాల విధ్వంసం
ఒక క్రమాగత హెచ్చరికా
పర్యవసాన క్రోధాగ్ని ఘటనే

కొమురంభీం, పొనగంటి తెలగన, కాళోజీ
అక్షరబద్ధమే మా కర్తవ్య దీక్ష

మట్టిమూర్తులందరినీ
ఆవాహన జేసుకుందాం
ఈ మట్టి మీద
మన మనసుల నిండ

మహాకవీ!
నువైనా, నేనైనా
నేల విడిచి, రాసిన అక్షరం
జన సమ్మతం కాదని
రుజువైంది గదా ఈ క్షణాన.
మతిల బెట్టుకుందాం....

గిరాయిపల్లి నుండి హైదరాబాద్

- సముద్రుడు

అమ్మ వలపోసి కన్నీరు వరదయ్యింది
కొడుకును ఒక్కసారి కలువమంటూ
పెయ్యంత నిమిరి విరిగిన చేతుల చూస్తూ
పోలీసులకు శాపనార్థాలు పెట్టింది
ఎందుకు బిడ్డా గీ కష్టాలు...
ఎందుకొచ్చిన తిప్పలురా
తొమ్మిది నెలలు మోసి చెట్టెత్తు చేస్తే
కన్నోళ్ళ కష్టాలు చూడకపోతిరి
కష్టాల కొలిమయితిరి
కిష్టడు శీనలను చంపిరి...
ముసలోల్ల ఎవలు సూడాలే
జనం జనం అంటూ
ఇంటిల్లిపాదిని వదిలి
ఒక్కొక్కరు సావబట్టిరి
ఎట్లనో ఏమో? ఎప్పుడో ఏమో?
రాజ్యమొచ్చుడు...
దొరలది రాజ్యమాయే... దొంగలేల బట్టిరి
చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకున్నోళ్ళు
ఊల్లేలుతుంటే... మీరడివి బడితిరి
కొడుకు పోయిండంటే కలువకపాయే
ముసల్ది సచ్చేటట్టయ్యింది
కొడుకును ఒక్కసారి కలువమను బిడ్డా
ఏడ్వాగనేలేదు... పొంగిపోర్లుతున్నాయి
అవ్వ మంచి గుందని చెప్పు
కండ్లు కాయలు గాసె
కలవరియ్యబట్టే
ఒక్కసారి చూసి కన్ను మూస్తంటుంది
జీవంత ఆడిమీదే
ఎంకటి ఏడున్నడో... ఎట్లున్నడో
కల్సిపొమ్మని బిడ్డా
ఎక్కడున్నా సల్లగుండమని చెప్పు బిడ్డా
కల్సినా కలువకున్నా సల్లగుంటే
ఎన్నడైనా కలుస్తడు బిడ్డా

* * *

బుడి బుడి అడుగులతో
బుచ్చి బుచ్చి మాటలతో
సూర్యుడుదయించకుండానే
అరికట్టం కట్టుకొని
గజ గజ వనుకుతూ
బాయికాడ చెప్పిన లాల్ సలామ్
మళ్ళీ కలుస్తమో? లేదో?
ఒక్కరొక్కరు నేల రాలుతుంటే
మదిల తలుసుకుంటూ
అలాయి బలాయి తీసుకొని
అమరులాశయాలు కొనసాగిద్దామని
మనమిచ్చిన నినాదాలు
గెరిల్లా జోన్లనుండి విముక్తి ప్రాంతాల వరకు
అడవి మైదానాలు స్కూలు కాలేజీల
రాజధానికి మోసుకెళ్ళావని చెప్పనా
అమరుల ఆశయసాధనకు
శ్రీనువాసరెడ్డి కిష్టారెడ్డిల బాటలో
అమరుడయ్యావని చెప్పనా
అమ్మకేమని చెప్పను
అవ్వకేమని చెప్పను
లవ్వాలలో సంపినమంటున్నరు
ఎదురుకాల్పుల్లో సచ్చిండంటుండ్రు
అమ్మ చెప్పిన ముచ్చెట్లు చేరకముందే
ఎర్రజెండా కప్పుకొని
ఎర్ర నక్షత్రాలలో ప్రకాశిస్తూ
అమ్మ దగ్గరకెల్లావా

ఉద్యమంతో ఎదిగి ఒదిగినావొ
కష్టాలు నష్టాలు ముద్దు ముచ్చట్లు చెప్పుకోలేని
కడసూపుతో
అమ్మ అయ్య అవ్వ తమ్ముడు చెల్లెలికి ధైర్యం చెప్పు
వందల ఎంకటిలు తలుపు తట్టితే
బాయి కాడికి సద్ది మోసుకు పొమ్మని చెప్పు
నీవోలె
నీ కొడుకు బిడ్డల అల్లుడు కోడళ్ళను కమ్మని చెప్పు
దండకారణ్యం విముక్తి చేసుకొని
ఏటూరునాగారం
మహదేవ్‌పూర్ మంథనిల నుండి
గిరాయిపల్లికి చేరమని చెప్పు
గిరాయిపల్లి నుండి హైదరాబాద్
దూలాడ దునికాడ జై అంటే సై అంటూ
సాయుధులకమ్మని చెప్పు

(శ్రీనివాస్ రెడ్డి, కిష్టారెడ్డిలది ఐనాపూర్ గ్రామమే. వేరు వేరు బాధ్యతలను నిర్వహిస్తూ అమరులు అయినారు)

సాయుధుడివి కాక తప్పదు

- లాంఛర్

నిండుగా నిటారుగా వాళ్ళ జ్ఞాపకాలు
రాజ్యాధికారాన్ని
స్వాధీనం చేసుకోవాలని
బోధించే రాజకీయ (మార్క్సిస్టు)
తత్వశాస్త్రాన్ని నమ్మినవాళ్ళు
తుమ్మెద మకరందాన్ని ఆస్వాదించినట్లు
వాళ్ళు విప్లవాన్ని ఆస్వాదించారు
కర్తవ్యాన్ని కడదాక
ధృడదీక్షతో స్వీకరించి
పల్లె, పట్నాల్లో - శత్రువును
ఎదురొడ్డిన రణ నినాద నగారాలయ్యారు
నక్సల్బరీ, శ్రీకాకుళం, వీర తెలంగాణా
వారసత్వంలో
పాటై, ఆటై, కార్మిక కర్షక
నిజమైన మైత్రివై
బుసకొట్టే విషనాగుల
తీవ్ర నిర్బంధాల్లో
స్వీయాత్మక శక్తులు కొరవడిన వేళ
నిజమైన విప్లవ సంస్కృతితో
ఎర్ర ప్రాంతాలుగా రగిలించడానికి
ఏటికి ఎదురీదిన జ్ఞాపకాలు వాళ్ళు
కమ్యూనిస్టు సమాజ స్థాపనలో
వాళ్ళ త్యాగ చరిత్ర ఏనాటికైనా
నిలిచి ఉంటుంది
ఆ వీరులు...
సైద్ధాంతిక రాజకీయ చైతన్యంతో
అన్ని సౌకర్యాలను వదులుకుని
పేద ప్రజల ప్రయోజనాల కోసం
సామాజిక మార్పులో
మన అమరవీరులు తమ వంతు పాత్రను
చక్కగా పోషించారు
వాళ్ళు మడమ తిప్పని పోరాటకారులు
సామాన్య ప్రజలు సైతం హత్తుకునే
ఎందరెందరో మహనీయులు
అందుకే అంటున్నాను....
వాళ్ళ జెండా పట్టుకోడానికి
వాళ్ళ తోవలో నడవడానికి
మన హృదయాన్ని తెరిచి ఉంచి
జీవించడమనేది
గొప్ప ఆనందమయం
కానీ మన హృదయాలను
మనమంతా బందీగా
ఎందుకు ఉంచుతున్నామో
ఒక్కసారి ఆలోచించాలి
దుర్భరమైన దుఃఖాలకు
కారణభూతులు ఎవరు
ఒక ప్రేమ భావన అంటూ
ఉండనీకుండా అంతరంగం ఎప్పుడో
మాయం చేస్తున్నది ఎవరు
సమాజంలో శ్రమజీవుల
సంగీతాన్ని కూడా స్వేచ్ఛగా
వినిపించకుండా చేస్తున్నది ఎవరు
పేద ప్రజల రాజ్యం కోసం
నెత్తుటి కావ్యాన్ని రచిస్తున్నదెవరు
నిజాలను అబద్ధాలుగా
అవాస్తవాలను వాస్తవాలుగా
చిత్రీకరించి....
నీ రాజ్యం కోసం పోరాడే వాళ్ళను
నిర్దాక్షిణ్యంగా
నిర్మూలిస్తుంటే...
నిస్సహాయంగా ఉండకు
లేలే... తొరపడు

వ్యాసం

"ఆదివాసీ గిరిజన రుచికాలు ఎందరో"

- జావెద్ ఇక్బాల్

'ఆపరేషన్ గ్రీన్ హంట్' (ఒ.జి.ఎచ్.) మావోయిస్టులను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం గత నవంబరులోనే మొదలు పెట్టి ఉండచ్చు. కానీ ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ ప్రాంతంలో ప్రభుత్వం ఆదివాసీ వ్యతిరేక కార్యకలాపాలు, ఆదివాసీల పట్ల తీవ్ర శత్రుపూరిత ధోరణిని ఎప్పట్నించో కొనసాగిస్తోంది. ఇదంతా ఆదివాసీలుండే ప్రాంతంలో అక్కడి అధికారయంత్రాంగం కొనసాగిస్తూ వస్తున్నది కానీ ప్రభుత్వం దీన్ని ఒప్పుకోదు.

ఉదాహరణకు సామ్‌సెట్టి అనే గ్రామంలో నలుగురు మురియా ఆదివాసీ స్త్రీల సంగతి చూద్దాం.2006 జూలై 6, దంతెవాడ జిల్లాలోని సామ్‌సెట్టి గ్రామంలో ప్రభుత్వం స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు సల్వాజుడుం మూకలతో కలిసి 19, 22, 23 సంవత్సరాల వయసులో ఉన్న ముగ్గురు మురియా ఆదివాసీ స్త్రీలను సామూహిక అత్యాచారం చేసారు. దీనికి సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయి. జనవరి నెలలోనే మరో అమ్మాయి దారుణ అత్యాచారానికి లోనయింది. కానీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోదల్చుకోలేదు. వీరు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టడానికి వెళ్ళినప్పుడు ఈ అమ్మాయిలందరూ వారిని స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు తీవ్ర భయాందోళనకు లోను చేస్తూ వెంటాడారని మాత్రమే చెప్పారు. తర్వాత తేలిన అంశం ఏమంటే వారంతా దారుణంగా అత్యాచారానికి గురి అయినారని. 'కొంటా' అనే ఊరిలో ఏకంగా 24 అత్యాచార కేసులు నమోదయితే అందులో ఆరుగురు మాత్రం అత్యాచారం గురించి మాట్లాడగలిగారు. అందులో నలుగురు 'సామ్‌సెట్టి' అనే ఊరి నించి అయితే ఒకరు అల్‌రామ్‌పల్లి నుంచి, మరొకరు బంద్రాపడార్ అనే ఊరుకు చెందినవారు. వారి ఆరోపణలు సహజంగానే రికార్డు కాలేదు.

చివరగా మార్చ్ 27, 2009న, ఈ స్త్రీలంతా నేరుగా సూపరిన్‌టెన్‌డెంట్ ఆఫ్ పోలీస్, డిస్ట్రిక్ కలెక్టర్‌కి నేరుగా కంప్లైంట్ ఉత్తరం రాసారు. ఏమీ జరగలేదు. అప్పుడు ఈ కంప్లైంట్‌ను నేరుగా వారు జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ 'కొంటా'కి ఏప్రిల్ 29న ఫైల్ చేసారు.

ఆసక్తికరంగా జూన్ 16న ఈ స్టేట్‌మెంట్స్ కోర్టులో నమోదు అయ్యాయి. నేరస్థులు కోర్టు కారిడార్లలో తిరగడం వాళ్లు చూసారు. తదుపరి కోర్టు తేది జూలై 17న బాధిత స్త్రీల స్టేట్‌మెంట్స్ వినాల్సిన రోజు. మెజిస్ట్రేట్ రాలేదు. అతను హెడ్ క్వార్టర్స్‌కు పిల్చుకోబడ్డాడు. లేదా పంపబడ్డాడు. తదుపరి తేదీ ఆగస్టు 12కి వాయిదా పడింది.

మెజిస్ట్రేట్ అమృత్ కర్‌కేట్ ఆందోళనతో తన సైకిల్ మీద కుంటలోని తన ఇంటి నుంచి కోర్టుకు తిరుగుతూ కన్పిస్తుంటాడు. ఆఖర్కి 30 మంది నేరస్తులకు వారెంట్ ఇవ్వబడింది. అది అక్టోబరులో డోర్నపాల్, కుంటా, బెజ్జి అనే ఊర్లలోని పోలీస్ స్టేషన్‌లలో. కానీ ఇంకా ఎవరూ అరెస్ట్ కాబడలేదు. నేరస్తులు మాయమయ్యారు.

అందులో ఒకడు ఇంకా ప్రజలకు ఉపన్యాసాలిస్తూ కన్పిస్తే, మరికొందరు డ్యూటీలో ఉండి కూడా మాయమైనవారి లిస్ట్‌లో ఉంటారు.

బాధితులను మానసికంగా, శారీరకంగా వేధించడం ఇంకా కన్పిస్తూ ఉంది. చాలామంది స్త్రీలు ఈ బాధ పడలేక వారి ఊళ్ళు వదిలేసి పారిపోయి వచ్చి హిమాంశూ కుమార్ వనవాసి చేతన ఆశ్రమ పరిసరాల్లో తలదాచుకుంటున్నారు. 11వ తారీఖు ఆగస్టు నెలలో వాళ్ళు కలెక్టరు రీనా బాబా సాహెబ్ కంగల్‌ను కలిసి, ఆదివాసీ స్త్రీల రక్షణను కోరారు. అయినప్పటికీ వారి రక్షణ కోసం ఏ ఏర్పాటు జరగకపోవడంలో వింతేముంది? నిస్సహాయులై వాళ్ళు తిరిగి తమ గ్రామాలకు చేరుకున్నారు. వాళ్ళను కొట్టడం, మళ్ళీ బూటకపు కేసుల్లో ఇరికించి జైళ్ళల్లో నెట్టడం మామూలే. ఇదంతా వాళ్ళు తమ మీద అత్యాచారం చేసిన వారిపై కేసులు పెట్టడం

మునుముందుకు అడుగులు వేయి
ఖడ్గం అందుకో
నీ శక్తినంతా కూడదీయి
నీ రాజ్యం కోసం
దోపిడీ రాజ్యాన్ని
కూలదోయి....

(ప్రపంచ కార్మికవర్గ మహోపాధ్యాయులు మార్క్స్ - ఎంగెల్స్ - లెనిన్ - స్టాలిన్ - మావోలూ మన భారత విప్లవోద్యమ సంస్థాపక నేతలు, ఉపాధ్యాయులు కామ్రేడ్ చారుమజుందార్, కామ్రేడ్ కన్హాయ్ ఛటర్జీ, వేలాదిమంది గొప్ప అమరవీరులు తమ విప్లవాచరణ ద్వారా కార్మికవర్గ విప్లవ సుగుణాలనూ, సంస్కృతినీ, అమూల్యమైన ఆదర్శాలుగా సాంప్రదాయాలుగా మన ముందుంచి వెళ్ళారు. వారి ఆదర్శాలను మార్గదర్శకాలుగా, త్యాగనిరతిని ఉత్తేజంగా తీసుకుని మునుముందుకు అడుగులు వేస్తారని ఆశిస్తూ అమరులైన కామ్రేడ్స్ స్మృతిలో ఈ లేఖ.

మూలంగానే జరుగుతున్నది. ఒకసారి వారెంట్ జారీ అయినాక, నేరస్తుడు ఆ కేసుల నించి తప్పించుకోలేడని తెల్సు... కోర్టులో హాజరు పర్చి మిగతా కార్యక్రమం కొనసాగే దాకా అయినా స్త్రీలను కొడతారు. అయినా, పాపం ఆ స్త్రీలు ఏం చేయగలరు?

ఉదాహరణకు మడకం మాడవి (పేరు మార్చబడింది) కేసు తీస్కుందాం. ఈ బండార్ పడార్ గ్రామస్తురాలు కొంటా బ్లాక్ పరిధిలో ఉంటుంది. ఈమెను ఏప్రిల్ నెల 2008లో కుంటా పోలీస్ స్టేషన్‌లో అక్కడి ఎస్.పి.ఒ.లతో సామూహిక అత్యాచారానికి గురయ్యింది. ఆమె చెప్పిందాని ప్రకారం సల్వాజుడుం వాళ్ళు ఆమెపై పోలీస్‌స్టేషన్‌కు తీస్కెళ్ళి అక్కడ ఆమె వద్ద ఉన్న 25,000 రూపాయలు గుంజుకుని ఆమెను ఒక గదిలో బంధించారు. ఆ గదిలో మొదట ఆమెను ఒక ఎస్.పి.ఓ. లైంగిక అత్యాచారం చేసాడు. తర్వాత ఆమె కళ్ళకు గుడ్డకట్టి అక్కడే, గుర్తు తెలీని ఇతర ముగ్గురు వ్యక్తులు ఆమెను వరుసగా రెండు రోజులు సామూహిక అత్యాచారం చేసారు. తర్వాత ఆమెను వదిలేసినప్పటికీ, వీలు చిక్కినప్పుడల్లా ఆమెను లైంగిక వేధింపులకు గురిచేయడంతో భరించలేక ఆమె ఆంధ్రప్రదేశ్‌కి వెళ్లి పెళ్ళి చేస్కుని భర్తతో ఉన్న తరుణంలో సల్వాజుడుం మూకలు ఆమెను ఆంధ్రప్రదేశ్‌లో వెతికి పట్టుకొని తమ వేధింపులు కొనసాగించారు. ఆమె భర్తను బెదిరిస్తూ.

"ఈమెను అమ్మి డబ్బు చేస్కోవాలని అనుకున్నాం కానీ నీవల్ల అది సాధ్యం కాలేదు. కాబట్టి నువ్వు ఆ నష్టాన్ని పూడ్చాలి. ఆ డబ్బు మాకు ఇవ్వాలి" అంటూ అతని వద్ద ఉన్న 3,500 రూపాయలు, ఒక ఆవు, మూడు మేకలు రెండు కోళ్ళు బలవంతంగా తీస్కెళ్ళిపోయారు. మరికొన్ని రోజులు ఇలానే వేధించి ఛత్తీస్‌ఘడ్ తిరిగి వెళ్ళి మాడవి ప్రతి రోజూ, ఒక్కో ఊరిలో ఒక్కొరితో గడుపుతోందని దుష్ప్రచారం చేశారు.

చివరికి గాంధేయన్ ఎన్.జి.ఓ. "వనవాసి చేతన్ ఆశ్రమ్" డైరెక్టర్ హిమాంశు కుమార్ దంతెవాడ ఎస్.పి.కి కంప్లైంట్ రాసివ్వడం జరిగింది. నెలల తరబడి ఈ కంప్లైంట్‌కి స్పందన లేకుండానే గడిచిపోయింది.

ఆఖరికి ఒక ప్రైవేట్ కంప్లైంట్‌గా కేసు కోర్టుకు అప్పగించబడి 2009 మార్చి 9న కేసు 'కుంట' గ్రామం నుంచి దంతెవాడ సెషన్స్ కోర్టుకు తరలించబడింది. వెంటనే మళ్ళీ వేధింపులు మొదలయ్యాయి.

ఈ క్రమంలోనే...

2009 ఏప్రిల్ 10న ఎస్.పి.ఓ.లు రాష్ట్ర సరిహద్దులను కూడా దాటి మాడవి ఇంటిని కనుక్కొన్నారు. 2009 డిసెంబర్ 29న ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు పోలీస్ స్టేషన్‌కి మాడవి తండ్రి, ఆమె భర్త పేరును చెప్పిన ఇంకొక యువకుణ్ణి తీస్కెళ్ళి తండ్రిని భయాందోళనలకు గురిచేసి, యువకుణ్ణి దారుణంగా కొట్టారు. మాడవిని కొంటా పోలీస్ స్టేషన్‌కు తీస్కు రమ్మని వాళ్ళని భయపెట్టారు. దీంతో మాడవి తెల్సినవాళ్ళ దగ్గర దాక్కుంటూ వచ్చింది. కోర్టు ఆమెను డిసెంబర్ 10న కోర్టుకు రమ్మని ఆర్డరు జారీ చేసింది. అయితే ఇది జరగలేదు. కోర్టులో హియరింగ్ ఉన్నరోజు వనవాసీ చేతన ఆశ్రమం మీద దాడి జరిగింది. ఈ ఆశ్రమ డైరెక్టర్ హిమాంశుకుమార్ మాడవి కేసులో ఆమెకు పూర్తి సహకారాన్ని అందిస్తూ ఉన్నారు. అతని ఆశ్రమంపై దాడి చేసి, బుల్ డోజర్‌లతో కూల్చివేసి అక్కడ ఉద్యోగస్తులందర్ని అరెస్టు చేశారు. భయాందోళనలకు గురిచేశారు. హిమాంశు ప్రాణాలతో బయటపడ్డారు. ఇదంతా జనవరి 6న జరిగింది.

మరుసటి రోజు మేధా పాట్కర్, సందీప్ పాండే, డి. గేబ్రియల్, కవితా శ్రీ వాస్తవ్ లాంటి సామాజిక కార్యకర్తలపై "మా దంతెవాడి ఆదివాసీ స్వాభిమాన్ మంచ్" పేరుతో సాల్వాజుడుం కార్యకర్తలు దాడి చేసాడు. వారంతా పోలీసుల సహకారంతోనే ఇదంతా చేసారని స్థానిక మీడియా చెప్పిన దాని ప్రకారం 'కొంటా' పోలీస్ స్టేషన్‌లో సామూహిక అత్యాచారం కేసులో నిందితుడు కూడా ఆ గుంపులో ఉన్నారు. వీరంతా ఈ కేసులో మాడవికి అండగా ఉండి పని చేస్తున్నారు. మాడవి కథ ఇది. ఎలా అంతమవుతుందో ఎవరికీ తెలీదు. ఇదీ భారతదేశంలో స్త్రీల, అందునా ఆదివాసీ స్త్రీల పరిస్థితి. ఇదంతా ప్రజలతో ఎన్నుకోబడ్డ ప్రభుత్వం మావోయిస్టుల అణచివేత పేరుమీద చేస్తున్న దారుణాలు.



చదవండి!

చదివించండి!

మార్క్సిస్టు తత్వశాస్త్రం

ఒక పరిచయం

న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

ప్రతులకు :

మైత్రీ బుక్ హౌస్, విజయవాడ,

దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్

ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్,

నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

సహచర బుక్‌మార్ట్, హైదరాబాద్

వెల : రు. 50

కథ

చావుడేరా

- ఉదయమిత్ర

రంగమ్మ పొయ్యికాడ తంటాలు పడుతోంది - పచ్చి కట్టెలుండటం వల్ల మంటసరిగ్గా రావటం లేదు. ఊదురు గొట్టంలో ఊదుతూ తెగ ఆయాసపడుతున్నది. దానిగా తోడు ఎడతెగని దగ్గు.

గుడిసెలోంచి పొగలేచి చేతులు చాచి రంగమ్మ కష్టం చూడరమ్మని చెబుతున్నట్టుగా ఉంది.

ఇంటిముందు ఆమె బిడ్డ సావిత్రి తొక్కుడు బిల్ల ఆట ఆడుకుంటోంది... పదేళ్ల పిల్ల... భుజం మీద చిరిగిన జాకెట్‌ను మాటిమాటికీ సరిజేసుకుంటూ ఒక్కతే ఏకాగ్రతతో ఆడుకుంటోంది..

"ఓసోరీ... యాడజచ్చినవే... నీ ముండమొయ్య" అంటూ ఊదురుగొట్టం భూమికేసి కొట్టి పిల్చింది రంగమ్మ.

ఉరుకుతూ వొచ్చింది సావిత్రి...

"ఇగో... కోమటి కిష్టయ్యకాడ్కివోయి, అర్ధపావు సింతపండు ఉద్దెరదేపో..."

"ఉద్దెరనా... అమ్మో నేనువోను..."

"ఎందుకే... ఏమయ్యిందే"

"ఆయన దగ్గెర గిప్పటికే ఉద్దెర శానదెచ్చిన. మల్లవోతే తిట్టి పంపుతడు..."

"మరెట్లనే... సేతిల సిల్లిగవ్వలేదు... సరేగాని... మన సాయమ్మ సిన్ని తాన్కివోయి, నేను జెప్పిన్నని పైసలడ్కపో.."

"అమ్మా... అమ్మా... నీ వొంట అయినంకవోతనే.."

"సింతపండు లేకుండా వొంట ఎట్లయితదేబ్యాగరి ముండా... ఇప్పటికే మస్తు ఆలీశమయ్యింది. ఆడు దొంగసచ్చినోడు పనిల వెట్టుకుంటడోలేదో. ఈ రోజు గూడ పని దొర్కకపోతే పస్తులే..."

"సరే.. సరే.. పొయ్యొస్త..."

కూలికి టైమ్ దగ్గరపడ్తుండడంతో ఎట్లాగయినా తొందరగా వంటముగించాలని తొందరపడ్తోంది రంగమ్మ... పొయ్యి మీదకి దినుసులు సరిగాలేవు... పొయి కిందకి కట్టెలు కూడా సరిగాలేవు.

ఊదినపుడు పొగ ఊపిరితిత్తులోకి పోయి ఉక్కిరి బిక్కిరవుతోందామె. మాయదారి జబ్బులేవో ఒకదాని వెంబడి ఒకటి వొస్తున్నాయి. సర్కారు దవాఖానకు పోయి మందులు దెచ్చుకుంటే, ఒకటి వోయినాంక మరోటి బయటికొస్తున్నది... కోపంలో ఊదురుగొట్టాన్ని నేలకేసి కొట్టి మొగుణ్ణి తిట్టసాగింది...

"ఈని మీదమన్నువొయ్య... తలకాయ గొట్టి ఆకుల గప్ప... ఈడు మంచి గుంటె, నా బతుకుగిట్లెందుకుంటుండె... నాకు 'సొమ్మ' రోగమొచ్చిందని ఆడిదారి ఆడు జూసుకున్నాడు. భాడ్కావు కొత్త పెండ్లంతోటి కుల్కుతున్నడు. మా ఉసురు ముట్టిపోతడు.. గీ 'సొమ్మ'తోటి నాకేమయితదో... ఏమో... నా పిల్ల గతి ఏమయితదో..." తిడుతూనే ఏడుస్తూ ఊదసాగింది.

అసలు సొమ్మరోగం వొచ్చిన కాడ్నించి రంగమ్మ బతుకు కత్తి మీద సాములాగ నడుస్తోంది. ఎప్పుడు ఎక్కడ ఎలా చావు మీదకొస్తుందో చెప్పలేని స్థితి.

నీళ్ల కాడా... నిప్పుల కాడా జాగ్రత్తగుండాలని అందరూ చెబుతారుగాని, అది అన్ని టైముల ఉండడం కుదరదుగదా..

రంగమ్మ ఊదురుగొట్టాన్ని పక్కన పడేసి, గిన్నెమూకుడు తీసుకుని ఊపడం మొదలెట్టింది. ఎట్లాగయితేనేం... మంట రాజుకుంది "హమ్మయ్య" అనుకొని ఏదో తీసుకోవడానికి పైకి లేవబోయింది. ఇంతలో "సొమ్మ" వొచ్చేసింది. అంతే.. ఆ క్షణాల్లో శరీరం పట్టుదప్పి... అకస్మాత్తుగా పొయ్యి మీద పడిపోయింది. వెంటనే బట్టలకు అగ్గి అంటుకొని, అక్కడే పొయ్యి పక్కన కాళ్లూ చేతులు కొట్టుకుంటూ పడిపోయింది.

* * *

చుట్టుపక్కల వాళ్లంతా ఇంటి ముందు గుమి గూడారు. అప్పటికే రంగమ్మ ఒళ్లు బొబ్బలెక్కి, నల్లగా వికారంగా తయారయింది. తెల్సినవాళ్ళు అదీ ఇదీ పూస్తున్నారు. ఆమె మరణాయసంతో మూలుగుతోంది.

సావిత్రి గుండె పగిలేలా ఏడుస్తోంది. ఎవరిని బడితే వాళ్ళను పట్టుకొని ఏడుస్తోంది. వాళ్ళకా పిల్లను ఓదార్చడం గగనమైపోయింది. ఆ పిల్ల పట్ల ఉన్న ప్రేమ, జాలి వల్లనో ఏమో, ఆ పిల్ల కన్నా పెద్దలే ఎక్కువగా ఏడుస్తున్నారు. కాళ్లకు బండరాళ్లు గట్టి నీళ్లలో విడిచి పెట్టినట్టుగా ఉంది ఆ పిల్ల పరిస్థితి.

* * *

"పాపం... దీనికేమో సొమ్మరోగం - మొగనికేమో దొబ్బరోగం. దీని "సొమ్మ" జూసి ఆడు ఇంకోదాన్ని గట్టుకొని గట్టెక్కిండు.. తల్లిపిల్ల దిక్కులేనోల్లయిన్రు. కొంగుతో కళ్ళు తుడ్చుకుంటూ అంది నాగమ్మ.

"చేస్కుంటే చేస్కునెగాని, దీన్ని తన దగ్గరనన్నా పెట్టుకోకపాయె... తల్లీ బిడ్డలకింత నీడనన్నా దొర్కుతుండె" పక్కింటి పార్వతమ్మ అందుకొంది.

"ఆ... మాటలు గాని... మంచిగున్నోల్లకే దిక్కులేదు. అన్నన్ని కట్నాలు వోసి అత్తారింటికి సాగనంపినోల్లనే సావగొట్టి సెవులు

మూస్తున్నరు. గీ దిక్కులేని దాన్ని ఎవడు గాంతడు?"

"గా పోరి బత్కు ఆగమయ్యిపాయె... తల్లి ఉండంగ ఇంతో అంతో నీడలాగుండె.. దానికేమయితే... దీనిగతేందో? గాదేవుని కంట్లెమన్నువడ... అన్ని కష్టాలు ఆడోల్లకే వెట్టిండు".

"ఈల్లక్క భీమమ్మకు కబురు వెట్టిన్రా.."

"ఆ... చెప్పంపిన్రు... దవాఖాన కాడికి వొస్తదంట... పాపం.. అక్క ఒగచోట... చెల్లెలోక చోట... అక్కనేమొ దేశం (వలస) బాయె... చెల్లెల్ని తీస్కపోదమంటే, దీనికి "సామ్మ" ఉండెనాయె. మనోల్ల మధ్యన ఉంటే ఇంత ఆదెరువన్న ఉంటదని ఈడనే ఇడ్సిపెట్టింది"

ఆటో వొచ్చింది.

పట్టుకుంటే చర్మం ఊడే స్థితిలో రంగమ్మను జాగ్రత్తగా పట్టుకొని ఆటోలోకి చేర్చారు. గొడ్డులాగ అరుస్తోందామె..

సావిత్రిని ఎంత వొద్దన్నా పట్టుబట్టి ఆటోలో తల్లిపక్కనే గూచుంది. అర్ధరాత్రి అందరూ గొల్లుమంటుంటే చీకట్లను తొల్చుకుంటూ ఆటో బయల్దేరింది.

* * *

పాలమూరు పెద్దాసుపత్రి

పై అంతస్తులో ఓ మూల బర్నింగ్ పేషెంట్ల వార్డు. దాన్ని నరకంలోంచి ఓ ముక్కను దీసుకొచ్చి అక్కడ అతికించినట్టుగా ఉంటది. లోపల వార్డులో, బయట వరండాలో పేషెంట్లు పడి ఉన్నారు. మనుషుల చర్మం కాలిన వాసన ముక్కు పుటాల్ని బద్దలు గొడ్తుంది. సగం కాలిన దేహాలు.. పూర్తిగా కాలిన దేహాలు... చర్మాలు ఊడి.. దేహాలు కాలి... లోపలి చర్మం తెల్లగా కనబడుతూ మనుష్యులు హారర్ సినిమాల్లాగ భయం గొల్పుతున్నారు.

కొందరికి దోమతెరలు, ఫ్యాన్లు ఉన్నాయి.

రంగమ్మకేమీ లేవు. మూల్గులు తప్ప.

చిత్రమేమిటంటే ఆ వార్డులో ఎక్కువ కేసులు ఆడవాళ్ళవే. అన్నీ కుటుంబ హింసల వల్ల జరిగినవే...

కాస్త ఊపిరి పీల్చుకుందామని బయటికొస్తే, అక్కడింకో దృశ్యం - కింద లెట్రిన్ పైపేదో పగిలినట్టుంది. బైటికొచ్చిన ఖజానా (మలం)తో వాతావరణమంతా భయంకరంగా ఉంది.

లోపల చర్మం కాలిన వాసన

బయట పాయిఖానా కంపు...

* * *

"అక్కా! దూపయితున్నదే.." నీరసంగా అంది రంగమ్మ. ఆమె పెదాలు ఎండిపోతున్నాయ్.

"గిన్ని కొబ్బరి నీల్లయితే బాగుండె.." - అంటూ రంగమ్మ అక్క భీమ్మమ చెయినంచి వెతికింది. సావిత్రిని బిల్చి కొబ్బరిబొండాం తెమ్మని ఇచ్చి పంపింది.

"గత రెండు మూడు రోజులుగా గమనిస్తున్న పక్క పేషెంటు తాలుకు మనిషి దగ్గరిగా వొచ్చి నిల్చుంది..

"ఈమెకెవరూ లేరా?" కుతూహలంగా అడిగింది.

"మస్తుగున్నరు. మందీ బలగం మస్తుగున్నరు.." కళ్లు తుడుచుకుంటూ అంది భీమమ్మ...

"మరి... ఎవరూ కనపడరేంది?"

"ఈడ ఎవరూ లేరమ్మా... అందరు నెత్తికో దిక్కు దేశం బోయిన్రు. ఉన్న ఇద్దరు తమ్ముల్లు బొంబాయి పనికాడ కాలువ దొవ్వుతుంటే కాలువ కూలి కాలంజేసిన్రు.."

"ఎట్ల.. ఏమయ్యింది.."

"ఏం జెప్పాలమ్మా... చెప్పుకుంటే తెల్లారేదిగాదు మా బతుకు. గుజరాత్‌ల పనికాడికి మా మేస్త్రి తీస్కపోయిండు. కాలువకాడికి పనికి వోయినంక పొద్దుమీకి గుడిసెల కాడికి లారీల వొస్తున్నరు. ఎనికోని కన్న ముందర లారీవోడు స్పీడుగ నడుపబోయి లారీ బోర్లపడ్డది. గనేటి రాళ్ల మీదపడి తొమ్మిదిమంది జచ్చిన్రు. మా తమ్ముల్లు గూడ ఉన్నరమ్మా... రాయవరం దెచ్చి ముగ్గురు ముగ్గుర్ని ఒక్క దగ్గర బొంద వెట్టిన్రమ్మా..."

"మరి అక్కా సెల్లెళ్లు..."

"ఒగ అక్క కర్నాటకల పనికి గుదిరింది.. మొగుడు కక్కుడు కాల్వకెట్టి కాలం జెసిన్రు... నేనేమొ గుజరాత్‌ల పనిజేస్తున్న..."

"మరి సెల్లెలు"

"దాని బతుకు తెల్లారిందమ్మా... దేశంబోయిన తన మేస్త్రిగాడు భాడుకావు... దాని మీద కన్నేసిండు... మొగణ్ణి పనిమీద పంపి, రాత్రిపూట ముగ్గురు తాగొచ్చి, దాన్ని ఖరాబు జేసిన్రు. ఒకరి తర్వాత ఒకరు (కళ్ల నీళ్లు ఒత్తుకుంది). అంత అయిపోయినాంక అది ఆయాసపడ్తుంటే, మేస్త్రి ముండకొడుకు ఏవోగోలీలిచ్చిండు. ఏమిచ్చిండో ఏమో... ఎగపోసుకుంట నురుగులు గక్కి పానం ఇడ్చింది పోరి. గిదంత జూసిన దాని మొగుడు ఆల్ల ఊరు బండ్లవెల్లిల పిచ్చోడయి తిర్గుతున్నడు. జాలిదల్చి ఆల్లింత ఈల్లింత వడేస్తే బతుకీడుస్తున్నడు... ఆన్కి సావురాదు.. బతుకెల్లదు.."

"పాపం.. మరి మీ అమ్మానాయినలు యాడున్నరు?"

కొద్దిసేపు మౌనం...

"మాకే గతి లేదు... ముసలోల్లకు ఎవరు దిక్కమ్మా... మేం దూర దేశం బోతే తిండి తిప్పల్లేక గుంజకు గట్టిన దూడల్లాగ ఇంటికాడనె వడి ఆకలికి అల్లాడి అల్లాడి సచ్చిన్రు.. మా నాయన ఏనుగసొంటి మనిషి... సక్కగ తాళ్ళు వేసుతుండె... సంచులు మోస్తుండె... ముసలితనం వొచ్చె... ఆదుకునె కొడుకులు, బిడ్డలు దూరం బోయిరి... మంచం బట్టి పీనుగోలె అయ్యిండు. గదంత పేపర్ల గూడ వొచ్చిందంట. వలస వోయినోల్ల బత్కులు భూమిలకు వోవుడెగాని, మీదికొచ్చుడు లేదమ్మా."

"మరి... ఊల్ల ఏదన్నా పనులు జేసుక బతుకొచ్చుగదా..."

"ఊరి మీద మన్నువొయ్య... ఏం పనులున్నయ్యమ్మా... వానొస్తె పని... లేపోతే శని.. గీ సర్కారు పని జూపుతదనుకుంటే గదీ ఉత్తదే... మట్టిపనికి వోదమంటే గదేందో ప్రాక్లెయిన్లంట.. గయిదెస్తరు... గవేవో పనికి బియ్యమంటరు.. రెండ్రోజులిస్తరు...

బందువెద్తరు... ఎవడుదింటడో... ఎవడు బాగుపడ్తడో... మాకు మాత్రం దేశం బోవుడే దిక్కు..."

"అదిసరే.. ఎప్పుడు జూసిన ఈమె కాడ బిడ్డనే గనవడ్తది - మొగుడు లేడా?" "ఆడా... ఆనింట్లమన్నువొయ్యి... ఆని సుఖం ఆడు జూసుకున్నడు. దీనికేమొ సొమ్మరోగం... ఆ సంగతి తెల్సుకోని ఆడు ఇంకోదాన్ని జేస్కున్నడు. అక్కడ కొత్త పెళ్ళాంతోటి గుల్కుతున్నడు... భాడుకావు లం... కొడుకు"

"మరి ఈల్లకేమన్న ఇచ్చిపొయ్యిండా?"

"మన్నిచ్చిపోయిండు... పిల్లను సేతిలవెట్టిపోయిండు.. కనీసం పిల్లను యాదన్న జేయడంట ముండకొడ్కు..."

"పోన్లేమ్మా... మంచి గుంటెనే మొగుల్లు... సెడ్డంక దయ్యాలె.."

* * *

మధ్యాహ్నం రావి చెట్టు మీద పక్షులు ఒకటే గోల జేస్తున్నాయి.. దగ్గర్లో ఉన్న బోరు కాడ జనం అన్నం తిని అక్కడే కడుక్కుంటున్నారు. కొందరు బట్టలు ఉతుక్కొని అక్కడే ఉన్న మైదానంలో బట్టలారేసుకుంటున్నారు. ఎవరో యాక్సిడెంట్ అయిన మనిషిని ఆంబులెన్స్‌లో తీసుకొచ్చారు.. బట్టల నిండా రక్తం... హడావిడిగా స్ట్రెచర్‌లో వేసుకుని తీసుకుపోయారు.

రావి చెట్టు నీడలో గుంపు మేస్త్రి నిలబడి ఉన్నాడు... అతని ముఖం కోపంతో రగరగలాడుతోంది. అతడు సిగరెట్ మీద సిగరెట్ లాగుతూ... మాటిమాటికీ తుపుక్కున ఉమ్మిస్తున్నాడు...

భీమమ్మ మేస్త్రి ముందు దోషిలా నిలబడి ఉంది. ఆ పక్కన జీపూ... అతని మనుష్యులూ వేటకుక్కల్లా నిలబడి అసహనంగా అటూ ఇటూ చూస్తున్నారు... వాళ్లు మఫ్టీలో ఉన్న పోలీసుల్లా ఉన్నారు.

"ఊ ఏంది భీమమ్మా... ఈణ్ణే ఉండలా? పనికి రావా?" హూంకరిస్తూ అడిగాడు మేస్త్రి.

"వొత్తమనే అనుకున్నా... అన్నా.. మా సెల్లెకు పెయిగాలింది గదన్నా... దానికాడ ఎవరూ లేరు... నేనే తంటాలపడ్తున్న... గా పసిపోరి దప్ప దిక్కెవరు లేరన్నా..." రెండు చేతులూ జోడించి అంది భీమమ్మ.

"ఆ.. ఆ.. గిట్ల దయ జూపుకుంటవోతే... చేతిల చిప్ప (చేతుల్తో చూపిస్తాడు) వొస్తది. అయినా రొండ్రోజులని పదిరోజులయిపాయె... గాడ పనెవ్వడు జెయ్యాలె... నాకు కూడ నా మీద మిండెడు (కాంట్రాక్టరు) ఉన్నడు..." ఇక తప్పదు నువ్వు రావాల్సిందే అనే ధ్వని.

"అదిగాదన్నా... నీ కాల్మొక్త... గీ దిక్కులేని దాన్ని వొదిలి ఎట్ల రావాలె సెప్పు. మొగుడు గూడ లేకపాయె... రెక్కలు గూలవడ్డట్టయ్యింది. రెండ్రోజులాగితే."

"ఆ... ఆగితే.. ఇయ్యాల ఒకటొస్తది.. రేపు ఇంకోటి... దిక్కుమాలిన బత్కులకు దిక్కుమాలిన కష్టాలు... ఎవేవో వొస్తుంటయి. అయ్యన్నీ జూస్కుంట ఉండనీకె కుదరదు.."

భీమమ్మ చుట్టూ సంకెళ్లు బిగుసుకుంటున్నయి... ఎటూకదల్లేని స్థితి.

"జర... రొండ్రోజులాగన్నా... నీకు పుణ్యముంటది..."

"కుదరదు... నువ్వీడమొండికేస్తే... ఆడనీకొడుకున్నడు... సిన్నోడని సూడకుండ పనిలవెడుత... తిక్కకుదుర్తది... ఆలోచన జెయ్యి... నీ కొడుకు గావాల్నో... నీ చెల్లెలు గావాల్నో... అంతకు గూడ తెగిడిస్తే... నిన్నెట్ల దీస్కపోవాల్నో నాకు దెల్సు..."

"అన్నా... గంత పని జెయ్యొద్దు... కనీసం గీ ఒక్కరోజు ఆగన్నా... పెద్ద డాక్టరు వొస్తే కాల్లమీద వడి మా సెల్లెలి సంగతి జెబుత. ఏ దన్నదయ ఇస్తదేమొ. దారి దొర్కుతదేమొ..."

"ఒక్క రోజు గాదు గదా... ఒక్క గంట కుదరదు. నీ కోసం నేను గుజరాత్ కెల్లి మల్ల రావాల్నా ఏం.. దొరసాని కోసం? బట్టలు గిట్టలుంటే సర్దుకొని బయల్దేరు... లేకపోతే జరిగే దాన్కి నా బాధ్యతుండదు... తర్వాత నీ ఇష్టం.."

మేస్త్రి తుపుక్కున ఉమ్మేసి, జీపుల పోయి కూచున్నాడు. అంటే ఇక ప్రశ్నలకు తావులేదన్నమాట.

అనేక ప్రశ్నలు... పాముల్లా బుసగొడ్తున్నాయ్.. ఒక్కదానికీ జవాబుచెప్పేట్టు లేదు మరి...

భీమమ్మకు అనుభవ రీత్యా చాలా విషయాలు తెల్సు.

ఏ కారణాంగానయినా పనిలోకి రావడం ఆలస్యమయితే మేస్త్రీల ప్రవర్తన భీమమ్మకు గుర్తే... పనిచాతగాక పారిపోయి వొచ్చిన వాళ్ళనూ చుట్టాలను చూడటాన్కి వచ్చి ఆలస్యమయిన వాళ్లనూ, ఇంటికొచ్చినాంక జబ్బు పడ్డ వాళ్ళనూ, కాళ్లూచేతులు గట్టి జీపులు పడేసుకుపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఒక్కోసారి భర్త రాకపోతే భార్యనూ, భార్య రాకపోతే భర్తనూ రూముల్లో వేసి చితకబాదిన సందర్భాలున్నాయి. ఒక్కోసారి కూలీలు పారిపోయి వస్తే... స్వయంగా సర్పంచే "ధర్మ కంకణుడై" వాళ్లను మేస్త్రీకి పువ్వుల్లో పెట్టి అప్పజెప్తాడు. గుంపు మేస్త్రి పక్క ఊరి వాడయినా సరే... పని గట్టుకొని వాళ్లను పట్టుకుపోయి అప్పగించి వస్తుంటారు.. గుంపుమేస్త్రీలకు, సర్పంచ్‌లకు ఉన్న సంబంధం... రాజకీయాలకు వ్యాపారాలకు ఉన్న సంబంధంలాంటిదే... ఒక్కోసారి సర్పంచ్‌లు మాజీలయినాంక వాళ్లే గుంపు మేస్త్రీలుగ అవతారమెత్తుతారు. ఏ దోపిడీనైన సజావుగా సాగించాలంటే.. ముందు సర్పంచ్‌ను పట్టుకుంటే చాలు.

చాలాసార్లు గంపు మేస్త్రీలను తోడేళ్లలాగా, కూలీలను కుందేళ్లలాగ చెప్పుకుంటూ ఉంటారు.

కబేళాకు బయలుదేరే గొడ్డులాగ భీమమ్మ కళ్లొత్తుకుంటూ బయలుదేరింది. కనీసం గొడ్డన్నా వ్యాన్ ఎక్కడానికి ప్రతిఘటిస్తుంది.. అరుస్తుంది... వీళ్లకా స్వేచ్ఛ కూడా లేదు...

పనికి రాకపోతే... "మేస్త్రీకి పుట్టినావ్రా..." అంటూ సెంటిమెంట్‌తో కొడతారు.

* * *

పొయ్యేటప్పుడు ఓ వంద రూపాయలు సావిత్రి చేతిల బెట్టి,

అన్ని జాగ్రత్తలు జెప్పి... చుట్టుపక్కల వాళ్లకు 'దయజూడమని జెప్పి'. డాక్టరు నర్సుల కాళ్లమీద పడి, "ఎట్లనన్న తన సెల్లెల్ని బతికించాలని... పోరి దిక్కులేనిదయితదని" చెప్పి బయలుదేరింది.

పెద్దమ్మ వెళ్లిపోతూ ఉంటే సావిత్రి రావి చెట్టు కింద నిలబడి ఒకటే ఏడ్చేసింది... చివరి ఓడ ఆ పిల్లను నిర్మానుష్యపు తీరం మీద ఒదిలివెళ్లినట్టుగా ఉంది. అర్ధరాత్రి... ఎటుబోవాల్నో తెలీని స్థితిలో ఉంది ఆ పిల్ల పరిస్థితి...

* * *

తల్లి భారమంతా సావిత్రి మీద పడింది. ఆ పిల్ల అకస్మాత్తుగా ఎదిగిపోయింది. నీడలో నుంచి ఎండలోకి వచ్చినట్టుగా ఉంది. ఒక తప్పనిసరి విషాదాన్ని, నిర్వేదంగా భుజాన్నెత్తుకొని నడుం బిగించింది.

ఆ పిల్ల తల్లి మూత్రాన్ని బేసిన్‌లో పట్టి దుర్గంధం ఉట్టిపడే టాయ్‌లెట్‌లో పోసి, జారిపడిపోకుండా నెమ్మదిగా వచ్చింది. తల్లి ఒంటి మీద నెమ్మదిగా మలాము రాయడం మొదలెట్టింది.

పూర్తిగా ఒళ్లు కాలిన యువతి వెర్రికేకలేస్తోంది. "అమ్మో... నాకు శాతగాదే... గింతమందియ్యవ్రే... నేను జస్తనే..." అంటూ వార్డంతా దద్దరిల్లేలా అరుస్తోంది. మరోపక్కన గర్భంతో ఉన్న యువతి చర్మాలు ఎక్కడివక్కడ ఊడి ఒకటే మూలుగుతోంది... లోపల బిడ్డ చనిపోయి ఉంది... బిడ్డను తీస్తే తల్లికి ప్రమాదం... అసలు పెద్ద ప్రాణానికే దిక్కులేదు.... ఒకతను తెల్లటి మనిషి.. వీపుమీద చర్మం కాలినచోట తెల్లని బట్టవేసుకొని దయ్యంలాగ నడుస్తూ బాత్రూమ్ కేసి పోతున్నాడు.

సావిత్రికివేమీ పట్టడం లేదు. పదేళ్ల పిల్ల యోగిలాగ తయారయ్యింది. ఆ పిల్ల తల్లి పక్కనే కూచొని తువ్వాలతో గాలి ఊపుతోంది.. పదేళ్ల వయస్సులోనే పది జీవితాల వయస్సొచ్చిందా పిల్లకు. తల్లుల గన్నతల్లి అయింది. స్నానం చేసి చాలా రోజులయ్యిందేమో... అసలా సంగతే మర్చిపోయింది.. బట్టలు అట్టలు గట్టిపోయాయి.

రంగమ్మకు తన బిడ్డను గుండెకు హత్తుకొని ఏడవాలనుంది... ఈ ప్రపంచాన్ని తిట్టిపోయాలనుంది. కాని చర్మమూడిన శరీరంతో ఎట్లా సాధ్యం..? లోపలేం రగుల్తున్నదో తెలీదుగాని, బిడ్డవైపు నిస్సహాయంగా చూస్తోంది. కళ్లు నీటి చెలిమలయ్యాయి.

"పాపమా పిల్లజూడు... చూస్తే ఎవరికయినా జాలేస్తది గదా..." అందో నర్సు.

"ఔనక్క... పదేళ్లపిల్ల... తల్లికి ఎంత జేస్తుందో?" అంది ఇంకోనర్సు.

"మనం పెద్దోల్లం కూడా ఇంత ఓపిక మీద సర్వ్ చేయలేం... వచ్చిన కాడికెల్లి ఆ పిల్లకు తల్లే లోకం... అందరు తల్లులకీ ఇట్లాంటి బిడ్డలుంటే బావుండే.."

"మురికి అనదు... మైల అనదు... అన్ని పన్లు తానే జేసి పెద్దదిక్కయ్యింది..."

"రాత్రి పూట తల్లి మూల్గుతుంటే... పక్క ఇద్వదు తెల్సా... ఊపి... ఊపి... తెల్లరగట్ల నిద్రవోతది..."

"ఔనక్కా... మొగుడు లేనందుకు బిడ్డ సరిపోయిందే..."

"ఆ... నీ మాటలు గాని... మొగుడుంటే మాత్రం ఈ పన్లన్నీ జేసెటోడా ఏంది? ఎన్ని తిట్లు దిడ్తుండెనో?"

"పిల్ల పేరు సావిత్రి గదూ..."

"ఔను.. ఏం?"

"ఆహా... ఏం లేదూ... ఆనాటి మొగుణ్ణి కాపాడనీకె కష్టాలు పడితే... ఈ సావిత్రేమొ తల్లిని గాపాడుకోనికె కష్టాలు వడ్తున్నది." (చిన్నగా నవ్వు)

"ఇంతకూ పేషెంటు బత్కుతదంటవా?"

"ఏమో... నమ్మకం తక్కువ... వారం రోజులయ్యింది... డెవలప్‌మెంట్ లేదు... డాక్టర్లు ఇంట్రస్టు చూపిస్తే బావుండు... ఈల్ల దగ్గర్నైమొ డబ్బుల్లేనట్టున్నయ్..."

"ఔనక్కా... గిది పేరుకే గవర్నమెంట్ దవాఖాన... అందర్నీ తడుపాలె... మొన్నజూడు... వెయ్యి రూపాయలియ్యలేదని ఆపరేషన్ లేట్... పేషెంట్ ఔట్..."

"ఇంతకీ ఈ తల్లి జస్తే ఈ పిల్లకు దిక్కెవరో...?"

"ఇంక దిక్కెవరు... తండ్రి ఉన్నా లేనట్టే... సుట్టాలు తలోదిక్కు వోయిన్రట... షి విల్ బి ఆన్ ద రోడ్.

ఎవరో కొత్త పేషెంటు రావడంతో నర్సులు వెళ్లిపోయారు. వేసవికాలం గావడంతో గాలి స్తంభించినట్టుగా ఉంది... ఎండ వేడికి గాయాలు సల్పుతున్నాయి...

* * *

పోస్ట్‌మార్టం గది హాస్పిటల్‌కు ఓ మూలన దూరంగా కట్టారు. బతికున్న శవాలకు, చచ్చిన శవాల గాలిసోకగూడదనేమొ... కాస్త దూరంగా కట్టారు.

శవాలు ఒక్కొక్కటే గదిలోకి పంపుతూ ఉంటే, శవం వెంబడి వాళ్ల తాలూకు మనుష్యులు ఏడుస్తూ గగ్గోలు పెడ్తున్నారు.. చెట్ల కింద అన్నాలు తింటున్న వాళ్లకు ఈ పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది.

పోస్ట్‌మార్టం గదిచుట్టూ ఒక నిశ్శబ్దం, ఒక నిరీక్షణ, ఒక పెను దుఃఖం అలుముకొని ఉన్నాయి.

సావిత్రి కాలుగాలిన పిల్లిలాగ ఆ పోస్ట్‌మార్టం గదిముందు తచ్చాడుతోంది. వార్డ్ బాయ్‌లు హడావిడిగా తిరుగుతున్నారు. "అన్నా... అన్నా... మా అమ్మను లోపలికి దీస్కపోయి చాల సేపయింది. ఇంకా బైటికి తీస్కరాలె..." అమాయకంగా అడిగిందా పిల్ల. వార్డు బాయ్ ఆ పిల్లవైపు నమ్మలేనట్లుగ జూశాడు. ఏదో వేరే లోకం నుంచి వచ్చిన 'ఎలీన్'లాగ కన్పించిందతనికి... నఖశిఖ పర్యంతం జూసి పేరడిగాడు... చెప్పింది...

"తెల్వదా పిల్లా... మీయమ్మ చచ్చిపోయింది. ఈడికి చచ్చిపోయినోల్లనే దెస్తరు... ఫో... ఫో... మీ వాల్లను తోల్కరాపో..." అంటూ "ఇదెక్కడి కేసురా బాబూ" అని విసుక్కున్నాడు.

సావిత్రికి దిమ్మదిరిగినట్టయ్యింది.

"మాయమ్మ జచ్చిపోయిందా... ఎట్ల జస్తది... రాత్రి డబల్‌రొట్టే... పాలు నేనే పెట్టిన... నాతోటి మంచిగనే మాట్లాడింది. ఎట్ల జచ్చిపోతది. మాయమ్మ సావదు..." అంటూ ఆ పిల్ల బైటికే అనేసింది...

వార్డ్‌బాయ్ జాలిగ నవ్వాడు...

"పిచ్చిదానా... పో... మీవాల్లెవరన్నా ఉంటే... పిలువ్... బాడీని దీస్కపోవాలె..." అంటూ ఎవరో పిలవడంతో వెళ్లిపోయాడు.

* * *

ఊహించని పిడుగేదో ఆ పిల్ల నెత్తిన పడ్డట్టయ్యింది. "తన తల్లి చావలేదు..." అన్న అమాయకమైన చిన్న నమ్మకమేదో ఆ పిల్లలో మిగిలే ఉంది. వేగంగా దవాఖాన్లకు పోయింది... బర్నింగ్‌వార్డులకు పోయి నర్సులనడిగింది. చుట్టుపక్కల వాళ్లనడిగింది... అందరూ జాలిగ అదే విషయం చెప్పారు... కొందరు ఏడ్చారు కూడ...

ఆ పిల్ల మనసంతా ఖాళీ అయింది...

నీళ్లు తోడేసిన ఊట బావి అయింది...

"నిజంగానేనా? తన తల్లి చచ్చిపోయిందా? అందరూ అదే అంటున్నారు... నిజమేనా?" గోడకు జేరగిలబడి, మునిగాళ్ళ మీద కూర్చుండిపోయింది.

"మీ అమ్మ చచ్చిపోయింది. మీ అమ్మ చచ్చిపోయింది" అంటూ నర్సులు, డాక్టర్లు, వార్డ్‌బాయ్‌లు, చుట్టూ పేషెంట్లూ, వాళ్ల తాలూకు మనుషులూ, చెట్లూ, పిట్టలూ, గాలీ, భూమీ, ఆకాశము వందల వేల నోర్లు పెట్టుకొని తననే అంటున్నట్టుగా ఉంది. మొత్తం హాస్పిటల్ భవనమంతా తన మీద కుప్ప కూలినట్టుగా ఉంది.

అంతా చీకటి... పెను విషాదం.. ఎవరికీ చెప్పుకోలేని స్థితి. ఆ పిల్లకు తన ఊరు, తన ఇల్లు, తను ఆడిన స్థలమూ, తన దోస్తులు, ఇంటి ముందు వేపచెట్టు, పక్కింటి లేగదూడ, భద్రంగా దాచుకున్న నెమలి ఈక, అన్నం పెట్టిన పక్కింటి ముసలవ్వా ఇలా అందరూ అన్నీ జ్ఞాపకమొచ్చాయి... అలా వచ్చీ వచ్చీ ఒక్కటొక్కటిగా మాయమయిపోతున్నాయి...

"ఓ పోరీ... ఇంకా ఇక్కడ్నే గూసున్నవా... పో... బాడీని దీస్కపోనీకే మీ వోల్లను దీస్కరాపో..." కసురుకుంటూ చెప్పి వెళ్లాడు వార్డ్‌బాయ్.

పట్టుదప్పుతున్న నరాలను బిగబట్టుకొని, ఆ పిల్ల ఓపిగ్గా లేచి నిలబడింది. ఒక్కసారిగ హాస్పిటల్ వైపు చూసింది. హాస్పిటలంతా చావు వాసనేసింది... లోపల్లోపల ఏదో గొణుక్కుంటోంది..

"మా అమ్మ చచ్చిపోయింది... మా నాయన చచ్చిపోయిండు. మా ఊరు చచ్చిపోయింది. ఈ దవాఖాన చచ్చిపోయింది. ఈ డాక్టర్లు సచ్చిపోయిన్రు... ఈ నర్సులు సచ్చిపోయిన్రు. అసలు... నేను... నేను గూడ సచ్చిపోయిన" అంటూ తనలోనే తాను గొణుక్కుంటూ కొంత దూరం నడిచి రోడ్డు దాటబోయింది. ఈలోపున అటునుండి వస్తున్న లారీని గమనించలేదు. ఆ లారీ గుద్దేయడంతో ఆ పిల్ల నడిరోడ్డు మీద గిలగిలా కొట్టుకొని ప్రాణాలు విడిచింది.

* * *

రద్దీప్రాంతం గావడంతో మంది గుంపు గూడారు.

లారీ దెబ్బకు డైరెక్షన్ చూయించే ఇనుప దిమ్మె విరిగి పోయింది. హైమాక్స్ లైటు స్తంభం ఓ పక్క ఒరిగిపోయింది. రోడ్డు పక్కన ఉన్న భారీ హోర్డింగ్‌లోని నాయకుల ముఖాలు నిస్సహాయంగా వేలాడుతున్నాయ్.

ఎండ మరింత చిరాగ్గా ఉంది.

"ఎవరమ్మాయో..." గుంపు లోంచి అడిగారెవరో.

"యా ఊరో..."

"యాడికొచ్చిందో..."

"తల్లి దండ్రి ఉన్నరో, లేదో"

"తోడన్న ఉన్నరో, లేదో..."

ఏదయినా చెప్పడానికి ఎవరున్నారనీ...

రోడ్డంతా చావు వాసన...

మార్క్సిజం లెనినిజం మావోయిజం

స్టడీ నోట్స్



వెల : రు. 50/-

న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

ప్రతులకు :

మైత్రి బుక్ హౌజ్ విజయవాడ,
దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్, నవోదయ పబ్లిషింగ్ హౌస్,
కాచిగూడ, హైదరాబాద్, సహచర బుక్‌మార్క్, హైదరాబాద్,

కథ

విప్లవ పయనం

- మిడ్కో

"నీకో శుభవార్త చెప్తాను" అందరికీ చేతులు కలిపి కొంచెం దూరంగా వెళ్లి కిట్టు దించుకుంటున్న అనిత దగ్గరకు పరుగు పరుగున వెళ్లి ఆత్రంగా చెప్పాడు సత్యం, చెప్పబోయే వార్త తాలూకు సంతోషంతో నల్లని ఆయన మొహం వెలిగి పోతోంది.

ఆయన ఆత్రుతను కానీ, సంతోషాన్ని గానీ పట్టించుకునే స్థితిలో లేదు అనిత. దాదాపు పదిరోజులుగా సత్యం ఎప్పుడెప్పుడు కలుస్తాడా అని ఆరాటపడుతోందామె.

"ఊహు కాదు నేనే నీకో శుభవార్త చెప్తాను" నల్లటి ఆమె మొహంలోనూ ఆనందపు కాంతి దాగడం లేదు.

"ఊహు నేనే ముందు చెప్తాను"

"ఉహుహు నేనే ముందు చెప్తాను"

"నేనే మొదట నీ దగ్గరికి వచ్చానుగా చెప్పడానికి, నువ్వేమన్నా నా దగ్గరికి వచ్చావా?"

"బాగుంది నేనిప్పుడే వచ్చి ఇంకా కిట్టన్నా దించుకోలేగా..."

"మొన్నటి నుండి నువ్వెప్పుడు కలుస్తావా? నీకెప్పుడు చెప్పాలా? అని చూస్తున్నా నేను"

"నువ్వు మొన్నటి నుండి చూస్తున్నావు కానీ నేను పది రోజుల నుండి చూస్తున్నా"

చాలా మంది కామ్రేడ్స్ కలిసిన కోలాహల వాతావరణంలో సహజంగానే నవ్వుల పువ్వులు విరుస్తున్నాయి. మాటలు కలగాపులగంగా కల్సిపోతున్నాయి. కొందరు మాత్రం అలసటగా కిట్లు దించుకొని కనబడ్డ రాళ్ల మీదనో, మొద్దుల మీదనో కూలబడ్డారు.

తమ మాటలు వినేంత దూరంలో ఎవరూ లేకపోవడంతో అనిత, ఆమె సహచరుడు సత్యం సరదా తగువులోకి దిగిపోయారు.

"సరేలే లేడీస్ ఫస్ట్ కదా. నువ్వే చెప్పులే" తన అవకాశాన్ని ఆమెకు త్యాగం చేస్తున్నట్టుగా మొహం పెట్టాడతను.

వచ్చిన అవకాశాన్ని వదులుకోవడానికి క్షణం కూడా ఆలస్యం చేయదల్చుకోనట్టుగా అందామె "లలిత, శేఖర్‌ల పెళ్లయింది... నేనే పెళ్లి పెద్దను"

సత్యం మొహం బొగ్గులా మాడిపోయింది. నెమ్మదిగా ఓ రాయి మీద కూలబడ్డాడు.

అనిత అయోమయంలో పడింది.

"అరె ఏంటలా అయిపోయావు? వాళ్ల పెళ్లి వార్త మనకేం కొత్తది కాదుగా. ఎప్పుడో నిర్ణయం అయిందేగా!"

అతనిలో ఏ మార్పూ లేదు.

"అరె ఏంటి ఏమయింది నీకు? ఒక్కసారిగా అలా అయిపోయావు..." పక్కనే మరో రాయి మీద కూలబడిందామె.

బాధగా చూశాడామె వైపు.

"ఏంటి ఏదో శుభవార్త చెప్తానన్నావు" అయోమయంలోంచి తేరుకోనప్పటికీ అనేసింది.

"ఏం లేదులే"

"అరె 'చెప్తాను చెప్తాను' అని ఇప్పటి దాకా గొడవ చేసి ఏం లేదంటావేంటి?"

"మధు జైలు నుండి విడుదలయ్యాడు. లోపలికి వచ్చేశాడు కూడా. మన జిల్లాకే..." అతని చూపులు నేలను తాకుతున్నాయి.

"నిజమా? ఎప్పుడు?"

"మొన్నే... రిసీవ్ చేసుకున్న దాంట్లో నేను కూడా ఉన్నా. ప్రయాణంలో ఉన్నాడు. మనవాళ్లకు కబురు అందించడం కోసం నేను ఫాస్ట్‌గా వచ్చేశాను. ఇప్పుడు మళ్లీ వెళ్తున్నా. సాయంత్రానికల్లా తనిక్కడికి వచ్చేస్తాడు."

"బాబోయ్ లలిత.. అసలు తట్టుకుంటుందా?"

ఆమె కళ్లు ఆత్రంగా లలితను వెతుక్కున్నాయి. కొంచెం దూరంలో కిట్టు దించుకొని నిలబడే ఉండి ఆ దళ కమాండర్ రమేష్‌తో నవ్వుతూ మాట్లాడుతోందామె.

ఇద్దరూ మాటలు మర్చిపోయి కూర్చుండిపోయారు. చలికాలం కావడంతో సూర్యుడు ఇప్పుడిప్పుడే బద్ధకంగా వళ్లు విరుచుకుంటున్నాడు. మంచు తెరలను తొలగించుకుంటోన్న అడవి తరీటగా కళ కళలాడుతోంది.

* * *

"ఇప్పుడే నిద్ర లేచినట్టున్నవ్"

"ఊ... ఇన్ని రోజుల నడకకు బాగా అలిసి పోయినట్టయింది గదనే. స్నానం చేసి, అన్నం తినేప్పటికి నిద్ర ముంచుకొచ్చింది" తన పాలిథిన్‌లోకి సురేష్‌ను ఆహ్వానిస్తున్నట్టుగా కొంచెం సర్దుకొని కూర్చుంది లలిత. సురేష్ ఆ జిల్లా పార్టీ కమిటీ కార్యదర్శి.

అతను అక్కడికి రావడం చూసి పక్కనే కూర్చొని ఉన్న లలిత గార్డ్ లేచి దూరంగా వెళ్లిపోయింది.

"నువ్వేందే అసలు రెస్ట్ తీసుకున్నట్టు లేదు..." లలిత.

"రమేష్‌తో రిపోర్టు తీసుకుంటూ ఉన్నా" కొంచెం ఇబ్బందిగా నవ్వుతూ అన్నాడు.

"కొంచెం సేపు రెస్ట్ తీసుకుంటే బాగుండేది కదా. ఇన్ని రోజుల నడక అలసట కొంచెం తీరేది. తర్వాత మాట్లాడుకోవచ్చు కదా..."

"నిజమే కానీ కొన్ని అర్జంట్‌గా మాట్లాడుకోవల్సినవి ఉండే.."

"ఊహు" అంటూ వినడానికి తానూ సిద్ధమై పోయింది.

"ఉదయం మనం రాగానే నాకీ వార్త తెల్సింది లలితా... అప్పటి నుండి నీతో చెప్పాలనుకుంటున్న... కానీ..."

"చెప్పవే ఎందుకు వెనుక ముందయితున్నవ్..." అతని గొంతులో ధ్వనిస్తున్న ఇబ్బందిని గుర్తించి అందామె.

"మొన్న పదిన మధు రిలీజ్ అయ్యాడట. లోపలిక్కూడా వచ్చేశాడట..."

తానేం వింటున్నది కొద్ది క్షణాలు లలితకు అర్థం కాలేదు. అర్థం కాగానే మొహం వెలిగిపోయింది. "నిజమానే... నువ్వు చెప్తున్నది నిజంగా నిజమానే..."

"మనం ప్రయాణంలో ఉన్నాం కాబట్టి మనకీ వార్త తెలియలేదు కానీ బయట ఇదొక సంచలన వార్త అయ్యిందట."

"అబ్బ నిజమా? లోపలిక్కూడా వచ్చిండంటున్నవ్? నీకెట్ల తెల్సిందే? సేఫ్‌గనే వచ్చుంటడా? వాడు రానిచ్చుంటడా?"

"చాలా సేఫ్‌గా వచ్చేశాడట. ఎక్కడికో కాదు మన జిల్లాకే వచ్చేశాడు. సత్యం వాళ్ల తనను స్వయంగా కల్సి వచ్చారు. అంతే కాదు సాయంత్రం తను ఇక్కడికి వచ్చేస్తున్నాడు."

"నిజమా?" కళ్లు చెమ్మగిల్లాయామెకు.

సురేష్‌కు ఆశ్చర్యంగా ఉంది. తానీ వార్త చెప్పగానే ఆమె షాక్ తింటుందని అనుకున్నాడతను.

"మనం వచ్చాకే మళ్లీ ఒక టీంను పంపించాం. నీకు నెమ్మదిగా చెప్దామనుకున్నా... ఈపాటికి వచ్చేస్తుంటారేమో"

"అరె మనమొచ్చినంక పంపిచ్చిన్రా. నాతోటెందుకు చెప్పలేదే. రిసీవ్ చేస్కుంటందుకు నేంగూడ పోదును గదా..."

ఇంకింత ఆశ్చర్యపోయాడతను.

మధు వస్తుండా... తన మధు వస్తుండా.. ఇన్నేండ్ల తర్వాత మధును తాను చూడబోతున్నదా... అనిర్వచనీయమైన భావమేదో కుదుపేయసాగిందామెను.

* * *

తన స్వభావానికి విరుద్ధంగా నిశ్శబ్దంగా ఫార్మేషన్లో నడుస్తున్నాడు మధు. నిన్నటి నుండీ ఎడతెగకుండా తమతో మాట్లాడుతున్న అతను నిశ్శబ్దంగా నడవడం కొందరు కామ్రేడ్స్‌కు ఆశ్చర్యంగా ఉంది. కొద్ది సేపట్లో లలిత కలుస్తుంది. అని తెల్సిన వాళ్లకు మాత్రం ఆ మౌనం అర్థమయింది. అందుకే తనతో ఇంకా ఏవేవో మాట్లాడించాలన్న తమ కోరికను అణచుకొని నడుస్తున్నారు.

ముందు టీంలో నడుస్తున్న సత్యం కూడా నిశ్శబ్దంగా నడుస్తున్నాడు. తనకు ముందూ వెనుకా నడుస్తున్న వాళ్లు ఏదైనా అడిగినా అన్యమనస్కంగా జవాబిస్తున్నాడు. వాళ్లేమైనా జోకులు వేసినా గంభీరంగా చూస్తున్నాడు. ఆలోచనలు గిజిబిజిగా అతని బుర్రను తొలుస్తున్నాయి. మధుకైనా మరికొందరికైనా 'కాన్ఫరెన్స్ నుంచి సురేష్, లలిత తిరిగి వచ్చారు. సాయంత్రం కలుస్తారు' అని మాత్రమే చెప్పగలిగాడు కానీ మరేం చెప్పలేక పోయాడు.

అది చెప్పగానే మధు కళ్లల్లో చమక్‌మన్న వెలుగు మళ్లీ మళ్లీ గుర్తుకొస్తూంటే అతని మనసు మెలిపెట్టినట్టవుతోంది.

మధుకు విషయం చెప్పేసి ఉంటే బాగుండేదా? కానీ తనకు అనిత ద్వారా తప్ప జిల్లా కమిటీ వాళ్ల ద్వారా తెలియలేదుగా... వాళ్లే స్వయంగా విషయం చెప్దామనుకున్నారేమో. అయినా తను చెప్పాలనుకున్నా చెప్పగలిగేవాడా? చెప్పడానికి నోరు వస్తుందా అసలు.

మౌనంగా నడుస్తున్న మధు అంతరంగం ఆలోచనలతో ఎగిసిపడుతోంది. ఎన్నో ఆలోచనలు... ఎన్నో భావనలు... ఎన్నో ఉద్వేగాలు మనసులో గిరికీలు కొడుతున్నా ఒక ఆలోచన, ఒక భావన, ఒక ఉద్వేగం మాత్రం అన్నింటినీ పక్కకు తోసేస్తూ అతన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అతని మనసులోని బాధనూ దుఃఖాన్నీ మరిపిస్తూ కళ్లల్లోకి ఆనందభాష్పాన్ని తెప్పిస్తోంది.

'కొద్ది సేపట్లో ఆమె కలుస్తుంది...' మనసు ఎన్ని సార్లు మననం చేసుకుంటున్నదో.

ఎన్ని యుగాల ఎదురుచూపుల ఫలితమిది!

ఎలా ఉందో... తన ఆరోగ్యం గురించి ఎన్నోసార్లు ఆందోళనాకరమైన వార్తలు వినాల్సి వచ్చింది!

ఎంత వద్దనుకున్నా మనసులో ఒక ప్రశ్న మళ్లీ మళ్లీ మెదులుతోంది.

'తను పెళ్లి చేసుకొని ఉంటుందా?'

ఎందుకు ఈ విషయం గురించి మళ్లీ ఇంతలా ఆలోచిస్తున్నాడు తను. మూడేళ్ల క్రితమే తనతో బంధం తెగిపోయిందిగా... తిరిగి పెళ్లి చేసుకొమ్మనీ చేసుకోవడం తప్పు కాదనీ ఇదే విడాకుల పత్రంగా భావించమనీ ఉత్తరం రాసేశాడుగా... గుండెను రాయి చేసుకున్నాడుగా... చేసుకున్నాడా? చేసుకోవాలనైతే అనుకున్నాడు గానీ... బంధం తెంచేసుకున్నాననుకున్నాడు గానీ నిజంగా తెంచేసుకోగల్గాడా? నిజానికి అలా తెంచేసుకోవడం సాధ్యమా! అలా తెంచేసుకోగల్గే అనుబంధమా తమది!

ఎలా ప్రవేశించిందామె తన జీవితంలోకి?

మొదటిసారి కలిసినప్పుడు ఆమె ఒక మూర్తీభవించిన విషాదం.

ప్రేమనూ మనసునూ ఆశయాలనూ ఆశలనూ పంచుకున్న ఆమె సహచరుడు విక్రం కళ్ల ముందే చెరువులో మునిగిపోయిన పీడకల నుండి అప్పటికింకా ఆమె తేరుకోనేలేదు.

దానికి తోడు తీవ్ర అనారోగ్యం... సహచరుడి వియోగాన్ని తట్టుకోలేని మానసిక వత్తిడి ఫలితంగా దాపురించిన ఫిట్స్... కరువు జిల్లాగా పేరుపోయిన పాలమూరు జిల్లాలో అదీ చెంచు ఆదివాసీల నడుమ పనిచేయడం వల్ల కారపు మెతుకులు దొరకడమే గొప్పగా భావించే పరిస్థితిలో తరచూ రక్తం కక్కుకునేది.

ఆశయం పట్ల మొక్కవోని విశ్వాసం తప్ప ఇంకేం నిలబెట్టిందామెను!

తాను పాలమూరు జిల్లా బాధ్యతలు కూడా తీసుకుని వెళ్తున్నప్పుడు సాగరన్న (పులి అంజన్న) ఏం చెప్పాడు? 'విక్రం అమరత్వంతో లలితక్క చాలా కుంగిపోయి ఉంది. ఫిట్స్‌తో పాటు రకరకాల అనారోగ్య సమస్యలతో చాలా ఇబ్బంది పడుతాఉంది.

పార్టీ నుండి కూడా ఆమెకు తగినంత సహకారం దొరకలేదనే చెప్పుకోవాలె. ఆమెనెట్లయినా మనం నిలబెట్టుకోవాలె. ప్రజల్లో మంచి పేరుందామెకు. ఆమెను ఆమెగానే కాకుండా విక్రం సహచరిగా కూడా చూస్తరు. విక్రం జిల్లా ప్రజలందరి ప్రేమను చూరగొన్న నాయకుడు కదా... కాబట్టి ఆయన సహచరిగా ఆమెను కూడా అందరూ గౌరవిస్తరు. కాబట్టి ఆమెను నిలబెట్టుకోలేకపోతే ప్రజలల్ల చెడ్డ ప్రభావం పడుతది. అంతే కాదు జీవిత సహచరులు చనిపోయినా మహిళలు దృఢంగా నిలబడగల్గినప్పుడు మాత్రమే పార్టీలో మహిళల వ్యక్తిత్వం పెరుగుతున్నట్టు లెక్క. లేకుంటే పార్టీల కూడా మహిళలు పురుషుల మీదనే ఆధారపడుతున్నట్టు అవుతుంది. భర్తలున్నన్ని రోజులు ఉంటరు లేకుంటే లేదు అనే ప్రచారం జరుగుతుంది. ఇది పార్టీలో చేరాలనుకునే మహిళలకు ఎటువంటి సంకేతాలను ఇస్తుందో మనం ఊహించుకోవచ్చు. మహిళల రిక్రూట్‌ను దెబ్బతీసే అంశమిది. వీటన్నింటిని నువ్వు దృష్టిల పెట్టుకో. తనకు పూర్తి సహకారం అందజెయ్యి'

అట్లా ఆమె గురించి విన్న దాన్ని బట్టే ఆమె పట్ల ఎంతో గౌరవ భావం ఉండేది. ఆమెను కల్సాక ఆ భావం రోజు రోజుకూ మరింత పెరిగింది. ఆమెకు సహకారాన్ని అందించడానికి శాయశక్తులా ప్రయత్నించాడు. ఆమె ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి శ్రద్ధ చూపించాడు.

అట్లా ఇద్దరి మధ్యా మంచి అవగాహన ఏర్పడింది. పరస్పరం విశ్వాసం, అభిమానం పెరిగింది. బహుశా అందుకే సాగరన్నకు ఇద్దర్నీ ఒకటి చేసే ఆలోచన వచ్చి ఉంటుంది.

ఆమెను పెళ్లి చేసుకుంటే బాగుంటుందని సాగరన్న తనకు సూచించినప్పుడు కాదనడానికి ఏ కారణమూ కనబడలేదు. మనస్ఫూర్తిగా అంగీకరించాడు.

"లలితక్కతో కూడా ఈ విషయం మాట్లాడమని మన వాళ్లకు చెప్పిన బహుశా తను కూడా అంగీకరిస్తుందనే అనుకుంటున్నా" ఎంత సంతోషంగా అన్నడో ఆ రోజు సాగరన్న.

ఆ తర్వాత కొద్ది రోజులకు పనిలో భాగంగా తాను లలిత వాళ్ల దళం దగ్గరకు వెళ్లాడు. ఆమెతో మనవాళ్లు విషయం మాట్లాడారా? మాట్లాడితే ఆమె అంగీకరించిందా? లేదా? ఇదేమీ తనకు తెలియదు. కాబట్టి ఏమీ ఎరుగనట్టుగానే తాను కొద్ది రోజులు వాళ్లతో ఉండి సమావేశాలు పనులూ ముగించుకొని బయల్దేరాడు.

ఇంకాసేపట్లో వాళ్ల నుండి వీడ్కోలు తీసుకోవాల్సి ఉండగా లలిత దగ్గరకు వచ్చి 'మధూ నీతో కాసేపు మాట్లాడాలె' అంది చిన్నగా.

సంతోషంగా తల ఊపిండు. ఆమె అడుగులో అడుగువేస్తూ వెళ్లి ఆమెకు ఎదురుగా నెగడు దగ్గర కూర్చున్నడు.

ఆ దృశ్యం ఇప్పటికీ తనకెంత బాగా, నిన్ననే జరిగినంత తాజాగా గుర్తుంది!

అప్పుడే తెల తెల వారుతోంది. పక్షులు మేల్కొంటూ ప్రపంచానికి మేల్కొలుపు పాడుతున్నాయి. చలి కాలపు ఆఖరి రోజులు. ఇద్దరూ అరచేతుల్ని మంటకు చూపిస్తూ కూర్చున్నారు.

కొద్ది క్షణాల కాల భారంగా గడిచింది. ఏ విషయం అయి ఉంటుంది? మన వాళ్లు మాట్లాడి ఉంటరా అనుకున్నడు తన మనసులో.

'మనవాళ్లు నీతో ఏమన్నా మాట్లాడిన్రా మధూ' మంట మీది నుండి చూపుల్ని తిప్పకుండానే నెమ్మదిగా అడిగిందామె?

ఆమె ఏం మాట్లాడాలనుకుంటున్నదో అర్థమైపోయింది తనకు. కానీ అప్రయత్నంగానే 'ఏ విషయం?' అన్నడు.

తన నోటి నుంచి ఆ మాట రావడంతో తనకేమీ తెలియదని ఆమె అనుకుంది.

'మన వాళ్లు నాతో ఒక విషయం మాట్లాడిన్రు... నిన్ను పెళ్లి చేసుకుంటే బాగుంటుందని... నాకు ఇష్టమే అని చెప్పిన...' ఆమె మాటల్ని ఆపింది కానీ ఆ మాటలకు కొనసాగింపుగా 'మరి నీకు?' అనే ప్రశ్న తనకు ధ్వనించింది.

"సాగరన్న నాతో కూడా మాట్లాడిండు... నాకూ ఇష్టమేనని చెప్పిన..." తను చెప్పినప్పుడు నెగడులో మరింతగా మెరిసిన ఆ మొహాన్ని తను ఎన్ని సార్లు ఇష్టంగా తలుచుకునేవాడో.

పెళ్ళయ్యాక రెండేళ్లకు పైగా తామిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉన్నారు. ఇద్దరి మధ్యా ఏ చిన్న పొరపొచ్చాలూ చొరబడలేదు.

ఇంతలో ఆశనిపాతంలా తన అరెస్ట్. ఆమె ఎంతగా కలత చెందిందో. జైల్లో ఉన్నప్పుడు ఆమె ఆరోగ్యం గురించి ఎన్నో ఆందోళనకర వార్తలు. తనతో పాటు పనిచేస్తున్న కొంత మంది నుంచి ఆమె ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని తెల్సినప్పుడు తనెంత బాధ పడ్డాడనీ. ఆమె ఎప్పుడూ ఒక సమస్యాత్మక మనిషి కాదు. ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తుంది! క్యాడర్‌తోనూ ప్రజలతోనూ ఎంత ఆత్మీయంగా ఉంటుంది! ఎదుటి వాళ్ల పట్ల ఎంత ఆత్మీయంగా ఉంటుందో అవసరమైనప్పుడు అంతే ఫైట్ చేస్తుంది కూడా. దాన్ని కొందరు భరించలేకపోయారు. క్యాడర్లో, ప్రజల్లో ఆమెకు పెరుగుతున్న ఆదరణను కూడా భరించలేకపోయారు. పార్టీలో మహిళల పట్ల దృక్పథంలో ఇప్పుడు చాలా మెరుగుదల వచ్చినట్టు అర్థమవుతోంది. కానీ తొలితరం మహిళా కామ్రేడ్స్ ఎన్నో ఇబ్బందులు పడ్డారు. బహుశా అటువంటి ఇబ్బందులను ఎదుర్కొన్న వాళ్లలో మొదటి స్థానం ఆమెదే కావొచ్చు. ఎంతో ఘోరంగా ఆమె ప్రతి కదలికను పితృస్వామ్య కళ్లద్దాల్లోంచి పరిశీలించడం... లేని పోని అనుమానాలు, అపార్థాలను సృష్టించడం. ఎంత నలిగిపోయిందో ఆమె! నిజానికి ఆమెను ఇబ్బంది పెట్టిన వాళ్లెవ్వరూ ఆ తర్వాత కాలంలో పార్టీలో సరిగా నిలబడలేదు. కొందరు శత్రువు ముందు మోకరిల్లారు కూడా. కానీ ఆ రోజు ఆమె పడిన వేదన మాసిపోదుగా. అది ఆమె జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేసిందనీ.

జరుగుతున్న విషయాలన్నీ ఆమె ఉత్తరాల ద్వారా, పార్టీ ఉత్తరాల ద్వారా తనకు అర్థం అవుతూనే ఉన్నాయి. ఎప్పుడెప్పుడు విడుదలై ఆమె వేదనను పంచుకుంటానా అని ఆలోచించని రోజు లేదు. కానీ తన విడుదల రోజు రోజుకూ దూరం జరిగింది. నిజానికి

తనే ఆమెకు అండగా నిలబడవలసిన అవసరం లేదు. పార్టీ ఆమెకు అండగానే ఉంది. ఆమెను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని పార్టీ ఖండిస్తూనే ఉంది, హెచ్చరిస్తూనే ఉంది. కానీ ఆమె మనస్తత్వం వేరు. సహచర కామ్రేడ్స్ నుండి ఆమె చాలా సన్నిహితత్వాన్ని కోరుకుంటుంది. ఆమె అంతరంగాన్ని అల్లుకుపోయి, ఆమెను అర్థం చేసుకునే వాళ్లు, ఓదార్చే వాళ్లూ కావాలి.

అటువంటి ఓదార్పును శేఖర్ దగ్గర పొందిందామె. ఒకవైపు తన విడుదల వాయిదా మీద వాయిదా పడ్డం, విడుదలపై తను కూడా ఆశలు వదిలేసుకున్న పరిస్థితిలో 'విడుదలయి వస్తాను' అని తను హామీ ఇవ్వలేకపోవడం, మరో వైపు ఆమె బలంగా ఒక తోడును కోరుకోవడం, శేఖర్‌తో పెరిగిన సాన్నిహిత్యం... ఇవన్నీ శేఖర్ పెళ్లి ప్రతిపాదన చేసినప్పుడు ఆమెను ఆలోచింప చేశాయి.

కానీ పార్టీ కూడదంది. జైల్లో ఉన్న తనను అది ఎంతగా బాధిస్తుందో ఆలోచించమంది. క్యాడర్లోనూ, ప్రజల్లోనూ మంచి ప్రభావం వేయదంది. శేఖర్‌ను కూడా పార్టీ తీవ్రంగానే హెచ్చరించింది. అప్పటికి గానీ ఆమె ఆ ప్రతిపాదనను తోసి వేయలేకపోయింది.

ఆ తర్వాత తనకు ఉత్తరం రాసింది. పెళ్లి గురించి తాను ఆలోచించినట్టూ, అలా ఆలోచించినందుకు క్షమించమంటూ, ఏ పరిస్థితి తననటువైపు నెట్టేసిందో, వేదనంతా వెళ్లగక్కుతూ వివరంగా రాసింది.

ఆ ఉత్తరం చదివి తానెంత షాక్ తిన్నాడనీ... తాను బతికుండగానే తన సహచరి, తన జీవితంలో సగభాగం, తన ప్రాణానికి ప్రాణం వేరొకరితో పెళ్లి గురించి ఆలోచిస్తున్నదని తెలిసి ఎంత గుండె కోతను అనుభవించాడనీ... అది కూడా ఇద్దరి మధ్యా ఏ చిన్న పొరపొచ్చాలు లేకుండా... ఆమె తనను ఎంతగా ప్రేమిస్తుందో, ఆరాధిస్తుందో తనకు కాక మరెవరికి తెల్సు? తనను అంతగా ప్రేమిస్తున్న, ఆరాధిస్తున్న ఆమె తనను అంత క్షోభలోకి నెట్టేసే వైపు ఆలోచించిందంటే... ఆమె మానసిక పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నట్టు... ఒంటరితనం ఆమెను ఎంతగా బాధిస్తున్నట్టు... ఎంత ఘర్షణలో కొట్టుమిట్టాడుతున్నట్టు... ఆమె పరిస్థితిని తలుచుకొని ఎంతగా తల్లడిల్లాడనీ... ఆ సమయంలో ఆమెను కలువలేని, ఆమెకు సహకారాన్ని అందించలేని తన స్థితిపై ఎంత అసహనం కల్గిందో... కటకటాలపై, జైలు గోడలపై ఎంత ఆగ్రహం కల్గిందో!

సరే ఏది ఏమైనా ఆ పొరపాటు ఆలోచన నుండి ఆమె బయట పడినందుకు ఊరటను పొందాడు.

ఆమెకు ఉత్తరం రాశాడు - తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దనీ, ఆమె పరిస్థిని అర్థం చేసుకుంటున్నాననీ.

నిజానికి ఆ విషయాన్ని తనకు సంబంధించిన నష్టంగానే, ఇబ్బందిగానే తాను చూడలేదు. పార్టీలో మొదటి తరం మహిళా కామ్రేడ్‌గా ఆమె ప్రజలపై, క్యాడర్‌పై ఎంత ప్రభావాన్ని వేసిందో, ఎందరి అభిమానాన్ని చూరగొందో తనకు తెల్సు. అటువంటి ఆమె తాను బతికుండగానే పెళ్లి చేసుకుంటే సమాజం దృష్టిలో దోషి అవుతుందనేది కూడా తాను చాలా ఆలోచించాడు.

కానీ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఆమె పెళ్లి గురించి మళ్లీ ఆలోచిస్తున్నట్టు, ఘర్షణ పడుతున్నట్టు తెలిసింది. అప్పుడిక తాను సరిగ్గా ఆలోచించవల్సి వచ్చింది. తన ఇబ్బందిని పక్కన పెట్టి ఆమె కోణం నుండి ఆలోచించాడు. ఆమె ఆలోచిస్తున్న దాంట్లో తప్పేం ఉంది? తన కోసం ఆమె ఎన్నాళ్లయినా ఎదురుచూడ్డం ఆదర్శం అవుతుందేమో కానీ తప్పనిసరి ఏమీ కాదుగా... ఎప్పుడు విడుదలవుతాడో అసలవుతాడో అసలు కానేకాడో తెలియని స్థితిలో ఉన్న తాను ఆమె ఎన్నాళ్లయినా తన కోసం ఎదురుచూడాలనుకోవడం సరైందేనా? పెళ్లి చేసుకున్నంత మాత్రాన రెండేళ్లు సహజీవనం చేసినంత మాత్రాన ఆమె మొత్తం జీవితాన్ని కట్టడి చేయడం కాదా అది. ఆమె కష్ట సుఖాల్లో తోడుగా నీడగా ఉండలేకపోతున్న తనకు ఆమె నిర్ణయాలను నిర్దేశించే హక్కు ఎక్కడుంది? అయినా ఆమె తనకు సహచరి మాత్రమే కాదు, పార్టీలో ఒక సీనియర్ కామ్రేడ్, వ్యక్తిత్వం ఉన్న కామ్రేడ్, మంచీ చెడూ ఆలోచించుకోగల్గిన శక్తీ, అనుభవమూ ఉన్న కామ్రేడ్. జీవితంపై ఆమెకున్న నిర్ణయాధికారాన్ని కాదనడానికి తనెవరు? ఆమెపై తనకున్నది ప్రేమనా? అధికారమా?

ప్రస్తుతం ఆమె ఒక తోడు కోసం ఎంతగా ఆరాటపడుతున్నదో తనకు తెలుస్తూనే ఉంది. ఒక తోడు లేకపోవడం అనేది ఆమె శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తున్నది. ఫలితంగా ఒక సీనియర్ కామ్రేడ్ శక్తి సమర్థతలన్నీ వృథా అయిపోవడం లేదూ... లేదా రావల్సినంతగా వెలికి రాకుండా ఉండిపోవడం లేదూ... ఆమె సహచరుడిగా, ఒక పార్టీ కార్యకర్తగా ఆమె రాజకీయ అభివృద్ధినే కదా తను కోరుకోవాల్సింది... పరి పరివిధాలుగా ఆలోచించుకున్నాడు.

ఇక ఆలస్యం చేయకుండా గుండె దిటవు చేసుకొని ఆమెకు ఉత్తరం రాశాడు. పెళ్లి చేసుకోవడం తప్పు కాదనీ, చేసుకునే హక్కు ఆమెకు ఉందనీ, ప్రస్తుతం ఆమె ఉన్న మానసిక పరిస్థితిలో చేసుకోవడం అవసరమనీ రాశాడు. ఈ ఉత్తరాన్ని విడాకుల పత్రంగా భావించమని కూడా రాశాడు. పార్టీకి కూడా రాశాడు - తమ విడాకులనూ, ఆమె పునర్వివాహ ప్రతిపాదనను ఆమోదించమని.

ఆ ఉత్తరం రాస్తున్నప్పుడు తానెంతగా దుఃఖించాడనీ? అవి అక్షరాలు కాదు విస్ఫోటనం చెందిన తన హృదయ శకలాలు!

మధుకు ఒక్కసారిగా పరిసరాలు మసకబారాయి. జేబులోంచి రుమాలు తీసుకొని కళ్లు తుడుచుకున్నాడు.

తన ఉత్తరానికి ఆమె బదులిచ్చింది. తన 'ఔదార్యానికి' కృతజ్ఞతలు తెల్పింది. క్షమించమని మరీ మరీ అభ్యర్థించింది.

కానీ ఆ తర్వాత ఇక ఏ విషయం తెలీదు.

'పెళ్లయి ఉంటుందా?' మళ్లీ తొలిచిందా ప్రశ్న.

ఒకవేళ ఇంకా పెళ్లి కాకుంటే... పునరాలోచించమని తను అడిగితే...

ఒక్కసారిగా ఆలోచనలు స్తంభించిపోయాయి అతనికి. ఏమిటిలా ఆలోచిస్తున్నాడు? తను విడుదల కావడం అసంభవం

అనుకున్నాడు. కానీ విడుదలయ్యేప్పటికి జీవితం మీద కొత్త ఆశలు పుడుతున్నాయా?

పెళ్లి కావడం, కాకపోవడం అన్నది టెక్నికల్ అంశమే తప్ప, ఆ రెంటికీ తేడా ఏముంది? పెళ్లి కాకుంటేనేం మానసికంగా ఆమె అతనితో ఐక్యమైనట్టేగా.

అయితేనేం? తన మీద వ్యతిరేకతతోనో, అయిష్టతతోనో ఆమె అతనికి దగ్గర కాలేదుగా ఒక అనివార్యత నుండి మాత్రమే అటు ప్రయాణించింది. అయినా పునరాలోచించమని తనొక రిక్వెస్ట్ చేస్తే తప్పేం ఉంది? తానేమీ వత్తిడి చేయడుగా.

కానీ తాను రిక్వెస్ట్ చేస్తే ఆమె కాదనలేదు. ఆమె నిర్మొహమాటంగా వ్యవహరించలేదు. అవుననే అంటుంది. కానీ మనస్ఫూర్తిగా అవుననంటుందా? శేఖర్‌ను మోసం చేశాననో, ఇబ్బంది పెట్టాననో ఆమె భావిస్తే... ఇటు కాదనలేక, మనస్ఫూర్తిగా అవుననలేక మళ్లీ ఆమెలో ఘర్షణ మొదలయితే... మళ్లీ ఆమె నలిగిపోతే...

ఏదోలా ఒక ఫుల్‌స్టాప్ పడిపోయింది. ఇక దాన్ని అలాగే ఉండనిస్తే పోదా? ఎందుకు మళ్లీ తనలో ఈ ఆలోచనలు.

కానీ తాను అరెస్ట్ అయినప్పుడు, శత్రువు చేతిలో చిత్రహింసలు అనుభవిస్తున్నప్పుడు ఆమెను ఎన్నిసార్లు తల్చుకున్నాడు? తనను చంపేస్తారనే అనుకున్నాడు. ఇక ఆమెను చూడలేడనే అనుకున్నాడు. కానీ ఎలాగోలా బతికిపోయాడు. జైలుకెళ్లాక జీవితంపై ఆశలు చిగురించాయి. ఇక ఎప్పుడో ఒకప్పుడు ఆమెను తప్పక కలుస్తాడనీ, ఆమె ఒడిలో తలపెట్టుకొని తన హృదయ వేదననంతా పంచుకోవాలనీ ఎన్నో కలలు కన్నాడు. ఇన్నాళ్లకు తాను తిరిగొస్తే అలా పంచుకునే అవకాశం లేకుండా పోవడం ఎంత దుర్భరం!

మధు ఆలోచనల నుండి తేరుకోకుండానే క్యాంపు వచ్చేసింది.

దారికేసే చూస్తూ కూర్చున్న లలిత ఎవరో వస్తున్న అలికిడి వినిపించగానే దిగ్గున లేచింది. కాళ్లలో వణుకు... గుండెలో దడ దడ... ఎలా అడుగులు వేసిందో తెలియదు. ఎదురుగా వస్తున్న మధును చూడగానే ఆమె ఈ ప్రపంచాన్నే మరిచిపోయింది. ఒక్క అంగలో అతన్ని చేరుకుంది. అతని గుండెలపై వాలిపోయి భోరుమంది. ఆమెను హత్తుకుంటూ అతనూ భోరుమన్నాడు. ఇద్దరి హృదయాలూ కన్నీరు మున్నీరయ్యాయి.

వాళ్లిద్దర్నీ అలా చూస్తూ కామ్రేడ్సంతా కళ్లు తుడుచుకున్నారు.

అక్కడున్న చాలా మంది కామ్రేడ్స్‌కు లలిత, శేఖర్‌ల పెళ్లయిందని తెలియదు. మరి కొందరికి ఆ ప్రతిపాదన ఉందని కూడా తెలియదు. అందుకే ఇన్నాళ్లకు కల్సిన ఆ 'జంట'ను కనులవిందుగా చూడసాగారు.

కొద్ది సేపట్లో క్యాంపంతా కోలాహలంగా మారింది. ఇప్పటిదాకా గూడు కట్టుకున్న నిశ్శబ్దం చెదిరిపోయి మధు మళ్లీ మాటల ప్రవాహం అయ్యాడు. పాలిథిన్‌లో కూర్చున్న అతని చుట్టూ కామ్రేడ్సంతా చేరిపోయారు. జైలు ఆవరణలోనే తిరిగి అరెస్ట్ చెయ్యాలనే శత్రు కుట్రను భగ్నం చేసి అతనెలా తప్పించుకుని వచ్చాడో తెల్సుకోవాలని అందరికీ కుతూహలంగా ఉంది.

హావభావాలతో చెప్తున్న మధును కళ్లప్పగించి చూస్తూ అతని కథనాన్ని ఆసక్తిగా వింటున్నారు. మధ్య మధ్యలో నవ్వులు గొల్లుమంటున్నాయి.

విప్పారిన మొహంతో పక్కనే కూర్చొని కళ్లనిండా అతన్నే చూసుకుంటూ కూర్చుంది లలిత. అలా ఎంత సేపు గడిచిపోయిందో. చీకటి పడిపోయింది. మెల్లగా నెగడు చుట్టూ చేరిపోతున్నారందరూ.

"బాగా తల నొస్తుంది. పోయి కాసేపు పడుకుంటా" అంటూ లేచిపోయింది లలిత.

మెల్లగా సురేష్ అందరినీ అక్కడి నుండి పంపించి వేశాడు.

"నీతో ఒక విషయం మాట్లాడాల్నే..." గొంతును స్వాధీనంలోకి తెచ్చుకుంటూ అన్నాడు సురేష్.

"మాట్లాడే" నెగడుకు దగ్గరగా జరుగుతూ చిరునవ్వు నవ్వాడు మధు.

"నీకు ఎలా చెప్పాలో అర్థం కావడం లేదే... మొన్నే పది రోజుల క్రితం లలిత, శేఖర్‌ల పెళ్లయింది..." ఇంకేం చెప్పలేకపోయాడు.

క్షణకాలం చిరునవ్వు మాయమైంది. "చెప్పడానికి అర్థం కానిదేముంది దీంట్ల? పెళ్లయిన వార్త నాకు తెల్వదు గానీ పెళ్లి అవుతుందనేదయితే తెల్సిందే కదా" చిరునవ్వుతోనే నెమ్మదిగా అన్నాడు. అతని మాటల్లో ఏ భావమూ వ్యక్తం కాలేదు.

పెళ్లి గురించి తామేం ఆలోచించిందీ లలితకు ఏం సలహా ఇచ్చిందీ సురేష్ చెప్పుకుపోతున్నాడు.

చిన్నగా తల ఊపుతూ వింటున్నాడు మధు.

అక్కడి నుండి వెళ్లిపోయిన అనిత, సత్యంలు ఇద్దరే ఓ చిన్న నెగడు వేసుకొని కూర్చున్నారు.

"వాళ్లిద్దర్నీ అలా పక్కపక్కన చూస్తుంటే ఎంత ముచ్చటగా ఉంది కదా. కానీ పాపం..." ఇంకేం మాట్లాడలేకపోయింది అనిత. సత్యం మౌనాన్ని వీడలేదు.

"లలిత పెళ్లి విషయం మధుకింకా తెలియదు కదా..." మళ్లీ తనే అంది.

"ఎలా తెలుస్తుంది? బహుశా ఇప్పుడు సురేష్ చెప్తాడేమో..." భారంగా ఉంది సత్యం గొంతు.

"పాపం తెలియదు కాబట్టే ఎంతో సంతోషంగా, హాయిగా నవ్వుతూ కబుర్లు చెబుతున్నట్టున్నాడు కదా..."

"లలిత కూడా అసలేమీ జరగనట్టుగానే ఉంది. మనసులో మాత్రం ఎంత ఘర్షణ పడుతున్నదో..."

"అబ్బో ఆ ఘర్షణ మామూలుగా ఉండదు. మనకు తెలుసుగా తన మనస్తత్వం... ఎంత సున్నితంగా ఉంటుందో"

"అవునూ పది రోజుల క్రితమే పెళ్లయిందంటున్నావు మరి శేఖర్ రాలేదేం..."

"అర్జెంట్ పనులున్నాయట సాయంత్రం పెళ్లయితే, తెల్లవారుజామునే అతను బయటకు వెళ్లిపోయాడు... లేకుంటే ఇద్దరూ జంటగా మధుకు ఎదురుపడి ఉండే వాళ్లే..."

"మాకసలు అపాయింట్‌మెంట్‌కు ఎవరొస్తారో తెలియదు. వెళ్లాకే తెల్సింది వచ్చింది తనని. మా అందరినీ కౌగిలించుకొని ఏడ్చాడు తెల్సా. ఎంత అప్యాయంగా మాట్లాడాడనీ మాతో. తన ప్రేమ, అప్యాయత గురించి మనం విని ఉన్నాం గానీ ప్రత్యక్షంగా చూడ్డం వేరు కదా... నేననుకున్నా పోనీలే లలిత ఇంకా పెళ్లి చేసుకోక ముందే వచ్చేశాడు. తను వచ్చాక ఇంక లలిత మరొకర్ని పెళ్లి చేసుకోవడం అంటూ జరగదు అనుకున్నా... ఛ ఓ పది రోజుల ముందే తను విడుదలైనా, పది రోజులు ఆలస్యంగా వాళ్ల పెళ్లి తేదీ నిర్ణయమైనా బాగుండు"

"మధు ముందే వస్తే లలిత కూడా తప్పక ఆలోచించేదేమో. ఆమెకు మధంటే ప్రాణం కదా. అంతగా ఆమె ఇంకెవర్నీ ప్రేమించలేదు... కానీ అలా ఆలోచించడం సరైందంటావా? ఎందుకంటే పెళ్లి కాకపోయుంటేనేం, లలిత, శేఖర్‌ల మధ్య కొన్నేళ్ల నుండి ఒక అనుబంధం ఏర్పడింది కదా. మళ్లీ మధు రాగానే దాన్ని కాదనుకోవడం సరైందంటావా?"

"ఆమె మధు మీద ఇష్టంలేక కాదుగా మరో పెళ్లి గురించి ఆలోచించింది? ఒక అనివార్యత నుండి ఆలోచించింది. ఇప్పుడా అనివార్యత లేదుగా. పైగా శేఖర్‌తో అనుబంధం ఏర్పడ్డాక ఇక ఆమెకు మధు మీద ప్రేమ తగ్గిందనో, లేదా అతన్ని మరిచిపోయిందనో అనుకుంటున్నామా? ఇప్పటికీ రోజుకు ఎన్ని సార్లు మధును తలుచుకుంటుందో మనకు తెలియదా? మళ్లీ పెళ్లి నిర్ణయాన్ని ఆమె ఎంత ఘర్షణ పడుతూ తీసుకుంది! ఇప్పటికీ ఎంతో ఘర్షణ పడుతూనే ఉందిగా. అటువంటిది తను విడుదలై వచ్చాక ఇంకో పెళ్లి చేసుకోగల్గేదా? ఎట్టి పరిస్థితిలోనూ చేసుకొని ఉండగల్గేది కాదు. అలా చేసుకోవడానికి మరింత ఘర్షణ పడివుండేది. దానికంటే మరో పెళ్లి ఆలోచనను విరమించుకొని మధుతోనే కలిసి ఉండాలనుకోవడంలో తప్పేం ఉంది?"

"తప్పొప్పుల ప్రస్తావన కాదు గానీ మనసులోంచి ఒకర్ని తుడిచేసుకొని మరొకర్ని ముద్రించుకోవడం అంత సులువు కాదు కదా అని..."

"కానీ ఆమె మధును తుడిచేసుకోలేదు కదా. తుడిచేసుకొని ఉంటే నేనిలా మాట్లాడేవాన్ని కాదు. ఆమెకు కూడా అంత ఘర్షణ ఉండి ఉండేదీ కాదు..."

"అలా అనుకుంటే పెళ్లి కాకపోయి ఉంటే బాగుండు అని అనుకోవడం మాత్రం ఎందుకూ? పెళ్లి అయితేనేం పెళ్లి ప్రతిపాదనను రద్దు చేసుకున్నట్టు... పెళ్లిని కూడా రద్దు చేసుకోవచ్చు కదా..."

"నా దృష్టిలో అయితే అలా కూడా ఏమీ తప్పు కాదు. ఒక అనివార్య పరిస్థితిలో తీసుకున్న నిర్ణయానికి జీవితాంతమూ కట్టుబడి ఉండాలనే నియమం ఏమీ ఉండనక్కర్లేదు. ఒకవేళ లలిత ఇప్పుడు శేఖర్‌తో పెళ్లి రద్దు చేసుకొని మధుతో కలిసి ఉంటానంటే, మధుకు కూడా అభ్యంతరం లేకపోతే నేనయితే దాన్ని పూర్తిగా సమర్థిస్తాను"

"ఇప్పుడు ఒకవేళ శేఖర్‌ని కాదనుకొని ఆమె మధుతోనే ఉండదల్చుకుంటే కూడా వాళ్లు మునుపటిలా ఉండగలరా? వాళ్ల మధ్య ఒక అడ్డుగోడ లేవలేదా?"

"ఇప్పుడు తను శేఖర్‌తో మాత్రం హాయిగా ఉండగలదా? మధుకు అన్యాయం చేశానని తలుచుకుంటూ కుమిలిపోతుంది. దానికంటే జరిగిందాన్ని ఒక తప్పుగా గుర్తించి దాన్నుండి బయటపడితే మంచిది"

"కానీ పాపం శేఖర్ ఇబ్బంది పడడా?"

"ఎవరో ఒకరు ఇబ్బంది పడాల్సిందే... శేఖర్‌ను" ఎవరో దూరం నుంచే అరిచిన అరుపుకు దాదాపు అందరూ దిగ్గుమని లేచారు.

ముందు సురేష్ వెనుక మధు వడివడిగా లలిత పాలిథిన్ వైపుకు అడుగులు వేశారు.

ఆమె పాలిథిన్ చుట్టూ అప్పటికే కొందరు కామ్రేడ్స్ గుమికూడి ఉన్నారు. పాలిథిన్లో లలిత భయంకరంగా పొర్లుతున్న దృశ్యం నెగడు వెలుగులోనూ, కొందరి చేతుల్లోని టార్చ్‌లైట్ల వెలుగులోనూ భీతిగొల్పేలా కనబడుతోంది. కొందరు కామ్రేడ్స్ ఆమె చుట్టూ కూర్చొని కాళ్లూ చేతులూ నడుమూ పట్టుకొని పొర్లకుండా ఆపేందుకు విఫల ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరు పిడికిళ్లను బలవంతంగా తెరిపించి అరచేతులనూ అరికాళ్లనూ రుద్దుతున్నారు.

మధు చటుక్కున ఆమె తల దగ్గర కూలబడి బలవంతంగా ఆమె తలను ఒడిలోకి చేర్చుకున్నాడు. "లలితా... లలితా" ఆర్తిగా పిలిచాడు.

కళ్లు తేలేసి, పళ్లు బిగబట్టి ఉన్న ఆమె నుండి ఎటువంటి ప్రతిస్పందనా లేదు. అదే పనిగా పిలుస్తూనే ఉన్నాడతను.

మరి కొందరు కామ్రేడ్స్ కూడా పిలవసాగారు. కొందరి గొంతులో ఏడుపు ప్రతిధ్వనిస్తోంది. మరి కొందరు ఏడవడం మొదలుపెట్టారు.

ఏడుస్తున్న వాళ్లను "మీరిక్కడ్నుండి వెళ్లిపోండి" అని కసిరాడు సురేష్. రమేష్ కూడా ఒక్కొక్కరి దగ్గరికి వెళ్లి "ఏడ్వొద్దని' చెప్తున్నాడు.

లలిత పొర్లడం తగ్గిపోయింది. కానీ శరీరం ఇంకా బిగుసుకునే ఉంది. మెల్లగా ఆమెను మరికొంచెం ఎత్తి ఆమె తలను గుండెకదుముకున్నాడు మధు. వీపును నిమురుతూ పిలవసాగాడు. అయినా ఆమె నుండి ఏ ప్రతిస్పందనా లేదు. మళ్లీ ఒడిలోకి చేర్చుకున్నాడు. కళ్లు ఇంకా అలాగే తేలేసే ఉంది. నోటి నుండి రక్తం కారుతున్నట్టు గమనించాడు. అప్పుడు చూసుకుంటే తన ఛాతీ భాగంలో చొక్కాపై రక్తపు చారికలు ఉన్నాయి. ఆందోళనగా ఆమె నోటి దగ్గరికి తన చేయిని పోనిచ్చి గట్టిగా పిలుస్తూ కరుచుకున్న నోటిని తెరిపించే ప్రయత్నం చేశాడు. అప్పుడర్థమయిందతనికి ఆమె నాలుకను కొరుక్కుంటున్నదని.

క్రమంగా ఆమె శరీరం స్వాధీనంలోకి వచ్చింది. తేలేసిన కళ్లను మూసుకుంది. కరుచుకున్న నోరు మామూలుగా అయింది. ఇప్పుడు చూస్తే అలసిపోయి నిద్రపోతున్న దానిలా ఉంది.

మధు పిలిస్తే నెమ్మదిగా కళ్లు తెరిచింది. ఎదురుగా కనబడుతున్న కామ్రేడ్స్ వైపు పిచ్చి చూపులు చూసింది.

"లలితా ఏమయింది?"

"ఇప్పుడెలా ఉంది?"

"మంచినీళ్లు తాగుతావా?"

"తలనొప్పిగా ఉందా?"

కామ్రేడ్స్ అందరూ ఆరాటంగా అడుగుతున్నారు. వాళ్ల మాటలేమీ అర్థం కానట్టు పిచ్చి చూపులు చూస్తూ ఉండిపోయిందామె.

అందరికీ ఆందోళనగా ఉంది. ఆమె రెండు చేతులను తన చేతుల్లోకి తీసుకుంటూ "లలితా నేనెవర్ని చెప్పు? నన్ను గుర్తు పట్టావా? నా పేరేంటి?" అడిగింది అనిత.

లలితలో ఏ మార్పు లేదు.

ఆమె మొహానికి తన మొహాన్ని దగ్గరగా చేర్చుతూ "లలితా నన్ను గుర్తు పట్టావా?" అడిగాడు మధు లాలనగా.

మధు మొహంలోకి చూపులు తిప్పి, గుర్తు పట్టినట్టుగా తల ఊపింది.

"నేనెవర్ని?"

"మధువి" నీరసంగా అంది. నాలుక కొరుక్కోవడం వల్ల మాటలో స్పష్టత లోపించింది.

అది గమనించినట్టుగా "ఏదీ నాలుక చూపించు" అన్నాడతను ఆమె గదుమ పట్టుకుంటూ.

నాలుక చాచిందామె. ఇంకా రక్తం స్రవిస్తూనే ఉంది. అప్పటికి మరి కొంచెం స్పృహలోకి వచ్చినట్టుగా నెమ్మదిగా లేచి కూర్చుని పక్కన కూర్చున్నవాళ్లను తప్పుకొమ్మని సైగ చేస్తూ నేలమీద ఉమ్మేసింది. వెంటనే అనిత టార్చ్‌వేసి చూస్తే అక్కడంతా రక్తమే ఉంది.

దూది తెప్పించి ఆమె నాలుకను తుడిచాడు మధు.

ఆమె అలసిపోయినట్టుగా మళ్లీ పాలిథిన్‌లో వాలిపోయింది. కొద్ది సేపట్లో నిద్రలోకి జారిపోయింది.

అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మొద్దుబారిన బుర్రతో ఆమె తల నిమురుతూ అలాగే కూర్చుండిపోయాడు మధు.

"నిద్రపోయింది ఇక వెళ్లండి అందరూ. తొమ్మిది దాటింది అన్నం తినేసెయండి" అంటూ అందర్నీ బలవంతంగా పంపించాడు సురేష్.

"ఇక్కడ నేనుంటాను మీరు కూడా తినేసి రండి" అంది అనిత సురేష్, మధులను ఉద్దేశించి.

"లేదు ముందు నువ్వెళ్లి తినేసిరా కామ్రేడ్ ..." మధు.

"అవును అనితా మేమిక్కడ ఉంటాం నువ్వెళ్లి తినేసిరా" రమేష్ కూడా అనడంతో అనితకు లేవక తప్పలేదు.

అనిత తిని వచ్చాక "లే మధూ మనం కూడా తిని వద్దాం" అంటూ సురేష్ లేచాడు.

తిననంటే బాగుండదని మధు కూడా లేచాడు. రెండు మెతుకులు తిన్నట్టు చేసి తిరిగి వచ్చి నిశ్శబ్దంగా పాలిథిన్లో కూర్చుంటూ "లేపి కొంచెం పాలో, టీనో తాపిస్తే..." లోగొంతుకతో అన్నాడు అనితతో.

"కానీ గాఢ నిద్రలో ఉంది లేపుదామంటావా?"

"మరెట్లా ఏం తినకుంటే ఇంకా నీరసపడిపోతది గదా..."

ఇంతలో లలితలో కదలిక మొదలైంది. మెలకువ వస్తున్నట్టుంది అనుకున్నారిద్దరూ. కానీ కాళ్లూ చేతులూ మళ్లీ విసిరేయడం మొదలుపెట్టింది.

"అరె మళ్లీ ఫిట్స్ వస్తున్నట్టుంది" ఆందోళనగా అంది అనిత.

మధు వేగంగా ప్రతిస్పందించాడు. అనిత పిలవడంతో మళ్లీ కామ్రేడ్స్ అక్కడ గుమికూడారు.

ఇక ఆ రాత్రంతా మాటి మాటికీ ఆమెకు ఫిట్స్ వస్తూనే ఉన్నాయి. స్పృహ వస్తూ పోతూ ఉంది. ఫిట్స్‌కీ ఫిట్స్‌కీ నడుమ కాలం మరింత మరింతగా తగ్గిపోసాగింది. నాలుక తెగిపోయి మధు చొక్కా ఛాతీ భాగమంతా తడిసిపోయింది.

వేకువ జాముకి ఆమె పరిస్థితి మరింత విషమించింది. మనిషి పూర్తిగా స్పృహ కోల్పోయింది.

అందరికీ ఆందోళనగా ఉంది. ఇక చచ్చిపోవడం ఖాయమనేసుకొని చాలా మంది వెక్కిల్లు పెడుతున్నారు. సురేష్, రమేష్ గద్దించకపోతే గట్టిగా శోకాలు పెట్టేవాళ్లే. మరికొందరు దూరంగా వెళ్లిపోయి గట్టిగానే ఏడ్చేస్తున్నారు.

మధు మానసిక పరిస్థితి వర్ణనాతీతం. పిచ్చివాడిలా తన వొడిలోని ఆమె మొహంలోకి చూస్తూ కూర్చున్నాడు. ఛ తను రావడం వల్లే ఇలా అయ్యింది. విడుదల కోసం తాను ఎంతగా తాపత్రయపడ్డాడు... ఎన్ని పథకాలు వేసి శత్రువు కళ్లు విప్పి అడవిలో పడ్డాడు... అడవిలో అడుగు పెట్టగానే తట్టుకోలేని ఆనందంతో ఎట్లా కన్నీళ్లు పెట్టుకున్నాడు... తనే కాదు తను విడుదలయి క్షేమంగా వచ్చేసిన వార్త విని రాష్ట్ర వ్యాప్తంగా కామ్రేడ్సూ, ప్రజలూ ఎంత సంతోషపడి ఉంటారు. కానీ తన విడుదల వల్లే ఇప్పుడిలా ఈమె ప్రాణం మీదికొచ్చింది కదా! తను ఇక బతుకుతుందా? ఆమెకేమన్నా అయితే తను తట్టుకోగలడా? ఇలా అవుతుందనుకుంటే తాను జీవితాంతం కటకటాల నడుమనే మగ్గిపోయేవాడు కదా... ఆలోచనలతో తల పగిలిపోతోందతనికి.

తలను గట్టిగా విదిలించుకుంటూ 'ఇప్పుడేం చేయాలి?' అనుకున్నాడు. తక్షణ కర్తవ్యం వైపు ఆలోచనలను సారించాడు.

కొద్ది సేపటికి లలిత తలను అనిత ఒడిలోకి చేర్చి పాలిథిన్లోంచి లేచాడు. అక్కడినుండి కదిలి వెళ్తూ సురేష్‌ను తనతో రమ్మని సైగ చేశాడు. తన ఆలోచనలను అతని ముందు పెట్టాడు. ఇక త్వర త్వరగా ఆ ఆలోచనలు ఆచరణ రూపం తీసుకున్నాయి.

కామ్రేడ్స్ పరుగులు పెట్టారు. కొద్ది గంటల్లో కారు వచ్చిందనే కబురు వచ్చింది. ఓ గంట దూరంలో ఉన్న కారులోకి చేర్చడానికి జీవచ్ఛవంలా ఉన్న లలితను కావడిలో పడుకోబెట్టారు. అందరూ

ఇక అవే ఆఖరు చూపులన్నట్టు ఆమెను చూస్తున్నారు. ఆమె శరీరాన్ని ఆర్తిగా తాకుతున్నారు. ఆమెకు తోడుగా వెళ్లడానికి అనితనీ, నరేష్ అనే మరో దళ సభ్యున్నీ తయారు కమ్మన్నారు. అనితని కూర్చోబెట్టి మధు అన్నీ వివరంగా మాట్లాడాడు. అవసరమైన సహాయం చేయగల కొందరి అడ్రసులు ఇచ్చాడు. కొందరికి ఉత్తరాలు కూడా రాసిచ్చాడు.

"ట్రీట్‌మెంట్ మొదలయ్యాక రెండు మూడు రోజుల తర్వాత నరేష్‌ను వెనక్కి పంపు. పరిస్థితిని వివరిస్తూ ఉత్తరం పంపు తనతో. పరిస్థితిని బట్టి ఏం చేయాలో మేం వెంటనే తెలియజేస్తాం" మధు చెప్తుంటే అసలు హాస్పిటల్‌కు వెళ్లేదాకా బతుకుతుందా అన్పించిందామెకు.

ఆఖరుగా అన్నాడు మధు - "మనం చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేద్దాం కామ్రేడ్... అయినా కాపాడుకోలేకపోతే బాడీ వాళ్లమ్మ వాళ్లింటికి చేరేలా ఏర్పాట్లు చేయి..." అతని గొంతు జీరబోయింది. ఆమె కళ్ల నుండి నీళ్లు దుంకాయి.

లలిత వాళ్ల ఇంటి అడ్రసూ, ఫోన్ నెంబర్ రాసివున్న చీటీని ఆమె చేతిలో పెట్టాడు.

* * *

లలితకు ట్రీట్‌మెంట్ మొదలై నాలుగు రోజులయింది. అనితలో ఆశలు చిగురించాయి. ఫిట్స్ రావడం ఆగిపోయింది. మనిషి స్పృహలోకి వచ్చింది. అయితే నాలుక తెగిపోవడం వల్ల మాట రావ్వడం లేదు. నిజానికి మాట్లాడే శక్తి కూడా ఆమెకు రాలేదు. ఎప్పుడూ పడుకునే ఉంటోంది. మందుల ప్రభావమేమో ఎక్కువగా నిద్రలోనే ఉంటోంది. ముందు రోజు నుంచీ అనిత భుజాల మీద ఒరిగి కూర్చుని పాలూ, పళ్ల రసం వంటివి కొంచెం తాగగల్గుతోంది. అనిత భుజాల చుట్టూ చేతులేసి నడిపిస్తే బాత్రూంకు వెళ్లగలుగుతోంది.

పళ్లరసం తాగించి నెమ్మదిగా పడుకోబెట్టి దిండు సవరించి నెమ్మదిగా ఆమె మీదికి వంగుతూ "లలితా నీకెలా ఉందోననీ మనవాళ్లు ఆందోళన పడుతూ ఉంటారు. నీక్కొంచెం నెమ్మదించిందిగా. విషయం తెలియజేయడానికి నరేష్‌ను పంపిద్దామా. మనవాళ్లు పంపించమని చెప్పారు" అంది అనిత.

తప్పక పంపిద్దాం అన్నట్టుగా తల ఊపిందామె.

అనిత ఇక ఆలస్యం చేయకుండా నోట్‌బుక్ తీసి ఉత్తరం రాసింది. కొద్ది సేపటికి తనకూ కాగితం పెన్నూ ఇమ్మన్నట్టుగా సైగ చేసింది లలిత.

అనిత ఆశ్చర్యపోతూ ఇచ్చింది. అనిత సాయంతో నెమ్మదిగా లేచి, గోడకు నిలబెట్టిన దిండుకు ఒరిగి కూర్చొని నోట్‌బుక్‌ను ఒళ్లో పెట్టుకొని ఉత్తరం రాయడం మొదలుపెట్టింది.

ప్రియమైన మధూ,

లాల్‌సలాం. ఆరోగ్యం కోలుకుంటోంది. ఆందోళన పడవలసిన అవసరం లేదు. నీరసంగా ఉంది. ఇంకొంచెం కోలుకున్నాక వస్తాను.

మధూ, బహుశా నిన్ను మనవాళ్లు రాష్ట్రంలో ఉంచకపోవచ్చు. వెంటనే ఎక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చేస్తారు కావచ్చు. అయితే నన్ను కలువకుండా, నాతో మాట్లాడకుండా నువ్వు దయచేసి ఎట్టి పరిస్థితిలోనూ వెళ్లిపోవద్దు. ప్లీజ్ నాకు ఒక్కసారి నీతో కలిసి మాట్లాడే అవకాశాన్ని కల్పించు. ఇది నా అభ్యర్థన. కాదనవు కదూ.

ఉంటానిక.

విప్లవాభివందనాలతో

నీ లలిత

ఎలాగోలా పూర్తిచేసి కాగితాన్ని మడతపెట్టి పైన పేరు రాసి అనిత చేతికిచ్చింది.

కాగితం మీద పేరు చూసిన అనితకు ఆశ్చర్యమనిపించింది. ఈ స్థితిలో ఈమె ఎలా రాయగల్గిందో... అసలేం రాసిందో... అనుకుంది.

ఆ తర్వాతి రోజు శేఖర్ వచ్చాడు. "ఎట్లుంది లలితా" అంటూ ఆమె మంచంలో కూర్చున్నాడు.

ఎవరో పరాయివాడు తన పక్కన కూర్చున్నట్టుగా కోపంగా చూస్తూ విసురుగా దూరంగా జరిగిందామె. అనిత, శేఖర్‌లిద్దరూ ఆశ్చర్యపోయారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తిగా తెలుసుకునే వచ్చాడు కనుక 'గుర్తు పట్టి ఉండదు' అనుకున్నాడు శేఖర్. కానీ మధుకు ఉత్తరం రాయగలిగిన ఆమె శేఖర్‌ను గుర్తు పట్టలేకపోవడం అనితకు ఆశ్చర్యంగా ఉంది.

ఆమె మానసిక పరిస్థితిని అర్థం చేసుకొని ఓపిగ్గా వ్యవహరిస్తున్నాడు శేఖర్. ఆమె తిరస్కారాన్ని మౌనంగా భరిస్తూనే ఆమెకు అవసరమైన సేవలు చేస్తున్నాడు.

ఓ పది రోజులకల్లా మరింతగా కోలుకుందామె. కానీ మాట ఇంకా సరిగా రావడం లేదు. కష్టమ్మీద మాట్లాడగల్గుతోంది.

"నువ్వు పోయి మధును కలువు" అందామె తన కోసం బత్తాయి తొనలు వలుస్తున్న శేఖర్‌తో.

"ఇప్పుడీ స్థితిల నిన్ను విడిచిపెట్టి ఎట్ల పోత..."

"అనిత నాకు తోడుందిగా నువ్వు ఉండి చేసేదేం ఉంది?"

"ఇప్పుడు అర్జెంటేముందీ కలుద్దంలే. నీ ఆరోగ్యం బాగుపడనీ... బాగయినంక ఇద్దరం కల్సి పోదంలే"

"ఉహూ తన దగ్గరికి ఇద్దరం కల్సి పోవుడు నాకిష్టం లేదు. నాకు బాగయినంక నేనొక్కదాన్నే పోత... ముందుగ నువ్వు పో" కరాకండిగా అందామె.

"పోతాలే నీకు కొంచెం బాగయినంక పోతాలే" చిన్నబుచ్చుకున్న మొహంతో అన్నాడతను.

"నాకిప్పుడు బాగానే ఉంది. నువ్వు తనను తొందరగా కలువాలె. కలిసి మాట్లాడాలె..." పట్టుబట్టిందామె.

\- - -

తనకు ఎదురుగా కూర్చొని వెక్కి వెక్కి ఏడుస్తున్న శేఖర్ వైపు బాధగా సానుభూతిగా చూస్తున్నాడు మధు.

"ఏడవకు... ఏడవకు" అన్నాడు కాసేపటికి.

"నువ్వు విడుదలై వస్తవని అనుకోలేదే..."

"అరెస్ట్ అయిన వాళ్లు ఎప్పుడో ఒకప్పుడు విడుదల కాకుండా

ఎట్లుంటరు?" నవ్వుతూనే అన్నాడు మధు. ఆ నవ్వు శేఖర్ గుండెల్లో దిగబడింది.

"చాలా గిల్టీగా అన్పిస్తుందే. తను కూడా చాలా ఘర్షణ పడుతా ఉంది..."

"ఇప్పుడు గిల్టీగా ఫీలయితే ప్రయోజనం ఏముంది? నేను ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పదల్చుకున్న. నువ్వు వ్యవహరించిన తీరు సరైంది కాదు. ఆమెకు పెళ్లి చేసుకునే హక్కు ఉంది. అయితే ఆ విషయంలో ఆమె స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోగల్గాలి. కానీ నువ్వామె మీద ప్రెజర్ పెట్టినవ్. నువ్వామె ముందు పెళ్లి ప్రతిపాదన చేసినవ్. ఆమె ఊగిసలాడింది. నీ వైపు మొగ్గుచూపింది కూడా. కానీ ఆ తర్వాత ఆమె తన ఆలోచన తప్పని అనుకుంది. ఆ ప్రతిపాదనను తోసిపుచ్చింది. నీకు కూడా మర్చిపొమ్మని చెప్పింది. కానీ నువ్వు మళ్లీ ఆమె వెంటపడ్డవ్. ఒకవేళ ఆమెనే మొదటగా ఒక తోడును బలంగా కోరుకొని నీ సహచర్యాన్ని పొందాలనుకుంటే నువ్వు అంగీకరించడం వేరు... అసలు అప్పుడు కూడా ఆమెకు మంచీ చెడు అర్థం చేయించగల్గాలి. నిజానికి ఆమె రకరకాల సమస్యలను ఎదుర్కుంటా ఉంది. ఒక శ్రేయోభిలాషిగా ఆ సమస్యలను పరిష్కరించుకునేటందుకు గానీ, ధైర్యంగా వాటిని ఎదుర్కునేటందుకు గానీ ఆమెకు నువ్వు తోడ్పాటును అందించవల్సి ఉండె. కానీ నువ్వు చేసిందేంటిది? ఇంకా ఆమెకు కొత్త సమస్యలు తెచ్చిపెట్టినవ్... ఆమెను మరింత ఘర్షణకు లోను చేసినవ్. ఆమె గురించి నల్గురూ నాల్గు రకాలుగా అనుకునేటట్టు చేసినవ్... ఆమె కష్టకాలంలో ఉన్న సమయంలో ఒక కామ్రేడ్‌గా నువ్వు ఆమెకు అండగా ఉండవల్సి ఉండె. కానీ నువ్వు ఆమె అసహాయతను ఈ ప్రయోజనానికి ఉపయోగించుకున్నావు."

"నేనామెను చాలా ఇష్టపడ్డ..."

"ఒక పెళ్లయిన మహిళను ఇష్టపడ్డ అనడం సరైందనిపించుకుంటదా? జైలులో ఉన్న ఒక కామ్రేడ్ పట్ల ఎవరి వైఖరైనా ఎలా ఉండాలె? వాళ్లకు అండగా ఉండాలె. వాళ్ల పట్ల సౌహార్ధతను చూపించాలె. వాళ్ల మనోభావాలు గాయపడకుండా చూడాలె. కానీ నువ్విట్ల జేసి జైలులో ఉన్న కామ్రేడ్‌కు వేదన కల్గించలేదా?" మధు గొంతులో చిరు ఆవేశం.

మధు మాటలను అంగీకరించాడో, అంగీకరించలేకపోయాడో గానీ తల నేలకేసి కూర్చున్నాడు శేఖర్.

తనను తాను అదుపు చేసుకున్నాడు మధు. మళ్లీ ప్రశాంతమైన గొంతుతో చెప్పడం మొదలుపెట్టాడు. "నేనేదో వ్యక్తిగతంగనే తీసుకొని రియాక్ట్ అవుతున్ననని అనుకోవద్దు. పార్టీపరంగా కూడా ఆలోచిస్తున్న. అసలదే ముఖ్యం అనుకో. పార్టీపరంగా కూడా ఇది సరైంది కాదు కాబట్టి నిన్ను పార్టీ చాలా తీవ్రంగానే మందలించిందని తెల్సింది. కానీ నువ్వు పునరాలోచించడానికి గానీ, నీ భావాలను సరిచేసుకోవడానికి గానీ కొంచెం కూడా సిద్ధం కాలేదు. అది మంచిది కాదని మాత్రం గుర్తు పెట్టుకో. నిన్ను నేను ఎంతగా అభిమానించిన్నో నీకు తెలుసు..."

భోరుమని ఏడ్వకుండా అదుపు చేసుకోలేకపోయాడు శేఖర్.

"నాకెందుకు తెల్వదే... నేనెట్ల మరిచిపోత... కానీ నీ అభిమానాన్ని నిలుపుకోలేకపోయిన. నిన్ను దూరం చేసుకున్న... నువ్వు నన్ను వ్యతిరేకించేటట్టు చేసుకున్న..."

"ఇప్పటికీ నీ పట్ల నాకు వ్యతిరేకత ఏమీ లేదు. ఈ విషయాన్ని వ్యతిరేకించినంత మాత్రాన నీ పట్ల నాకు అసలు అభిమానమే ఉండదనుకోకు. సరే జరిగిందేదో జరిగింది. కొన్ని సందర్భాల్లో జరిగిపోయిన వాటిని గురించి ఎంత ఆలోచించినా ప్రయోజనం ఉండదు. జరగాల్సిన దాని గురించి ఆలోచిస్తే మంచిది. లలిత జీవితంలో ఎక్కువ కాలం ఏదో రకమైన ఘర్షణలోనే గడిచిపోయింది. ఆమె సంతోషంగా చీకూ చింతా లేకుండా గడిపింది చాలా తక్కువ కాలమే. ఇప్పటికన్నా ఆమె జీవితం సంతోషంగా గడిచిపోవాలని నేను కోరుకుంటున్న. దీన్ని ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకో..."

\- - -

సాయంకాలపు టీ సమయపు కోలాహలంతో కిచెన్ దగ్గరంతా సందడిగా ఉంది. చేతిలో లోటా లాంటి కప్పుతో ఓ మొద్దు మీద కూర్చొని ఉన్న మధు ఆ సందడంతటికీ కేంద్రబిందువుగా ఉన్నాడు. ఆ మొద్దు మీద, పక్కనే ఉన్న బండల మీద మరి కొందరు కామ్రేడ్స్ కూర్చొని ఉంటే, ఇంకొందరు నిలబడి ఉన్నారు. మధు పక్కనే కూర్చొని ఉన్న జిల్లా కమిటీ సభ్యురాలు ప్రశాంతి ఏం మాట్లాడకుండా నవ్వుతూ ఆ సందడిని ఆస్వాదిస్తోంది.

రాత్రి బాగా అలసిపోయి గాఢ నిద్రలో ఉన్న జయను సెంట్రీకి లేపినప్పుడు నిద్రమత్తులో ఆమె ఏమేం మాట్లాడిందో మధు బనాయింపుగా చెప్తుంటే అందరూ పడీ పడీ నవ్వుతున్నారు. జయ మాత్రం బుంగమూతి పెట్టి "నేనేం అట్లా మాట్లాడలేదులే" అంటోంది.

మధు నల్లమల డివిజన్‌కు వచ్చి ఇంకా పదిరోజులు కూడా కాలేదు. కానీ అందరికీ ఎప్పుడో పాత అయిపోయాడు.

"ఈ కామ్రేడ్ ఇంత హాయిగా ఎలా నవ్వగలుగుతాడు? మనసులో అంత బాధను పెట్టుకొని ఏ చీకూ చింతా లేనట్టు ఎలా ఉండగలుగుతాడు?' అనుకుంటోంది ప్రశాంతి.

విజిల్ పడ్డంతో సందడికి బ్రేక్ పడింది. అందరూ సమిష్టి అధ్యయనానికి వెళ్లిపోయారు. ప్రశాంతికి ఉత్తరాలు రాసే పని ఉంది గానీ మధుతో మాట్లాడాలని మనసులో బలంగా ఉండి మొద్దు మీద నుండి లేవకుండా అతనితో మాటలు కలిపింది. ప్రశాంతి మాటలు కలవడంతో లేవబోతున్న మధు అలాగే కూర్చుండిపోయాడు.

కాసేపు అదీ ఇదీ మాట్లాడక "రేపు లలిత వస్తున్నట్టేనా?" అంది.

"రావాలి మరి. ఆరోగ్యం అయితే పూర్తిగా కోలుకున్నట్టేనని తెల్సింది మనకు. కాబట్టి ఇక రావడమే మంచిది బయట ఉంటే లేనిపోని రిస్క్ కదా."

"మధూ ఒక విషయం అడుగుతాను చెప్తావా? లలిత ఇట్ల

చేసినందుకు నువ్వు బాధ పడలేదా?" విడుదలై వచ్చాకనే మధుతో ప్రశాంతికి ప్రత్యక్ష పరిచయం. లలిత ఆమెకు మంచి స్నేహితురాలు. లలిత దగ్గర అతని గురించి విని విని ఉండడం వల్లనో, అతని స్వభావం వల్లనో, రెండింటి వల్లనో కానీ తక్కువ పరిచయంలోనే ఆమెకు అతనితో ఏ విషయమైనా మాట్లాడేంత చనువు వచ్చేసింది.

"బాధపడ్డం కాదు కామ్రేడ్... గాయపడ్డ" అన్నాడు దూరంగా ఎటో చూస్తూ.

"మరి తన మీద కోపం రాలేదా?"

"ఊహు రాలేదు..."

"ఎప్పుడూ రాలేదా?"

"ఎప్పుడూ రాలేదు. పాపం తను ఎంత ఘర్షణ పడి తీసుకుని ఉంటుందా నిర్ణయం..."

"నాకూ తలుచుకుంటే ఎంత బాధనిపిస్తుందో... లలిత నీ గురించి ఎంత ఎదురు చూసింది. నీ ఉత్తరాలను ఎంత అపురూపంగా దాచుకునేది. మాకూ ఎంత మురిపెంగా చూపించుకునేదో... ఉద్యమం కోసమే కాదు లలిత కోసమైనా నువ్వు త్వరగా రావాలని మేమంతా ఎంతగా అనుకునే వాళ్లమో. కానీ తీరా నువ్వు వచ్చేస్తే తను సంతోషంగా ఉండే పరిస్థితి లేకపోయే. పేషంట్ అయి చావు బతుకుల నడుమ హాస్పిటల్లో చేరాల్సి వచ్చే..."

"అదే నాకూ అన్పిస్తది. నేను రాకున్నా తను సంతోషంగా ఉండి ఉండేదేమో. ఇన్నేళ్లు ఒంటరి తనంతోటి బాధపడ్డది. ఇప్పుడిక పెళ్లయింది కదా... కొంత సంతోషంగా ఉండగల్గేదేమో. కానీ నేనొచ్చి మానుతున్న గాయాన్ని కెలికినట్టయింది..."

"ఛ నువ్వలా అనుకోవద్దు మధూ... తను సంతోషంగా ఉండడం కోసం నువ్వు జైల్లో మగ్గిపోవాలా? తను కూడా అలా ఎప్పటికీ కోరుకోదు కదా. కొన్ని రోజులు ఇబ్బంది పడినా కోలుకుంటుందిలే. తను ఇంకొకర్ని పెళ్లి చేసుకున్నా నువ్వు విడుదలై రావడమనేది తనకు చాలా సంతోషాన్ని కల్గించే విషయమే... కానీ తను సంతోషపడ్డా... తనకా సంతోషాన్ని మిగలనిచ్చేలా లేరు కొంత మంది కామ్రేడ్స్. చూస్తున్నావుగా రకరకాల చర్చలు..."

"ఎప్పటి నుండో ఎన్నో రకాల చర్చలు జరిగి చివరికి అవన్నీ ఒక కొలిక్కి వచ్చి వాళ్ల పెళ్లయింది. నేను రావడంతో మళ్లీ చర్చలు మొదలయినయ్. పాత చర్చలకు తోడు కొత్త చర్చలు కూడా తోడయినయ్. తను నాకు దూరమయిందన్న బాధ కంటే తన గురించి ఇలా నలుగురూ నాల్గు రకాలుగా అనుకోవడమే నాకు ఎక్కువ బాధను కల్గిస్తాంది."

"మన కామ్రేడ్స్ కొందరిలో నీకు అన్యాయం జరిగిందనే ఫీలింగ్ బలంగా ఉంది. నీకు అన్యాయం జరిగిందన్నది నిజమే గానీ దానికి లలితనే కారణంగా చూస్తున్నారు. ఒక రకంగా నీ మీది అభిమానం లలిత మీద వ్యతిరేకతగా మారుతోంది?"

"అదే నా బాధ. నా మీద అభిమానాన్ని చూపుతున్నామనో, సానుభూతిని చూపుతున్నామనో వాళ్లనుకుంటున్నరు గానీ లలిత గురించి అట్లా మాట్లాడ్డం నన్నెంత బాధిస్తుందో వాళ్లకు అర్థం కావడం లేదు... నాకు ఒక్కోసారి అన్పిస్తుంది. నేను బతికుండడం వల్లే కదా తన పెళ్లి గురించి ఇంత చర్చ జరుగుతున్నదీ... నేను చనిపోయి ఉంటే తన పెళ్లి ఎవరికీ అభ్యంతరకరంగా ఉండేది కాదుగా..."

విలవిలలాడింది ప్రశాంతి. "ఛ అలా మాట్లాడకు మధూ... తెలిసీ తెలియని చైతన్యంతో మాట్లాడే వాళ్ల మాటలను లెక్కలోకి తీసుకొని నువ్వు మరీ అలా మాట్లాడకు..."

ఆమెకింకా ఎంతో మాట్లాడాలని ఉంది గానీ, మాటలు దొరకలేదు.

కాసేపు ఆవరించిన భారమైన నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ ప్రశాంతి మళ్లీ మాట్లాడ్డం మొదలు పెట్టింది.

"నాకు శేఖర్ మీద కూడా చాలా కోపం వస్తోంది. తను పరిణామాల పట్ల కొంచెం కూడా సీరియస్‌గా ఆలోచించలేదనిపిస్తుంది... క్యాడర్ అందరూ కూడా తన గురించి ఎలా మాట్లాడుతున్నారో చూస్తున్నావు గదా..."

"నిజానికి తను చాలా మంచి కామ్రేడ్. మనుషులను నిష్కల్మషంగా ప్రేమిస్తడు. ఎవరికి ఏ సమస్య వచ్చినా సానుభూతితో స్పందిస్తడు, సహానుభూతి చెందుతడు. అట్లనే లలిత పట్ల సానుభూతిని ప్రదర్శించిండు... తనను ఓదార్చాలనీ, అండగా నిలబడాలనీ, సహకారాన్ని అందించాలనీ ఆమెతో సాన్నిహిత్యం పెంచుకున్నడు. చివరకదిట్లా పరిణమించింది... ఈ పరిణామాలను తనూ ఊహించి ఉండడు కదా..."

"నువ్వు తన గురించి ఇంత ఉదాత్తంగా ఎట్లా ఆలోచించగల్గుతావు మధూ? మొన్న మమత వచ్చినప్పుడు ఎంత ఆశ్చర్యపోయిందో తెల్సా? నువ్వు తనను 'శేఖర్ బాగున్నాడా?' అని అడిగావట కదా... 'శేఖర్ నాకు బాధ్యుడే గానీ, తనూ లలితా పెళ్ళి చేసుకున్నారని నాకు అనధికారంగా మాత్రమే తెల్సు... కానీ మధు నేను రాగానే 'శేఖర్ బాగున్నాడా?' అని ఎంత ఆప్యాయంగా అడిగిండో తెల్సా? పైగా 'పాపం తను లలితను కలవడానికి వస్తే లలిత పేషంట్ అయి హాస్పిటల్లో ఉండె గదా, శేఖర్ చాలా బాధపడ్డాడు' అన్నాడు. 'లలితకు వంట్లో బాగాలేదని శేఖర్ చెప్పిండు గానీ ఇంత సీరియస్ అయిందని నాకు తెలియదు.పైగా శేఖర్ మధును కల్సిపోయాడని కూడా నాకు తెలియదు. మధు చెబితేనే తెల్సింది. తన మాటల్లో లలిత, శేఖర్‌ల పట్ల సానుభూతి, వాళ్లు పడుతున్న బాధ పట్ల ఆవేదన తప్ప కొంచెం కూడా వ్యతిరేకత పొడచూపలేదు... పైగా ఈ విషయాలన్నీ తనకు ప్రత్యక్ష సంబంధం లేని విషయాల్లాగే, తాను కూడా బాధితుడు అనే విషయం కొంచెం కూడా స్పృహలో లేనట్లు ఎంత మామూలుగా చెప్పాడో తెల్సా.. అసలెట్లా సాధ్యం' అనుకుంట ఒకటే ఆశ్చర్యపోయింది."

"మమత నన్నేం అడిగిందో తెల్సా. లలిత నీ కన్నా వయసులో పెద్దది కదా. పైగా 'విడో'... ఆ రోజుల్లో ఇటువంటి పెళ్లిళ్లు చేసుకోవాలంటే కొంచెం వెనుకా ముందాడే పరిస్థితే కదా... నువ్వెట్లా చేసుకున్నవ్ అనడిగింది" మధు గొంతులో నవ్వు దాగడం లేదు.

"అవును నేనూ అనుకుంటాను... ఆ రోజుల్లో ఇటువంటి పెళ్లిళ్లు చేసుకోవాలంటే కొంచెం సంకోచమే ఉండె కదా... నువ్వలా ఆలోచించలేదా?" ప్రశాంతి గొంతులో కుతూహలం దాగడం లేదు.

"ఛ... నేనట్ల ఆలోచించలేదు. చైనాలో విప్లవం విజయవంతం అయిన తర్వాత యుద్ధంలో చనిపోయిన కామ్రేడ్స్ జీవిత సహచరులను పెళ్లిచేసుకోవడానికి ముందుకు రావాలని యువకులకు పార్టీ పిలుపునిచ్చిందని చదివినప్పుడు నేను చాలా ఇన్‌స్పైర్ అయిన... అలా చేసుకోవడం ఆదర్శం అని బాగా అనిపించింది... కాబట్టి నేను లలితను చేసుకోవడానికి ఎటువంటి సంకోచాలకూ గురి కాలేదు..."

చీకటి పడి, చలి వణికించే దాకా అలా మాట్లాడుకుంటూనే ఉండిపోయారు వాళ్లిద్దరూ.

* * *

"నేను చాలా బలహీనంగా ఆలోచించిన కానీ, ఎందుకట్ల ఆలోచించవల్సివచ్చిందో తెల్వా... ఒకటి తర్వాత ఒకటి ఏవో రకరకాల సమస్యలు... తట్టుకోలేకపోయిన. పిచ్చెక్కుతుందేమో అని భయమయ్యేది... నువ్వెప్పుడెప్పుడు వస్తవా నీ గుండెల మీద వాలిపోయి ఎప్పుడెప్పుడు నా వేదననంతా వెళ్లగక్కుతనా అని ప్రతి క్షణమూ ఎదురుచూసిన. కానీ నువ్వు రాలేదు. నువ్వు వస్తవనే ఆశలు రోజురోజుకూ అడుగంటినయి... 'నేనే రావాల్నా పార్టీ ఉంది కదా' అని నువ్వనొచ్చు... నిజమే పార్టీలో కొందరు కావాలని నన్ను ఇబ్బంది పెట్టినా చాలామంది కామ్రేడ్స్, ముఖ్యంగా పైకమిటీ కామ్రేడ్స్ నాకు అండగనే ఉన్నారు. కానీ నాకు నా అనే ఒక మనిషి కావాలనిపించింది... ఆ సమయంలో నేను కోరుకుంటున్న ఓదార్పును శేఖర్ దగ్గర పొందిన. అట్ల అనుకోకుండనే ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరిగింది. అయినా అదిట్ల దారితీస్తదని నేననుకోలేదు... కానీ ఇట్లా అయిపోయింది.

నిజానికి నేను ఆలోచిస్తున్న తీరు సరైంది కాదని మనవాళ్లతో మాట్లాడినంక నేను విత్‌డ్రా చేసుకున్న. కానీ శేఖర్ నన్ను మళ్లా మళ్లా అడుగుతూనే వచ్చిండు. అలా నా వెంట పడడాన్ని నేను కొద్ది రోజులు వ్యతిరేకించిన... కానీ ఆ తర్వాత ఆ వ్యతిరేకతను అట్లనే నిలుపుకోలేక పోయిన. క్రమంగా మెత్తబడ్డ. నిజానికి ఒక సీనియర్ కామ్రేడ్‌గా నేనతడిని గట్టిగా వ్యతిరేకించవల్సి ఉండె. కానీ... బలహీనంగా ఆలోచించిన.

నేను నీతో మాట్లాడుతున్నది నేనేదో సంజాయిషీ చెప్పుకుందామనో, నేను చేసిన దాన్ని సమర్థించుకుందామనో కాదు.. నీ ఎదురుగా ఇట్ల కూర్చొని మాట్లాడే అర్హతను కూడా నేను కోల్పోయిన... అయినా నీతో మాట్లాడకుంట, జరిగిందంతా నీతో చెప్పుకోకుంట ఉండలేక ఇట్ల చెప్పుకుంటున్న... ఎప్పటికప్పుడు నీకు ఉత్తరాలు రాస్తనే ఉన్న.... అయినా ప్రత్యక్షంగా నీతోటి మాట్లాడితే తప్ప నా మనసు భారం దిగిపోదు...

ఒక్క విషయం నువ్వర్థం చేసుకుంటే చాలు. చాలా మంది అనుకుంటున్నట్టు నేను శారీరక అవసరాలను ప్రధానంగా చూడలేదు...

నేను చేసినదాన్ని ఎవరెట్లనన్నా ఆలోచించనీ... ఎట్లనన్న అనుకోనీ... కానీ నువ్వర్థం చేసుకుంటే చాలు... నువ్వు క్షమిస్తే చాలు... నేను చేసింది క్షమించగల్గేది కాకపోవచ్చు అయినా క్షమించమనే అడుగుతున్న... నువ్వు క్షమించలేకపోతే నేను బతకడం కష్టం..."

యుగ యుగాలుగా అనుభవిస్తున్న క్షోభను వెళ్లబోసుకుంటున్నట్టుగా ఉందామె. మాటలకు దుఃఖం అడ్డం పడ్డప్పుడల్లా భోరుమని ఏడుస్తూ ఉంది.

ఆమె మాటలకు ఎక్కడా అడ్డం రాకూడదన్నట్టుగా వింటూ ఉండి పోయాడు మధు. ఆమె ఏడ్చినప్పుడు మాత్రం "ఏడవకు ప్లీజ్!" అంటూ ఉన్నాడు. ఆమె ఆపిన తర్వాతే అతను మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

"నేనిప్పటికే అన్ని విషయాలూ, నా ఫీలింగ్సూ నీకు ఉత్తరాల్లో రాసిన... సరే అవకాశం వచ్చింది కనుక వాటినే మళ్లోసారి మాట్లాడుత. నేను బతికుండగనే నువ్వు మళ్లా పెళ్లి గురించి ఆలోచించడం అనేది నన్ను మొదట చాలానే ఇబ్బంది పెట్టింది. అయితే తర్వాత తర్వాత ఆలోచిస్తే నువ్వు ఆలోచిస్తున్న దాంట్లో తప్పేమీ లేదనిపించింది. నేను ఎన్నేళ్లకొచ్చినా, అసలు వచ్చినా రాకున్నా, జీవితాంతం జైల్లోనే మగ్గిపోయినా నువ్వు నాకోసం ఎదురు చూస్తూనే ఉండాలని కోరుకోవడం ఫ్యూడల్ ఆలోచన తప్ప మరోటి కాదనిపించింది. అందుకే నువ్వు చేసిన దాన్ని తప్పుగా నేను ఎంత మాత్రం అనుకోవడం లేదు. అట్లా తప్పు పట్టడం అంటే నీ జీవితంపై నీకున్న నిర్ణయాధికారాన్ని కాదనడమే కదా..."

"నిజమా మధూ, నేను తప్పు చేసిన అని నువ్వనుకోలేదా? నన్ను అసహ్యించుకోలేదా? నా మీద కోపం రాలేదా?"

"నిన్ను అసహ్యించుకుంటనా? నువ్వు నన్ను ఇంతేనా అర్థం చేసుకుంది? కోపం వచ్చింది గానీ, నీ మీద కాదు నన్ను జైల్లో పెట్టి మనిద్దరి జీవితాల్లో అల్లకల్లోలం సృష్టించిన స్టేట్ మీద... అయితే నీకు సంబంధించి ఒక విషయం మాత్రం బలంగా ఫీలయిన... నువ్వు నీ గురించి స్పష్టంగా, బ్యాలెన్సింగ్‌గా ఆలోచించుకొని నిన్ను నువ్వు సరిగ్గా అంచనా వేసుకొని ఒక దృఢమైన నిర్ణయం తీసుకోవల్సి ఉంటివి. కానీ నువ్వు అట్ల చేయలేదు. దానివల్ల క్యాడర్లో నీ పట్ల అనేక అపోహలూ, అపార్థాలూ, అనుమానాలు చోటుచేసుకున్నాయి. నీ పట్ల నువ్వు స్పష్టంగా ఉండి ఉంటే ఇటువంటి వాటికి తావుండేదే కాదు..."

"నేను చాలా ఊగిసలాడిన. నిన్ను బాధపెట్టే నిర్ణయం తీసుకోవద్దనే, ఎన్ని యుగాలైనా నీ కోసం ఎదురుచూడాల్లనే ఆలోచన ఒకవైపు, ఆ ఆలోచనకు గట్టిగా కట్టుబడి ఉండలేని బలహీనత మరోవైపు... ఎంతగా నలిగిపోయిన్నో... పగవాళ్లకు కూడా ఇటువంటి సంకట స్థితి రాకూడదనిపించేది..."

"అదే నేననేది నీ బలహీనత నీకర్థం అవుతున్నప్పుడు నువ్వు తొందరగా తేల్చుకోవాల్సి ఉంటివి..."

"ఎట్ల తేల్చుకోమంటవు? నేనూ మనిషినే కదా. నీ పట్ల నాకు అసంతృప్తో, అయిష్టమో ఉంటే తేల్చుకునే దాన్నే... కానీ నిన్ను

నేను నా ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన... అటువంటిది నిన్ను కాదనుకొని..." ఇక మాట్లాడలేక భోరుమంది.

మధు కూడా ఇక నిగ్రహించుకోలేక పోయాడు. వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టాడు.

వాళ్ల దుఃఖానికి చీకటి ముసుగేసుకుంటున్న నల్లమల్ల ప్రకృతి ఏకైక సాక్షిగా నిలిచింది.

తేరుకోవడానికి ఇద్దరికీ కొంత సమయం పట్టింది.

"పెళ్లి చేసుకోవడం తప్పు కాదని నువ్వు ఉత్తరం రాసినంకనే నేనిక గట్టిగ నిర్ణయించుకోగల్గిన... అప్పటికీ తప్పు కాదనైతే నేను అనుకోలేదు గానీ ఇక తప్పనిసరై నిర్ణయం తీసుకున్న..."

"కొన్ని కొత్త ప్రతిపాదనలను ముందుకు తీసుకురావడానికి చాలా ధైర్యమే చేయాల్సి వస్తది. అనేక భావాలతో ఘర్షణ పడాల్సి ఉంటది. నిజానికి బూర్జువా చట్టం కూడా ఏడేళ్ల జైలు శిక్షను విడాకులు పొందడానికి అర్హమైన గ్రౌండ్‌గానే భావిస్తది. మనం మరింత విశాలంగా ఆలోచించాలె, వాస్తవికంగా ఆలోచించాలె..." మధు ఆమెకు చెప్తున్నాడో తనకు తానే చెప్పుకుంటున్నాడో.

"నువ్విలా పైకి చెప్తున్నావు గానీ లోలోపల నువ్వెంత మధన పడుతున్నవో నాకు తెలుసు. నిజం చెప్పు ఇన్నాళ్లంటే జైల్లో ఉన్నవు కాబట్టి అనివార్యంగా నాకు దూరంగా ఉన్నవు. కానీ ఇప్పుడు నన్ను మరిచిపోయి నువ్వు ఉండగలవా? నేను చేసిన ఈ గాయం నుండి కోలుకొని నువ్వు తిరిగి మునుపటి మధులా నీ బాధ్యతలను నిర్వర్తించగలవా?"

"ఏదీ జరగనట్టు ఎప్పటిలాగే ఉంటనని నేను చెప్పినా నువ్వు నమ్మలేవు కదా! అబద్ధాలు చెప్పి నిన్ను నమ్మించాలని కూడా నేననుకుంటలేను. నాకు కష్టమే... కానీ తప్పదు కదా దీన్ని భరించాల్సిందే... తేరుకోవడానికి కొంత టైమయితే పడుతది."

"నన్నొక విషయం చెప్పనీ మధూ... నేను తొందరపడేం మాట్లాడుత లేను. కేవలం నువ్వు జైల్లో ఉన్నావనే ఏకైక కారణం మాత్రమే మనం విడిపోవడానికి కారణం తప్ప మరింకేమీ కాదుగా. నువ్విప్పుడు జైలు నుంచి వచ్చేసినవ్. ఇప్పుడు చెప్పు మధూ నువ్వు ఏం చేయమంటే నేనది చేసేటందుకు సిద్ధంగున్న... నీకంటే నాకేదీ ఎక్కువ కాదు... నువ్వు ఆలోచించుకొని చెప్పు..." ఆమె మాటల్లో ఒక తెగింపు స్పష్టంగా తెలుస్తోందతనికి.

కానీ క్షణంలో వెయ్యోవంతు కూడా అతను ఆలోచించ దల్చుకోలేదు. "నువ్విక ఏమీ ఆలోచించకు. ఇంకే ఆలోచన చేయడమైనా ఎవరికీ శ్రేయస్కరం కాదు. ఇంత ఫైట్ చేసి మీరిద్దరూ పెళ్లి చేసుకున్నరు. ఇక ఆ బంధాన్ని దృఢపరుచుకునే వైపే ఆలోచించు. ఇప్పటికైనా నువ్వు సంతోషంగా ఉండాల్నని తప్ప నేను కోరుకునేది ఏమీ లేదు. నువ్వు ముందు నీ మనసులోని గిల్టీనెస్‌ను వదిలించుకో. అట్లా వదిలించుకుంటే తప్ప నువ్వు సంతోషంగా ఉండలేవు..."

"ఏం సంతోషం! నిన్నింత బాధపెట్టి నేను సంతోషంగ ఎట్లుంట?"

"నువ్విట్లనే ఆలోచిస్తే అసలు నువ్వేమయిపోతవో నీకేమన్నా అర్థం అయితుందా? నేను స్పష్టంగా చెప్తున్నదేమంటే, నేను బాధ పడుతున్న... నిజమే, కానీ నా బాధకు నువ్వు బాధ్యురాలివి కాదు, నువ్వే బాధ్యురాలిగా పైకి కనబడుతుండవచ్చు. నువ్వు కాదుగా నన్ను జైల్లో పెట్టింది. మనిద్దరి మధ్య అనివార్యమైన ఒక ఎడబాటు వచ్చిన పరిస్థితుల్లో నీ జీవితానికి సంబంధించిన నిర్ణయం, అది కూడా నీకూ ఉద్యమానికీ ఉపయోగపడుతుందనుకున్న నిర్ణయం నువ్వు తీసుకోవడం తప్పు కాదు. అది కొందరికి నచ్చకపోవచ్చు, కొందరిని బాధ కూడా పెట్టవచ్చు... అందుకు నువ్వు బాధ్యురాలివి కాదు. నువ్వు తీసుకున్న నిర్ణయం పట్ల నువ్వు ముందు దృఢంగా ఉండాలె. నువ్వు ఒక విషయంలో మొదటి అడుగు వేసినవ్. అలవాటైన దారిలోనే నడుస్తున్న వాళ్లకు అది తప్పుదోవగా కనిపించవచ్చు. ప్రస్తుతం ఉద్యమ ప్రయోజనాలకు భిన్నంగా కూడా కనబడవచ్చు. కానీ నువ్వు వేసిన ఈ అడుగు భవిష్యత్‌లో సరైన మార్గంగా నిరూపితం కావొచ్చు... ఏదైనా దీన్నొక ప్రయోగంగా తీసుకోవాల్సిందే..."

అతను తనను అంతగా అర్థం చేసుకున్నందుకు సంతోషమూ, అంతగా అర్థం చేసుకోగలిగిన సహచరుణ్ణి దూరం చేసుకున్నందుకు బాధ కలగలిసి తడిబారిన కళ్లను తుడుచుకుంటూ "నన్ను గురించి ఎవరెలా అర్థం చేసుకున్నా సరే... నువ్వు నన్నర్థం చేసుకున్నవనే తృప్తే ఇక మీదట నన్ను ముందుకు నడిపిస్తుంది. అయితే నీ బాధకు నేను బాధ్యురాలిని కాదని నువ్వన్నా, నాకూ బాధ్యత ఉందని నాకు తెల్వనిదేం కాదు. నీకు బాధ కలిగించిన అనే విషయం నుండి నేను వెంటనే అయితే బయటపడలేను. నువ్వు కొంత తేరుకొని మళ్లీ పెళ్లి చేసుకొని సంతోషంగా ఉండగల్గినప్పుడు బహుశా నేనీ బాధ నుండి బయట పడుతనేమో అంతవరకైతే నేను..." చీకటిని పారదోలడానికి పైపైకి ఎక్కి వస్తోన్న పున్నమి చందమామని చూస్తూ చెప్పుకుంటూ పోతోందామె.

('సుగుణ మీద నీకెప్పుడూ కోపం రాలేదా?' అనడిగితే, 'ఎప్పుడూ రాలేదు పాపం తానెంత ఘర్షణ పడ్డదీ' అని ఆర్తిగా పలికిన కామ్రేడ్ శాఖమూరి అప్పారావు హృదయ ఔన్నత్యం ముందు వినమ్రంగా తలవంచి నివాళిని అర్పిస్తూ.... - మిడ్కో)

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),

మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు

ఈ-మెయిల్ ఐ.డి. : arunatara1977@gmail.com

పత్రికా ప్రకటన

ఒడిషా సర్వోదయ సమాజ్‌కు కొన్ని ప్రశ్నలు

- మావోయిస్టు రాజకీయ ఖైదీలు

మీరు మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాలు సహజంగానే కొన్ని ప్రశ్నలు తలత్తేలా ఉన్నాయి. మావోయిస్టులను, ప్రభుత్వాలను ఒకే గాటన గట్టి శాంతి, హింసలకు వ్యతిరేకంగా మాట్లాడడం ద్వారా శాంతి కోసం కాకుండా ప్రచారం కోసం చేస్తున్న కార్యక్రమాలుగా భావించాల్సి వస్తోంది. సమాజంలో కుటుంబ హింసకు అగ్రతాంబూలాలు ఇస్తూ దళితులు, ఆదివాసుల, మైనార్టీలపై జరుగుతున్న దాడులు. మహిళలపై అత్యాచారాలు రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. వీటిపై ఎప్పుడూ ఒక్క మాటయినా మాట్లాడని మీరు, నేడు మావోయిస్టు ప్రాంతాలలోనే హింస కొనసాగుతున్నట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉంది. భూమి, అడవి, నీరుపై ఆదివాసులకు అధికారం లేకుండా చేస్తూ ఇక్కడ ఉన్న వనరులను దళారీ బూర్జువా వర్గాలైన పోస్కో, జిందాల్, ఎస్సార్ తదితర సంపన్నవర్గాల సంస్థలకు రాజ్యాంగ యంత్రానికి, చట్టాలకు వ్యతిరేకంగా ధారాదత్తం చేస్తుంటే ఏనాడయినా ప్రభుత్వాలను ప్రశ్నించారా? మాచ్‌కుండ్, బలిమెల, సీలేర్లలలో తయారవుతున్న జలవిద్యుత్తు, శబరీ, సీలేరు తదితర నదులలో ప్రవహిస్తున్న నీరు ఈ ప్రాంత ప్రజల వ్యవసాయ అభివృద్ధికి నోచుకోకపోవడానికి సంబంధించిన అంశంపై మీ దగ్గర సమాధానం ఉందా? విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలలో వెనకబాటుతనంపై ఎప్పుడైనా మాట్లాడారా? అభివృద్ధి పేరుతో ఆదివాసీ ప్రాంతాలలో కొనసాగుతున్న విధ్వంసం, పెరుగుతున్న నిరుద్యోగం, వనరుల దోపిడీ, కొత్త కొత్త రోగాల ఆవిర్భావం, పెరుగుతున్న పేదరికం, ఆకలి చావులు తదితర అంశాలను తెరపైకి రాకుండా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాదులతో మిలాఖత్ అయ్యి కొనసాగిస్తున్న హింసాకాండనే ఆపరేషన్ గ్రీన్‌హంట్. అవిభక్త కోరాపుట్‌లో దాదాపు 20 మందికి పైగా నిరోహి ఆదివాసులను పోలీసులు మాయం చేయడం జరిగింది. భూమికోసం, తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ చాసీమూలీ ఆదివాసీ సంఘం సభ్యులను, అమాయకులైన ఆదివాసీ ప్రజలను వందల సంఖ్యలో వివిధ జైళ్ళలో బంధించి పెట్టడం జరుగుతున్నది. మల్కన్‌గిరి సబ్‌జైలులో 30 మంది అమాయక ఆదివాసీ యువకులను బంధించిపెట్టారు. అక్రమంగా అరెస్టు చేసి 10, 15, 20 రోజుల వరకు రకరకాల చిత్రహింసలకు గురిచేయడం, అరెస్టు చేసిన రెండు మూడు నెలల తరువాత మరో కేసును పెట్టడం, కేసు విచారణ ముగిసి కేసును కొట్టి వేసిన తరువాత విడుదలయిన వారిని మళ్ళీ అరెస్టు చేసి మరికొన్ని కేసులు పెట్టి జైలులో బంధించడం ఈవిధంగా అరెస్టు అయ్యి సంవత్సరం దాటినా కేసులపై కేసులు నమోదు చేసే తంతు కొనసాగిస్తున్నారు పోలీసులు. కూంబింగ్ పేరుతో పోలీసులు ఆదివాసీ యువతులపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి అంశాలపై ఎప్పుడైనా మీరు నిజ నిర్ధారణ చేపట్టి లోకానికి తెలియజేశారా? లేదా మీరైనా తెల్సుకున్నారా? పై అంశాలపై మాట్లాడకుండా శాంతి గురించి మాట్లాడడం, మావోయిస్టులను హింసావాదులుగా ముద్రవేయడం ద్వారా మీరు ఆశిస్తున్న శాంతి ఎవరికోసం అనేది చెప్పకనే చెపుతోంది.

మీరు ఆరోపిస్తున్నట్టుగా మావోయిస్టులది హింసా సిద్ధాంతం కాదు. రాజ్యం, పాలకవర్గాలు సృష్టిస్తున్న హింసకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న ప్రతిహింస. పాలకవర్గాలు, రాజ్యం తమహింసను మానుకున్నట్లయితే ప్రయివేటు హింస తనంతట తానుగా ఆగిపోతుంది. హింసకు పుట్టుకను మరికొంత విశ్లేషించినట్లయితే గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు, పెత్తందార్లు, పట్టణాలలో పెట్టుబడిదారులు, గుండాలు, ఆదివాసులపై ఫారెస్టు అధికారులు రైతాంగం, కూలీలు, కార్మికులపై పోలీసులతో కల్సి రాజ్యాంగ యంత్రానికి, చట్టానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న అణచివేతే హింస. ఆత్మరక్షణ కోసమే పీడిత, తాడిత, ఆదివాసీ ప్రజానీకం ప్రతిహింసను కొనసాగిస్తుంది. భూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాద మిళిత వ్యవస్థలోనే హింసా సూత్రం, సిద్ధాంతం ఉంది. ప్రపంచ యుద్ధాలు, ప్రాంతీయ యుద్ధాలు మొదలు గ్రామాలలో జరుగుతున్న ప్రతి ఘర్షణ వెనుక భౌతికంగా, మానసికంగా, సాంస్కృతికంగా కొనసాగిస్తున్న దాడియే హింసా సిద్ధాంతం. ప్రజలు తమని తాము రక్షించుకోవడానికే ప్రతిహింసను, సాయుధ తిరుగుబాట్లను చేపట్టడం జరుగుతుంది. సంథాల్ తిరుగుబాటు నుండి నేటి దండకారణ్యం, ఒడిశా, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ వరకు జరుగుతున్నది ఇదే.

నిజానికి మీకు శాంతి, అహింసల పట్ల చిత్తశుద్ధి ఉంటే మొదట వెంటనే ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేర కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు కొనసాగిస్తున్న హింసను ఆపి ఆదివాసీ ప్రాంతాలలోని బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్ క్యాంపులు ఎత్తివేయాలని డిమాండ్ చేయాల్సింది. చర్చల పట్ల మావోయిస్టుల వైఖరిని స్పష్టం చేస్తూనే ఉన్నారు. కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం చర్చల పేరుతో కాలయాపన, అణచివేత విధానాలను అవలంబిస్తుంది స్పష్టమే. చిదంబరం చర్చల కోసం ఇచ్చిన పిలుపులన్ని అవకాశవాద, ఎత్తుగడల పరమయిన పిలుపులేనన్నది అతని కార్యాచరణే తెలియజేస్తుంది. సిపిఐ (మావోయిస్టు) పార్టీ అధికార ప్రతినిధి

చర్చల కోసం సామాజిక వేత్త స్వామి అగ్నివేశ్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగిస్తున్న విషయం తెల్సి ఎస్ఐబి పోలీసులు అతనిని నాగ్‌పూర్‌లో అరెస్టు చేసి, ఆదిలాబాద్ అడవుల్లో ఎన్‌కౌంటర్ పేర ఆజాద్‌ను, అతనితో పాటు మరొక విలేకరి హేమచంద్ర పాండేను కూడా హత్య చేయడం జరిగింది. తలలకు వెలలు నిర్ణయించడం, మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించడం కోసం ప్రత్యేక కార్యాచరణను కొనసాగించడం, ఉద్యమ అణచివేత కోసం ప్రత్యేక బలగాలను రూపొందించడం, స్పెషల్ ట్రైనింగ్ స్కూల్స్‌ను నెలకొల్పడం, వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి ఆయుధాలు కొనుగోలుచేయడం బహిరంగ రహస్యమే. చర్చల కోసం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి గణపతి పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో సవివరంగా ప్రకటించింది విదితమే.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఐ (మావోయిస్టు) పార్టీ, అనుబంధ ప్రజాసంఘాలపై నిషేధం ఎత్తివేయకుండా, ఆదివాసీ ప్రాంతాల నుండి బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్ క్యాంపులు ఎత్తివేయకుండా, ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేర ఆదివాసీ ప్రజలపై పారామిలటరీ బలగాలు చేస్తున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు ఆపాలని డిమాండ్ చేయకుండా చర్చలను ప్రస్తావించడంలో అర్థమే లేదు. చర్చల కోసం మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలను 3 లేదా 6 నెలలు కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేసిన విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం విదితమే. పై అంశాలన్నింటిని ఏమాత్రం పట్టించుకోకుండా శాంతి, అహింసలు అంటూ మావోయిస్టు పార్టీని నిందించడం భావ్యం కాదు. ప్రభుత్వాల ద్వంద్వవైఖరిని, అవకాశవాదాన్ని, హింసోన్మాదాన్ని నిందించండి, వ్యతిరేకించండి. 6 నెలలు కాల్పుల విరమణను పాటించమని డిమాండ్ చేయడం ద్వారానే మీరు కోరుతున్న శాంతి, అహింసల పట్ల ప్రజలలో విశ్వాసం కల్గుతుంది. లేకపోతే గుడ్డిఎద్దుకు బండిని కట్టి తోలినట్లే ఉంటుంది. చర్చలకు మధ్యవర్తులుగా, సంధానకర్తలుగా ఉండేలా జైళ్ళల్లో ఉన్న మావోయిస్టు పార్టీ నాయకులను విడుదల చేయమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేయండి.

చరిత్రలో వినోభాబావే భూస్వాములకు ఆచార్యుడిగా, పీడిత ప్రజలకు, వారి బాధలకు కారకుడుగా, బాధ్యుడుగా నిల్చింది యథార్థం. తాడు లేకుండానే బొంగరాన్ని తిప్పుతున్నట్టుగా భ్రమింపజేసిన మాంత్రికుడు. ఆనాడు పాలకులకు, భూస్వామ్య వర్గాలకు తెలంగాణ సాయుధ పోరాట ప్రభావాన్ని తగ్గించడానికి వినోభాబావే అవసరం ఏర్పడింది. కాబట్టి పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటాలకు పాల్పడినాయి. ఆనాటి ఆర్భాటం నేడు మరింతగా తేటతెల్లమయ్యి అందులోని డొల్లతనం బయటకు వచ్చింది. భూదానోద్యమం భూస్వామ్య వ్యవస్థను పటిష్ట పర్చడానికేనని నిరూపితమయింది. ఈ తానులోదే మీ ముక్క అయినట్లయితే మీ ర్యాలీలు, బహిరంగ సభలు అవసరం లేదు. కాకపోతే పోస్కో, వేదాంత, ఎస్సార్, జిందాల్, టాటా కంపెనీలకు వ్యతిరేకంగా నిర్వాసితుల పోరాటాలకు సంఘీభావం పల్కండి. జల్, జంగల్, జమీన్‌లపై ఆదివాసులకే అధికారమని, రాజ్యాంగంలో ఆదివాసులకు కల్పించిన స్వయం నిర్ణయాధికారాన్ని డిమాండ్ చేయండి. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి వ్యవసాయ వనరులు, అనుబంధ పరిశ్రమలు, విద్యుత్, వైద్యం, విద్య నెలకొల్పేలా డిమాండ్ చేయండి. స్కూల్స్, కాలేజీలు, హాస్టల్స్, హాస్పిటల్స్‌ను పారామిలటరీ దళాలు స్థావరాలుగా వినియోగించుకోవడాన్ని వ్యతిరేకించండి.

పై విషయాల ద్వారానే మీరు ఆశించే శాంతి, అహింసల వాస్తవికత తేటతెల్లమవుతుంది. ఆయుధం అవసరం లేని సమాజం కోసం, ఆయుధాలను యంత్ర పనిముట్లుగా, వ్యవసాయ సాధనంగా మలిచే స్థితి కోసం యుద్ధం చేస్తున్న వాస్తవాన్ని గ్రహించడానికి తోడ్పడుతుంది. రోగమొకటయితే మందు మరొకటి ఇవ్వడం ద్వారా సత్ ఫలితాలను పొందలేము. నేడు వ్యవస్థకు పట్టిన జబ్బుకు సాయుధ పోరాటమే శస్త్ర చికిత్స. దీని ద్వారా హింసకు తావులేని శాంతియుత సమాజాన్ని నెలకొల్పడానికి భాగస్వాములు కావాలని కోరుతున్నాం.

(మావోయిస్టు రాజకీయ ఖైదీల తరపున
శ్రీరాముల శ్రీనివాస్)

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.

డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల	:	రు. 10
సంవత్సర చందా	:	రు. 100
జీవితచందా	:	రు. 1000

మేనేజర్ : ఎస్. రవికుమార్

5-1307, దొరసానిపల్లె రోడ్, ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360, సెల్ : 9866021257

దండకారణ్య డైరీ

ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలోనూ, మొత్తంగా దేశ వ్యాప్తంగానూ ముఖ్యంగా ఆదివాసీ ప్రజలపై గ్రీన్‌హంట్ పేరిట అమలవుతున్న అణచివేతలో ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న నిర్బంధం గురించి సాధన అందించిన రిపోర్టు - సం.

గ్రీన్‌హంట్ ఉత్పాతాలు

- సాధన

(2)

సిగ్గులేని మగతనం

రాహీ దళం మార్చి 8 'అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం' జరుపుకునే సంబరంలో మునిగిపోయింది. ఈ మార్చి 8 వందేళ్లది కావడంతో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దండకారణ్య క్రాంతికారి ఆదివాసీ మహిళా సంగటన్ వందేళ్ల వేడుకల ప్రత్యేక కార్యక్రమం రూపొందించింది. వారం రోజులు జరపాలని రోజువారీ కార్యక్రమాన్ని నిర్ణయించి అన్ని యూనిట్లకూ అందించింది. ఇందులో ఒక రోజు 'ముప్పై ఏళ్ల దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర' పుస్తకావిష్కరణ కూడా ఉంది. భారతదేశంలో వేల సంఖ్యలో ఆదివాసీ పీడిత మహిళలను తమ విముక్తి మార్గంలో సంఘటితం చేసి ఒక లక్ష సభ్యత్వంతో నిలిచిన 'క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగటన్' ను ఏకైక అతి పెద్ద ఆదివాసీ మహిళా సంఘంగా స్థానిక మహిళలంతా సగర్వంగా చెప్పుకుంటున్నారు. రాహీ దళంతో పాటు అక్కడ సాయుధమై ఉన్న ప్లాటూన్ మహిళలంతా ఆలీవ్‌గ్రీన్ దుస్తుల్లో చక్కగా ముస్తాబై యువ గెరిల్లాలుగా దర్శనమిస్తున్నారు. పురుషులూ అంతే ఉత్సాహంగా ఉన్నారు.

ఎర్రని జెండా మధ్యలో ఐదు కోణాలను కలిగిన తెల్లని మెరుపుల నక్షత్రం నూతన ఉషోదయానికి సంకేతంగా నిల్చి ఆకాశంలో ఎగరడానికి సిద్ధంగా ఉంది. రాహీ దళం కమాండర్ మోతీ విజిల్ ఊదడంతో గెరిల్లాలూ, గ్రామస్తులూ అందరూ మూడేసి వరుసల్లో నిల్చున్నారు. అందరికీ ఎదురుగా నిల్చున్న దక్షిణ గడ్‌చిరోలి డివిజన్ క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు తారా సిడం చేతిలో ఆవిష్కరణకు సిద్ధంగా చరిత్ర పుస్తకం ఉంది. గ్రామస్తుల్లో స్త్రీలు, పురుషులు, పిల్లలూ ఉన్నారు.. ప్రజా మిలీషియా కార్యకర్తలు నాల్గు వైపుల సెంట్రీలున్నారు. విడిగా పిఎల్‌జిఎ గెరిల్లాలు క్యాంపు సెంట్రీ చేస్తున్నారు. ఆ రోజు మహిళలకు సెంట్రీ మినహాయించారు.

గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో భాగంగా మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లాకు సైతం కేంద్ర పారా మిలటరీ బలగాలు పెద్దెత్తున చేరాయి. అవి ఐదు వేలకు పైగా ఉన్నాయని పత్రికలు రాస్తున్నాయి. వేడుక జరుగుతున్న ప్రాంతమంతా రెండు రోజుల ముందే 'భద్రతా' బలగాలు కూంబింగ్ చేసి వెళ్లాయని అక్కడికి వచ్చిన ప్రజలు చెప్పుతున్నారు. కార్పొరేట్ సెక్యూరిటీ విధానంలో భాగంగా బలగాలను మోహరించడంతో మొత్తం ఆ ప్రాంతమంతా ఖాకీవనంలా తయారైంది. రాజ్‌నంద్‌గాం-గడ్‌చిరోలి జిల్లాల సరిహద్దులో ఇండో-టిబెటన్ బార్డర్ పోలీసు (ఐటిబిపి) బలగాలు 'నూతన సరిహద్దుల'ను నిర్మిస్తున్నారు. వాళ్లు గెరిల్లాల్లాగే తయారై, రోజుల తరబడి అడవిలో గస్తీ చేస్తున్నారు. 'గెరిల్లాలతో గెరిల్లాగా పోరాడు' (ఫైట్ గెరిల్లా లైక్ ఎ గెరిల్లా) నినాదంతో కాంకేర్‌లోని 'కౌంటర్ టెర్రరిజం జంగల్ వార్‌ఫేర్ కాలేజీ'లో శిక్షణ పొందిన పోలీసు కమాండో బలగాలూ గెరిల్లాల వేటలో నిమగ్నమయ్యాయి.

ప్రజలనే సముద్రంలోని లోతైన నీళ్లలోకి జారుకొని 'సురక్షితంగా' సంచరించే ప్రజా గెరిల్లాలతో జీతం రాళ్ల కోసం కక్కుర్తి పడి పొట్ట కూటి కోసం పోలీసు విధులు నిర్వహిస్తున్న బలగాలు జనసంద్రపు ఒడ్డున తిరుగుతూ గెరిల్లాలను వేటాడుతామనుకోవడం దోపిడీ పాలకవర్గాల ఆత్మవంచనతో గూడిన పరవంచనే తప్ప మరోటి కాదు. వరుసలు తీరి నిలబడిన జండా వద్దకు హఠాత్తుగా కంపెనీ-4 సభ్యులు ఇద్దరు చేరుకున్నారు. అనుకోని వారు రావడంతో 'ఏదో జరిగి ఉంటుంద'ని అందరి ఆలోచనల్లో ప్రశ్నలు మెదులుతున్నాయి.

'నిన్న గడ్‌చిరోలీ-ధనోరా రోడ్డు పై హత్తిగుట్ట వద్ద మన గెరిల్లాలు పదహారున్నర టన్నుల విస్ఫోటకం స్వాధీనం చేసుకున్నారు', వచ్చిన ఇద్దరిలో చరణ్ గబగబా చెప్పాడు. వందేళ్ల వేడుకలకు మరింత వన్నె తెచ్చింది ఆ వార్త. గెరిల్లాలకు ఏదీ అందకుండా చేస్తామని '4-కట్' పాలసీని అమలు చేస్తున్న పోలీసులకు ఈ చర్య చెంపపెట్టులా ఉంటుందనీ రాహీ దళ బాధ్యుడు మనసులోనే అనుకున్నాడు.

'మహిళా ముక్తీ జండా హమ్ పహరాయేంగే
శోషణ్ ముక్తీ జండా హమ్ లహరాయేంగే...'

అంటూ శ్రావ్యంగా సి.ఎన్.ఎ. కార్యకర్తలు పాట పాడడంతో ఆకాశంలో మహిళా విముక్తి జండా ప్రశాంతంగా రెపరెపలాడుతోంది. పాట పూర్తయ్యే వరకూ అందరూ పిడికిలి బిగించి జండాకు ఎర్రెర్ర వందనాలు తెలుపుతూ నిశ్శబ్దంగా సావధాన్‌లో నిల్చున్నారు. పాట ముగిసిన వెంటనే కమాండర్ మోతీ 'మహిళా విముక్తి బాటలో పోరాడుతూ గత వందేళ్ల కాలంలో అసువులు బాసిన వీరవనితలందరికీ, ప్రజాయోధులందరికీ రెండు నిమిషాలు వారి స్మృతిలో మౌనంగా నిల్చి పేరుపేరునా జోహార్లు తెలుపుదాం' అంటూ 'ఉల్టా శస్త్ర్' కాషన్ ఇచ్చింది.

ఆ రెండు నిమిషాలూ ప్రతి ఒకళ్ల ఆలోచనల్లో తమ ప్రియమైన సహచరుల అమర జ్ఞాపకాలే మెదిలాయి. ఆ తర్వాత బరువెక్కిన గుండెలతో, చెమ్మగిల్లిన కళ్లతో, బిగించిన పిడికిళ్లు పైకి లేపి ముక్తకంఠంతో నినాదాల హోరు మొదలైంది. ఒకరు 'క్లారా జెట్కిన్ అమర్ హై' అంటే మరొకరు 'క్లారా తుజే లాల్‌సలాం'

అంటున్నారు. 'అమర్ షహీదీర్‌కు మావా భూంకాల్ జోహార్' అంటూ అడవులు, కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి.

వక్తలు వరుసగా ఒకరి తర్వాత మరొకరు మాట్లాడుతున్నారు. మార్చ్ 8 నేపథ్యం మాట్లాడాక వక్తలు ఎవరి అనుభవాలు వారు చెప్పుతున్నారు. అందరి జీవితాలకు ప్రతిబింబంగా, వారి పోరాట అనుభవాలను తెరిచిన కిటికీలా ముప్పై ఏళ్ల చరిత్ర పుస్తకం తమ మధ్య సాక్ష్యంగా నిల్చిందని కామ్రేడ్ తార మాట్లాడగా, చరిత్రను అక్షరబద్ధం చేసినవాళ్లకు పేరుపేరునా కాంత (ఉత్తర గడ్‌చిరోలి డివిజన్ క్రాంతికారి మహిళా సంఘం అధ్యక్షురాలు) విప్లవాభినందనాలు తెలిపింది. ఆ తర్వాత వక్తల వరుసలో కోస్మీకి చెందిన పుష్ప నిల్చింది. పుష్ప తన అనుభవాలను చెప్పుతుంటే రాహీ దళ బాధ్యుడికి రెండు దశాబ్దాల క్రితంనాటి కోస్మీ కళ్లల్లో మెదిలింది.

కోస్మీ ధనోరా తాలూకాలోని ఆదివాసీ గ్రామం. ఆదివాసీ గ్రామాల లెక్కల్లో అది ఒక పెద్ద గ్రామమే అనుకోవచ్చు. నూట పదిళ్లున్న గ్రామం అది. ఆ ఊళ్లో మడావీ, పూడో, నైతాం, హోడి, కోలా, పొట్టావీ, హల్లామీ, ఊసెండీ మొదలైన కోయ ఆదివాసీ కుదుర్లతో పాటు మహర్ (మాల), తేలి (గానుగ) కులస్తులు, రావుత్, పర్చస్, వతన్‌కార్ లాంటి తెగలకు చెందినవాళ్లూ ఉన్నారు. బంగ్లాదేశ్‌నుంచి పెద్దెత్తున దండకారణ్యానికి వచ్చిన బెంగాలీ కుటుంబాలు అనేక ఆదివాసీ గ్రామాల్లో స్థిరపడ్డట్టే కోస్మీలోనూ ఓ బెంగాలీ కుటుంబం దుకాణం గత ఇరవై ఏళ్లుగా నడుపుకుంటోంది. ఆ ఊరికి పాండు హల్లామీ పటేల్‌గా ఉన్నాడు. ఊళ్లో చిన్న చిన్న దుకాణాలు నాల్గున్నాయి.

1987-88లో ఈ ప్రాంతానికి విప్లవ దళం చేరుకుంది. ఆ దళానికి పసుల రాంరెడ్డి (జగదీషు) నాయకత్వం వహించాడు. ఆయన సహచరి శాంతక్క మహిళా నాయకురాలిగా ఆ ప్రాంతానికి వెళ్లింది. ఆయన కొద్ది రోజుల్లోనే మడావి దాదాగా జనాల్లో గొప్ప విశ్వాసం పొందిన ప్రజానాయకుడయ్యాడు. (1999లో ఉత్తర తెలంగాణ పోరుగడ్డన పోరాడుతూ ఆయన అసువులు బాసాడు). తిప్పాగడ్ గుట్ట ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందినది కావడంతో ఆ దళం తిప్పాగడ్ దళంగా ఉనికిలోకి వచ్చింది.

విప్లవ దళం వచ్చాక అన్ని గ్రామాల్లో ప్రజాసంగాలు ఏర్పడినట్టే కోస్మీలోనూ ఏర్పడ్డాయి. వాటిలో డివికెఎంఎస్‌తో పాటు కెఎఎంఎస్ కూడా ఉంది. కాకపోతే ఆదివాసీ పితృస్వామ్య సంకెళ్ల మధ్య నలిగిపోతున్న మహిళలు కోస్మీలో ప్రారంభంలో పెద్దెత్తున సంఘాల్లో సభ్యత్వం తీసుకోలేదు. ఆ రోజుల్లో సంఘంలో వారి సంఖ్య పదికి మించలేదు. ఆ సంఘానికి మైనాబాయి నైతాం తొలి నాయకురాలు. ఆమె అప్పటికే గృహిణి.

ఊళ్లో మహిళలు విప్లవ సంఘంలో చేరడాన్ని పురుషుల్లో నరనరాన జీర్ణించుకుపోయిన మగతనం ఆమోదించలేకపోతోంది. 'ముత్తి మాట మూలకు' అని చెప్పి తరతరాలుగా అణచి ఉంచిన ఆ ముత్తి (మహిళ) ఈ రకంగా ముందుకు రావడాన్ని వాళ్లు భరించలేకపోతున్నారు. ఏదో ఓ నెపంతో వారిని వేధించడం మొదలైంది. ఇంటిలో వేధింపులూ, తెగ వేధింపులూ వారిని ఆనాటికి ఉన్న రాజ్యహింసకన్నా నిజంగానే ఎక్కువగా వేధిస్తుండినాయి. రోజు-రోజు, ఘడియ-ఘడియ అన్నట్టు ఆ వేధింపులు వారిని హింసిస్తున్నాయి. 'సంఘంలో చేరి తప్పు చేశామేమో' అని అనుకునేలా చేస్తున్నాయి. కానీ సంఘాన్ని వదులుకుందామనే ఆలోచనలు మాత్రం వారిలో రాకుండా మైనాబాయి వారికి నిరంతరం ధైర్యం చెబుతోంది. ఊళ్లోకి మడావి దాదా, దళం వచ్చినప్పుడు దవడలు దగ్గర పడుతున్న ఊరి మగాళ్లు దళం వెళ్లిపోయిందంటేనే విరుచుక పడుతున్నారు. 'ఆడాళ్లకు రాజకీయాలు ఎందుకు?' ఇదే వారి ఏకైక, అసూయ నిండిన, వివక్షాపూరిత పితృస్వామ్యం విసురుతున్న సవాల్.

ఆ పదిమంది మహిళలు ఆ సవాల్‌ను స్వీకరించారు. అర్ధరాత్రినుంచే తన శక్తినంతా చేర్చి వడ్లు దంచడం మొదలుపెట్టే మహిళకు, పుంజులు కూయక ముందే పొద్దు తల్లి కడుపులో ఉండగానే రోజుకు సరిపడా జావ కాచిపెట్టే మహిళకు, నాగలి పట్టడంలో, వేటకు వెళ్లడంలో మగాడితో సమానంగా శ్రమను పంచుకునే మహిళకు, అడవి అడవంతా తిరిగి ఆకూ-అలమూ, కూరా-నారా తెచ్చి ఇంటిల్లిపాదికీ వంటా వార్పూ చేసి దొప్పల్లో వడ్డన చేసే ఆ కష్టజీవికి, నవమాసాలు మోసి పునర్జన్మతో సమానమైన ప్రసవంతో బిడ్డలకు జన్మనిచ్చి, తన రక్తాన్ని పాలుగా తాపి వారిని పెంచి పెద్ద చేసే ఆ తల్లికి 'రాజకీయాలు ఎందుకు పనికిరావు?' అన్నదే ఊరి మగాళ్లను పదే-పదే ఆ పదిమంది మహిళలు అడుగుతున్న ఏకైక ప్రశ్న. ఈ విషయం మార్క్స్ చెప్పాడా, మావో చెప్పాడా వాళ్లకు తెలియదు గానీ మడావి దాదా మాత్రం సంఘం పెట్టినాడు సూటిగా అడిగిన ప్రశ్న ఇదే. ఈ ప్రశ్నకు జవాబుగానే వారు కెఎఎంఎస్‌లో సంఘటితం అయ్యారు.

ఊరి మహిళలు రోజురోజుకూ మరింత పట్టుదలగా సంఘంలో పని చేయడం పెరగడంతో పాటు ఊళ్లో ఎర్రెర్రని తోరణాలు కట్టి ఏటా మార్చి 8 జరపడం కూడా మొదలైంది. దీనిని భరించలేని మగతనం ఇంకా బరి తెగించింది. ఊళ్లోని లంపెన్ శక్తులు ఏకమయ్యాయి. గ్రామ సంపన్న శక్తుల అదృశ్య హస్తం, బూర్జువా రాజకీయ పక్షాల అండ, రాజ్యం ప్రోత్సాహం అన్నీ కలిసి ఆ లంపెన్ శక్తులను విపరీతంగా రెచ్చగొట్టాయి. ఫలితంగా ఆ లంపెన్ యువకులు ఊరి సంఘం మహిళల కార్యక్రమాలను దెబ్బ తీయడానికి వారి వెంటబడి వారిని అడవిలోకి తరమడం మొదలైంది. అడవిలో వాళ్లు తమ ఒంటి మీది గుడ్డలన్నీ తీసేసి నగ్నంగా నిల్చుండేవారు. అంతే కాదు. అడవిలో ఆ మహిళలను బలవంతంగా తమ నగ్న శరీరాల కాళ్ల నడుమనుంచి ఈగించడం అందులో భాగమైంది. ఆ పితృస్వామ్యం ముందు ఏ వావీ వరుసలకు అర్థం లేకుండా పోయింది. వాళ్ల వయసులతో నిమిత్తం లేకుండా, వారు గృహస్థులా, తల్లులా, చెల్లెల్లా అన్నదాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా సిగ్గులేని మగతనం అనాగరికంగా హద్దు మీరి పిచ్చిగా వ్యవహరించసాగింది.

మగపిచ్చిని భరించలేని ఆ మహిళల రక్తం వేడెక్కితుకతుక

ఉడకసాగింది. ఏ సామాజిక కట్టుబాట్లు పాటించని ఆ దుర్మార్గ చర్యలతో మహిళలు విసిగి వేసారిపోయి ఆ మగతనానికి కళ్లెం వేయాలనుకున్నారు. గట్టిగా బుద్ధి చెప్పనిదే ఆ పితృస్వామ్యం తమను వదలదనుకున్నారు. ఓ రోజు వారు ఊళ్లోకి దళం వచ్చినప్పుడు తమ వెతనంతా నిర్భయంగా, నిస్సంకోచంగా మడావి దాదా ముందు వెళ్లబోసుకున్నారు.

దళం ప్రజా పంచాయితీ నిర్వహించింది. ఊరి జనాలంతా వచ్చినట్టే ఆ లంపెన్ శక్తులు కూడా వచ్చాయి. పూడో, ముకుంద్, నిజాం మొదలైన గూండాల బృందం చేరింది. మైనాబాయి నైతాం కెఎఎంఎస్ వాళ్ల తరపున అన్ని విషయాలూ పూస గుచ్చినట్టు మాట్లాడింది. మర్యాదస్తులూ, మానస్తులూ మౌనంగా తలదించుకుని వినసాగారు. గూండాలు తప్ప ఊరి వాళ్లందరూ తమ సహానుభూతిని ప్రకటించారు. అక్కడ చేరిన మహిళల రోమాలు నిల్చున్నాయి. మడావి దాదా, దళ సభ్యులూ ఆ గూండాల ఆగడాలను అరికట్టకపోతే ఏ ఊళ్లోనూ సంఘాలు, అందులోనూ మహిళా సంఘాలు దుర్మార్గమైన పితృస్వామ్యం ముందు బతికి బట్ట కట్టలేవనుకున్నారు. వెంటనే మడావి దాదా ముందుకు వచ్చి 'ఈ గూండాలకు ఏ శిక్ష విధిస్తారు?' అనడంతో జనాలంతా ముక్తకంఠంతో 'గట్టిగా బుద్ధి చెప్పాల'న్నారు.

ఆరుగురు గూండాలపై మహిళలు బరిగలతో విరుచుకుపడ్డారు. వారి వీపులు చిట్లి ఎరుపెక్కాయి. అయినా ఆ మహిళల ఉగ్రరూపం చూస్తుంటే వారిని ఆపడానికి ఎవరూ సాహసించలేకపోతున్నారు. చివరకు దళం జోక్యం చేసుకొని 'మహిళలతో మర్యాదగా వ్యవహరించని ఏ మగాడికైనా ఇదే గతి పడుతుంది' అనడంతో మైనాబాయి పేరుపేరునా మిగిలిన గూండాలను హెచ్చరించింది. ఆ ఘటన తర్వాత ఆ ఊళ్లో కెఎఎంఎస్ అన్ని ఊళ్లల్లో కెఎఎంఎస్ కన్నా బలంగా తయారైంది. ఇంటికో మహిళ సంఘంలో చేరింది. మెజార్టీ యువతులు చేరారు. కాలక్రమంలో వీరిలో కొందరు మహిళా విముక్తి మార్గంలో సాయుధమై గెరిల్లాలయ్యారు. మైనాబాయి సంఘ నాయకత్వం నుంచి పార్టీ సభ్యురాలిగా ఎదిగి 2006-07 నాటికి కోస్మీ జనతనా సర్కార్ అధ్యక్షురాలైంది.

'ఆడవాళ్లకు రాజకీయాలెందుకు?' అని ఒకనాడు ప్రశ్నించిన ఆ ఊరి మగాళ్లు ఒక మహిళకు స్వచ్ఛందంగా తమ ఊరి సర్కార్ పగ్గాలు అప్పగించారు. ఆ పగ్గాలు అందుకున్న ఆరుగురు పిల్లల తల్లి కామ్రేడ్ మైనాబాయి నైతాం రాజ్యం కళ్లల్లో నలుసైంది. 2008 మే నెలలో గ్యారపత్తి పోలీసులు ఆమెను అరెస్టు చేసి సామూహికంగా అత్యాచారానికి గురి చేసి చిత్రహింసల కొలిమిలో ఆమె ప్రాణాలను బలిగొన్నారు.

ఇది ఒక కోస్మీ కథ. ఇది ఒక మైనాబాయి నైతాం జీవిత చరిత్ర. ఇది తరతరాల అణచివేత పై ఎగిసిన ఒక పోరు కేతనం అనుభవం. దండకారణ్యంలో ఇలాంటి పల్లెలు ఎన్నెన్నో ! ఆ పల్లె కడుపులల్లో ఎందరెందరు మైనాబాయిలో !! వందేళ్ల పోరు మహిళకు వన్నె తెస్తున్న ఈ వీరవనితలే క్లారా జెట్కిన్‌కు నిజమైన వారసురాళ్లు. 'ముత్తి (మహిళ) మాట మూలకు' అన్న పురుషాధిపత్య నానుడిని తమ పోరాటాలతో, త్యాగాలతో జయిస్తూ 'ముత్తి మాటను ముందుకు' తెస్తున్నారు. పితృస్వామ్యానికి సమాధి కట్టేది వీళ్లే. ఇన్ని విజయాలను సాధించిన వీళ్లు ఈనాడు గ్రీన్‌హంట్ అభియాన్ కొనసాగిస్తున్న దాడులను తమ విజయాల స్ఫూర్తితో ఓడించకుండా ఎలా ఉంటారు? వాళ్లు గత 30 ఏళ్లలో సాధించుకున్న ప్రతీ విజయం గ్రీన్‌హంట్ దాడులను కచ్చితంగా సవాలు చేస్తాయి అని రాహీ దళ బాధ్యుడు అనుకుంటూ ఒక్కసారి తల పైకెత్తి చూడగా జనాలందరూ 'కెఎఎంఎస్ జిందాబాద్, మైనాబాయి, శ్యామల, సునంద, సరిత, సాధన అమర్ హై - అమర్ హై' అంటూ నినదిస్తున్నారు. ఆయన చేయి కూడా బిగించిన పిడికిలితో పైకి లేచి 'అమర్ హై' అంటూ గొంతు కలిపింది. 'గ్రీన్‌హంట్‌తున్' అంటూ ఆ గొంతు గట్టిగా నినదించడంతో 'హోరా కీకాల్, హోరా కీకల్' అంటూ వందల గొంతులు బదులిచ్చాయి. అడవులూ - కొండలూ - జనవాసాలూ ప్రతిధ్వనించాయి.

డికె ఆదివాసీ మహిళలు గత ముప్పయ్యేళ్లుగా తెగ పితృస్వామ్యాన్నీ, ఇంటిలోని పురుషాధిపత్యాన్నీ అడుగడుగునా ఎదుర్కొని దానిని ఓడిస్తూ మరింత సంఘటితమవుతున్నారు. రాజ్యహింసను ఓడించడానికి వాళ్లు సాయుధమవుతున్నారు. ఒకనాడు 'జనజాగరన్', ఆ తర్వాత 'సల్వాజుడుం', ఈ రోజు 'గ్రీన్‌హంట్'తో వాళ్లు జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. జీవించడానికి వాళ్లు చావుకైనా తెగించి అడుగడుగునా పోరాడుతూ న్యాయమైన జీవన పోరాటంలో గెలుస్తున్నారు. పితృస్వామ్యాన్ని ముక్కలు ముక్కలుగా నరికి పోగులు పెట్టి దోపిడీరహిత సమసమాజ నిర్మాణ మార్గంలో తమ విముక్తికై వడివడిగా అడుగులు వేస్తున్నారు. 'మహిళ లేని విప్లవం గెలవబోదు' అన్న చారిత్రక సత్యాన్ని పదే పదే నిరూపిస్తున్నారు. మహిళా లోకానికి ఆదర్శప్రాయంగా దండకారణ్య ఆదివాసీ మహిళలు భారత పోరాట చరిత్ర పుటల్లో తమ స్థానాన్ని భద్రపరచుకుంటున్నారు.

మేడే, 2010

(పోరు దారిలో ధైర్యంగా నిలిచి ఆదర్శమూర్తిగా అందరి హృదయాలలో చోటు చేసుకున్న మైనాబాయి నైతాం లాంటి ఎందరెందరో పోరు మహిళలందరికీ వందేళ్ల మహిళా దినం సందర్భంగా వినమ్రంగా అంకితం)

కజ్జాం

రాహీ దళ బాధ్యుడు చాలా ఆసక్తిగా 'వాకింగ్ విత్ కామ్రేడ్స్' అరుంధతీ రాయ్ వ్యాసం చదువుతూ దళానికి చెప్పుతున్నాడు. దళ సభ్యులందరూ 'దీదీతో మాట్లాడుతున్నట్టే ఉంది వింటుంటే' అని పైకీ, లోపలా అనుకుంటూ వింటున్నారు.

'ఖమ్మంలో 49.5 డిగ్రీల ఎండ' అంటూ రేడియో చెప్పింది. దండకారణ్యంలోనూ అటూ ఇటూగా ఎండ తీవ్రత 48 డిగ్రీలకు తగ్గదన్నంత తీవ్రంగా తన ప్రతాపాన్ని చూపిస్తోంది. రాహీ దళం తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న పందిరి కింద చద్దర్లు కట్టుకొని సమష్టి అధ్యయనం కొనసాగిస్తోంది. అకాల వర్షాల పుణ్యమా

అంటూ ఈసారి అడవి కొంత ముందుగానే అంటే జూన్‌కు ముందే పచ్చబడింది. అక్కడక్కడ వాగుల్లో వర్షపు నీళ్లు అగుపడుతున్నాయి. ఈ వర్షాలే లేకపోతే పరిస్థితి చాలా గంభీరంగానే ఉండేది. గత సంవత్సరం వేల సంఖ్యలోనే ఆదివాసుల పశువులు అడవిలో నీళ్లూ, మేత దొరకక మృత్యువాత పడ్డాయి. ఎన్నెన్నో పల్లెలు నీటి కోసం వలస వెళ్లక తప్పలేదు. ఈ సంవత్సరం మాత్రం ఆ దుస్థితి రానందుకు పల్లెముఖాల్లో, పసుల మందల్లో వరుణ దేవుడికి కృతజ్ఞతలు వెల్లడవుతున్నాయి.

క్యాంపు బాధ్యుడు రెండుసార్లు 'లాంగ్ విజిల్' ఊదడంతో సెక్షన్‌ల వారీగా సభ్యులందరూ తూనీగల్లా వచ్చి నిల్చున్నారు. ఆ రోజు పౌర్ణమి కావడంతో నిండు చంద్రుడు కూడా విజిల్ విన్నట్టే వచ్చి తన జాగాలో తాను ఉండిపోయి అన్నీ పరిశీలిస్తున్నాడు.

'కామ్రేడ్స్! మనం ఇప్పుడు అమ్మోనియం నైట్రేట్ విస్ఫోటన పరీక్షలు చేయాలి. ఊరివాళ్లకూ, సెంట్రీలకూ కబురు వెళ్లింది. అందరూ అలర్ట్‌లో, జాగ్రత్తగా ఉండాలి' అని చెప్పి రోల్‌కాల్ ముగించాడు.

అమ్మోనియం నైట్రేట్‌ను దంచి వస్త్రగాళితం పట్టి మెత్తని పిండిలా తయారు చేసి అందులో కిలోకు 50 గ్రాముల చొప్పున డీజిల్ కలిపి తేమ ఏ మాత్రం లేకుండా అయ్యేవరకూ ఎండలో రోజు ఆరబెట్టి కంటేనర్‌లలో నింపిన గగన్ ముఖంలో పున్నమి వెలుగులు నిండాయి. మిగతా సభ్యులందరూ విస్ఫోటన శబ్దాల కోసం ఉవ్విళ్లూరుతుంటే మోతీ బ్యాటరీ తెచ్చి డిటోనేటర్‌కు కనెక్షన్ ఇచ్చింది. క్యాంపు బాధ్యుడు కౌంట్ మొదలుపెట్టాడు. ఒకటీ, రెండూ,మూడూ...అనేసరికి అడవిలోని కొండల నడుమ పెద్ద ఉరుములాంటి శబ్దంతో విస్ఫోటనం తన శక్తిని ప్రదర్శించింది. అక్కడ గుమిగూడిన సభ్యులందరూ ఆనందోత్సాహాలతో ఎగిరి గంతులు వేస్తూ కేరింతలు కొడుతున్నారు.

రాహీ దళ బాధ్యుడు తన పక్కనున్న ఓ వారపత్రికను తదేకంగా చూస్తున్నాడు. దాని అట్ట పై ఉన్న పోలీసు డిజిపి విశ్వరంజన్ ఫోటో 'ఇంత శక్తివంతమైన పేలుడా' అని ఆశ్చర్యపోతున్నట్టు అన్పించి తనలో తాను ముసిగా నవ్వుకున్నాడు. హిట్లర్‌ను పోలిన ఆ ముఖాన్ని చూస్తుంటే సరిగ్గా ఏడాది క్రితం 15వ లోక్‌సభ ఎన్నికలకు కొద్ది ముందు 'ఎన్నికలకు ముందు నక్సలైట్లు చేసే ఆగడాలను వారి విస్ఫోటనం జప్తు చేసుకొని అరికట్టామ'ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ చేసిన ప్రకటన, ఆనాడు విశ్వరంజన్ అందుకున్న వాహ్వాలు బాధ్యునికి గుర్తొచ్చాయి.

మే 18 నాడు పిఎల్‌జిఎ శత్రువునుంచి పదహారున్నర టన్నుల విస్ఫోటనాన్ని జప్తు చేసుకోవడం రమణుడి పొగరుకు ఫిట్టింగ్ రిప్లై కొండలు ప్రతిధ్వనించిన పిడుగులాంటి విస్ఫోటనలు గర్జిస్తున్నాయి.

'శత్రువు అనుసరిస్తున్న 4-కట్ పాలసీకి ఇది మరో పెద్ద దెబ్బ. విప్లవకారులకు అందే అన్ని రకాల సరఫరాలను దెబ్బ తీయడానికి పోలీసులు అన్ని దారులూ మూస్తున్నామని అనుకుంటున్నప్పటికీ ఎప్పటికప్పుడు కొత్త దారులు తెరుచుకుంటూనే ఉన్నాయి. గతంలోని సల్వాజుడుంకూ, 'అంకుల్ చిదం' ముందుకు తెచ్చిన గ్రీన్‌హంట్‌కూ తూట్లు పడుతూనే ఉన్నాయి. నిధులు అందకుండా అడ్డుకోవాలంటే విప్లవకారులు దాడులు చేసి బ్యాంకు నిధులు సమకూర్చుకుంటున్నారు. వారికి కొత్త శక్తులు రిక్రూటు కాకుండా నియంత్రించాలని రకరకాల చిట్కాలూ, దుష్ప్రచారం ఎంత చేస్తున్నా 'సింగిల్ లార్జెస్ట్ త్రెట్' పెరుగుతూనే ఉంది. దింపిన బలగాలలో నక్సలైట్లను ఎదుర్కొంటామనే ఆత్మస్థయిర్యం మావోయిస్టుల దాడులతో తీవ్రంగా దెబ్బ తింటోందనీ మీడియానే తెలుపుతోంది. శత్రువు తలపెట్టిన దాడులు విఫలమవుతుంటే ప్రజల పై విరుచుకు పడి అది కొనసాగిస్తున్న ఫాసిస్టు చర్యలు తీవ్రమవుతున్నాయి. సామూహిక హత్యలు, అత్యాచారాలు, గృహ దహనాలు ప్రజల్లో బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. వీటిని మీడియా దృష్టికి రాకుండా పోలీసులు పూర్తిగా నియంత్రిస్తున్నారు. ప్రజల పక్షం మాట్లాడేవారినెవరినీ అడవుల్లోకి రానివ్వడం లేదు. ఇది మారాలి. దీన్ని మార్చాలి' అనుకుంటూ తీవ్ర ఆలోచనల్లో మునిగిపోయిన రాహీ దళ బాధ్యుడు 'లాల్‌సలాం' అంటూ వినబడడంతో ఈ లోకంలోకి వచ్చి తలెత్తి చూశాడు.

ఎదురుగా ఎనిమిదిమంది యువతీ-యువకులు నిలబడి ఉన్నారు. వారంతా 'చేతనా నాట్య మంచ్' సభ్యులు. ఆకుపచ్చ గేర్ (పొడుగాటి లంగా) ధరించి, స్త్రీలైతే పైన జాకెట్, పురుషులైతే బనియన్ వేసుకుని తలకూ, నడుంకూ ఎర్రని గుడ్డ కట్టి, చేతిలో తమ సంఘ చిహ్నంతో (డోలు, కలం) ఉన్న జండాను పట్టుకొని ఒక్కొక్కరుగా చేయి కలుపుతూ కదులుతున్నారు. వారంతా గ్రామ జనతనా సర్కార్ విద్యా-సంస్కృతి ప్రచార విభాగం. వారి కోరిక పై ఆ రోజు క్యాంపులో తమ కళా ప్రదర్శనను చూపడానికై తయారై వచ్చారు. చివరన ఉన్న ఒక యువతి చేతిలో కంజర ఉంది. మహిళ చేతిలో కంజర చూసిన రాహీ దళ బాధ్యుడు ఒక్కసారి కనుబొమ్మలు ఎగురవేసి కళ్లు పెద్దవిగా చేసి చూస్తూ 'పెద్ద మార్పే' అనుకున్నాడు. ఆదివాసీలలో మహిళలు/యువతులు డప్పు, డోల్లు పట్టి నృత్యం చేయడం గానీ, విల్లంబులు చేతబట్టి వేటలో పాల్గొనడం కానీ మేలో అంటారు. కానీ విప్లవ సాంస్కృతిక మహిళా కార్యకర్తలు ఆ పురుషాధిపత్య సంప్రదాయాన్ని పక్కన బెట్టగా, ప్రజా మిలీషియాలోని మహిళలేమో ఆత్మరక్షణ కోసం నిరభ్యంతరంగా విల్లంబులను ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. 'విప్లవోద్యమం ఎన్నెన్ని మార్పులను సునాయాసంగా తేగల్గుతుంది' అనుకుంటూ బాధ్యుడు లేచి వేదిక వైపు వెళ్లి అందరిలో కలిసిపోయి ప్రేక్షకుడిగా కూచున్నాడు.

బృంద నాయకురాలు ముందుకు వచ్చి తమ బృందం పాడబోయే పాటను పరిచయం చేసింది. అది విస్థాపన సమస్య పై పాట అని అర్థమైంది.

ఒక మహిళా కళాకారిణి పాడుతూ నృత్యం చేస్తోంది. మిగతా వాళ్లంతా కోరస్ ఇస్తూ వాళ్లూ నృత్యంలో భాగమవుతున్నారు. అక్కడ కూచున్న పిఎల్‌జిఎ గెరిల్లాలూ, ప్రజలూ పాట వింటూ నృత్యాన్ని చూస్తూ మురిసిపోతున్నారు. పున్నమి వెలుతురులో అందరి

భావాలూ ఎలాంటి దాపరికం లేకుండా వారి ముఖాలపై అగుపడుతున్నాయి. కానీ రాహీ దళ బాధ్యుడు పదే, పదే పెదవులు విరుస్తున్నాడు. పాటకు తగినట్టుగా నృత్యం లేదు, భావానికి ప్రతిబింబంగా హావభావాలు లేవన్నదే ఆ పెదవి విరుపులకు సంకేతం అని సి.ఎన్.ఎ. బలహీనత అర్థమైనవాళ్లకెవరికైనా సులువుగానే బోధపడుతుంది. 'ఇది శిక్షణలోనే ఉన్న లోపం' అనుకుంటూ ఆయన దీర్ఘంగా ఆలోచిస్తుండగానే ఆయన ఆలోచనలకు వేదిక పైన వెలువడుతున్న ప్రకటనతో తెరపడింది. 'విస్థాపన సమస్య పై నాటకం చూడండి' అంటూ పరిచయం చేశారు.

పదిహేను నిమిషాల్లో కళాకారులు నాటకం పూర్తి చేశారు. తాము ఇవ్వదలుచుకున్న సందేశాన్ని అద్భుతంగా వ్యక్తం చేశారు. పాత్రోచితంగా ఆహార్యం ధరించారు. భావయుక్తంగా ఆ హావభావాలున్నాయి. ఎక్కడా ఏ లోపం లేకుండా డైలాగులు ఉచ్ఛరిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. అది నటన కాదు, జీవితం. ఈ రోజు దండకారణ్యంలోని వేలాది ఆదివాసీ రైతుల జీవన్మరణ సమస్య. తమ ఇండ్లూ, పంట భూములూ, తమకు ప్రాణంలాంటి అడవీ, తమ ఆత్మీయ సంబంధాలూ, తరతరాల సంస్కృతీ, గాలీ, నీరూ అన్నీ వదులుకొని టాటా, ఎస్సార్, జిందాల్‌ల కోసం జీవితాలను బలి తీసుకోవద్దనే సందేశం ఆ నాటకం ద్వారా ఇచ్చారు. గ్రీన్‌హంట్ మొదలైందందుకే అని చెప్పారు. మనిషి తన వ్యక్తిగత ఆస్తి కోసం ఎంతగా గింజులాడినా, సమష్టి కోసం అంతకన్నా అనేక రెట్లు సమైక్యతతో పోరాడకుండా ఏదీ కాపాడుకోలేమని ప్రతి పాత్ర చేతా మాట్లాడించారు. రాహీ దళ బాధ్యుడు కూడా ఆ వెలుగుల్లో వెలుగయ్యాడు. జనం నవ్వులో భాగమయ్యాడు. దీనితో ఆయనలో మరో ఆలోచన ముందుకు వచ్చింది. పక్కనే కూచున్న ఎస్‌జెడ్‌సి సభ్యుడు రాజుతో 'భావం అర్థమైన కళాకరుల హావభావాలు యాంత్రికంగా ఉండవు రాజుదా' అన్నారు. రాజు తలూపుతూ ముసిగా నవ్వాడు. వీళ్లు మాటల్లో ఉండగానే సి.ఎన్.ఎ. కళాకారులతో పిఎల్‌జిఎ గెరిల్లాలూ, జనం అందరూ కళాకారులైపోయారు. వారంతా సామూహికంగా సంప్రదాయ నృత్యంలో మునిగిపోయారు. మిగిలింది రాజూ, బాధ్యుడే.

ఊళ్లోనుంచి ప్రజా మిలీషియా కమాండర్ ఫాగు పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఆయన ముఖంలో వ్యక్తమవుతున్న ఆందోళనను అర్థం చేసుకున్న రాజు 'ఏదో జరిగింది' అని రాహీ దళ బాధ్యుడితో అంటుండగానే కమాండర్ ఫాగు విషయం వెల్లడించాడు.

'ఈ రోజు ఉదయం పోలీసులు పక్కూరు కజ్జాం వచ్చి మన అనిల్ ఇంటితో పాటు, జనతనా సర్కార్ సభ్యుడి ఇల్లు తగులబెట్టారు. ఇంట్లో దాచిపెట్టుకున్న డబ్బులు కూడా దోచుకెళ్లారు. ఇంట్లో ఉన్న ఇప్పపూలూ, పంటగింజలూ, గుడ్డలూ అన్నీ తగులబడిపోయాయి. అనిల్ ఇంటిని పోలీసులు తగలబెట్టడం ఇది రెండోసారి. మొదట సల్వాజుడుం గూండాలు కాలిస్తే, ఇప్పుడు గ్రీన్‌హంట్ పోలీసులు కాల్చారు' అంటూ ఫాగు తాను చూసిందంతా చెప్పాడు.

కమాండర్ చెప్తున్నదంతా శ్రద్ధగా వింటున్న బాధ్యుని వైపు చూస్తూ రాజు '2010 మార్చ్‌లో వయనార్‌లో కొత్తగా పోలీసు క్యాంపు వేశారు. దాదాపు 250 మంది కమాండోలుంటున్నారు. వీరు చేయని దుర్మార్గం అంటూ లేదు. ఇప్పటికే రెండు బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి ఏడుగురు ఆదివాసీ యువతీ-యువకులను కాల్చి 'మావోయిస్టుల మరణం' అన్నారు. వీళ్ల వెంటే స్థానిక లంపెన్ శక్తులు సుఖ్‌లాల్, మున్నా, జుగ్నూలు ఎస్.పి.ఓలుగా ఉంటున్నారు. వీళ్ల పీడ ఎప్పుడు విరగడవుతుందా? అని జనం అనుకోని రోజుండదు. వయనార్‌లో కొత్తగా బడి పేరుతో కడుతున్న పోలీస్ క్వార్టర్స్ నిర్మాణ పనుల్లో కజ్జాం ఊరివాళ్లు పాల్గొనడం లేదు. వాళ్లను ఎలాగైనా లొంగదీసుకోవాలని ముందు మన పార్టీ ఏరియా కమిటీ సభ్యుడి ఇల్లు, మరో నాయకుడి ఇల్లు కాల్చారు. ఉదయం హెలికాప్టర్ మూడు రౌండ్లు తిరిగిందంటేనే అనుమానమొచ్చింది కామ్రేడ్' అన్నాడు. రాజు ఫాగు వైపుకు తిరిగి 'ఇంకేం చేశారు పోలీసులు?' అని అడిగాడు.

'ఇంకేముంది? షరా మామూలే. ఆ పోలీసుల దుర్మార్గానికి దారిలోని మరో మూడూళ్లలో అమరుల స్థూపాలు నేలమట్టమయ్యాయి. ఒక రైతును తమ వెంట తీసుకెళ్లారు. మేం చెప్పిన పనికి రాకుంటే మిగిలిన ఇండ్లనూ కాలుస్తాం అని ఎస్‌పిఓ సుఖ్‌లాల్ హెచ్చరించాడు. నన్ను వాడు చూడలేదు. నేను దూరంగా ఉండి అన్నీ గమనించాను' అంటూ కమాండర్ ముగించాడు.

'ఊరోల్లు ఏమంటున్నారు ఫాగూ? అనిల్ భార్యా పిల్లలూ ఇంటి వద్దే ఉన్నారా?' అంటూ రాజు ప్రజా మిలీషియా కమాండర్‌ను మరో రెండు ప్రశ్నలు అడిగాడు.

'ఊరి వాళ్లంతా ఈ సమయంలో మన కంపెనీ వస్తే బాగుండు అనుకుంటున్నారు. అనిల్ భార్య జాడ లేదు కామ్రేడ్. తన కళ్ల ముందే తన కష్టార్జితమైన ఇప్పపూలూ, వడ్లూ, పప్పు దినుసులూ కాలిపోతుంటే ఆవిడ తట్టుకోలేకపోయింది. తన ఒంటి మీది నగల్నూ, కూడబెట్టుకున్న డబ్బూ పోలీసుల పాలవడంతో వలవలా ఏడ్చింది. ఇంట్లో దొంగలు పడ్డా ధనం పోయి ధాన్యం మిగులుతుంది. ఇల్లూ ఉంటుంది. కానీ ఈ దొంగలు ఏదీ మిగల్చడం లేదు. ఏ క్షణాన మళ్లీ వచ్చి తననేం చేస్తారో అనే ఆందోళనతో ఆమె ఆ మంటల్లోనే పడి సజీవంగా ప్రాణం తీసుకోవడానికి సిద్ధపడగా ప్రజలు అడ్డుకున్నారు. తను పోగు చేసుకున్న సంపదంతా తన కళ్ల ముందే కాలి, కూలుతుంటే ఆ దృశ్యాలను భరించలేక చివరకు ఆమె పిచ్చిదానిలా అడవిలోకి పరుగెత్తింది. ఎటు పోయిందో ! ఏమవుతుందో ! ఊరోళ్లకు దిక్కు తోచడం లేదు. ఆ, అయితే పోలీసుల పనికి మాత్రం ఊరోళ్లు పోమంటున్నారు' అంటూ ఫాగు అంతా పూసగుచ్చినట్టు చెప్పాడు.

'పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లిన ఊరి రైతును ఐదు వేల రూపాయల లంచం ఒప్పందంతో వదిలిపెట్టారు. నేను రాంగా ఆయన అప్పుడే ఇంటికి వచ్చిండు' అంటూ ఫాగు అదనంగా జోడించాడు. రాజు తలూపాడు. దీర్ఘ శ్వాస తీసుకుని 'సరే' అన్నాడు.

చేతి గడియారం చూడగా రాత్రి ఎనిమిది అవుతుంది.

బిబిసి హిందీ సర్వీస్‌లో 'ఇండియా బోల్ ప్రసారమౌతోంది. బాధ్యుడు శ్రద్ధగా వింటున్నాడు. 'మావోయిస్టులు సాధారణ ప్రజలను చంపుతున్నారు. ఆ నెపం పై కేంద్రం సైన్యం దింపే అవకాశం ఉందా' అనే అంశం పై రూపా ఝా ప్రోగ్రాం నడిపిస్తోంది. దంతెవాడలో మందుపాతర పేలుడులో పోలీసులతో పాటు ప్రయాణీకుల ప్రాణాలు పోవడం, ఝూర్‌గ్రాం (పశ్చిమ బెంగాల్) రైలు ప్రమాదంలో ప్రయాణీకుల ప్రాణాలు పోవడం పై రూపాతో బిబిసిలో ఎవరూ తమ అభిప్రాయాలు పెద్దగా పంచుకోవడం లేదు. ఎందుకంటే అప్పటికే దంతెవాడలో పొరపాటున జరిగిన బస్సు దుర్ఘటన ప్రమాదం పై మావోయిస్టులు క్షమాపణలు చెప్పి ఉండడం, ఝూర్‌గ్రాం రైలు దుర్ఘటనలో తమ హస్తం లేదని స్పష్టం చేయడం జరిగింది. దీనితో ఇద్దరు, ముగ్గురు తప్ప అందరూ దాదాపు ఒకే స్వరంగా మావోయిస్టుల విప్లవోద్యమ మూలాలు ఈ హంతక వ్యవస్థలోనే ఉన్నాయన్నారు. బిబిసి ఎంచుకున్న టాపిక్ దాదాపు అడ్రస్ లేకుండా పోయింది. వార్తల్లో మాత్రం ఆ రోజు చిదంబరం ఎప్పటిలాగే మరోసారి 'నక్సలైట్లు హింసను వదులుకోవాలి' అని వాగాడు. 'కజ్జాం లాంటివి ఎన్నెన్నో దండకారణ్య అడవుల్లో దాగున్నాయి, జనం గుండెల్లో లావాలు బద్దలవుతున్నాయి, ఖాకీల హింసోత్పాతానికీ, గ్రీన్‌హంట్ ఆగడాలకూ బలవుతున్న పల్లెలు అనేకం ఉంటున్నాయి, ఇంతకంటే మించిన హింస ఇంకేముంటుంది !' అంటూ రాజు వైపు చూస్తూ రేడియో కట్టేశాడు రాహీ దళ బాధ్యుడు.

బుధురాం

ఎండాకాలం. నీళ్ల కటకట తీవ్రంగా ఉంది. పచ్చని అడవులుగా భారత దేశ ప్రకృతి పటంలో స్థానమాక్రమించిన విశాల దండకారణ్యంలోనూ మార్చ్ నుంచీ జూన్ వరకూ నీడ కరువవుతుంది. ఈ సమయంలోనూ అడవిలో నీడనిచ్చే చెట్లంటే పూనుగు చెట్లే. పోతే మామిళ్లు. పూనుగు చెట్లు అరకొరగానే అడవిలో ఉంటాయి. వేసవిలో ఈ చెట్ల నీడను ఖాకీలే ఆక్రమిస్తాయి. కాబట్టి అవి దళాల డేరాలకు నిషేధిత స్థలాలే అయ్యాయి. ఇక ఈ అడవిలో మామిళ్ల అరుదే అని చెప్పుకోవచ్చు. కాకపోతే ఊరి పొలిమేరల్లో, రైతుల పొలాల్లో, వాగు ఒడ్డున మేమున్నామంటాయి. అందుకే గడ్‌చిరోలిలో అన్ని దళాలూ ఎండాకాలం అంతా చద్దర్లతోనే నీడనిచ్చే గూళ్లు ఏర్పరుచుకుంటాయి. ఆ గూళ్లు అర్ధనగ్న ఆదివాసీలకు ఏ మాత్రం తీసిపోవు. రాహీ దళం కూడా అలాంటి గూడునే ఏర్పర్చుకుంది. కాకపోతే ఆ ఒక్క రోజు డేరాకు కూడల్ దొడ్డ (వాగు) ఆతిథ్యమిచ్చి కాపాడింది.

కూడల్ దొడ్డ అంచున తన డేరాలో ఉన్న రాహీ దళ బాధ్యుడు తనలో తాను నవ్వుకుంటుంటే 'బాతా కామ్రేడ్ ! కవ్వీనిన్?' (ఏంటి కామ్రేడ్ ! నవ్వుకుంటున్నారు?) అంటూ దళ కమాండర్ మోతీ నవ్వుతూ అడిగింది.

'ఈ దొడ్డ పేరు గుర్తొచ్చి నవ్వొస్తుంది మోతీ ! కూడల్ దొడ్డ అంటే తెలుగులోనూ నగ్న వాగే అవుతుంది. ఈ పేరు ఎలా వచ్చిందో ?' అంటూ ఆయన తన సందేహాన్ని ఆమెతో వెలిబుచ్చాడు.

'బారాయో' (తెలీదు) అనుకుంటూ మోతీ గుడ్డలు తీసుకుని అంజాని వెంటేసుకుని వాగుకేసి వెళ్లింది. అంతలోనే రుషి అందుకున్నాడు.

'ఆదివాసీలెవరైనా స్త్రీ, పురుషులు బరిబాతలనే స్నానాలు చేస్తారు కదా ! వెనుకట ఎవరో దాదాలు నగ్నంగా స్నానాలు చేస్తున్నప్పుడు వరద వచ్చి వాళ్లను తన్నుకపోయిందట. దాంతో ఆ పేరు వచ్చింది' అంటూ చరిత్ర చెప్పుకొచ్చాడు.

రాహీ దళ బాధ్యుడు తన పక్కన పడి ఉన్న మరాఠీ పత్రికల్లోకి తల దూర్చాడు. గత నెల రోజుల పత్రికలు ఆయన పక్కన పడి ఉన్నాయి. అన్ని పత్రికల్లోనూ ప్రత్యేక విదర్భ వార్తలే పతాక శీర్షికల నిలిచాయి. దాదాపు గత వందేళ్లుగా ఈ డిమాండ్ నానుతూనే ఉంది. క్రమక్రమంగా ఈ డిమాండ్ రాజకీయ అసంతృప్తి జీవులకే పరిమితమైంది. దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కుతూ తమ పబ్బం గడుపుకోవడానికే ప్రత్యేక విదర్భను ముందుకు తెచ్చే రాజకీయులంటేనే ప్రజల్లో అసహ్యమేర్పడింది. కాకపోతే దేశవ్యాప్తంగా ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్ నెగళ్లను మరోసారి రాజేయడానికి తాజాగా ఉవ్వెత్తున లేస్తున్న ప్రత్యేక తెలంగాణ పోరుకేకలు తోడ్పడుతున్నాయని రాహీ దళ బాధ్యుడు చరిత్రను సమీక్షించుకుంటూ పత్రికలు తిరగేస్తుంటే జగ్గూ కాల్చుకొచ్చిన మొక్క జొన్న కంకులతో ఆయన వద్దకు వచ్చాడు.

'అరె ! అప్పుడే కంకులు రావడం, కాల్చడం, అందరికీ పంచడం అన్నీ అయిపోయాయే' నవ్వుతూ జగ్గూ చేతిలోని కంకులను బాధ్యుడు అందుకున్నాడు. 'ఎవరిచ్చారు జగ్గూ' జొన్న గింజలు ఒలుచుకుంటూ ప్రశ్నించాడు.

'డొల్తానా పేకాల్ (మృతుని కొడుకు) అని చెప్పి అతను వాళ్ల తండ్రి ఫోటో అడుగుతున్నాడన్నాడు జగ్గూ. 2008, నవంబర్ 14 నాడు కేంద్ర రిజర్వు బలగాలు కూరెనార్ వద్ద కాల్పులు జరిపి ఇద్దరు రైతులను పొట్టన పెట్టుకున్నాయి. ఆ రోజు ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికలు. ఆ పేరుతో వచ్చిన 'భద్రతా బలగాలు' ఓట్ల పెట్టెలతో తిరిగి వెళుతూ మందుపాతరను కవ్వించారు. ఫలితంగా ఒక జవాను మృత్యువాత పడక తప్పలేదు. పనికి రాని ఓట్లతో పనేముందని ఉదయాన్నే అడవికి వెళ్లిన కుటుంబాలు అడవినుంచి సాయంత్రం తమ భార్యా పిల్లలతో ఇంటికి తిరిగి వస్తున్నాయి. జవాను మృతితో రెచ్చిపోయిన సిఆర్‌పిఎఫ్ జవాన్లు ఆ ప్రజలపై కాల్పులు జరపడంతో ఒక రైతు అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. వారికసలు ఆ మందుపాతరతో ఎలాంటి సంబంధమూ లేదు. ఆయన చేసిన నేరమేమంటే ఓట్లలో పాల్గొనకపోవడమే. భారత ప్రజాస్వామ్యాన్ని నిలుపుతుందని పాలకవర్గాలు చెప్పుకునే ఓట్ల ప్రక్రియలో పాల్గొనకపోవడమే. ఆ తుపాకులస్వామ్యం వాళ్ల ప్రాణాలు తీసింది. చనిపోయిన ఆ రైతు కొడుకే మొక్కజొన్న కంకులతో దళం వద్దకు వచ్చాడు.

రాహీ దళ బాధ్యుడు జనతనా సర్కార్ తొలి సంచికలో (మే, 2009) అచ్చయిన వాళ్ల తండ్రి ఫోటోను చూపిస్తూ జగ్గూ చేతిలో పత్రిక పెట్టి, 'వీలైతే వాళ్ల అమ్మను పంపించమను, మాట్లాడి వెళ్దాం' అన్నాడు.

ఉద్యమ ఫలితంగా దోపిడీ అటవీ శాఖ నుంచి అడవి విముక్తమై జనం చేతికి వచ్చింది. జనతనా సర్కార్లు ఏర్పడిన చోట అటవీ రక్షణ విభాగం ఉనికిలోకి వచ్చి అడవులను కాపాడుతున్నాయి. భూమి లేని వేలాది కుటుంబాలకు అటవీ భూములు దొరికి, వాళ్ల జీవితాల్లో రెండు పూటలా తిండికి హామినిచ్చాయి. శరణార్థులుగా చేరిన బెంగాలీలు కూడా ఈ లబ్ది పొందుతున్నారు. భూములు దొరికిన పేద బెంగాలీలంతా తామూ చారు మజుందార్ వారసులమే అన్నంతగా మురిసిపోతూ దళాలకు చెప్పుకుంటూ ఉంటారు. వారు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో సేద్యం చేస్తూ వేసంగి జొన్న వేయడంతో కూడల్ దొడ్డ అందాలే మారిపోయాయని అనుకుంటున్న రాహీ దళ బాధ్యుడి ఆలోచనలకు గాలి దుమారంలా పరుగులు బెడుతూ వస్తున్న రైతుల దండు బ్రేకు వేసింది.

రైతుల దండులో అన్ని వయస్సుల వాళ్లూ ఉన్నారు. పిల్లల చేతుల్లో గులేర్‌లున్నాయి. అందరూ ఒగురుస్తున్నారు. వాళ్లలో పెద్ద వాళ్లెవరికీ ఒంటి మీద చిన్న అడ్డగా తువ్వాలు తప్ప ఇంకే గుడ్డా లేదు. వాళ్లంతా ఎందుకు పరుగు దీస్తున్నారబ్బా ! అనుకొని ఆరా తీస్తే, వాళ్లు ఒక చిన్న పక్షిని తరుముకు వస్తున్నారు. ఇంత ఎండలో కూడా అది ఎంతో వినోద క్రీడగా ఉంది వాళ్లకు. ఆ పక్షి కుమ్మాంగోల్, ఎండకు తట్టుకోలేక వీళ్లకన్నా అధికంగా ఒగురుస్తూ ఓ చెట్టు నుంచి మరో చెట్టుకు ఆయాసంగా ఎగురుతూ అలసిపోయింది. దాన్ని ఏ చెట్టు కొమ్మ మీదా కాసేపు కూడా సేద తీర్చుకోనీయకుండా గుల్లేర్లతో కొడుతూ, అరుస్తూ, కేరింతలతో తరుముతూ ఆనందిస్తున్నారు. వాళ్ల ముఖాల పై ఆనందం, నవ్వులూ తప్ప ఏ అలసటా, ఆయాసమూ, గ్రీష్మ తాపం కానరావడమే లేదు. ఆ క్షణంలో రాహీ దళ బాధ్యుడికి 'రాలిపడిన పువ్వుల కై, గాయపడిన పిట్టల కై' అంటూ రాసిన తెలుగు కవి గుర్తొచ్చి తనలో తాను నవ్వుకుంటుంటే, 'వాళ్లను అడ్డుకోవేంటీ' అని అంజూ ఆయన్ని ఆటపట్టించింది.

తన దళ సభ్యులు ఇలాంటి చిన్న, చిన్న పక్షులనూ, పిల్ల జంతువులనూ సంబరంగా వేటాడితే నివారించడం రాహీ దళ బాధ్యుడికి అలవాటు. కానీ అదే క్షణంలో 'భిన్న సంస్కృతుల భావ ఘర్షణ ఇది' అని సమాధానపడడమూ ఆయనకు అలవాటే. అంజూ జోక్‌తో తనలాగే కోసాదా కూడా నివారించడం, సమాధానపడ్డం చేస్తుంటాడని గుర్తొచ్చాడు. మరో రెండు రోజుల్లో కోసాదా కలుస్తాడని గుర్తొచ్చి కనుబొమ్మలు ఎగరేసాడు.

* * *

(ఇంకా ఉంది....)

3వ పేజి తరువాయి......

మందిని (కార్మిక స్త్రీలు, బిడ్డలతో సహా) కాల్చి చంపించాడు. మరొక 45 వేల మందిని అరెస్టులు చేశారు. వారిలో 15 వేల మందిని ఉరి తీసి, తక్కిన వారిని ప్రవాసం పంపివేశారు. వేలాది మంది కమ్యూనిస్టులు స్విడ్జర్‌లాండ్, ఇంగ్లాండ్, యునైటెడ్ స్టేట్స్ దేశాలకు పారిపోవాల్సి వచ్చింది. ఇటువంటి ప్రవాసుల్లో ఒకరైన కార్మికుడు యాజనీ పాటియర్ 1871 జూన్‌లో ప్రపంచ కార్మికుల విప్లవ పోరాట గేయం 'ఇంటర్ నేషనల్ గీతం' రచించాడు. స్త్రీ కమ్యూనార్డ్స్ ఆ మొత్తం క్రమంలో వీరోచితమైన పాత్రను పోషించారు. మహిళా సంఘాలు స్త్రీ, పురుష సమానత, సమాన వేతనాలకోసం డిమాండ్ చేశాయి. ఇలా రాసుకుంటూ పోతే ప్యారిస్‌లో కార్మిక, ప్రజానుకూల నిర్ణయాలు ఎన్నింటినో కమ్యూన్ చేసింది. ప్యారిస్ కమ్యూన్ అమలుపరిచిన ఉచిత విద్య, కార్మికుల పని గంటలు, జీవించడానికి అవసరమైన పరిస్థితులు లేకుండానే ఇప్పటికీ మన దేశ ప్రజలు (60 ఏళ్ల స్వాతంత్రం(?) తర్వాత కూడా) అవస్థలు పడుతున్నారు. ప్రజలకు కూడు, గూడు, నీడ, విద్య, వైద్యం, ఉపాధి వంటి కనీస మౌలిక అవసరాలు తీర్చకుండా లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలలో పాలకులు తలమునకలై ఉన్నారు. వడ్డీ వ్యాపారుల పీడనలతో బతకలేక ప్రజలు ఆత్మహత్యల పాలవుతున్నారు. విద్యలో మతాన్ని చొప్పిస్తున్నారు. హిందూ మతోన్మాదాన్ని ప్రేరేపించి అధికారం సుస్థిర పరచుకోవాలని చూస్తున్నారు. జనానికి విప్లవ పరిష్కారాలు ఎంత అవసరమో పరిస్థితులు సూచిస్తూనే ఉన్నాయి. ప్యారిస్ కమ్యూన్ ఆశయాలు, విప్లవ ఆశయాలు సాధించే వరకు కార్మిక, కర్షక, పీడితులంతా పోరాటాలు చేస్తునే ఉంటారు. అందువల్లే 140 ఏళ్ల ప్యారిస్ కమ్యూన్‌ను తలుచుకోవడం. ప్యారిస్ కమ్యూన్ ఎగరవేసిన అరుణపతాకను మన దేశంలోనూ ప్రపంచ వ్యాప్తంగానూ ప్రజలు మరింత ధృఢమైన దీక్షతో చేతబట్టి ముందుకు సాగుతున్నారు. ప్యారిస్ కమ్యూనే కాదు మన దేశంలోని విప్లవ వెల్లువలో భాగంగా ఎగసిపడిన ఇంద్రవెల్లి అణిచివేతకు ఈ ఏడాదితో ముప్పై ఏళ్లు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న జిల్లా గిరిజన రైతుకూలీ మహాసభ జరగకుండా 144 సెక్షన్ విధించి పోలీసులు సభకు వస్తున్న గిరిజనులపై నిర్విచక్షణగా కాల్పులు జరుపడంతో అనేక మంది గిరిజనులు అసువులు బాసారు. అధికారిక లెక్కల ప్రకారం ఇంద్రవెల్లి ఘటనలో 13 మంది చనిపోయారు. నిజనిర్ధారణ కమిటీల ప్రకారం 60 మంది వరకు గిరిజనులు చనిపోయి ఉండవచ్చని ఒక అంచనా. వాస్తవానికి ఆనాటి పోలీసు కాల్పుల్లో గాయపడి బయటకు చెప్పలేక వైద్యం చేయించుకోలేక చనిపోయిన వారి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండవచ్చు. ప్యారిస్ కమ్యూన్ అయినా, ఇంద్రవెల్లి అయినా పీడిత ప్రజలకు తాము సాధించుకోవాల్సిన లక్ష్యాలను నిరంతరం గుర్తు చేస్తూనే ఉంటాయి. ఈ సందర్భంలో శ్రీ శ్రీ 'మరోప్రస్థానం' కవిత – "యిప్లవం యాడుందిరా /ఆడనే నీ కూడుందిరా/ నీ గూడుందిరా... యిప్లవం యాడుందిరా–నీ/ గుండెలోనే కూకుందిరా...మన కళ్లలోనే దాగుందిరా..../ యిప్లవం యేమందిరా/ మనిషికొకటే సావందిరా/ కట్లు తెంచుక రమ్మందిరా....' అన్న కవితా పాదాల్ని మననం చేసుకుంటూ మునుముందుకే సాగుతున్న పోరాటాలతో మనమంతా భుజం కలిపి నడవాల్సిందే.

నవల సీరియల్

గుమ్మెటమోత

- పాణి

(11)

(గత సంచిక తరువాయి...)

"ఏదన్నా మాట్లాడతవని వస్తే నన్నపిల్లోడి మాదిరి ఏడుస్తుండవే..." అని ఎప్పటికో మందలింపుగా, చిరు కోపంగా అన్నాడు.

'అబ్బా.. జంబులుగాడు కత చెప్తాంటే పోకుండా ఉండలేం. పోతే ఎప్పుడు ఏడిపిస్తడో, ఎప్పుడు ఎంటికలు నిక్కబొడుచుకునేటట్లు చెప్తడో తెలేదు... ' అనుకుంటారు.

జంబులు తాను చెప్పే కథల్లోని విషాద ఘట్టాల్లో లీనమవుతాడు. తాను కళా ప్రదర్శకుడిగా, నటనగా మిగిలిపోడు. రౌద్రాన్నయినా, ఆగ్రహాన్నయినా, దు:ఖాన్నయినా హృదయపు లోతులనుంచి వెలికి తీస్తాడు. తాను ఆ మన:స్థితికి చేరుకొని చూపరులకు కూడా ఆ స్థితిలోకి తీసికెళతాడు. అలాంటి కళాకారుడు ఇప్పుడు తన కథ కోసం, అందులోని నిజ పాత్ర అయిన కొడుకు కోసం రోదిస్తున్నాడు. ఈ పంచాయితీ జరిగినంత సేపు ఓ దిక్కు మౌనంగా కూర్చుండిపోయిన జంబులును కొడుకు బిచ్చావతి పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు. కొడుకు చేసిన ఈ ఒక్క తప్పు కాయమని తాను పంచాయితీని అడిగి ఉండాల్సింది. ఆ రోజే అడిగి ఉండింటే వాడికి అంత ఆగ్రహం వచ్చేది కాదేమో.

జంబులు కాసేపు పసివాడిలాగే ఏడ్చాడు.

ప్రపంచమంతా స్థావర జంగమాత్మకమైనదనీ, అన్నీ వాటి వాటి తీరున నడిచిపోతుంటాయనీ ఎరుకపరిచే ఈ ప్రాచీన సంచార కళాకారుడికి ఇది ఎందుకిట్లా జరిగిందో ఇన్నాళ్లకు సంశయం పట్టుకున్నట్టుంది. దానివల్లే మనసు వశం తప్పిపోయింది. స్థిర చిత్తంతో అన్నిటినీ సంబాళించుకుంటూ కథ చెప్పే జంబులుకు ఈ కథ ఎందుకిట్లా ఈ మలుపు తిరిగి కనిపించని దూరాలకు జారిపోయిందో తెలియడం లేదు. కథలో వాటంతటవే తమ స్వయం సిద్ధమైన మానవోచిత వ్యక్తిత్వంతో సాగిపోయే పాత్రల మానవోచిత ప్రవర్తనకు తానూ గురయ్యాడు.

కాసేపటికి తేరుకున్నాడు.

మిగతా వాళ్లంతా బీరుపోయారని వెంకటేశ్వర్లుకు తెలుస్తూనే ఉంది. ఉలిగప్ప కూడా అట్లాగే ఉన్నాడు. "అవును నాయినా...! మీ పిలగాడి పంచాయితీ కూడా చేద్దామా... మరి" అన్నాడు. కొంచెం తేలికపాటి స్వరంతో, జంబులును మాటల్లోకి దించాలని.

జంబులు కళ్ల నీళ్లు తుడుచుకున్నాడు.

గొంతు గురగురలాడింది.

బైట తాగినవాళ్లెవరో కేకలు వేయడంతో ఏమీ వినిపించలేదు. మళ్లీ తనే " మావోడు ఒకరి మాట వినేరకం కాదు. కులమన్నా, పెద్దమంచులన్నా వాడికి మంట..."

"ఎందుకని" గిరి అడిగాడు.

"ఏమో వాడికి ఇట్లాంటివేవీ పడదు. చిన్నప్పటాల్నుంచి అంతే. ఆ పంచాతితో మరీ ఎక్కువైంది... దాంతోని ఎట్టికి తిరుగుతా ఉంటడు. ఎటుదిక్కు గాలి తోలితే అటే. ఎంత మాట నోటికి వస్తే అంతే. పెద్దా చిన్నా లేదు"

కొడుకు గురించి అట్లా మాటలు సాగిపోయాయి.

అప్పుడట్లా మాట్లాడుతున్నప్పుడు ఆయన తాగి ఉన్నాడని మిగితా వాళ్లంతా మర్చిపోయారు. ఆ క్షణాన ఉలిగప్పకు జేనాయన కొత్తగా కనిపిస్తున్నాడు. నిజంగానే ఏనాడూ ముసలోని నోటెంట ఈ మాటలు వినలేదు. ఎల్లప్పుడూ కులాచారాల పంజరంలో నుంచి, కుల ధర్మాల పలుకులు మాత్రమే విన్నాడు. వాటికి బందీ అయినట్టు ఇసుమంత సందేహం ఆ స్వరంలో వినిపించేది కాదు. తొట్రుబాటు లేని, అచంచల భాషణగా సాగేది. తర తరాల నుంచివారసత్వంగా తాను నేర్చుకొని, వందల వేల సార్లు ఎంత అభినివేశంతో కథ చెప్తాడో అట్లా మాట్లాడేవాడు. తొలిసారి ఈ స్వరం ఇలా ... ఏమిటి?

ఈ వైనం ఏమిటా అని ఉలిగప్ప ఆశ్చర్యపోయాడు.

అసలు జేనాయిన మాటలు తనకు దూరమైపోయి, వాటిని ఎక్కడి నుంచి అర్థం చేసుకోవాలనే సందిగ్ధంలో పడిపోయాడు. ఉలిగప్పకు ఏదో స్పురించింది. కొంపదీసి ముసలోడు ఇప్పుడు బైటి నుంచి మాట్లాడుతున్నాడా? వందల వేల ఏళ్ల కిందటి నుంచి తయారవుతున్న కుల మానవుడు ఆ నమూనా నుంచి బైటికి తొంగి చూస్తున్నాడా? ఏకంగా బైటికి వచ్చి మాట్లాడుతున్నాడా? అన్నిటినీ తొలుచుకుంటూ బైటికి వచ్చిన నిజ మానవుడా కాదుగదా? అనే సందేహం కలిగింది.

మళ్లీ ఇది సాధ్యమేనా? అనిపించింది.

మర్నాడు తిరుగు ప్రయాణంలో ఈ సందేహం చెప్తే "ఎందుకు సాధ్యం కాదు? లేకపోతే మార్పు అనేదే కల్ల. కాకపోతే ఒకే అనుభవం పదే పదే తారసపడటం వల్ల, ఎప్పటికప్పుడు కొత్తగా అనుభవంలోకి రావడంతో ఆయనకిది సాధ్యమైంది. ఆ తేడా తెలుసుకోవడం వల్లే కొత్త ఆలోచనలు వస్తాయి...." అన్నాడు గిరి.

- - -

మర్నాడు జంబులు తాంబుర తగిలించుకొని బయల్దేరాడు. వెనుకే మశమ్మ కూడా. ఇప్పుడాయనకు ఏ రకంగానూ ఇంట్లో ఉండబుద్ధి కావడం లేదు. పెద్ద కొడుకు, పెద్ద మనవడు పొద్దునే లేచి యాపారానికి కొట్కూరు వెళ్లిపోయారు. ... చావుతో, దినాలతో, పంచాయితీతో గడిబిడిగా ఉండిన కాలనీ తెల్లారేసరికల్లా మౌనం దాల్చింది. అది మరింత యాతనగా ఉన్నది. ఈడ ఉండి ఏం చేయాలి? ... అనుకొని బయల్దేరాడు. కోడలు ఎప్పటి వలెనే ఉండమనీ అనలేదు, పొమ్మనమనీ అనలేదు. ఇల్లు దాటి దోవ పట్టగానే ఎదురుగా ఒక మనిషి కనిపించాడు. మోకాళ్లపైకి మురికి పట్టిన అడ్డగుడ్డతో, అట్టగట్టిన వెంట్రుకలతో రూపు పోల్చుకోడానికి వీల్లేనట్లుగా ఉంది. పక్క తొమ్మిదేళ్ల వయసున్న పిల్లవాడు. చినిగిపోయిన అంగీ తగిలించుకొని ఉన్నాడు. ఆ మనిషే దారికి అడ్డంగా నిలబడి జంబులు, మశమ్మ వైపు పరీక్షగా చూశాడు. దాంతో ఇద్దరూ ఆగిపోయారు. ఆ మనిషి ఈసారి మరింత దగ్గరిగా వచ్చి జంబులు కళ్లలోకి కళ్లు పెట్టి చూశాడు. సరిగ్గా జంబులు

వెనుక ఉన్న మశమ్మను ఆయన భుజం మీది నుంచి తొంగి చూశాడు.... " జంబులుగా ఇంకా నువు కత చెప్తాండవా? " అన్నాడు. ఆ స్వరంలో ఏదో పోలిక తెలుస్తోంది.

"ఒరే... నువ్వంటరా? ఏంది ఇట్లయినవు.. " అని మశమ్మే ముందు గుర్తుపట్టింది.

ఆ వ్యక్తి తుపాకిరాముడు

తమ్ముడ్ని అట్లా చూసే సరికి ఆమెకు బోరున ఏడుపు వచ్చేసింది. జంబులు తట్టుకోలేకపోయాడు. "ఎన్నేండ్లాయెరా నిన్ను చూసి. .." ఇంకేం మాట్లాడలేకపోయాడు.

తుపాకి రాముడు సమాధానం చెప్పలేదు. రెండడుగుల దూరంలో ఉన్న పిల్లవాడి భుజం మీద చెయి వేసి దగ్గరికి తీసుకున్నాడు. వాడు ఆకలితోనో.. కొత్తకావడం వల్లనో తుపాకిరాముడి నడుమును రెండు చేతులతో చుట్టేశాడు. ఎదుట ఉన్నవాళ్ల కళ్లలోకి అదోలా చూశాడు.

మశమ్మకు ఆ రెండు నిమిషాల్లో ఏవేవో తలపుకు వచ్చాయి. దు:ఖం మరింత పెరిగింది. ఆత్రంగా వెళ్లి తమ్ముడి వొళ్లంతా తడిమింది. ఎముకల కట్టెలాగా ఉన్న తుపాకిరాముడికి అక్క స్పర్శతో కళ్లు తడిబడ్డాయి.

జంబులుకు మనసంతా వికారంగా తోచింది. ఏండ్లూ పూండ్లూ కలవకపోవడం మామూలే. ఈలోగా ఎన్నో జరుగుతాయి. కానీ వీడేంది ఇట్లైపోయాడు? అనిపించింది. జంబులు చాలా సార్లు అనుకున్నాడు... ఇంతకూ వీడు ఉండడా? యాడన్నా రాలిపోయినాడా? అని. అయినా తిక్కోడి మాదిరి, బతుకు బుగ్గిపాలైనవాడి మాదిరి కలిపించేసరికి ఆందోళన పడ్డాడు. పక్కన ఈ పొట్టెగాడు ఎవరు? అనే సందేహం వచ్చింది.

"ఇంటికి పోదాం పా.. కండ్లల్లో ఊపిరి పెట్టుకున్నావు.. "అని జంబులు వెనక్కి తిరిగాడు. మశమ్మ తమ్ముడి చేయి పట్టుకొని నడుస్తూ ఏదో వలపోసుకుంది.

అత్త మామలు అట్లపోయి ఇట్ల తిరిగి రావడంతో కోడలు మొదట ఆశ్చర్యపోయినా క్షణంలోనే తుపాకిరాముణ్ణి గుర్తుపట్టింది. ఏంది చిన్నాయినా... ఇట్లైపాయినావు? ... అని మరో ప్రశ్న వేయకుండా... ముందు నీల్లు తాగు.. అని పెద్ద చెంబు నిండా నీళ్లు అందించింది. తుపాకి రాముడు ఎంత దప్పిక మీద ఉన్నాడో చెంబు నోటికి కరిపించుకొని గటగట తాగేశాడు. అడుగున కాసిని మిగిలితే నెత్తిమీద, ముఖం మీద చల్లుకున్నాడు. గడ్డం, మీసాలు, తల జుట్టు తడిసిపోయి మరింత వికృతంగా కనిపిస్తున్నాడు. చెంబు కింద పెడ్తూ పక్కన ఉన్న పిల్లవాడివైపు చూశాడు. అప్పటికిగాని వాడి దప్పిక గుర్తు రాలేదు. వాడు నీళ్లు తాగడం అయిపోయింది.

తుపాకిరాముడు వచ్చినాడని చాలా మంది గుంపయ్యారు. పాత కాలం వాళ్లు గుర్తుపట్టారు. ఈ కారు పిల్లలయితే చూసి వెళ్లిపోయారు. తుపాకిరాముడు తన ప్రాభవాన్ని దారిగాచే బందిపోట్లు కొల్లగొట్టుకపోయినట్లు ఉన్నాడు. ఆ సంగతి ఎవరో అననే అన్నారు. ఏందిరా రాజ్యం పొయినట్టు ఉండావు.. ఈ పిల్లోడెవరు? నీ కొడుకా... అని అడిగారు.

దేనికీ సమాధానం లేదు. తుపాకిరాముడంటే మాటలే మాటలు గదా? ఒక మాట కోసం వెతుక్కోనవసరం ఉండదు గదా? చిత్ర విచిత్ర విన్యాసాలతో మాటల గారడీ చేయడంలో సిద్ధహస్తుడు. అట్లా మాట్లాడవచ్చని ఎవరూ ఊహించలేరు. అలాంటి తుపాకీ రాముడు మౌనం దాల్చాడు. విషాదమో... వైరాగ్యమో ఆయన ముఖంలో తారాడుతున్నాయి. మశమ్మ తలపోసుకుంటోంది. ఎట్లాంటోడు ఎట్లయినాడు...? ఒక పెళ్లి లేకుండా, సంసారం లేకుండా ఇట్ల తయారైనాడు. ఇద్దరు పిల్లలు పుడితే ఒక ఇల్లనేది ఉండేది గదా? వీడిదంతా కష్టమయ జీవితం... అనుకున్నది.

అక్కడున్న వాళ్లలో తుపాకీరాముడి గతం తెలిసిన వాళ్లు అదంతా గుర్తు చేసుకుంటున్నారు. కానీ ఆ పిల్లోడు ఎవరబ్బా అనే సందేహం పట్టి పీడిస్తోంది.

కానీ తుపాకీ రాముడి మనసు గడ్డకట్టినట్టు ఉంది.

పక్కన ఉన్న పిల్లవాడు తుపాకీ రాముడి తొడ మీద ఒరిగి "ఒరే... ఆకలయితాందిరా.." అని అతడి గడ్డం పట్టుకొని లాగాడు. మశమ్మ తల్లడిల్లిపోయింది. కుండలో ఏమన్నా తిన్నీక ఉన్నదేమో చూద్దామని లేవబోతోంటే కోడలు ఆదలాబాదలా లోనికి పోయి రాత్రి మిగిలిపోయిన అన్నం, ఊరిబిండి పళ్లెంలో వేసుకొని వచ్చి ఆ పిల్లోడికి అందించింది. అప్పుడు తుపాకీరాముడికి తల్లి శవాన్ని పట్టి కుదుపుతూ "ఓమా.. లెయ్.. లెయ్‌మా.." అని ఆ పిల్లవాడు ఏడ్వడం గుర్తుకొచ్చింది. దాంతోపాటే రత్నమ్మ తలపుకొచ్చి కళ్లెంబడి బొటబొట నీళ్లు కారాయి.

ఏడాది కలిసి ఉన్నారేమో... రత్నమ్మ తననంతా ఆవరించింది. తెగిపోయిన గాలిపటాన్ని ఒడుపుగా చెట్టుకొమ్మల మీది నుంచి తప్పించి చేతిలోకి తీసుకొని కొత్తగా దారం కట్టి దృఢంగా పట్టుకొని ఎగరేసినట్లు ఆమె సొంతం తనను ఆధీనంలోకి తీసుకొనింది. ఎట్లాంటి మనిషి..! కర్రెగా నిగనిగలాడుతూ దయ, కారుణ్యం, అంతులేని తెగింపు, బలాదూర్‌తనం, గొప్ప విశ్వాసం ఉట్టిపడుతున్నట్టుండేది. అదే ఆమె పాలిట వరం, శాపమూ అయ్యాయి. కోస్తా ప్రాంతం నుంచి చేపలు పట్టుకోడానికి కృష్ణానదీతీరానికి వందలాదిగా వచ్చిన బెస్తవాళ్ల పిల్ల. వాళ్ల నాయన పసి పిల్లలతో పెళ్లాన్ని వెంటపెట్టుకొని ఎర్రమఠం ప్రాంతానికి వచ్చాడు. అక్కడి నుంచి అందరితో కలిసి ఎక్కడ చేపలు దొరికితే అక్కడికి నదికి ఈ పక్క, ఆ పక్క తిరిగాడు. నీళ్లలో చేప వలె నదిలో మనిషిగా బతికాడు. అక్కడే రత్నమ్మకు మనువైంది. ఈ లోగా అమ్మానాయినలిద్దరూ చనిపోయారు. మొగుడికి ఎంత ప్రేమనో అంత అనుమానం. ఎవరితోనో తిరుగుతోందని గొడ్డును బాదినట్టు బాదేవాడు. రత్నమ్మ ఎదురుతిరిగేది. దెబ్బకు దెబ్బ తీసేది. కొన్ని దినాలు అన్యోన్యంగానే ఉండేవాడు. కానీ ఆమెకు మొగుడి ప్రేమ మీద గౌరవం పోయింది. అది ప్రేమ కాదని, యావ అని తెలుసుకున్నాక అతడి స్పర్శ దుర్భరంగా తయారైంది. అప్పుడే దుబ్బన్న పరిచయమయ్యాడు. అతనితో బాగున్నట్టనిపించింది. అతనే పిలిచాడో, రత్నమ్మకు కూడా కోరిక కలిగిందో గాని ఒకనాడు కొడుకును చంకనేసుకొని పుట్టి ఎక్కి అవతలికి చేరుకుంది. ఇక తిరిగిచూడలేదు. ఇద్దరూ కొన్ని దినాలు బాగానే ఉన్నారు. ఈ

లోగా మొగుడు నదిలో దూకి చనిపోయాడని ఎవరో చెప్పారు. ఒకటే బాధ... కొన్ని దినాలు మనిషి కాలేకపోయింది. రత్నమ్మ మనసులో మొగుడు మిగిలే ఉన్నాడని దుబ్బన్నకు అనుమానం. అదే అడిగాడు. లేకుండా యాడికి పోతాడు? అని నిక్కచ్చిగా సమాధానం చెప్పింది. తుడిచేస్తే పోతదా? అని ఎదురు ప్రశ్న వేసింది. దుబ్బన్న ఆరోజు నుంచి అసహ్యంగా చూడడం, అనరాని మాటలు అనడం మొదలు పెట్టాడు. పిల్లవాడ్ని నానారకాలుగా హింసపెట్టి రత్నమ్మ మీది కోపం చల్లార్చుకొనేవాడు. రత్నమ్మకు మొగుడే నయమనిపించింది. ఆమె ఎంత తెంపరి మనిషంటే... ఈ పొద్దటి నుంచి నీకు నాకు ఏ సంబంధం లేదు, నా కాడికి వచ్చినావంటే ఒప్పుకోను ... అని తెగేసి చెప్పింది. దాంతో ఆమెకు అలివిగాని కష్టాలు వచ్చాయి. రోజూ తాగి వచ్చి మీదపడేవాడు. గొడ్డును బాదినట్టు బాదేవాడు. లొంగకపోతే నరకమే ఒకనాడు కొడుకును తీసుకొని పారిపోయింది. ఎక్కడెక్కడో తిరిగి అలసట బాపుకుంది. నేల మీద కాళ్లు మోపేందుకు ఇంత చోటు సంపాదించుకుంది. కూలి పని చేసుకుంటూ తనకూ, కొడుకుకూ ముద్ద సంపాదించుకోగలిగింది. సరిగ్గా అలాంటి ఒంటరి బతుకుతో పోరాడుతున్నప్పుడే తుపాకిరాముడు తారసపడ్డాడు. ఆమే ముందుకు అడుగేసింది. తుపాకి రాముడ్ని తీర్చిదిద్దింది. ఇప్పటికే ఇద్దరు మొగవాళ్లతో మోసపోయిన రత్నమ్మకు గొప్ప విశ్వాసం దొరికింది. నమ్మకం కుదిరింది. ఇద్దరికీ దాదాపు పదిహేనేళ్ల తేడా. కానీ జీవితంలో అలసిపోవడం వల్ల చాలా నేర్చుకున్నది. అదే తుపాకీ రాముడికి నచ్చింది. పిల్లవాడు ఒరే రాముడూ ... అంటూ కాళ్లలో చేతుల్లోతిరిగేవాడు. రత్నమ్మకు గొప్ప భరోసా కలిగింది. తన కత ఎట్లున్నా పిల్లోడికి ఇంక భయం లేదనుకుంది. తుపాకీరాముడు తిరిగి కాకీ గుడ్డలు సంపాదించుకొని, చింపిరి టోపీ ఒకటి పిల్లవాడి నెత్తికి తగిలించి, కప్రపట్టుకొని ఊర్లు తిరగడం మొదలు పెట్టాడు. కులం వాళ్లు కనిపించి నీ కొడుకు నీలెక్కనే మాటలు నేర్చుకున్నట్లుందే.. ఎప్పుడు పెళ్లి చేసుకున్నావు? అని అడిగితే బడబడా నవ్వి ఏటవతల సిరిగిరోల్ల పిల్లను చేసుకుండా అనేవాడు. అక్కడి వాళ్లు అడిగితే మాదిక్కున రూపమోల్ల పిల్లను చేసుకుండా అనేవాడు.

రెండేళ్లు రత్నమ్మతో సంసారం చేశాడు.

ఒకనాడు ముగ్గురూ కలిసి టౌన్‌కు వచ్చారు. దారెంట పోతూ ఉంటే ఎదురుగా ఉప్పులారీ వచ్చి రత్నమ్మను కొట్టుకుంటూ వెళ్లిపోయింది. ఆమె ఎగిరి అల్లంత దూరాన పడింది. అంతే కాళ్లూ చేతులు అల్లాడించలేదు. కళ్లు తెరిచి చూడలేదు. ఒక్క మాటైనా లేకుండా నిమిషం సేపు నొప్పి భరించకుండా గాల్లోంచి గాల్లోనే ఎగిరిపోయినట్లు వెళ్లిపోయింది. ఎవరో దయామయులు ఆటోలో పక్కన ఉన్న ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు ముట్టకోకుండానే చనిపోయిందని చెప్పేశారు.

క్షణాల్లో ఎన్నెన్నో అద్భుతాలు జరిగినట్టు కాయించి చెప్పే తుపాకిరాముడికి లిప్తలో జరిగిన ఈ ఘటన నమ్మడానికి సాధ్యం కాలేదు. పక్కన ఉన్న పిల్లవాడి ఏడుపే ఇది.. నిజమని నమ్మించింది.

ఇప్పటికి ఆర్నెల్లయింది. తను తిన్నా తినకున్నా పిల్లవాడికి రోజుకింత సంపాదించి పెడతాడు. జీవితం పూర్తిగా కడ బిందువు దగ్గరికి చేరుకోవడం అంటే ఇదేనేమో... అన్ని కల్పనలూ రద్దయిపోయి కఠోరవాస్తవం ఒక్కటే మిగిలి ఉండడమంటే ఇదేనేమో.. తుపాకిరాముడు తనకు తెలిసిన పద్ధతిలో యదార్థాన్ని అర్థం చేసుకుంటున్నాడు. కానీ ఎందుకో అశ పోయింది. ఏది పోకూడదో అదే ఆవిరైపోయింది. ఇప్పుడు తనకు తానే బరువైపోయినట్టుంటే ఈ పిల్లవాడొకడు... అని చాలా సార్లు అనిపించింది. అయినా వదిలించుకోదలుచుకోలేదు. రత్నమ్మ తనను ఇష్టపడ్డం వెనుక ఉన్న భరోసా ఇదే. దాంతో కొడుకును వెంటపెట్టుకొనే తిరుగుతున్నాడు.

తుపాకీరాముడు ఇక్కడికి రావాలని రాలేదు. కాళ్లు తీసుకొని వచ్చాయి అంతే. ఈ పిల్లోడు ఎవరని అడిగినప్పుడు రత్నమ్మ సంగతి చెప్దామని నోటి దాకా వచ్చింది. కానీ భయమేసింది. తాను బైట ఎన్ని మాటలైనా చెప్పినెట్టుకవచ్చినంత సులభం కాదిక్కడ. తన మీద హక్కు, అధికారం ఉన్న జనాలు వీళ్లు. అందుకే నోరు విప్పలేదు.

అప్పటికే జనాలు వెళ్లిపోయారు. జంబులు, మశమ్మ ఇద్దరే ఉన్నారు. వేపచెట్టు, కానుగ చెట్ల నీడ అక్కడ పరుచుకుంటోంది. కోడలు ఏదో పని మీద ఊళ్లోకి వెళ్లిపోయింది. నడిచీ నడిచీ అలిసిపోయినట్టుంది. పిల్లవాడు తుపాకిరాముడి తొడ మీద తలపెట్టి నిద్రలోకి జారిపోయాడు.

"ఏందిరా ఏందిట్ల...?" అని జంబులు అడిగాడు.

చెప్పడానికి మాటలు రాలేదు.

మశమ్మ చెప్పమన్నట్లు చూసింది,

తుపాకి రాముడు దాపరికం లేకుండా అంతా చెప్పాడు. చెప్పడం చేతగాక మధ్య మధ్యలో ఆపేశాడు. గొంతు తడారిపోవడం, శరీరం-మనసూ అలిసిపోవడం... మశమ్మ మంచి నీళ్లు తెచ్చి ఇచ్చింది. అంతా విన్నాక మశమ్మకు భయమేసింది. కులం వాళ్లకు తెలిస్తే ఏమవుతుందో ఏమో అని అందోళన పడింది. సరిగ్గా అదే భయం తుపాకీరాముడిలో. అక్క భయం గమనించి బింకంగా పైకి "నేనేమన్నా ఈడ సంసారం పెట్టనీక వచ్చినానా?" అన్నాడు.

అది నిజమే అనిపించిందామెకు.

కానీ మొగుడు ఏమంటాడో అనే భయం కూడా ఉంది. ఇంత సేపూ విన్నాడేగాని ఉలుకూ లేదు, పలుకూ లేదు.

జంబులు అది గమనించాడు. కొంచెం ముందుకు వంగి అక్కా తమ్ముళ్లతో ఒకే సారి " అయిందేదో అయింది. ఇది బైటికి పొక్కనియ్యగాకండ్రి. మన పొట్టెగాల్లకు కూడా. ఎవరన్నా ఆరా తీస్తే నీ కడుపున పుట్టినేడో అని చెప్పు.. " అని పిల్లవాడ్ని చూస్తూ అన్నాడు.

అవును ... అదే మంచిది.. అన్నట్లు చూసి మశమ్మ పిల్లవాడి తల నిమిరింది.

(ఇంకా ఉంది....)

-: స్వీకారం :-



నిశ్శబ్ద సంకేతం
(కథల సంపుటి)
రచయిత :
వారాల కృష్ణమూర్తి
వెల : రు. 80/-



హైదరాబాదు
స్వాతంత్ర్య సంరంభం
పరిచయం, వివరణలు :
ఎన్. వేణుగోపాల్
ప్రాచీ పబ్లికేషన్స్
వెల : రు. 25/-



అంపశయ్య
కవితలు
రచయిత :
అంపశ్రీ
వెల : రు. 20/-



ఒకటే మాట
తెలంగాణ
రచయితలు :
నినదించిన ఇందూరు కవులు
ప్రచురణ :
స్నేహ ప్రచురణలు
వెల : రు. 30/-



జస్టిస్ శ్రీ కృష్ణకమిటీ నివేదిక
పొరపాట్లు, అబద్ధాలు, వక్రీకరణలు
ప్రతి అక్షరం
ప్రజాద్రోహం
రచయిత :
ఎన్. వేణుగోపాల్
ప్రచురణ :
తెలంగాణ ఆత్మగౌరవ వేదిక
వెల : రు. 20/-



డిసెంబర్ 9
కావ్యం
రచయిత :
పరమాత్మ
ప్రచురణ :
సృజన్ ప్రచురణలు
వెల : రు. 20/-

(నాల్గవ కవర్ తరువాయి....)

పద్ధతిలో అస్తిత్వాలను ఎలా విశ్లేషించాలనేది చాలా ముఖ్యం. నిర్దిష్టంగా మన దేశంలో, తెలుగు సమాజంలో అస్తిత్వ ప్రేరణతో సాగుతున్న సాంఘిక ఉద్యమాలు వలసవాదం నుంచి పుట్టిన ఆధునికత మీది విమర్శగా బయల్దేరాయి. ఆధునికపూర్వ బంధనాల నుంచి మానవ జీవితాన్ని విడుదల చేయడంలో ఆధునిక వ్యవస్థలుగా చెలామణీ అవుతున్నవన్నీ విఫలమయ్యాయనే నిరసన నుంచి అస్తిత్వవాదాలు, సాంఘిక ఉద్యమాలు పుట్టుకొచ్చాయి.

రాజకీయంగా ఇవి వర్గపోరాటానికీ, సాంఘిక ఉద్యమాలకు సంబంధించిన అనేక సమస్యలను ముందుకు తెస్తాయి. ప్రస్తుతం అలాంటి సంక్లిష్టత నెలకొని ఉన్నది.

ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం - దున్నేవారికే భూమి అనే నినాదంతో బయల్దేరిన విప్లవోద్యమం ఆర్థిక, రాజకీయ, సాంఘిక పోరాటంగా సాగింది. అనేక సాంఘిక సమస్యలపై విశాల ప్రజానీకాన్ని విప్లవంలోకి నడిపించిన చరిత్ర ఉన్నది. విప్లవోద్యమం చేపట్టిన ఆర్థిక రాజకీయ పోరాటాలు అనివార్యంగా కుటుంబ హింస, అగ్రకుల ఆధిక్యం అనే సాంఘిక అణచివేతలను వెలుగులోకి తీసుకొచ్చాయి. వాటి మీద పెద్ద ఎత్తున పోరాటాలు పెల్లుబికాయి. భూస్వామ్యం బలంగా ఉన్న కాలంలో, ప్రాంతంలో ఆర్థిక - సాంఘిక వ్యవస్థలు ఎంత పెనవేసుకొని ఉంటాయో తెలంగాణ విప్లవ సాహిత్యంలో మనకు కనిపిస్తుంది. విప్లవోద్యమం ఆచరణలో గడించిన అనుభవానికి సాంస్కృతిక వ్యాఖ్యాత అయిన విరసం ఈ జీవన పోరాట వాస్తవికతను తొలి నుంచీ చిత్రిస్తూ వచ్చింది. అస్తిత్వవాదాలు, వాటి వెలుగులో సాంఘిక పోరాటాలు రంగం మీదికి వచ్చాక ఈ చర్చ, సంఘర్షణ, అన్వేషణ మరింత పెరిగింది. ఆచరణలో వర్గపోరాటానికీ, సాంఘిక పోరాటాలకూ సంబంధించిన సమస్యలతోపాటు మార్క్సిజానికీ, అస్తిత్వవాదాలకూ సంబంధించిన సంఘర్షణ కూడా పెరిగింది.

దీని వల్ల చాలా మార్పులకు లోనైన మన ఉద్యమ ఆవరణలో విరసం మార్క్సిస్టు- లెనినిస్టు వైఖరితో అనేక స్థాయిల్లో తన ఆలోచనలు పంచుకున్నది. సంవాదంలో పాల్గొన్నది. సహాన్వేషణలో పాలుపంచుకున్నది. అన్ని వైపుల నుంచి జరిగిన ఈ పని ఇంకా చాలా ముందుకు తీసుకపోవలసి ఉన్నది. సాహిత్య కళా రంగాల్లోనైనా, ఉద్యమాల్లోనైనా ఈ విషయం నిగ్గుతేలడానికి చారిత్రక భౌతికవాదమే శాస్త్రీయ సామాజిక సిద్ధాంతమని విరసం దృఢ విశ్వాసం. అందుకే మరోసారి అస్తిత్వాల గురించి, వాటికి సంబంధించిన సాహిత్యం గురించి ఈ సాహిత్యపాఠశాలలో చర్చించదలిచింది. అస్తిత్వాలు - మార్క్సిజం అనే అంశం కేంద్రంగా జరుగుతున్న ఈ సాహిత్యపాఠశాలకు రమ్మని విరసం సాదరంగా అహ్వానిస్తోంది.

విప్లవ రచయితల సంఘం
ఆంధ్రప్రదేశ్

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal of Revolutionary M)

• RNI Regn.No.21152/72 • Published on 08/06/2011 - 285 - April 2011

KLVA101M 153

అస్తిత్వాలు - మార్క్సిజం అనే అంశం కేంద్రంగా

విప్లవ రచయితల సంఘం రాష్ట్ర సాహిత్య పాఠశాల
21,22 మే 2011, కావలి, నెల్లూరు జిల్లా

కామ్రేడ్ ఆజాద్, శాఖమూరి అప్పారావు ప్రాంగణంలో(షాదీమంజిల్, కూరగాయల మార్కెట్ పక్క వీధి, కావలి)

అస్తిత్వాలంటే- సాంఘిక జీవి అయిన మనిషికి ఉండే గుర్తింపులు. పీడిత అస్తిత్వాలకు తమదైన సంస్కృతి ఉంటుంది. ఆర్థిక పార్శ్వం కూడా ఉంటుంది. ఇవన్నీ వాస్తవికమైనవి, సంఘటితమైనవి. కాబట్టి వాటికి సంబంధించిన అనుభవంలో ప్రత్యేకతలు ఉంటాయి. కులాలు, ప్రాంతాలు, మత మైనారిటీలు, జండర్ మొదలైన వాటి గురించి ఇప్పుడు లోతైన చర్చ నడుస్తున్నది. అస్తిత్వ స్పృహ నుంచి సమాజాన్నీ, జీవితాన్నీ, సాహిత్యాన్నీ చూపే కొత్త దృక్కోణాలు ఆవిష్కారమయ్యాయి. అనేక కారణాల వల్ల అణచివేతకు గురై, గుర్తింపుకు నోచుకొని అస్తిత్వాలు తమదైన సొంత వాదనతో ముందుకు వచ్చాయి. ఒక ప్రత్యేకమైన అనుభవానికి ఉండే సామాజిక అర్థాన్ని వినిపిస్తున్నాయి. చరిత్ర, సంస్కృతి సాహిత్యాల మీద కొత్త వ్యాఖ్యానాలు అందిస్తున్నాయి.

అందువల్ల అనుభవం అనేదాన్ని ఇంతక ముందుకంటే పూర్తి భిన్నంగా చూడాల్సిందే. అసలు సాంఘిక వాస్తవికతనే సరి కొత్తగా చూడాలి. అస్తిత్వ ప్రత్యేకతల వల్ల నన్ను నేను ఎలా గుర్తిస్తున్నాను? సమాజం నన్ను ఎలా గుర్తిస్తుంది? ఇతరులను నేను ఎలా గుర్తిస్తాను? అనే ప్రశ్నలు ముందుకు వచ్చాయి. ఇవి అనుభవం నుంచి వస్తున్నవే అయినా వాటికి కారణమైన సాంఘిక వ్యవస్థల చర్చ ప్రధానం కావాలి. అంటే - అస్తిత్వాల చర్చ సిద్ధాంతపరమైనదని అర్థమౌతున్నది.

అన్ని సామజిక శ్రేణుల్లో అస్తిత్వ స్పృహ కలగడంతో ఉద్యమాల్లో కూడా సహజంగానే కొత్త వాతావరణం తలెత్తింది. ఇది చాలా ఆలోచనాత్మకంగా సాగుతోంది. తీవ్ర సంఘర్షణ నడుస్తోంది. ఇన్ని రకాల అస్తిత్వాలున్నాయనీ, వాటితో రాజకీయంగా వ్యవహరించాలనే విషయంలో ఇప్పుడెవరికీ సందేహం లేదు. కానీ ఎలా అర్థం చేసుకోవాలి? ఎలా వ్యవహరించాలనే విషయాల్లోనే సమస్య ఉన్నది.

భిన్న అస్తిత్వవాదాలు ఏం చెప్తున్నాయి? అనేదాన్ని పరిగణలోకి తీసుకుంటూనే మొత్తంగా మార్పును కేంద్రం చేసుకున్న చారిత్రక భౌతికవాద

(మిగతా 3 కవర్‌లో.....)

మొదటి రోజు కార్యక్రమం
సోంపేట, కాకరాపల్లి అమరుల హాల్‌లో
సుద్దాల హనుమంతు వేదిక మీద

21.5.2011
ఉదయం 9.30 గంటలకు పతాకావిష్కరణ
10.00 గంటలకు ప్రారంభ సమావేశం
అంశం: అస్తిత్వవాదాలు- నేపథ్యం
వక్త: అల్లం రాజయ్య
అంశం: అస్తిత్వాలు - మార్క్సిజం
వక్త: పాణి, నిర్వహణ: ఉజ్వల్
1.30 గంటలకు భోజన విరామం
2.30 గంటలకు
అంశం: స్త్రీల అస్తిత్వం- సాహిత్యం
వక్త: చల్లపల్లి స్వరూపరాణి
అంశం: మైనారిటీ మత అస్తిత్వం- సాహిత్యం
వక్త: బాసిత్, నిర్వహణ : శశికళ
సాయంకాలం 5.30గంటకు ప్రజాకళామండలి, ఇతర కళాకారులుచే సాంస్కృతిక కార్యక్రమాలు
నిర్వహణ : తంగెళ్ల సుదర్శన్
22-05-11 తేదీ ఉ॥ 9.00 గం॥లకు కవిసభ
నిర్వహణ: అరసవెల్లి కృష్ణ, ఉదయమిత్ర
అంశం: ప్రాంతీయ అస్తిత్వం- సాహిత్యం
వక్త : కాశీం
అంశం: కుల అస్తిత్వం - సాహిత్యం
వక్త: కళ్యాణరావు, నిర్వహణ: చంద్రయ్య
1.30 గంటలకు భోజనవిరామం
2.30గంటలకు
అంశం : ఆదివాసీ అస్తిత్వం- సాహిత్యం
వక్త: రాఘవాచారి, నిర్వహణ: రాంకి
సాయంకాలం 5.00కు బహిరంగ సభ
అధ్యక్షత : కోటయ్య
వక్తలు: ప్రొ. శేషయ్య(ఎ.పి.సి.ఎల్.సి ఆధ్యక్షులు), డా. జి. విజయ్‌కుమార్(జనవిజ్ఞానవేదిక), రుక్మిణి, వరవరరావు, కళ్యాణరావు
ప్రజాకళామండలి తదితర సాంస్కృతిక బృందాల కార్యక్రమాలుంటాయి

'విప్లవ సాహిత్యం జీవితంలోని అతి జటిలమైన వైరుధ్యాలను ఎదుర్కొంటుంది. అదే దాని బలం' - **కొడవటిగంటి కుటుంబరావు**

'చైతన్యం వ్యక్తుల మనస్సుల్లో స్వచ్ఛందంగా పుట్టేదికాదు. సామాజిక జీవిత వాస్తవికత చైతన్యానికి పునాది' - **త్రిపురనేని మధుసూదనరావు**

'వర్గ సంఘర్షణ జీవిత వాస్తవం... ఆదిమ గణసమాజం భగ్నమైన నాటి నుంచీ ఇది సాగుతూంది. జీవిత వాస్తవాన్ని గుర్తించిన రచయిత దీన్ని విస్మరించలేడు.' - **కె.వి.ఆర్.**

'విప్లవం ఒకరి అనుమతితో వచ్చేది కాదు. ఒకరు వద్దంటే మానేది కాదు' - **శ్రీశ్రీ**

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Charita Impressions, Azamabad, Hyderabad - 500 020 for Nagendra Printing Press, Vijayawada - 520 002,
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M153
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	narma
పేజీలు విడదీసినది	bhanu
స్కాన్ చేసినది	sharmila
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good